
'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 239

బుధవారం 20-11-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఎదురులేని భారత్

ఐదోసారి ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో ఫైనల్లోకి. సెమీస్‌లో జపాన్‌పై గెలుపు -14లో



రూఫ్‌టాప్ 'సౌర'భం!

2027 నాటికి 30 గిగావాట్ల గృహ సౌర విద్యుత్ లక్ష్యం -15లో



కమ్ముకుంటున్న అణుమేఘాలు

ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి తెరతీసి సరిగ్గా 1,000 రోజులు పూర్తయిన నాడే చోటుచేసుకున్న పరిణామాలు గుబులు రేపుతున్నాయి.

- వివరాలు 6లో▶



పోలింగ్ వేళ పంపకం గోల

బీజేపీ నేత వినోద్ నగదు పంచుతున్నారంటూ బహుజన్ వికాస్ అఘాడీ పార్టీ విడుదల చేసిన వీడియో కలకలం సృష్టించింది.

- వివరాలు 6లో▶



నువ్వా.. నేనా?

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. 288 స్థానాలకు బుధవారం ఒకే విడతలో పోలింగ్ జరగనుంది.

- వివరాలు 6లో▶



మళ్లీ ఎఫ్‌టీఏ చర్చలు

బ్రిటన్, భారత్ మధ్య ఎఫ్‌టీఏపై నెలకొన్న అనుమానాలకు తెర పడింది. తిరిగి చర్చలు ప్రారంభించాలని మోదీ, స్టార్మర్ నిర్ణయించారు.

- వివరాలు 6లో▶

విజయోత్సవానికి రెడీ..
ఏడాదైనా గూడేది?



కాంగ్రెస్ సర్కారు ఆరు ప్రధాన గ్యారంటీల్లో ఒకటైన 'ఇందిరమ్మ' ఇళ్లపై గందరగోళం

- ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరించి వచ్చే నెలతో ఏడాది... మార్గదర్శకాలు విడుదల చేసి ఎనిమిది నెలలు పూర్తి
- పథకం అమలుపై కీలక కమిటీలు ఏర్పాటై కూడా నెల రోజులు
- ఇప్పటివరకు లబ్ధిదారులెవరో తేలని తీరు
- నెలరోజులుగా ఖాళీగానే కమిటీలు
- జాడ లేని గ్రామ సభలు.. ఒక్క దరఖాస్తుకూ కలగని మోక్షం
- తొలి ఏడాదిలో 4.16 లక్షల ఇళ్లు నిర్మిస్తామన్న ప్రభుత్వం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావొస్తున్న సందర్భంగా 'ప్రజా పాలన.. ప్రజా విజయోత్సవాల' పేరిట సంబురాలకు శ్రీకారం చుట్టింది. పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళిక సిద్ధం చేసింది. విజయోత్సవాలు సరే.. ఈ ఏడాదిలో సొంత గూటి కోసం కోటి ఆశలతో ఎదురుచూస్తున్న ఎందరు బడుగులకు ఇళ్లు ఇచ్చారనే ప్రశ్నలు వస్తున్నాయి. కాంగ్రెస్ సర్కారు పేదలకు ఒక్క 'ఇందిరమ్మ'ఇల్లు కూడా ఇవ్వలేక పోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిగో అదిగో అనడమే తప్ప.. పేదలకు 'గూడు'ఎప్పటివరకు దక్కుతుందో చెప్పలేకపోతోందన్న ఆగ్రహం కనిపిస్తోంది.

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు ప్రధాన గ్యారంటీల్లో ఒకటైన ఇందిరమ్మ ఇళ్ల పథకం గందరగోళంలో పడింది. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు పాలనకు ఏడాది దగ్గరపడి, విజయోత్సవాలు ప్రారంభమైనా.. రాష్ట్ర ప్రభుత్వ పెద్దల నుంచి అదిగో, ఇదిగో అంటూ ప్రకటనలు వెలువడినా.. 'ఇందిరమ్మ' ఇళ్ల పథకం మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. సుమారు నెల రోజుల క్రితం దీపావళి కానుకగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ఉంటుందంటూ ప్రకటనలు వచ్చాయి. పండుగ దాటి 20 రోజులు గడుస్తున్నా ఎక్కడి గొంగళి అక్కడే ఉంది. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 4,16,500 ఇళ్లను ఈ ఏడాది నిర్మించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం గతంలో పేర్కొంది. కానీ ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే.. నిర్మించడం ఏమోగానీ, మంజూరైనా చేస్తారా? అనే ప్రశ్నలు వస్తున్నాయి. కనీసం దరఖాస్తుల వెరిఫికేషన్ కూడా చేపట్టకపోవడం ఏమిటనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక్క ఇల్లు కూడా పూర్తి కాకుండానే కాంగ్రెస్ సర్కారు తొలి ఏడాది కరిగిపోవటం ఖాయంగా కనిపిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

హడావుడిగా దరఖాస్తులు స్వీకరించినా..

కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రకటించింది. ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే గత ఏడాది డిసెంబర్–జనవరిలలో ప్రజాపాలన పేరిట ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. అందులో ఇందిరమ్మ ఇళ్ల కోసం 80 లక్షల దరఖాస్తులు అందాయి. దీనిలో మిగతా 2వ పేజీలో ▶



డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు సీతక్క, పొంగులేటి, కొండా సురేఖతో కలిసి వేదికపైకి వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కోటిమంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తాం

అంబానీ, అదానీలను తలదన్నేలా వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతాం

- ఓరుగల్లు ప్రజాపాలన–ప్రజా విజయోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- మహిళల ఆశీస్సులతోనే మేం నిలబడ్డాం
- కేసీఆర్.. గెలిస్తే దోచుకుంటవ్.. ఓడితే ఫామ్‌హౌస్‌లో పడుకుంటవా? అన్న సీఎం
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి తెలంగాణలో ఉండే హక్కులేదంటూ ఆగ్రహం
- కాళోజీ కళాక్షేత్రం ప్రారంభం.. రూ.4,684.37 కోట్ల పనులకు శంకుస్థాపనలు, ప్రారంభం

సాక్షి ప్రతినిధి, వరంగల్: 'ఇందిరమ్మ పేరిట మహిళలకు సంక్షేమ పథకాలు అందించి, ఇందిరమ్మ రాజ్యాన్ని ఏర్పాటు చేసి ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలనేది కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పం. ఇందులో భాగంగా తెలంగాణలో కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం. అంబానీ, అదానీలను తలదన్నే రీతిలో వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతాం. వరంగల్ ప్రజాపాలన – ప్రజా విజయోత్సవాలు కార్యక్రమాన్ని ఆడబిడ్డలకు అంకితం చేస్తున్నాం..' అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. నాడు టీపీసీసీ చీఫ్‌గా, నేడు సీఎంగా మహిళలు నిండు మనసు, ఆశీస్సులతో మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

రైతుల భూమి బీఆర్‌ఎస్ నేతల పాలు



గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పంపిణీ చేసిన భూములను బీఆర్‌ఎస్ పాలనలో బలవంతంగా గుంజుకుందని డిప్యూటీ సీఎం భట్టి ఆరోపించారు. అలాంటి దుర్మార్గులు రైతుల సంక్షేమం గురించి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు.

- వివరాలు 3లో▶

హామీలపై చర్చకు సిద్ధం



కాంగ్రెస్ 6 గ్యారంటీలు, 420 హామీల అమలుపై చర్చకు సిద్ధమని.. సీఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరిస్తున్నామని బీజేపీ నేత, ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. రేవంత్‌తో చర్చకు ప్రధాని మోదీ రావాల్సిన అవసరం లేదని.. ఇక్కడున్న తాము సరిపోతామని చెప్పారు.

- వివరాలు 2లో▶

ఎస్‌బీఐలో భారీ చోరీ



వరంగల్ జిల్లా రాయపర్తిలోని ఎస్‌బీఐలో భారీ చోరీ జరిగింది. భవనం కిటికీని తొలగించి లోపలికి చొరబడిన దొంగలు.. లాకర్‌లోని 19 కిలోలకుపైగా బంగారాన్ని అపహరించుకుపోయారు. దీని విలువ రూ.14.82 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు.

- వివరాలు 5లో▶

నాన్నకు ప్రేమతో..



మతిస్థిమితం కోల్పోయిన తండ్రి ఆరేళ్ల క్రితం ఎటో వెళ్లిపోయాడు.. తండ్రి జాడ కోసం ఆయన ఇద్దరు కూతుళ్లు వెదకనిచోటు లేదు.. అనాథల్లోనే తండ్రిని చూసుకొంటూ అనాథాశ్రమాల్లో అన్నదానం చేస్తూ వచ్చారు. అలా ఒక అనాథాశ్రమంలో తమ తండ్రి జ్ఞాపకార్థం అన్నదానం చేస్తుండగా.. ఆ తండ్రే భోజనం కోసం పంక్తిలో కూర్చొని కనిపించాడు.

- వివరాలు 16లో▶



పూడికతీతకు పచ్చజెండా


- పైలట్ ప్రాజెక్టుకు ప్రభుత్వం ఓకే
- త్వరలో టీజీఎండీసీ ద్వారా టెండర్లు!
- బిడ్డర్ నుంచి పన్నులు, జీఎస్టీ, రాయల్టీ, సెస్ వసూలు ద్వారా రాబడి
- పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే ఇతర జలాశయాల్లో అమలు

సాక్షి, హైదరాబాద్: జలాశయాల్లో పూడిక తొలగించి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన జాతీయ విధానాన్ని రాష్ట్రంలో అమలు పరచడానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం ఆ మేరకు చేసిన సిఫారసుల ఆధారంగా ఒక జలాశయంలో పైలట్ ప్రాజెక్టుగా పూడిక తొలగింపును చేపట్టడానికి అనుమతిస్తూ రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా మంగళవారం ఉత్తర్వులు మిగతా 5వ పేజీలో ▶

తొలగింపు కుదరదు.. ఇకపై వద్దు

కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై తేల్చిచెప్పిన హైకోర్టు

- ఇన్నాళ్లుగా పని చేస్తున్న వారిని తొలగిస్తూ ఉత్తర్వులివ్వలేం
- ఇకపై పోస్టుల భర్తీ చట్టబద్ధంగా నోటిఫికేషన్ ఇచ్చి చేపట్టాలి
- ప్రభుత్వానికి ధర్మాసనం స్పష్టీకరణ
- క్రమబద్ధీకరణను సవాల్ చేసిన పిటిషన్‌లో కీలక తీర్పు
- 5,544 మంది ఉద్యోగులకు ఊరట



సాక్షి, హైదరాబాద్: కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ రాజ్యాంగ విరుద్ధమని, ఇకపై రెగ్యులరైజ్ చేయడం చెల్లదని హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. తెలంగాణ (రెగ్యులరైజేషన్ ఆఫ్ అపాయింట్‌మెంట్స్ టు పబ్లిక్ సర్వీసెస్ అండ్ రెగ్యులరైజేషన్ ఆఫ్ స్టాఫ్ ప్యాటర్న్ అండ్ పే స్ట్రక్చర్) చట్టం 1994లోని సెక్షన్ 10ఏ చెల్లదని.. చట్టవిరుద్ధమైన ఈ సెక్షన్‌ను రద్దు చేస్తున్నామని తేల్చిచెప్పింది. ఏళ్లుగా పని చేస్తున్న, ఇప్పటికే క్రమబద్ధీకరించిన కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఇకపై ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చట్ట ప్రకారం జరగాలని, క్రమబద్ధీకరణ కుదరదని చెప్పింది. నోటిఫికేషన్ల ద్వారా మాత్రమే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని స్పష్టం చేసింది. క్రమబద్ధీకరణను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను పాక్షికంగా అనుమతించినట్లు పేర్కొంది. జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో కాంట్రాక్ట్ లెక్చరర్లను గతంలో ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. నిబంధనలకు విరుద్ధంగా వీరిని క్రమబద్ధీకరించారని, సెక్షన్ 10ఏను చేరుస్తూ తెచ్చిన జీవో 16 చట్టవిరుద్ధమంటూ పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసిన.. సెట్‌కు క్వాలిఫై అయిన పలువురు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ చేపట్టిన జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. ఈ తీర్పుతో దాదాపు 5,544 మంది ఉద్యోగులకు ఊరట లభించింది.

పిటిషనర్ల వాదన..

'జూనియర్, పాలిటెక్నిక్, డిగ్రీ లెక్చరర్ల పోస్టులను 1993, డిసెంబర్ 30న జీవో 302తో మిగతా 12వ పేజీలో ▶

ధర్మాసనం ఏమందంటే..

'విద్యాసేవా నిబంధనలు చట్టబద్ధంగా ఉన్నందున వాటిని రద్దు చేయడం, సవరించడం ఒక్కపూటలో సాధ్యం కాదు. చట్టబద్ధమైన నియమాల అమలులో సెక్షన్ 10ఏ ప్రభావం ఉండకూడదు. పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 101 ప్రకారం ఇప్పటికే ఉన్న ఏదైనా చట్టాన్ని సవరించడానికి, రద్దు చేయడానికి ప్రభుత్వానికి అధికారం ఉంటుంది. అయితే సెక్షన్ 10ఏను చొప్పించడం పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 101కు విరుద్ధం. అందువల్ల 10ఏను కొట్టివేయడంలో మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. ఉమాదేవి కేసులో రాజ్యాంగ ధర్మాసనం తీర్పుపై ఇరుపక్షాలు ఆధారపడ్డాయి. తీర్పును జాగ్రత్తగా చదివితే కాంట్రాక్టు ఉద్యోగులతో ఎలాంటి సంబంధం లేదని తేలింది. రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులను 2009లో నియమించి ఆ తర్వాత రెగ్యులరైజ్ చేశారు. ఇలా 15 ఏళ్లకు పైగా ఉద్యోగాల్లో ఉన్నారు. అటువంటి కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించాలని ఆదేశించాలా లేక ప్రస్తుత పిటిషనర్లకు పోస్టులను ప్రకటించాలని సర్కార్‌ను ఆదేశించాలా అనేది మా ముందున్న ప్రశ్న. అయితే అన్ని పిటిషన్లలో క్రమబద్ధీకరించిన వారిని తొలగించాలని కోరలేదు. పోస్టులు భర్తీ చేసేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఏళ్ల కింద నియమితులైన వారి అంశంలో జోక్యం కూడదని సుప్రీం కోర్టు గతంలో పేర్కొంది. అందుకే క్రమబద్ధీకరణ అంశంలో జోక్యం చేసుకోవడం లేదు. కాంట్రాక్టు ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయనే కారణంతో గత నిర్ణయాలను రద్దు చేయడం లేదు' అని ధర్మాసనం పేర్కొంది.



కూత పెట్టనున్న.. హైడ్రోజన్ రైలు

- డిసెంబరులో ప్రయోగాత్మక పరిశీలనకు రైల్వే ఏర్పాట్లు
- హరియాణాలోని జింద్–సోనిపట్ మధ్య 90 కిలోమీటర్ల ప్రయాణం
- ప్రపంచంలో హైడ్రోజన్ రైళ్లు నడిపే ఐదో దేశంగా రికార్డు సృష్టించనున్న భారత్

బొగ్గు, చమురు నిల్వలు తరిగిపోతుండటం, అవి కాలుష్య కారకం కావడంతో... ప్రత్యామ్నాయ ఇంధనాలపై ప్రపంచ దేశాలు దృష్టి పెట్టాయి. ఎలాంటి కాలుష్యం వెలువడని, తరిగిపోని హైడ్రోజన్‌ను భవిష్యత్తు ఇంధనంగా భావిస్తున్నాయి. వాటితో వాహనాలను నడిపే సాంకేతికతలను కొన్ని దేశాలు అభివృద్ధి చేశాయి. ఇప్పటికే జర్మనీలో హైడ్రోజన్ రైళ్లు పరుగులు పెడుతున్నాయి. ఇప్పుడు మన రైల్వే కూడా వేగంగా ప్రయోగాలు పూర్తి చేసి హైడ్రోజన్ రైళ్లను పట్టాలెక్కించే దిశగా ముందుకు వెళుతోంది. - 16లో

ఇదండీ సంగతి



వీళ్ల మాటలు మాత్రం నిజాలు!!



కాంగ్రెస్‌ను ప్రశ్నిద్దాం.. బీజేపీని నిలదీద్దాం!

రెండు జాతీయ పార్టీలను ఇరుకున పెట్టడమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ పావులు

- సీఎం రేవంత్‌కు బండి సంజయ్, ఇతర బీజేపీ ఎంపీల మద్దతుపై ప్రశ్నలు
- కాంగ్రెస్, రేవంత్ పాలన వైఫల్యాలపై నిరంతరం విమర్శనాస్త్రాలు
- ప్రజా సమస్యలపై జనంలోకి వెళ్లేందుకు అవసరమైన కార్యాచరణకు పదును
- సోషల్ మీడియాలోనూ కాంగ్రెస్, బీజేపీ తీరును ఎండగట్టేలా కార్యాచరణ
- మరికొంతకాలం ఎర్రవెల్లి నివాసానికే పరిమితం కానున్న అధినేత కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఏడాది క్రితం అధికారానికి దూరమై ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్).. తన రాజకీయ ప్రత్యర్థులైన రెండు జాతీయ పార్టీలపై దూకుడుగా ముందుకు వెళ్లేందుకు రంగం సిద్ధం చేస్తోంది. కాంగ్రెస్, బీజేపీలను ఇరుకునపెట్టడమే లక్ష్యంగా పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉండేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై కసరత్తు చేస్తోంది. వచ్చే ఏడాది జరిగే స్థానిక ఎన్నికల తర్వాత పార్టీ సంస్థాగత నిర్మాణం, శిక్షణపై దృష్టి పెట్టే యోచనలో ఉంది. క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు, కేడర్‌లో ఉత్సాహం నింపేలా.. ప్రజా సమస్యలు కేంద్రంగా పార్టీ కార్యకలాపాలు నిర్వహించనుంది. రాష్ట్రంలో జరుగుతున్న అవకతవకలను, అవినీతిని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదన్న అంశాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని భావిస్తోంది.

కాంగ్రెస్, బీజేపీలను టార్గెట్ చేస్తూ..

అమృత్ స్కీమ్ కింద అర్హత లేకున్నా సీఎం బావమరిది కంపెనీకి కాంట్రాక్టు అప్పగించారని ఆరోపణలు చేసిన మిగతా 3వ పేజీలో ▶

21న బీఆర్‌ఎస్ మహాధర్నా 3లో

● 'ఐలాండ్' అదరహో...



ఇది విదేశాల్లోని స్విమ్మింగ్‌పూల్ కాదు.. మన రాష్ట్రంలోనిదే.. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరంలో ముచ్చటగా మూడో ఐలాండ్ ముస్తాబైంది. రూ.7 కోట్ల వ్యయంతో, ఎనిమిదెకరాల విస్తీర్ణంలో దీనిని అభివృద్ధి చేశారు. పిల్లల కోసం ప్రత్యేక ఈత కొలనులు, ఆటవస్తువులు ఏర్పాటు చేశారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క బుధవారం దీనిని ప్రారంభించనున్నారు. 16లో

క్లుప్తంగా...

83,64,331 నివాసాల్లో సర్వే

ఫస్ట్‌ప్లేస్‌లో ములుగు జిల్లా, లాస్ట్‌లో గ్రేటర్ హైదరాబాద్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 83,64,331 నివాసాల్లో సర్వే పూర్తయ్యింది. సమగ్ర ఇంటింటి సర్వేలో మొత్తం 1,16,14,349 నివాసాలకుగాను ఇప్పటి వరకు 72 శాతం సర్వే పూర్తయినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. జాప్యం లేకుండా సకాలంలో సర్వే పూర్తి చేయడానికి కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. ఏ ఒక్క ఇల్లును కూడా వదలకుండా ప్రతీ ఇంటిలో సమగ్రంగా సర్వే నిర్వహించాలని సీఎస్ స్పష్టం చేశారు. మంగళవారం నాటికి రాష్ట్రంలో ములుగు జిల్లా 98.9శాతం పూర్తి చేసి ప్రథమస్థానంలో నిలవగా, నల్లగొండ జిల్లా 95 శాతంతో ద్వితీయ స్థానంలో, జనగాం జిల్లా 93.3 శాతంతో తృతీయ స్థానంలో నిలిచాయి. గ్రేటర్ హైదరాబాద్ 50.3 శాతం సర్వేతో చివరిస్థానంలో నిలిచింది. ఈ సర్వేలో 87,807 మంది సిబ్బంది, 8,788 పర్యవేక్షక అధికారులు పాల్గొంటున్నారు. ఉమ్మడి జిల్లాల వారీగా పర్యవేక్షణకు సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించారు. వీరు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సర్వే తీరును సమీక్షిస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో ఉల్లి ధరలు సాధారణం

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో తెలుగు రాష్ట్రాల్లో ఉల్లి ధరలు సాధారణ స్థితికి చేరుకుంటున్నాయి. ధరల స్థిరీకరణ నిధి (పీఎస్ఎఫ్) జోక్యం ఉల్లి ధరలపై గణనీయమైన ప్రభావం చూపుతోంది. మెజారిటీ రాష్ట్రాల్లో సగటు రిటైల్ ధరలు జాతీయ సగటు కంటే తక్కువగా ఉన్నాయని మంగళవారం వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. రిటైల్ ధరలు జాతీయ సగటు కంటే తక్కువ ధరలు ఉన్న జాబితాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్తాన్, బిహార్, కర్ణాటక, గుజరాత్, చండీగఢ్, హరియాణా, గోవా తదితర రాష్ట్రాలున్నాయని వెల్లడించింది.

సీఎం అల్లుడి సంస్థలపై దర్యాప్తు చేయండి

ఈడీకి బీఆర్ఎస్ నేత క్రిశాంక్ ఫిర్యాదు



సాక్షి, న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో రైతుల భూములను లాక్కొని తన అల్లుడు గొలుగూరి సత్యనారాయణరెడ్డి డైరెక్టర్‌గా ఉన్న మ్యాక్స్ బెయాన్ ఫార్మా కంపెనీకి కట్టబెట్టాలని చూస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. ఈ కంపెనీ లావాదేవీలపై దర్యాప్తు జరపాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కు ఫిర్యాదు చేసింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆదేశాల మేరకు పార్టీ నేత క్రిశాంక్ ఢిల్లీలోని ఈడీ కార్యాలయంలో మంగళవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మ్యాక్స్ బెయాన్స్ కంపెనీలో సీఎం అల్లుడికి 16 లక్షల షేర్లు ఉన్నట్లు తెలిపారు. అదే కంపెనీలో మరో డైరెక్టర్‌గా అన్నం శరత్ ఉన్నారని, ఇతడికి సంబంధించిన వేరే కూడా 21 లక్షల షేర్లు ఉన్నాయని ఆరోపించారు. ఫిర్యాదును స్వీకరించిన ఈడీ.. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపడతామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. రేవంత్ అల్లుడి కుటుంబంపై ఈడీ ఇప్పటికే పలు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నదని వెల్లడించారు. సీఎం అల్లుడు ఎన్నో మోసాలు చేసి రుణాలను దారిమళ్లించారని ఈడీ గుర్తించినట్లు పేర్కొన్నారు. కొడంగల్ ఫార్మా విలేజ్‌లో ప్లాంటు ఏర్పాటుచేయాలని చూస్తున్న మరో కంపెనీలో కూడా సీఎం అల్లుడికి వాటాలు ఉన్నాయని ఆరోపించారు.

కాంగ్రెస్ మూసీలో మునగడం ఖాయం: గొంగిడి సునీత



సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్ పార్టీ ఉండదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యలు చేస్తున్నారని, కానీ కాంగ్రెస్ పార్టీయే మూసీలో మునిగి పోతుందని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని సీఎం రేవంత్‌రెడ్డి, మహేశ్ కుమార్‌గౌడ్ కలిసికట్టుగా ముంచుతారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం సునీత మీడియా సమావేశంలో మాట్లాడారు. అన్ని వర్గాల్లోనూ ప్రభుత్వం మీద ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందన్నారు. సీఎం, మంత్రుల నడుమ సమన్వయం లేదని, రైతు రుణమాఫీ విషయంలో ఈ విషయం తేటతెల్లమైందని పేర్కొన్నారు. ప్రజా పాలన అంటూ రాష్ట్రాన్ని రేవంత్ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని ధ్వజమెత్తారు. అభివృద్ధి ధ్యేయంగా కేసీఆర్ పారదర్శకంగా పని చేయగా.. కాంగ్రెస్ మాత్రం నిర్లక్ష్యంతో తన గొయ్యిని తానే తవ్వుకుంటోందన్నారు. మహేశ్‌కుమార్ గౌడ్ బీఆర్ఎస్ మీద విమర్శలు మానుకుని ఎన్నికల హామీల అమలు కోసం సీఎం రేవంత్‌పై ఒత్తిడి తేవాలని సునీత హితవు పలికారు.

కోటిమంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

ఆదరించడం వల్లే ఓరుగల్లు వేదికపై తామంతా నిలబడగలిగామని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి మహిళా లోకం ఓటు ద్వారా బుద్ధి చెప్పి కాంగ్రెస్ ప్రజాపాలనకు బాసటగా నిలిచిందని పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో తమ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని చెప్పారు. ప్రజాపాలన – ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం వరంగల్‌లో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులతో కలిసి మధ్యాహ్నం కాళోజీ కళాక్షేత్రానికి వచ్చిన సీఎం.. తొలుత ప్రముఖ కవి కాళోజీ నారాయణ రావు నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. తర్వాత కళాక్షేత్రాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచే వర్చువల్‌గా రూ.4,684.37 కోట్ల పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానం (ఇందిరా మహిళాశక్తి ప్రాంగణం)లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రేవంత్ మాట్లాడారు.



హనుమకొండలో నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన మహిళలు

ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు పెద్దపీట

'2014 నుంచి 2019 వరకు బీఆర్ఎస్ మంత్రివర్గంలో ఒక్క మహిళా మంత్రిగా లేరు. గత ఎన్నికల్లో తెలంగాణ మహిళలు ఇచ్చిన తీర్పుతో మేం మొదటి మంత్రివర్గంలోనే కొండా సురేఖ, సీతక్కకు మంత్రులుగా అవకాశం కల్పించాం. ఈ సభా నిర్వహణ కార్యక్రమాన్ని సైతం వారి చేతుల్లోనే పెట్టాం. వరంగల్ నియోజకవర్గం నుంచి కడియం కావ్యను పార్లమెంటుకు పంపించాం. పాలకుర్తిలో ఓ రాక్షసుడు రాజ్యమేలుతుంటే యశస్వినిరెడ్డి అనే సోదరి ఆ రాక్షసుడిని ఎన్నికల్లో ఓడించి పాలకుర్తి గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసింది. తెలంగాణ చీఫ్ సెక్రటరీ కూడా ఆడబిడ్డనే. పలు జిల్లాలకు కలెక్టర్లుగా మహిళలే ఉన్నారు. వరంగల్ కార్పొరేషన్ మేయర్‌గా కూడా ఓ మహిళే ఉన్నారు. మహిళల రుణం తీర్చుకోవాల్సిన అవసరం ఇంకా ఉంది. మహిళా సంఘాల స్టాల్స్ చూస్తుంటే కార్పొరేట్ శక్తులైన అంబానీ, అదానీ వ్యవస్థలను అధిగమించేలా కనిపిస్తోంది. మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు వారికి సౌర విద్యుత్ ఉత్పాదక రంగాలను అప్పగిస్తాం..' అని ముఖ్యమంత్రి తెలిపారు.

ఆ సభతో తెలంగాణ రూపురేఖలు మారిపోయాయ్

'తెలంగాణ వాదానికి, పౌరుషానికి మరో పేరైన కాళోజీని గుర్తించని ప్రపంచం, కవులు లేరు. అలాంటి కాళోజీని స్ఫూర్తిగా తీసుకుని వరంగల్‌లో రాహుల్‌గాంధీతో రైతు సంఘర్షణ సభ నిర్వహించాం. ఆ సభలో రైతు డిక్లరేషన్ ఇచ్చి ఆచరణలో అమలు చేస్తున్నాం. ఆ సభతోనే తెలంగాణలో కాంగ్రెస్ రూపురేఖలు మారిపోయాయి. ప్రశ్నించే గొంతుకకు ప్రతీకైన కాళోజీ కళాక్షేత్రాన్ని పదేళ్లలో పూర్తి చేయలేకపోవడంలోనే గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేతగానితనం వెలుగు చూసింది. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఒత్తిడితో మేం కాళోజీ కళాక్షేత్రం పూర్తి చేసి ప్రారంభించాం..' అని రేవంత్ చెప్పారు.

కేసీఆర్ అనే మొక్కను మళ్లీ మొలవనీయం

'కేసీఆర్ నువ్వు ఫామ్‌హౌస్‌లో పడుకుంటే, మౌనంగా ఉండి కుట్రలు చేస్తే నీ గురించి తెలవదనుకోకు.. నాకు ముందు తెలుసు.. వెనక తెలుసు.. ఉపాయం తెలుసు.. ఉబలాటం తెలుసు.. అన్నింటికీ కుక్కకాటుకు చెప్పుదెబ్బలా నీ సంగతి తేలుస్తా.. కేసీఆర్ అనే మొక్కను మళ్లీ తెలంగాణలో మొలకెత్తనీయం.. రాసి పెట్టుకోండి.. కేసీఆర్ కాస్కో చూద్దాం. అధికారం ఉంటే దోచుకుంటవ్. ఓడిపోతే ఫామ్‌హౌస్‌లో పడుకుంటవా? మళ్లీ చెబుతున్నా.. రా బయటకు.. ప్రజల్లోకి వచ్చి మాట్లాడు.. నీ దుఃఖం ఏందో.. నీ బాధ ఏందో దమ్ముంటే అసెంబ్లీకి రా.. చర్చ పెడదాం.. నువ్వు లేవనెత్తిన అంశాలు సహేతుకమైతే సరిచేసుకుంటాం..' అని రేవంత్ చెప్పారు.

వరంగల్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తాం

'వరంగల్ నగరాన్ని హైదరాబాద్‌కు దీటుగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం. హైదరాబాద్‌కు పోటీ నగరంగా తీర్చిదిద్దుతాం. వరంగల్ అభివృద్ధి చెందితే ఉత్తర తెలంగాణ రూపురేఖలే మారతాయి. తెలంగాణలోని ఉత్తర తెలంగాణ జిల్లాల పురోగతి ఓరుగల్లు అభివృద్ధితో ముడిపడి ఉంది. మహారాష్ట్రలో బస్సు డిపోల మాదిరిగా ఎయిర్‌పోర్టులు ఉన్నా తెలంగాణలో హైదరాబాద్ తప్ప ఎక్కడా లేవు. అందుకనే వరంగల్, రామగుండం, కొత్తగూడెం, ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవడానికి కుట్రలు చేస్తే ఊచలు లెక్కబెడతారు..' అని సీఎం అన్నారు.

బిల్లా రంగాలవి అర్థం పర్థం లేని విమర్శలు


'మీరు రాష్ట్రాన్ని తాగుబోతుల రాష్ట్రంగా మార్చాలనుకున్నారు. తాగుబోతుల సంఘానికి గౌరవాధ్యక్షుడు ఎవరంటే అది కేసీఆరే. కేసీఆర్.. మీరు ఫామ్‌హౌస్‌లోనే ఉండండి.. కావలసినవి అక్కడికే పంపిస్తా. అసెంబ్లీకి రమ్మంటే అచ్చోసిన ఆంబోతుల్లా ఇద్దరిని రోడ్ల మీదకు వదిలేసినవ్.. రుణమాఫీ చేయలేదంటూ ఆ బిల్లా రంగాలు అర్థం పర్థం లేని విమర్శలు చేస్తున్నారు. దమ్ముంటే వారైనా అసెంబ్లీలో చర్చకు సిద్ధం కావాలి. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే ఆర్టీసీ కార్మికులతో ధర్నా చేయించిన కేటీఆర్.. కాకి అంగీ వేసుకుంటే ఆటోరాముడు అవుతావా? నువ్ రామారావువా? డ్రామారావువా?..' అని సీఎం ఎద్దేవా చేశారు.

తెలంగాణ ద్రోహి మోదీకి కిషన్‌రెడ్డి గులాంగిరీ

'ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ ద్రోహి. అలాంటి మోదీకి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గులాం గిరీ చేస్తున్నారు. ఆ ద్రోహికి ఊడిగం చేసే కిషన్‌రెడ్డికి తెలంగాణలో ఉండే అర్హత లేదు. కేటీఆర్ ఏదన్నా మాట్లాడగానే రెండోరోజు కిషన్‌రెడ్డి మాట్లాడతడు. అది మీకున్న బాండింగ్. నీకు ఉద్యోగం ఇచ్చింది నరేంద్రమోదీ కాదు.. సికింద్రాబాద్ ప్రజలు. ఆ ప్రజలకు కృతజ్ఞతగా ఉండు. మేం సోనియమ్మకు గులాం గిరీ చేస్తున్నం అని కిషన్‌రెడ్డి మాట్లాడుతుండు. అరవై ఏళ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన సోనియమ్మ.. నాలుగుకోట్ల తెలంగాణ బిడ్డలకు అమ్మ. అలాంటి ఆ తల్లి కాళ్లు కడిగి నీళ్ల నెత్తిన చల్లుకోవడానికి కూడా మేం సిద్ధమే. ఇది మాకు అవమానం కాదు.. ఆత్మ గౌరవం. కిషన్‌రెడ్డి.. సోనియమ్మ కాళ్లు కడిగి నెత్తిమీద చల్లుకుంటే మోదీకి ఊడిగం చేసిన పాపం కొంతైనా తగ్గుతుంది..' అని రేవంత్ మండిపడ్డారు.

మహిళల కోసం ఎన్ని కోట్లయినా ఖర్చు

వరంగల్ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



వరంగల్ అభివృద్ధి మ్యాప్ విడుదల చేస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో బలరాంనాయక్, వేం నరేందర్‌రెడ్డి, కొండా సురేఖ, కోమటిరెడ్డి, భట్టి, సీతక్క, మహేశ్‌గౌడ్, కావ్య, పొంగులేటి, పొన్నం, జూపల్లి

సాక్షి ప్రతినిధి, వరంగల్: మహిళల కోసం ఎన్ని కోట్లయినా ఖర్చు చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. మంగళవారం వరంగల్‌లో నిర్వహించిన 'ప్రజా పాలన–ప్రజా విజయోత్సవ సభ'లో ఆయన మాట్లాడారు. మహిళల అభివృద్ధితోనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. రూ.6వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. ఇది మహిళలు ఏది కావాలంటే అది అమలు చేసే ప్రభుత్వమని పేర్కొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేసి తీరతాం: పొంగులేటి

ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం నూటికి నూరు శాతం నెరవేరుస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని, ఒకేరోజు రాష్ట్రవ్యాప్తంగా 22 ఇందిరా మహిళా శక్తి భవనాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

మూసీ ప్రక్షాళన తెలంగాణకో వరం: కోమటిరెడ్డి

మూసీ ప్రక్షాళన తెలంగాణకు గొప్ప వరమని, ప్రధానంగా ఫ్లోరైడ్‌తో బాధపడుతున్న నల్లగొండతో పాటు పలు ప్రాంతాలకు చెందిన లక్షలాది మందికి మేలు జరుగుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. రూ.7 లక్షల కోట్ల అప్పు చేసిన గత పాలకులు మూసీ కోసం రూ.7 కోట్లు కూడా ఖర్చు చేయలేదన్నారు.

వైఎస్ స్ఫూర్తితో ముందుకు: సీతక్క, కొండా సురేఖ

నాడు దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మహిళా సమాఖ్యలకు పావలా వడ్డీ రుణాలు ఇచ్చి ఆర్థిక పరిపుష్టిని కల్పిస్తే, నేడు వడ్డీలేని రుణాతోపాటు కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా రేవంత్ ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి ధనసరి సీతక్క చెప్పారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తర్వాత అంత గొప్ప దయగల నేత, సీఎం రేవంత్‌రెడ్డి అని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

మహిళల అభ్యున్నతికి సీఎం కృషి: టీపీసీసీ చీఫ్

వరంగల్ అభివృద్ధికి ప్రభుత్వం రూ.6,000 కోట్లు కేటాయించడం చరిత్రలో రికార్డని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మహిళల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. సభలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, కె.కేశవరావు, సలహాదారు శ్రీనివాసరాజు, ఎంపీలు బలరాం నాయక్, డాక్టర్ కావ్య, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, మధుసూదనాచారి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, యశస్విని రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఎంఏయూడీ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

నేడు వేములవాడకు సీఎం రేవంత్

ఆలయ గుడి చెరువు మైదానంలో భారీ బహిరంగ సభ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్ల జిల్లా పర్యటనకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. రేవంత్ బుధవారం ఉదయం 10 గంటలకు వేములవాడకు చేరుకొని శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుంటారు. అనంతరం గుడి చెరువు ఖాళీ స్థలంలో వేములవాడ పట్టణాభివృద్ధికి, దేవాలయ అభివృద్ధికి రూ. 127 కోట్లతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేస్తారు. ప్రభుత్వం శ్రీ రాజరాజేశ్వర ఆలయ కాంప్లెక్స్ విస్తరణ, భక్తులకు అవసరమైన అధునాతన సదుపాయాలకు గాను రూ.76 కోట్లు, ఆలయం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు రోడ్ల విస్తరణకు రూ.47.85 కోట్లు, మూలవాగు బతుకమ్మ తెప్ప నుంచి జగిత్యాల కమాన్ జంక్షన్ వరకు డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణానికి రూ.3.8 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేస్తారు. అలాగే సిరిసిల్ల ఎస్పీ కార్యాలయాన్ని వర్చువల్‌గా ప్రారంభిస్తారు. అనంతరం సభలో రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సభ ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు.

విజయోత్సవానికి రెడీ.. ఏడాదైనా గూడేది

▶ మొదటి పేజీ తరువాయి

రేషన్‌కార్డు లేని 30లక్షల దరఖాస్తులను పక్కనబెట్టిన అధికారులు.. మిగతా 50 లక్షల దరఖాస్తులను స్క్రూటినీ చేయాలని నిర్ణయించారు. కానీ ప్రక్రియ ముందుకు కదల లేదు. ఏడాది అవుతుండటంతో దరఖాస్తులు దుమ్ముకొట్టుకుపోతున్నాయి.

ఉత్తర్వులు వెలువడి ఎనిమిది నెలలు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఈ ఏడాది మార్చి 9న ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అధికారికంగా ప్రారంభించారు. మంత్రులందరినీ వెంటబెట్టుకుని అట్టహాసంగా ఆ కార్యక్రమాన్ని నిర్వహించడంతో.. పథకం పట్టాలెక్కినట్టే అనే భావన అప్పట్లో నెలకొంది. ఇది జరిగి ఎనిమిది నెలలైనా ఒక్క ఇల్లు కూడా మంజూరు కాలేదు.

ఎన్నికల కోడ్ ముందుండగా..

భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించడానికి మూడు నెలల ముందే దరఖాస్తుల స్వీకరణ పూర్తయింది. పథకాన్ని ప్రారంభించే నాటికే లబ్ధిదారుల జాబితా రూపొందించి ఉంటే... భద్రాచలంలో వెంటనే ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించే వీలుండేది. అదే జరిగితే కొంత మేరకైనా ఇళ్ల నిర్మాణం పూర్తయి ఉండేది. అయితే భద్రాచలం సభ ముగిసిన వారం రోజుల్లో లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి.. ఇళ్ల నిర్మాణ ప్రక్రియను చేపట్టలేని పరిస్థితి నెలకొంది. నిజానికి ఎన్నికల కోడ్ వస్తుందని ప్రభుత్వానికి ముందే తెలుసని, అయినా దరఖాస్తుల స్క్రూటినీ చేపట్టకుండా కాలయాపన చేసిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఊసే లేని గ్రామ సభలు

ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక గ్రామసభల ద్వారానే ఉంటుందని మార్చిలో విడుదల చేసిన మార్గదర్శకాల ఉత్తర్వులలో ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ ఇప్పటి వరకు గ్రామ సభల ఊసే లేదు. దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయ్యాక అర్హుల జాబితా ఆధారంగా గ్రామసభల్లో లబ్ధిదారుల ఎంపిక జరగాల్సి ఉంది. ఈ మొత్తం వ్యవహారాన్ని పర్యవేక్షించాల్సిన జిల్లా కలెక్టర్లు, గృహనిర్మాణ శాఖ అధికారులకు కూడా ఎలాంటి స్పష్టత లేకపోవటంతో యావత్తు పథకం నిర్వహణ గందరగోళంగా మారింది. మరోవైపు గ్రామసభలతో సంబంధం లేని ఇందిరమ్మ కమిటీల ఎంపికను మాత్రం హడావుడిగా చేపట్టడం గమనార్హం. ఈ కమిటీలు కూడా నెల రోజులుగా చేసే పనేమీ లేక ఖాళీగా ఉండిపోయాయి.

50 లక్షల దరఖాస్తులు... ఇంటింటి వెరిఫికేషన్ జరిగేదెప్పుడు?

పేదల ఇళ్ల పథకం అమల్లో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పక పాటించాలని.. లేకుంటే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద నిధులను ఇవ్వబోమని కేంద్రం ఇప్పటికే స్పష్టం చేసింది. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్రూం ఇళ్ల పథకంలో ఆ మార్గదర్శకాలను పాటించకపోవడంతో ఆవాస్ యోజన నిధులను విడుదల చేయలేదు. ఈ క్రమంలో కేంద్ర నిధులను రాబట్టాలని, మార్గదర్శకాలు పాటించాలని కాంగ్రెస్ సర్కారు ప్రాథమికంగా నిర్ణయించింది. దీంతో కేంద్రం రూపొందించిన యాప్ ఆధారంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల ఎంపిక జరగాల్సి ఉంటుంది. అందిన ప్రతి దరఖాస్తుకు సంబంధించి, వారి ఇళ్లకు వెళ్లి వివరాలను యాప్‌లో నమోదు చేయాలి. అలా 50 లక్షల దరఖాస్తులను వెరిఫై చేసే బాధ్యతను సుమారు 13 వేల మంది గ్రామ కార్యదర్శులకు అప్పగించారు. ఇంకా ఆ ప్రక్రియ మొదలు కాలేదు. మొదలైనా దాదాపు రెండున్నర నెలల సమయం పడుతుందని అంచనా. అంటే వచ్చే ఫిబ్రవరికి గాని అర్హుల జాబితా సిద్ధం కాదు. ఇక ఆ జాబితాలలో ఏవైనా లోపాలుంటే పరిశీలించి సరిదిద్దాల్సిన బాధ్యత ఇందిరమ్మ కమిటీలకు అప్పగిస్తారని సమాచారం. దాని కోసం మరింత సమయం పట్టే అవకాశం ఉంటుంది. చివరగా గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారుల పేర్లను అధికారికంగా ప్రకటిస్తారు. వెరసి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి గానీ ఇందిరమ్మ ఇళ్ల పథకం పట్టాలెక్కడం కష్టమేనని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రాజ్యాంగంలో మతపరమైన రిజర్వేషన్లకు స్థానం లేదు

రిజర్వేషన్లు అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి మహారాష్ట్రలో చెప్పడం సరికాదు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంలో మతపరమైన రిజర్వేషన్లకు స్థానం లేదని... ఈ అంశం సుప్రీం కోర్టు పరిధిలో ఉందని మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో ముస్లింలకు ఇస్తున్నట్టుగానే మహారాష్ట్రలో కూడా 4శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం సరికాదన్నారు. మంగళవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఆర్ఎస్ఎస్ వరిష్ఠ ప్రచారక్ నందకుమార్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో హైకోర్టులు మతపరమైన రిజర్వేషన్లు రద్దు చేశాయని, ఇది రాజ్యాంగ వ్యతిరేకమని చెప్పాయని గుర్తు చేశారు. దీనిపై సుప్రీంకోర్టులో స్టే తీసుకొచ్చి మతపరమైన రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగంలో మతపరమైన రిజర్వేషన్లకు స్థానం లేదు..ఇది రాజ్యాంగ వ్యతిరేకం అని కోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఆ కోర్టు తీర్పును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గౌరవించాలని సూచించారు. లగచర్ల అంశంపై చట్టం తనపని తాను చేస్తుందని, ఇది ముఖ్యంగా శాంతిభద్రతల సమస్య అని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను రద్దు చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. టీటీడీ బోర్డు తీసుకున్న నిర్ణయాలను స్వాగతిస్తున్నానని తెలిపారు. హిందూ దేవాలయాల్లో పనిచేసే ఇతర మతాల వారిని వేరేచోట్లకు బదిలీ చేయాలని కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఆవిష్కరణలకు అంతర్జాతీయ గమ్యస్థానంగా హైదరాబాద్

ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: నూతన ఆవిష్కరణలకు ప్రపంచ గమ్యస్థానంగా హైదరాబాద్ స్థానం సుస్థిరమవుతోందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. హైటెక్ సిటీలోని సత్వ నాలెడ్జ్ పార్కులో ఎవర్‌నార్త్ ఆరోగ్య సేవల సంస్థ ఏర్పాటు చేసిన దేశంలోనే తొలి గ్లోబల్ సామర్థ్య కేంద్రాన్ని (జీసీసీ) మంగళవారం ఆయన ప్రారంభించారు. తొలిదశలో ఎవర్‌నార్త్ వేయి మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తుందన్నారు. ఈ ఆధునిక కేంద్రం హైదరాబాద్‌లోని నిపుణుల సామర్థ్యాన్ని వినియోగించుకుని ఆరోగ్యరంగంలో ఐటీ వినియోగాన్ని మరింత విస్తృతం చేస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. బెంగళూరులోని సిగ్నా హెల్త్ సొల్యూషన్స్ సంస్థ, అంతర్జాతీయ ఆరోగ్య వ్యాపారానికి డేటా, అనలిటిక్స్ లాంటి సాంకేతిక సేవలను అందించే కేంద్రంగా ఎవర్‌నార్త్ పనిచేస్తుందన్నారు. సిగ్నా సంయుక్త భాగస్వామ్యం ద్వారా ఎవర్‌నార్త్ 1.9 కోట్ల భారతీయులకు ఆరోగ్య సేవలను అందిస్తోందన్నారు. 75 వేలకు పైగా మంది ఉద్యోగులతో 30కి పైగా దేశాల్లో 18.6 కోట్ల వినియోగదారులతో, ఆరోగ్య సేవల రంగంలో నూతన ఆవిష్కరణలకు దోహదం చేస్తోందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిగ్నా గ్రూప్ ప్రధాన సమాచార అధికారి నోయెల్ ఎడర్, రాష్ట్ర ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ, రాష్ట్ర లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ డైరెక్టర్ శక్తి నాగప్పన్ తదితరులు పాల్గొన్నారు.

11 నెలల పాలనలో బూతులు తప్ప నీతులు లేవు

విజయోత్సవాలు కాదు అపజయోత్సవాలు చేయాలి: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: చేతకాని వాడికి మాటలెక్కువ. చేవలేనోడికి బూతులు ఎక్కువ అనే రీతిలో సీఎం రేవంత్‌రెడ్డి వైఖరి ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. వరంగల్ వేదికగా రేవంత్ చేసిన వ్యాఖ్యలపట్ల ఆయన 'ఎక్స్'వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. '11 నెలల పాలనలో సీఎం నోటి వెంట బూతులు తప్ప నీతులు రాలేదు. కాంగ్రెస్ విజయోత్సవ సభ అని పేరు పెట్టుకొని 11 నెలల్లో చేసింది చెప్పుకోవడానికి లేక పిచ్చి మాటలు వదిలిండు. అశోక్ నగర్ నుంచి లగచర్ల దాకా, రైతుల నుంచి లంబాడీల బిడ్డల దాకా ఆయన చేసిన ఘోరాలు సమసిపోవు'అని హరీశ్ వ్యాఖ్యానించారు. 'కేసీఆర్ నామస్మరణ చేసినంత మాత్రాన నీ పాపం పోదు. తొక్కుకుంటూ వచ్చానని గప్పాలు కొడుతున్నవు. నీ వదరుబోతు తనంతో రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదు'అని పేర్కొన్నారు. కాంగ్రెస్ జరపాల్సింది అపజయోత్సవాలు నిర్వహించాలని ఎద్దేవా చేశారు.

తెలంగాణ కవులకు అవమానం: కాళోజీ జయంతి సందర్భంగా ప్రభుత్వం ఏటా ఇచ్చే పురస్కారాన్ని కవి, రచయిత నలిమెల భాస్కర్‌కు ప్రదానం చేయకపోవడం శోచనీయమని హరీశ్‌రావు విమర్శించారు. 2024 సంవత్సరానికి గాను నలిమెల భాస్కర్‌కు ప్రభుత్వం కాళోజీ సాహితీ పురస్కారాన్ని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. కాళోజీ జయంతి సందర్భంగా సాహితీవేత్తలకు పురస్కారాలు అందజేసి గౌరవించే సంస్కృతిని ప్రభుత్వం దురుద్దేశపూర్వకంగా విస్మరించి కవులను అవమానించిందన్నారు.

హామీలపై చర్చకు మేం సిద్ధం

సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నా: ఎంపీ ఈటల రాజేందర్

చర్చకు ప్రధాని మోదీ ఎందుకు.. మీకు మేం చాలు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ 6 గ్యారంటీలు, 420 హామీల అమలుపై చర్చకు సిద్ధమని.. సీఎం రేవంత్‌రెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరిస్తున్నామని బీజేపీ నేత, ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. రేవంత్‌తో చర్చకు ప్రధాని మోదీ రావాల్సిన అవసరం లేదని.. తాము సరిపోతామని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లో ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడారు. ఏడాది పాలనలో అన్నిరంగాల్లో విఫలమైన కాంగ్రెస్ సర్కారు ఏదో సాధించినట్టు సంబురాలు చేసుకోవడం ఏమిటన్నారు. ఒకవైపు హైడ్రాతో పేదల ఇళ్ల కూల్చివేతలు, మరోవైపు లగచర్ల రైతులపై దాడి వంటి ఘటనలు జరుగుతున్నా సంబురాలు ఏమిటని నిలదీశారు. రేవంత్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వ అధికారులు భూముల వద్దకు వస్తే తరిమేయాలని పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. ఇప్పుడు కోట్ల రూపాయల విలువైన భూములను ఫోర్త్‌సిటీ, హ్యాపెనింగ్ సిటీ అంటూ రియల్ ఎస్టేట్ మాఫియాకు కట్టబెట్టి.. రైతుల కళ్లలో మట్టికొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

రైతుల భూములు గుంజుకునే యత్నం

కొడంగల్‌లో ప్రజలు ఫార్మాసిటీకి భూములు ఇచ్చేందుకు ససేమిరా అంటున్నా కాంగ్రెస్ ప్రభుత్వం బెదిరింపులకు దిగిందని ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. లగచర్ల ఘటనలో తనపై దాడి జరగలేదని స్వయంగా కలెక్టర్ ప్రకటించినా... అక్కడి ప్రజలపై పోలీసులు దాడి చేసి, హింసించిన తీరుతో యావత్ గిరిజన, దళిత సమాజం, పేద రైతులు కన్నీళ్లు పెడుతున్నారని పేర్కొన్నారు. భూములు ఇవ్వబోమంటూ వ్యతిరేకిస్తున్నందుకు రైతులపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఆరోపించారు. రేవంత్ రైతుల భూములను గుంజుకునే ప్రయత్నం చేస్తూ శాడిస్టులా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. హైడ్రా పేరుతో ఇండ్లను కూలగొట్టే ప్రయత్నం చేసిందని.. పట్టాలు, అన్ని అనుమతులున్న ఇండ్లను కూడా కూలగొట్టిందని ఈటల పేర్కొన్నారు. ఈ వ్యవహారాన్ని తెలంగాణ సమాజం చీత్కరించడంతో మూసీ ప్రక్షాళన అంటున్నారని చెప్పారు. మూసీకి ఇరువైపులా విలువైన భూములను లాక్కొని.. మల్టీనేషనల్ కంపెనీలతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు.

లగచర్ల ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్సీకి ఈటల ఫిర్యాదు

నిజ నిర్ధారణ బృందాన్ని పంపాలని విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: లగచర్ల ఘటనపై జాతీయ మానవహక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ)కి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఫిర్యాదు చేశారు. కస్టడీలో రైతులపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలకు గురిచేశారని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్ పరిధిలో ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని ఎన్‌హెచ్‌ఆర్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికీ పోలీసులు, అధికార పార్టీ నాయకులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఈటల ఆందోళన వ్యక్తంచేశారు. వెంటనే లగచర్ల గ్రామానికి నిజనిర్ధారణ బృందాన్ని పంపించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని మంగళవారం ఎన్‌హెచ్‌ఆర్సీ ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌కు పంపిన లేఖలో ఈటల వెల్లడించారు. తాను చేసిన విజ్ఞప్తిపై కమిషన్ సానుకూలంగా స్పందించిందని ఆయన చెప్పారు. 8 రోజులుగా లగచర్ల గ్రామంలో అమాయక ప్రజలపై హింస, దాడులు కొనసాగుతున్నాయన్నారు.

క్లుప్తంగా...

టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశం రేపు

మంత్రులతో ముఖాముఖి కూడా..

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పీసీసీ విస్తృత స్థాయి సమావేశం గురువారం గాంధీభవన్‌లో నిర్వహించనున్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి పార్టీ ముఖ్య నాయకులతో పాటు భారీ ఎత్తున పార్టీ సభ్యులు హాజరు కానున్నారు. మహేశ్‌కుమార్ అధ్యక్షుడిగా నియమితులైన తరువాత జరుగుతున్న తొలి సమావేశం కావడంతో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. నూతన కార్యవర్గం ఏర్పాటు, ప్రభుత్వంలో పార్టీ నేతలకు అవకాశం వంటి అంశాలపై చర్చించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి.

మంత్రులతో ముఖాముఖిలో భట్టి

గాంధీభవన్‌లో వారానికి రెండు రోజులు నిర్వహించే మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం ఈసారి గురువారం జరగనుంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. బుధవారమే జరగాల్సిన ఈ సమావేశం సేవాదళ్ కార్యక్రమం కారణంగా గురువారానికి వాయిదా పడింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారు. అఖిల భారత సేవాదళ్ కార్యక్రమం బుధవారం ఉదయం నుంచి జరగనున్నట్లు సేవాదళ్ అధ్యక్షుడు జితేందర్ తెలిపారు.

జైలుకు పోతానని తెలిసే కేటీఆర్ బద్నాం: మల్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కేటీఆర్ జైలుకు పోవడం ఖాయమని తెలిసే సీఎం రేవంత్ రెడ్డిని బద్నాం చేయాలని ప్రయత్నిస్తున్నారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ధ్వజమెత్తారు. సీఎల్పీ మీడియా పాయింట్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. ఈడీ ప్రస్తుతం ఐఏఎస్ అధికారి అమేయ్ కుమార్‌ను విచారిస్తోందని, త్వరలోనే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును కూడా విచారించనుందని తెలిపారు. కేసీఆర్, కేటీఆర్ చిట్టా అంతా తనదగ్గర ఉందని మల్‌రెడ్డి చెప్పారు. రేవంత్‌రెడ్డికి మంచి పేరు వస్తే భవిష్యత్‌లో పుట్టగతులు ఉండవనే ఈ దాడులు చేయించారన్నారు. కేసీఆర్ పదేళ్ల ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని మల్‌రెడ్డి విరుచుకుపడ్డారు.

కొడంగల్ ఘటనపై సీఎం ఎందుకు స్పందించట్లేదు?

మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



సాక్షి, న్యూఢిల్లీ: కొడంగల్ నియోజకవర్గంలో గిరిజనులపై అఘాయిత్యాలు జరుగుతున్నా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గమైనా ఎందుకు స్పందించడం లేదని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ప్రశ్నించారు. ఫార్మా కంపెనీ కోసం గిరిజనులు తమ భూములివ్వనందుకు రేవంత్‌రెడ్డి అహంకార పూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ఢిల్లీ రావటానికి సమయం ఉంటుంది కానీ, లగచర్ల రావటానికి ఉండదా? అని నిలదీశారు. మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సత్యవతి మీడియాతో మాట్లాడారు. కలెక్టర్ మీద దాడి చేయకపోయినా జరిగినట్టు చిత్రీకరించి గిరిజనులపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడటం దుర్మార్గమని మండిపడ్డారు. ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్ వంటి వాళ్లను కూడా లగచర్లకు వెళ్లనీయటం లేదంటే అక్కడ జరుగుతున్న దాడులు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు.

నేడు డెడికేటెడ్ కమిషన్ అభిప్రాయాల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు, సమోదిత బీసీ సంఘాలు, మేధావుల నుంచి బుధవారం డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు అభిప్రాయాలను స్వీకరించనున్నారు. మాసబ్ ట్యాంక్ దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్‌లోని నాల్గవ అంతస్తులో ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొనవచ్చని డెడికేటెడ్ కమిషన్ కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైతుల భూమి బీఆర్ఎస్ నేతల పాలు

హైదరాబాద్ చుట్టూ 10 వేల ఎకరాలు గుంజుకున్న బీఆర్ఎస్
- భూ సేకరణ బాధితుల గురించి ఇప్పుడు మొసలికన్నీరు
- అందరికీ సమానావకాశాల కోసమే సర్వే: డిప్యూటీ సీఎం భట్టి



ప్రతిభా అవార్డు అందజేస్తున్న భట్టి. చిత్రంలో మహేశ్‌కుమార్‌గౌడ్, అనిల్, కోదండరెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పంపిణీ చేసిన భూములను బీఆర్ఎస్ పాలనలో బలవంతంగా గుంజుకొని అమ్ముకున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. అలాంటి దుర్మార్గులు ఇప్పుడు రైతుల సంక్షేమం గురించి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ధ్వజమెత్తారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో 24 లక్షల ఎకరాల భూమిని రైతులకు పంచిందని, పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు అందులో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని రైతుల నుంచి 10 వేల ఎకరాల భూమిని బలవంతంగా లాక్కొని అమ్ముకొన్నారని ఆరోపించారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఆయన నెక్లెస్‌రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. 2013లో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ సేకరణ చట్టం ప్రకారమే రైతుల నుంచి అభివృద్ధికి అవసరమైన భూములు తీసుకుంటామని, బలవంతంగా తీసుకోబోమని స్పష్టంచేశారు. లగచర్లలో అధికారులపై దాడి చేయించింది బీఆర్ఎస్ పార్టీయేనని ఆరోపించారు. హామీలను నెరవేర్చకుండా బీజేపీ ప్రజలను మోసగించిందని విమర్శించారు. సొంత స్థలం ఉన్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రూ.5 లక్షలు ఇచ్చే అంశంపై సర్వే చేస్తున్నట్లు తెలిపారు.

సమానావకాశాల కోసమే సర్వే..: రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించేందుకే ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్నదని భట్టి విక్రమార్క తెలిపారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు మహిళా స్వయం సహాయక సంఘాలకు ఏటా రూ. 20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇస్తున్నామని చెప్పారు. దేశాన్ని విభజించి, అస్థిరపరిచి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నవారు ఇందిరాగాంధీ గురించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అలాంటివారితో దేశానికి ఎప్పటికైనా ప్రమాదమేనని అన్నారు. మీడియా సమావేశంలో మాజీ మంత్రి గీతారెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, చరణ్ యాదవ్, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంతో ఏ ప్రయోజనం లేదు

- ఆ ప్రాజెక్టు నీళ్లు లేకున్నా రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

గన్‌ఫౌండ్రీ: బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆ ప్రాజెక్టు వల్ల రాష్ట్రంలో వరి ఉత్పత్తి పెరిగిందనటం అవాస్తవమని పేర్కొన్నారు. కాళేశ్వరంతో సంబంధం లేకుండానే రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వరి ఉత్పత్తి జరుగుతుందని ఆనాడే చెప్పామని, ఇప్పుడు అదే నిజమైందని పేర్కొన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఆయన పలువురికి ఇందిరాగాంధీ వ్యవసాయ ప్రతిభా అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలో మొదటిసారి తమ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో రూ.72 వేల కోట్లు కేటాయించిందని తెలిపారు. వ్యవసాయ రుణాల మాఫీ కింద రూ.18 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమచేశామని వెల్లడించారు. వ్యవసాయరంగ అభివృద్ధికి అన్నివిధాలుగా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ఇందిరాగాంధీపై ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'లగచర్ల'పై రాష్ట్రపతి వద్దకు బీఆర్ఎస్

- బాధితులకు ముర్ము అపాయింట్‌మెంట్ కోసం వినతి
- ఘటన వివరాలు కోరిన ప్రెసిడెంట్ కార్యాలయం

సాక్షి, న్యూఢిల్లీ: లగచర్లలో అధికారులపై రైతుల దాడి.. తదనంతరం స్థానికులపై పోలీసుల నిర్బంధంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కార్యాలయం ఆరా తీసింది. లగచర్లలో బలవంతపు భూసేకరణ, పోలీసుల దాడులు, లైంగిక దాడి ఆరోపణలు తదితర అంశాలను రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తోంది. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ నేతృత్వంలోని 15 మంది సభ్యుల బృందం మంగళవారం రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరగా.. దాడికి సంబంధించిన వివరాలను ఇవ్వాలని రాష్ట్రపతి కార్యాలయం సూచించింది. దీంతో భూసేకరణకు వ్యతిరేకంగా 15 నెలలుగా స్థానికులు చేస్తున్న నిరసన కార్యక్రమాలు.. అధికారుల ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం.. ఆగ్రహంతో స్థానికులు తిరగబడటం.. పోలీసులు గ్రామాలను చుట్టుముట్టి రాత్రిపూట అరెస్టులు చేయటం వంటి అంశాలకు సంబంధించిన వార్తా కథనాలు, ఇతర వివరాలన్నీ బీఆర్ఎస్ నేతలు సమర్పించారు. దీంతో నాలుగైదు రోజుల్లో ఈ అంశంపై రాష్ట్రపతి స్పందిస్తారని, అప్పటివరకు వేచి ఉండాలని రాష్ట్రపతి కార్యాలయం సూచించింది. అయితే బాధితులు ఢిల్లీలో అన్ని రోజులు ఉండటం కష్టమని బీఆర్ఎస్ నేతలు విన్నవించటంతో, రాష్ట్రపతి సమయాన్ని బట్టి అపాయింట్‌మెంట్ ఖరారు చేస్తామని అధికారులు సమాచారమిచ్చారు. అయితే, ఢిల్లీలో కాకుంటే మరో రెండు రోజుల్లో రాష్ట్రపతి హైదరాబాద్‌కు వస్తున్నందున.. ఇక్కడైనా ఆమెను కలిసేందుకు అవకాశం ఇవ్వాలని కోరినట్టు ఎంపీ సురేశ్ రెడ్డి తెలిపారు.

రోజుకో చావుతో తెలంగాణ తెల్లారుతోంది

- కొడంగల్ నియోజకవర్గం పాకిస్తాన్ బార్డర్‌లో ఉందా ?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: రోజుకో చావుతో తెలంగాణ తెల్లారుతోందని, కాంగ్రెస్ కుట్రలకు రాష్ట్రం బలవుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అసమర్థ పాలనలో ఆర్థికంగా అనేక వర్గాలు చితికిపోయాయన్నారు. రైతులు, ఆటోడ్రైవర్లతోపాటు వివిధ వర్గాలకు చెందిన వారు రోజూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని 'ఎక్స్'లో పేర్కొన్నారు. లగచర్లకు నిజనిర్ధారణకు వెళ్లిన మహిళా సంఘాలపై దౌర్జన్యం చేసి వాస్తవాలను అడ్డుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. సీఎం సొంత నియోజకవర్గమైన కొడంగల్ పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉందా అని ప్రశ్నించారు. లగచర్లను చైనా సరిహద్దులో ఉన్న కల్లోలిత ప్రాంతంలా చూస్తూ ఇంటర్నెట్ సేవలు నిలిపివేయడం, పోలీసుల పహారా ఏర్పాటు చేశారని కేటీఆర్ మండిపడ్డారు.

ట్రాన్స్‌ఫార్మర్ల భారం ప్రజలపైనా?

హైదరాబాద్‌లో అదనపు విద్యుత్ వినియోగం పెరిగిందని చెబుతూ ప్రజలే వ్యక్తిగతంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ సంస్థ నోటీసులు ఇవ్వడంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. లోడ్ పెరిగిందంటూ ట్రాన్స్‌ఫార్మర్ల భారం అపార్ట్‌మెంట్‌వాసులపై వేస్తారా అని ప్రశ్నించారు. కరెంట్ నిర్వహణ, సరఫరా చేతకాక ప్రజలను ఇబ్బంది పెట్టేలా మరో తుగ్లక్ చర్యకు ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. ఒక్కో అపార్ట్‌మెంట్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.3 లక్షలు అవసరమవుతాయన్నారు. దీంతో నగరవాసులపైనే రూ.300 కోట్ల భారం పడే అవకాశముందని చెప్పారు. పెరిగిన అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అనే విషయం మరిచిపోయిందన్నారు. పెరిగిన విద్యుత్ లోడ్‌కు అనుగుణంగా ప్రభుత్వమే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

'నరేందర్‌రెడ్డికి ప్రత్యేక బ్యారక్ కేటాయించండి'

సాక్షి, హైదరాబాద్: వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్, జిల్లా అధికారులపై దాడి ఘటనలో అరెస్టయిన మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్‌రెడ్డికి ప్రత్యేక బ్యారక్ కేటాయించాలని జైళ్ల శాఖను హైకోర్టు ఆదేశించింది. ప్రత్యేక అండర్ ట్రయల్ ఖైదీగా పరిగణించాలని, ఇంటి నుంచి భోజనం అనుమతించాలని స్పష్టం చేసింది. తన భర్తకు జైలులో ప్రత్యేక వసతి కల్పించాలని కోరుతూ నరేందర్‌రెడ్డి భార్య శ్రుతి తరఫున న్యాయవాది సామల రవీందర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇతర ఖైదీలతోపాటు ఉంచితే తన భర్త ప్రాణానికి హాని ఉందని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. అండర్ ట్రయల్ ఖైదీ కుటుంబసభ్యులు సరఫరా చేసే ఆహార వస్తువులను రుచి చూసి అనుమతించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే వైద్య సదుపాయాలు అందించేలా చూడాలని చెప్పింది. జైలు అధికారులు నిర్దేశించిన సమయాల్లో ఆహారాన్ని అందజేయాలని కుటుంబసభ్యులకు స్పష్టం చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ డిసెంబర్ 10కి వాయిదా వేసింది. కాగా, ట్రయల్ కోర్టు డాకెట్ ఆర్డర్‌ను చాలెంజ్ చేస్తూ నరేందర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం జస్టిస్ జువ్వాడి శ్రీదేవి వద్ద విచారణకు వచ్చింది. అయితే మాజీ ఎమ్మెల్యే కావడంతో సంబంధిత కోర్టుకు పిటిషన్‌ను బదిలీ చేయాలని న్యాయమూర్తి ఆదేశించారు.

21న బీఆర్ఎస్ మహాధర్నా

మానుకోటలో నిరసన కార్యక్రమానికి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: లగచర్ల ఘటనతోపాటు రాష్ట్రంలో గిరిజనులు, దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఈ నెల 21న మహాధర్నా చేపట్టనుంది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం జరిగే ఈ ధర్నాలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొంటారు. లగచర్ల ఘటనను సీరియస్‌గా తీసుకున్న బీఆర్ఎస్ ఇప్పటికే వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్న విషయం తెలిసిందే. లగచర్ల ఘటనలో అరెస్ట్ అయిన గిరిజనులకు ఓవైపు న్యాయ సహాయం అందిస్తూనే, మరోవైపు వారికి పార్టీ సంఘీభావం ప్రకటించింది. లగచర్ల ఘటనలో అరెస్ట్ అయిన వారిని ఈనెల 15న సంగారెడ్డి జైలులో కేటీఆర్ కలిశారు. 18న ఢిల్లీకి వెళ్లిన కేటీఆర్ గిరిజనులపై జరిగిన దాడి, రేవంత్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును మీడియా ఎదుట ఎండగట్టారు.బాధిత కుటుంబాలను ఢిల్లీలోని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ వద్దకు పార్టీ నేతలు తీసుకెళ్లారు. లగచర్ల ఘటనతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ధర్నాకు గిరిజనులు హాజరయ్యేలా చూడాలని పార్టీ నేతలకు ఆదేశాలు వెళ్లాయి.

తప్పుదోవ పట్టించడమే..

కేటీఆర్ ఆరోపణలపై దక్షిణ డిస్కం స్పందన

సాక్షి, హైదరాబాద్: తక్కువ విద్యుత్ వినియోగించే వినియోగదారుల వ్యక్తిగత గృహాల విద్యుత్ సరఫరాకు మాత్రమే పబ్లిక్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయని, బల్క్‌గా విద్యుత్ వినియోగించే అపార్ట్‌మెంట్ల కోసం కాదని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) చీఫ్ ఇంజనీర్ తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలకు స్పందిస్తూ మంగళవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈఆర్సీ 2013లో జారీ చేసిన 4వ రెగ్యులేషన్ ప్రకారం భారీ మొత్తంలో విద్యుత్ వినియోగించే అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, మాల్స్.. ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. పవర్ ఓవర్‌లోడ్, లో వోల్టేజి సమస్యల పరిష్కారానికి అపార్ట్‌మెంట్లు సొంత ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాలని 11 ఏళ్లుగా కోరుతున్నామని, ఇప్పుడు కొత్త కాదన్నారు. గత పదేళ్లలో సంస్థ పరిధిలో 35,790 ప్రైవేట్ ట్రాన్స్‌ఫార్మర్లను అపార్ట్‌మెంట్‌లు, బహుళ అంతస్తుల సముదాయాలకు ఏర్పాటు చేసుకున్నారని వెల్లడించారు. వినియోగదారులపై రూ.300 కోట్లు భారం వేసేందుకు ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుందని పేర్కొనడం పూర్తిగా అవాస్తవమని, తప్పుదోవ పట్టించడమేనన్నారు.

ఏ-2 సురేష్ లొంగుబాటు

లగచర్ల కేసులో నేడు నరేందర్‌రెడ్డి రిమాండ్ పిటిషన్ విచారణ



సురేష్‌ను వైద్య పరీక్షలకు తీసుకెళుతున్న దృశ్యం

కొడంగల్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన లగచర్ల దాడి ఘటనలో ఏ- 2 నిందితుడిగా ఉన్న బోగమోని సురేష్ మంగళవారం న్యాయస్థానంలో లొంగిపోయారు. కొడంగల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీరాం అతనికి 14 రోజుల రిమాండ్ విధించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం సురేష్‌ను సంగారెడ్డి జైలుకు తరలించారు. ఇదే కేసులో ఏ-38 హన్మంత్, ఏ-55 నీరటి సురేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరికి వైద్య పరీక్షలు చేయించి, కొడంగల్ కోర్టులో హాజరుపర్చగా.. ఇరువురికీ 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం వీరినీ సంగారెడ్డి జైలుకు తరలించారు. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 28 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఏ-1 నరేందర్‌రెడ్డి పోలీస్ కస్టడీ పిటిషన్‌ను జడ్జి బుధవారం విచారించనున్నారు. ఈ పిటిషన్‌పై నరేందర్‌రెడ్డి సమక్షంలో విచారణ జరగాలని న్యాయమూర్తి ఆదేశించడంతో చర్లపల్లి జైలులో ఉన్న ఆయనను పోలీసులు బుధవారం కొడంగల్ కోర్టుకు తీసుకురానున్నట్లు తెలిసింది.

21న లగచర్లకు వెళతాం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సిరిసిల్ల: లగచర్లలో కలెక్టర్‌పై జరిగిన దాడిని ఖండిస్తున్నామని..దానికి బాధ్యులైన వారిని పట్టుకొని శిక్షించాలే తప్ప.. ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు పెట్టడం సరికాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. అన్ని విషయాలు తెలుసుకునేందుకు ఈ నెల 21న లగచర్లకు వెళతామని చెప్పారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జరిగిన సీపీఎం జిల్లా మూడో మహాసభల్లో పాల్గొని మాట్లాడారు. బీజేపీని ఓడించే లక్ష్యంతోనే వర్గశత్రువు అయిన కాంగ్రెస్‌తో కలిశామని వెల్లడించారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలన గాడి తప్పిందన్నారు. హైడ్రా, మూసీ సుందరీకరణపై ప్రతిపక్షాలతో చర్చించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. సిరిసిల్లలో నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటే.. ఉపాధి కల్పించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాలడుగు భాస్కర్, స్కైలాబ్‌బాబు, కూరపాటి రమేశ్, మూషం రమేశ్, కోడం రమణ తదితరులు ప్రసంగించారు. అంతకు ముందు సిరిసిల్ల వీధుల్లో ఎర్రజెండాలతో ప్రదర్శన నిర్వహించారు.

కాంగ్రెస్‌ను ప్రశ్నిద్దాం.. బీజేపీని నిలదీద్దాం!

▶ మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. దీనిపై ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రికి కూడా ఫిర్యాదు చేశారు. తాజాగా లగచర్ల ఘటనపైనా మరోమారు ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్, బీజేపీ లక్ష్యంగా విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాల పట్ల బీజేపీ వైఖరిని నిలదీశారు. వాస్తవానికి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ లోపాయికారీ ఒప్పందంతో చెరో ఎనిమిది సీట్లు గెలుచుకున్నాయని ఆరోపించిన బీఆర్ఎస్.. తెలంగాణ పట్ల ఆ రెండు పార్టీలది ఒకే వైఖరి అనే విషయాన్ని పదే పదే ఎత్తిచూపుతోంది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నివాసంపై జరిగిన ఈడీ దాడులపై బీజేపీ మౌనంగా ఉండటం ఏమిటని ప్రశ్నిస్తోంది. కేంద్ర మంత్రి బండి సంజయ్, కొందరు బీజేపీ ఎంపీలు రేవంత్‌కు మద్దతు పలుకుతున్నారని ఆరోపిస్తోంది. రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌తోపాటు బీజేపీ కూడా సమాన స్థాయిలో బీఆర్ఎస్‌కు ప్రధాన ప్రత్యర్థులుగా మారే అవకాశం ఉందని.. లోక్‌సభ ఎన్నికల అనుభవంతో రెండు పార్టీలపైనా సమాన స్థాయిలో పోరాటం చేయాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ భావిస్తోంది. రెండు జాతీయ పార్టీలను ఏక కాలంలో, ప్రణాళికబద్ధంగా టార్గెట్ చేసే వ్యూహాన్ని అమల్లో పెడుతోంది.

సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం

ఇప్పటికే ఎక్స్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమ వేదికలను కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం కోసం విస్తృతంగా వినియోగిస్తున్న బీఆర్ఎస్.. మరింత స్పీడ్ పెంచడంపై దృష్టి పెట్టింది. దీనికోసం సోషల్ మీడియా హ్యాండిల్స్‌ను పెంచుకోవడంలో నిమగ్నమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిన్న నేపథ్యంలో తిరిగి పట్టు సాధించేందుకు అవసరమైన మార్గాలను అన్వేషిస్తోంది. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలు వైఫల్యం గ్రామీణ ప్రాంతాల్లో ప్రభావం చూపుతోందనే అంచనాకు వచ్చింది. సోషల్ మీడియా ద్వారా ఈ అంశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేడర్‌కు దిశానిర్దేశం చేస్తోంది.

కేసీఆర్ కొంతకాలం ఎర్రవల్లికే పరిమితం!

ఇక పార్టీ అధినేత కేసీఆర్ మరికొంత కాలం ఎర్రవల్లి నివాసానికే పరిమితమవుతారని బీఆర్ఎస్ వర్గాలు చెప్తున్నాయి. జాతీయ, రాష్ట్రస్థాయిలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై ఆయన ఎప్పటికప్పుడు పార్టీ కీలక నేతలకు దిశానిర్దేశం చేస్తున్నారని అంటున్నాయి. వివిధ వర్గాలు తమ సమస్యలను విన్నవించేందుకు పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌కు వస్తుండటంతో 'జనతా గ్యారేజ్'గా మారిందని బీఆర్ఎస్ నేతలు వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం. బీఆర్ఎస్ పట్ల సీఎం రేవంత్ తీవ్ర వైఖరి దాల్చితే 'పాదయాత్ర' ద్వారా ప్రజల్లోకి వెళ్లే ప్రణాళికపైనా కసరత్తు జరుగుతోందని వారు చెప్తున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు మరో కీలక నేత హరీశ్‌రావు కూడా పాదయాత్ర చేసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.



మీ చర్య వల్ల మీకుగానీ, ఇతరులకుగానీ హాని జరిగేట్టయితే దాన్ని చేయకూడదు. జరగనట్టయితే కొనసాగించాలి.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 20 నవంబర్ 2024

విషతుల్య రాజధాని

భారత రాజధాని ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ప్రతి శీతకాలంలానే ఈ ఏడాదీ పాత కథ పునరావృత్తం అయింది. ఒకపక్క పెరిగిన చలికి తోడు ధూళి నిండిన పొగ లాంటి గాలి, కాలుష్య ఉద్గారాలు, పొరుగున ఉన్న పంజాబ్ – హర్యానా లాంటి వ్యవసాయాధారిత రాష్ట్రాల్లో అక్రమంగా సాగుతున్న కొయ్యకాళ్ళ దహనం... అన్నీ కలిసి అతి తీవ్ర వాయు కాలుష్యంగా పరిణమించాయి. వారంగా అదే పరిస్థితి కొనసాగుతూ ఉండడం, వాయునాణ్యతా సూచిక (ఏక్యూఐ) సోమవారం గరిష్ఠంగా దాదాపు 500 మార్కును చేరడంతో సుప్రీమ్ కోర్ట్ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. స్కూల్ పిల్లలకు భౌతికంగా తరగతులు నిర్వహించవద్దని ఆదేశాలు ఇవ్వాల్సి వచ్చింది. చివరకు బాకూలో జరుగుతున్న ఐరాస వాతావరణ సదస్సు సైతం ఈ కాలుష్యాన్ని ఆందోళనకరంగా పరిగణించడం, నిపుణులు దీన్ని 'ఆరోగ్య అత్యవసర పరిస్థితి'గా ప్రకటించడం పరిస్థితి తీవ్రతకు తార్కాణం.

ఢిల్లీలో సోమవారం కాలుష్య స్థాయి దీపావళి నాటి రాత్రి కన్నా దాదాపు 40 శాతం ఎక్కువంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఢిల్లీలో సగటు పీఎం 2.5 స్థాయి... భారతీయ ప్రమాణాల కన్నా 14 రెట్లు ఎక్కువ, అదే ఐరాస పర్యావరణ పరిరక్షక సంస్థ (యూఎస్‌ఈపీఏ) నిర్దేశించిన ప్రమాణాల లెక్కలో అయితే 55 రెట్లు ఎక్కువ నమోదైంది. వాయు నాణ్యత ఇంతలా క్షీణించడం పిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ వ్యాధులున్న వారికి ప్రమాదంగా పరిణమిస్తోంది. పీఎం 10 స్థాయిని బట్టి అంచనా వేసే ధూళి కాలుష్యమూ హెచ్చింది. ఆగ్రాలో కళ్ళు పొడుచుకున్నా కనిపించని దట్టమైన పొగ. తాజ్‌మహల్ కట్టడం విషవాయు కౌగిలిలో చేరి, దూరం నుంచి చూపరులకు కనిపించడం మానేసి వారమవుతోంది. మాస్కులు లేకుండా వీధుల్లోకి రాలేని పరిస్థితి. వెరసి, ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరమనే దుష్కీర్తి ఢిల్లీకి దక్కింది. స్విస్ గ్రూప్ ఐక్యూ ఎయిర్ తేల్చిన ఈ నిష్ఠురసత్యం ఇన్నేళ్ళ మన బాధ్యతా రాహిత్యానికీ, పాలకుల నిష్క్రియాపరత్వానికీ నిదర్శనం. ఆ మాటకొస్తే, 2018లో కానీ, గడచిన 2023లో కానీ ఏడాదిలో ఏ ఒక్కరోజూ ఢిల్లీలో స్వచ్ఛమైన గాలి లేదని రికార్డులు చెబుతున్నాయంటే ఏమనాలి?

కాలుష్యం దేశవ్యాప్తంగా ఉందనీ, నివారణ బాధ్యత రాష్ట్రానిదే కాదు కేంద్రానిది కూడా అని ఢిల్లీ 'ఆప్' సర్కార్ వాదన. కానీ, ఏటేటా శీతకాలంలో రాజధానిలో పెరుగుతూ పోతున్న ఈ కష్టానికి చెక్ పెట్టడంలో పాలకులు ఎందుకు విఫలమయ్యారంటే జవాబు దొరకదు. విమర్శలు వెల్లువెత్తడంతో ఢిల్లీ సర్కార్ కాలుష్య నిరోధానికి యంత్రాల ద్వారా నీటి తుంపర్లు జల్లడం లాంటి చర్యలు చేపడుతోంది. ఇవేవీ చాలక చివరకు ఢిల్లీ, జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లలో కృత్రిమ వర్షాలకు అనుమతి ఇవ్వాలని మరోసారి కేంద్రాన్ని అభ్యర్థిస్తోంది. మేఘమథనం జరిపేందుకు ఇప్పటికే పలుమార్లు కేంద్రాన్ని అనుమతి కోరినా, జవాబు లేదన్నది 'ఆప్' ఆరోపణ. ఇలాంటి ప్రయోగాల వల్ల ప్రయోజనమెంత అనేది చర్చనీయాంశమే. అయితే, ప్రజలకు తాత్కాలికంగానైనా ఉపశమనం కలిగించే ఇలాంటి ప్రయత్నాలకు కేంద్రం మొదటే మోకాలడ్డడం సరికాదు.

వాయు కాలుష్యం 'అతి తీవ్ర' స్థాయులకు చేరిన నేపథ్యంలో 'గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్' (గ్రాప్) నాలుగోదశ చర్యలను కఠినంగా అమలు చేయాలన్నది సుప్రీమ్ తాజా ఆదేశం. పాఠశాలల్ని మూసివేయడం, ఆఫీసుకు రాకుండా ఇంటి వద్ద నుంచే పనిచేయడం, పరిశ్రమల మూసివేత లాంటి చర్యలన్నీ నాలుగో దశ కిందకు వస్తాయి. ముప్పు ముంచుకొస్తున్నా మూడో దశ, నాలుగో దశ చర్యల్లో అధికారులు ఆలస్యం చేశారంటూ సర్వోన్నత న్యాయస్థానం చీవాట్లు పెట్టింది. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు షరతులు అమలు చేయాల్సిందేనని కోర్ట్ చెప్పాల్సి వచ్చిందంటే అధికార యంత్రాంగం అలసత్వం ఏ స్థాయిలో ఉందో తెలుస్తోంది. నిద్ర లేచిన ప్రభుత్వం ఇప్పుడిక 'గ్రాప్' నాలుగో దశ కింద వాహనాల రాకపోకలు, భవన నిర్మాణ కార్యకలాపాలపై షరతులు విధించింది. అయితే, దీంతో ఢిల్లీ, పంజాబ్, హర్యానాల్లో దాదాపు 34 లక్షల చిన్న, మధ్యశ్రేణి సంస్థల్లో ఉత్పత్తి దెబ్బతిననుంది. అంటే కాలుష్య పాపం ఆరోగ్యాన్నే కాక ఆర్థికంగానూ కుంగదీస్తుందన్న మాట.

ఢిల్లీలో వాహనాల వల్ల అత్యధిక కాలుష్యం సంభవిస్తుంటే, ఎన్‌సీఆర్‌లో పరిశ్రమలు ప్రధాన కాలుష్య కారకాలని ది ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ (తెరి) 2021లోనే తేల్చింది. అనేకచోట్ల ఇప్పటికీ కట్టెల వాడకం కొనసాగుతోంది. ఇక, పొలాల్లో కొయ్య కాళ్ళ దహనం తాజా దురవస్థకు 40 శాతం కారణమట. అన్నీ కలిసి పీల్చే గాలే విషమయ్యేసరికి, ఢిల్లీ వాసుల ఆయుఃప్రమాణం సగటున ఏడేళ్ళు తగ్గుతోంది. రాజధాని, ఆ పరిసరాల్లోని 3 కోట్ల పైచిలుకు మంది వ్యథ ఇది. నిజానికి, స్వచ్ఛమైన గాలి ప్రాథమిక మానవహక్కని గత నెలతో సహా గత అయిదేళ్ళలో సుప్రీమ్ అనేకసార్లు స్పష్టం చేసింది. వాయునాణ్యతకు చర్యలు చేపట్టాల్సిందిగా కేంద్ర, రాష్ట్రస్థాయి యంత్రాంగాలను ఆదేశించింది. అయినా జరిగింది తక్కువ. సరైన ప్రాణ వాయువు కూడా అందని ఈ పరిస్థితికి ప్రజల నుంచి పాలకుల దాకా అందరూ బాధ్యులే. కాలుష్య నివారణ, నియంత్రణలకు సృజనాత్మక ఆలోచనలు చేయలేకపోవడం ఘోరం. దాహమేసినప్పుడు బావి తవ్వకుండా ఏడాది పొడుగూతా వ్యూహాత్మకంగా చర్యలు చేపట్టడం అవసరం. ఆధునిక సాంకేతికత, ప్రజారవాణా, ప్రజల అలవాట్లలో మార్పులు సహా అనేక అంశాల్లో రాజకీయ కృత నిశ్చయంతో విధాన నిర్ణేతలు పనిచేయాలి. లేదంటే, సాక్షాత్తూ దేశ రాజధానే నివాసయోగ్యం కాక జనం తరలిపోతుండడం చూసి వికసిత భారత్, లక్షల కోట్ల ఆర్థికవ్యవస్థ లాంటివన్నీ వట్టి గాలి మాటలే అనుకోవాల్సి వస్తుంది.

ప్రజా తిరుగుబాటుకు ఇది ఆరంభం

అభిప్రాయం



టి. హరీష్ రావు

గెలిస్తే ప్రజాపాలన తెస్తామని వాగ్దానం చేసిన కాంగ్రెస్ ఇప్పుడు ప్రజలను అణచివేసే పాలన సాగిస్తోంది. ఏడాది పాలనను పూర్తిచేసుకుంటూ సంబరాలకు సిద్ధమవుతున్న ప్రభుత్వానికి లగచర్లలో ఎదురైన ప్రజా నిరసన ఒక తిరుగుబాటే! కాంగ్రెస్ ఇందిరమ్మ పాలన అందిస్తుందని చెప్పిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిజంగానే ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ పాలనను తెచ్చింది. ప్రజాస్వామ్య ప్రభుత్వం ఒక ప్రైవేటు ఫార్మా కంపెనీకి భూములు ఇప్పించడానికి ప్రజలపై ఉక్కుపాదం మోపుతుందా? స్త్రీలను తొక్కుకుంటూ ఇండ్లలోకి చొరబడి అరెస్టు చేసిన ప్రభుత్వాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ప్రజలకు అండగా గొంతెత్తుతున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం, జైల్లో పెడతామని బెదిరించడం ప్రజాస్వామ్య ప్రభుత్వం చేసే పనేనా?

రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అధికారం చేపట్టి ఏడాదవుతున్న సందర్భంగా పెద్ద ఎత్తున సంబరాలకు సర్కారు సన్నాహాలు చేస్తోంది. ఈ సమయంలో జనక్షేత్రంలో మొదలైన ప్రజా తిరుగుబాటు దేనికి సంకేతం? ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కొడంగల్ పరిధిలోని లగచర్లలో మొదలైన ప్రభుత్వ వ్యతిరేకత, రాబోయే రోజుల్లో రాష్ట్రమంతటా విస్తరిస్తుంది. మాట తప్పి ప్రజల్ని వంచించిన తప్పుడు పాలనకు పతనం ప్రారంభమైంది. రేవంత్ దీన్ని గుర్తించాలి.

లగచర్లలో ప్రభుత్వం అమానుషంగా పేదలు, అమాయక రైతులపై జరిపిన దౌర్జన్యం, వారిపై కక్షపూరితంగా వ్యవహరించిన తీరు గమనిస్తే... ప్రజా సమస్యలను కనీసం పరిశీలించే ఓపిక కూడా ఈ ప్రభుత్వం కోల్పోతున్నట్లు స్పష్టమవుతోంది. పైగా నెపాన్ని ప్రతిపక్షం బీఆర్ఎస్‌పై నెట్టే దురుద్దేశం తేటతెల్లమవుతోంది. ఫార్మా కంపెనీ కోసం జరిపే భూసేకరణను వ్యతిరేకిస్తున్న తన నియోజకవర్గంలో, కొద్ది నెలల క్రితం తనకు ఓట్లు వేసిన ప్రజలకు నచ్చచెప్పే ప్రయత్నం చేయలేదు. వారి అభ్యంతరాలను పరిశీలించే ప్రయత్నం కూడా చేయకుండా, అమానుషంగా పోలీసులను పంపి దౌర్జన్యంగా వ్యవహరించిన తీరు చూస్తుంటే ప్రభుత్వం ఎంతటి అసహనంతో వ్యవహరిస్తుందో అర్థమవుతుంది. అన్ని వర్గాల ప్రజలూ ఈ పరిణామాలను గమనిస్తున్నారు.

అధికారాన్ని అడ్డం పెట్టుకొని, ఏ బుకాయింపైనా చేయొచ్చన్నట్టు ప్రభుత్వ పెద్దలు వ్యవహరిస్తున్నారు. తనపై రైతులు దాడి చేయలేదని స్వయంగా కలెక్టర్ చెబుతున్నారు. అయితే, జమ్మూ – కశ్మీర్‌లోనో, మరో తీవ్రవాద ప్రాంతంలోనో చేసినట్లు ఇంటర్ నెట్ కనెక్షన్లు ఆపివేసి, విద్యుత్ సరఫరాను నిలిపివేసి, అర్ధరాత్రి పూట గోడలు దూకి, తలుపులు బద్దలు కొట్టి, ఆడవారిని వేధిస్తూ భయభ్రాంతులకు గురిచేసి అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? రైతులను కరడుగట్టిన తీవ్రవాదులకన్నా దారుణంగా చూడటం ఈ ప్రభుత్వానికి తగునా?

ఇందులో రెండు, మూడు కోణాలను సందేహించాల్సి వస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరచడం లేదని ఎక్కడికక్కడ నిలదీస్తున్న రైతుల పట్ల తమ ఆగ్రహావేశాలను సర్కారు పెద్దలు ఈ విధంగా వ్యక్త పరుస్తున్నారా? ఇంకెక్కడా రైతులు, ఇతర బాధితులు తమ హక్కుల గురించి గొంతెత్తవద్దని హెచ్చరించడానికే ఇలా చేశారా? తమ వారికి ఫార్మా కంపెనీ కోసం సాగుభూమిని స్వాధీనం చేసుకొని అప్పచెప్పుదామంటే వీళ్లేదని ఎదురు తిరుగుతున్నారని వారి పట్ల కక్షసాధింపు ధోరణిలో వ్యవహరిస్తున్నారా? రేవంత్ నియోజకవర్గంలో ఫార్మా కంపెనీ కోసం గిరిజనుల భూమి మాత్రమే ఉందా? ఇవన్నీ ప్రశ్నలే! ఈ విషయమై ప్రజాభిప్రాయ సేకరణకు కలెక్టర్, ఇతర అధికారులు తగు పోలీస్ బందోబస్తు లేకుండా వెళ్లడం ఏమిటి? అన్న ప్రశ్నా తలెత్తడం సహజం!



కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం తీసుకు వస్తుందని రేవంత్ రెడ్డి నిత్యం చెబుతూ ఉంటారు. ఇదేనా వారు చెప్పే ఇందిరమ్మ రాజ్యం! ఆ పేరుతో ప్రజల ప్రాథమిక హక్కులను హరించడం, బడా కార్పొరేట్ల కోసం, తన వారి ఫార్మా కంపెనీల కోసం పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల పట్టా భూముల్ని దౌర్జన్యంగా లాక్కోవడం... ఇవా అందులో ఉండేది? తనను వ్యతిరేకించిన వారందరినీ జైళ్లలో నింపుతూ నిరంకుశంగా పాలించిన నాటి ఇందిరమ్మ ఎమర్జెన్సీ పాలన నేడు రాష్ట్రంలో మళ్లీ తీసుకు వస్తున్నట్లు స్పష్టమవుతోంది. ముఖ్యమంత్రి పదవి చేపట్టగానే, తమది నిఖార్సయిన 'ప్రజా పాలన' అంటూ చెప్పుకొచ్చిన రేవంత్ రెడ్డి ఇప్పుడు పోలీసులతో రాజ్యమేలే ప్రయత్నం చేస్తున్నారు.

ఈ సందర్భంగా లగచర్లలో పోలీసుల దమననీతి గమనిస్తే, అది ఎమర్జెన్సీ రోజులనే గుర్తుకు తెస్తోంది. తొమ్మిది నెలల గర్భిణీ, ఇతర మహిళల ఛాతీ మీద తొక్కుకుంటూ పోలీసులు ఇంట్లోకి వెళ్లారు. ఆ సందర్భంగా పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో రాఘవేంద్ర యాదవ్ అనే ప్రభుత్వ ఉద్యోగి ఉన్నాడు. పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ, వేరే మండలంలో కులగణనలో పాల్గొని రాత్రికి ఇంటికి రాగా, పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపారు. దాంతో, తన ఉద్యోగం పోతే కుటుంబం ఇబ్బందులకు గురవుతుందని ఆందోళన చెందుతున్నారు. వనపర్తిలో ఐటీఐ చదువుతున్న తాను గ్రామంలో ఉన్న తల్లిదండ్రుల యోగక్షేమాలు తెలుసుకునేందుకు ఇంటికొస్తే, పోలీసులు తనపైనా అక్రమంగా కేసులు బనాయించి జైలుకు పంపినట్లు శివకుమార్ అనే విద్యార్థి వాపోతున్నాడు.

బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ శివారుల్లో ఫార్మాసిటీ కోసం కేసీఆర్ ప్రభుత్వం 14 వేల ఎకరాలు సేకరించింది. ఆ భూముల్లో ఫార్మాసిటీ పెట్టకుండా, తాజాగా కొడంగల్‌లో రైతుల భూములు సేకరించడం ఎందుకో విడమర్చి చెప్పాల్సిన అవసరం ఉంది. ఇక్కడ ఫార్మాసిటీ కట్టడం ద్వారా, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సేకరించిన ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ ఆలోచనలా ఉంది. ప్రజాభిప్రాయాన్ని పరిగణించకుండా, పచ్చటి పొలాల్లో ముఖ్యమంత్రి పెడుతున్న చిచ్చు చివరకు ఆయన్నే దహించి వేస్తుందని గ్రహించాలి.

గతంలో తనను ఓడించి, నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్ట్ చేయడం ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనం మాత్రమే. ఆయన అక్కడ లేకున్నా, ఈ పరిణామాలతో ఆయనకు ఏ సంబంధమూ లేకపోయినా అరెస్ట్ చేయించడం అన్యాయం. ముఖ్యమంత్రి ఇప్పటికైనా కక్ష పూరిత రాజకీయాలు మానుకొని పాలనపై దృష్టి పెట్టాలి. లగచర్లలో దాడి జరిగింది అధికారులపై కాదనీ, గిరిజన ప్రజల మీద అనీ గుర్తించాలి.

గిరిజన మహిళలపై దాడులు చేసిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల (నిరోధక చట్టం కింద) కేసులు పెట్టాలని ఇప్పటికే వారు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు ఢిల్లీ వెళ్లారు. ప్రభుత్వ అణచివేత చర్యలను ప్రజలు తలవంచుకొని మౌనంగా భరించే రోజులు పోయాయని రేవంత్ రెడ్డి ప్రభుత్వం గ్రహించాలి.

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మల్లన్న సాగర్‌కు వ్యతిరేకంగా రేవంత్ రెడ్డి రెండురోజులపాటు నిరసన చేస్తే ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించిందని ఆయన గుర్తు తెచ్చుకోవాలి. కేటీఆర్, ఇతర బీఆర్ఎస్ నాయకులను ఏదో ఒక కేసులో ఇరికించి, జైలుకు పంపడం ద్వారా ప్రజా సమస్యలపై గొంతెత్తకుండా కట్టడి చేయాలనే ఆలోచనలో ఈ ప్రభుత్వం ఉన్నట్లు దాని వ్యవహార శైలి చెబుతోంది. ప్రజల తరఫున ప్రతిపక్షనేతలు ప్రశ్నిస్తే కేసుల్లో ఇరికిస్తారా? ప్రజాస్వామ్యం అంటే ఇదేనా?


ఎంతో బలవంతుడైన రాజకీయ నాయకుడిగా పేరొందిన నరేంద్ర మోదీ సహితం ప్రధాన మంత్రి పదవి చేపట్టగానే భూసేకరణ సవరణ చట్టంలో మార్పులు తీసుకొచ్చే ప్రయత్నం చేసి, రైతుల నుండి వ్యతిరేకత ఎదురుకాగానే వెనుకడుగు వేశారు. మూడు వ్యవసాయ చట్టాలు తీసుకువచ్చినపుడు, వాటిని వ్యతిరేకిస్తూ రైతులు ఏడాదికి పైగా నిరసనలు చేపట్టడంతో... బేషరతుగా, జాతికి క్షమాపణలు చెప్పి మరీ ఉపసంహరించుకున్నారు. రైతులను ఎదిరించి, వారిని వేధించిన ఏ ప్రభుత్వం కూడా మనుగడ సాగింపజాలదని సీఎం గ్రహించాలి. ప్రజాభిప్రాయం తెలుసుకోవడం ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యత. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం తన బాధ్యతను గుర్తెరిగేలా చేయడం ప్రతిపక్షాలకు ప్రజలు అప్పగించిన బాధ్యత. సదరు బాధ్యత నిర్వర్తించడానికి బీఆర్ఎస్ సదా ప్రజాపక్షం వహించి, సంసిద్ధంగానే ఉంటుంది.

వ్యాసకర్త మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కొనుక్కోవడమా?



పొగతో చుట్టుముట్టిన ఈ (బహుళ అంతస్థుల) భవనం, గుర్గావ్‌లోని కెమిలియాస్‌లో ఉంది (ఫొటో జత చేశారు). ఇక్కడ గాలి నాణ్యత అధికారికంగా విషపూరితం. ఈ ఫ్లాట్ల ఖరీదు 60 నుంచి 100 కోట్లు. ఇదీ అని చెప్పలేను గానీ ఇందులో ఏదో తమాషా ఉంది.

– మనూ జోసెఫ్, రచయిత

కాలుష్య కారకాలు



తెలియకపోతే తెలుసుకోండి! ఢిల్లీలో ఏడాది పొడవునా వాయు కాలుష్యం ఉండటానికి మూల కారణాలు వాహనాల ఉద్గారాలు: రోడ్లు, నిర్మాణాల నుండి వచ్చే దుమ్ము, ఇంకా పరిశ్రమలు. (కొయ్యకాళ్లను కాల్చడం ఒక్కటే కారణం కాదన్న అర్థంలో.)

– రుపికా పార్దీకర్, పర్యావరణ విలేఖరి

రాష్ట్రపతి పాలనే!



సున్నితమైన సరిహద్దు రాష్ట్రమైన మణిపూర్‌లో శాంతిభద్రతలు క్షీణించడం విచారకరం. ప్రజల్లో విశ్వాసం పాదుకొల్పడానికీ, హింసను నియంత్రించడానికీ సమర్థమైన ఏకీకృత సైనిక వ్యవస్థతో రాష్ట్రపతి పాలనను ఏర్పాటు చేయడానికి సమయం ఆసన్నమైంది.

– వేద్ మాలిక్, ఆర్మీ మాజీ చీఫ్

నడకే ఔషధం



మన ఆత్మకు అత్యంత శక్తిమంతమైన ఔషధం సుదీర్ఘ నడక. ఏ సమస్యలు ఉన్నప్పటికీ, ఎంత గందరగోళంగా ఉన్నప్పటికీ నడవండి. నడక, ప్రార్థనలతో ముడిపడిన జీవితం అట్టే పట్టాలు తప్పదు.

– విల్ మానిడిస్, వ్యాపారవేత్త

ఏది హార్డ్ వర్క్?



ఎక్కువ గంటలు పని చేయడం, స్మార్ట్‌గా పని చేయడం గురించి చర్చ జరుగుతోంది. కానీ ఈ రోజు స్మార్ట్, 'వైట్ కాలర్' పని అనుకునేది రేపు అలా ఉండదు. ఐదారేళ్లలో నేడు జరుగుతున్న పనిలో మూడింట రెండొంతులు ఏఐ, రోబోలు చేయగలవు. అలాంటప్పుడు హార్డ్ వర్క్ అంటే ఏమిటి? సమాధానాలు లేవు. కానీ ప్రశ్నలను అడగడం కొనసాగించాలి.

– సీపీ గుర్‌నానీ, వ్యాపారవేత్త

ఇన్ బాక్స్

సమంజసమైన డిమాండ్లేనా?

మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను అధికార కూటమి ఎన్డీఏ, ప్రతిపక్ష ఇండియా కూటమి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నట్లు ఆ కూటములలోని నాయకుల ఆరోపణలు ప్రత్యారోపణలను బట్టి గ్రహించవచ్చు. జార్ఖండ్ రాష్ట్ర ఎన్నికల కంటే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల గురించి దేశంలోని రాజకీయ విశ్లేషకులు తమకు తోచిన రీతిలో విశ్లేషణలు చేస్తున్నారు. ఇందుకు కారణం, ఆల్ ఇండియా ముస్లిం ఉలేమా బోర్డు... ముస్లిం సమాజం మూకుమ్మడిగా మహా వికాస్ అఘాడీ కూటమికి ఓట్లు వేయాలంటే– ఇస్లాం సమాజానికి సంబంధించిన 17 డిమాండ్లను నెరవేరుస్తామని కూటమి నాయకులు లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వాలని కోరడం... అందుకు కూటమి నాయకులు హామీ లేఖలు ఇచ్చి, ధన్యవాదాలు తెలపడం! వీరి డిమాండ్లలో అత్యంత ప్రమాదకరమైనదీ, ఆశ్చర్యాన్ని కలిగించేదీ 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్' (ఆరెస్సెస్)ను నిషేధించాలనడం. ఈ దేశ సంస్కృతి, భద్రత, సమగ్రతలను కాపాడే విషయంలో ఆరెస్సెస్ నిబద్ధత ఏమిటో ప్రపంచానికి తెలుసు. యుద్ధం, భూకంపాలు, వరదలు దేశంలో సంభవించినప్పుడు ఆ సంస్థ కార్యకర్తలు ప్రతిఫలాపేక్ష లేకుండా ఈ దేశ ప్రజలకు సేవ చేస్తారు.

వక్ఫ్ బోర్డు బిల్లును అడ్డుకోవాలనీ, వెయ్యి కోట్లు నిధులు వక్ఫ్ బోర్డుకు మంజూరు చేయాలనీ, దేశంలో పోలీసు ఉద్యోగాలలో ముస్లిం యువతకు ప్రత్యేక ప్రాధాన్యమివ్వాలనీ, 10 శాతం రిజర్వేషన్లు కావాలనీ, ప్రభుత్వ కమిటీలలో ముస్లిం పెద్దల భాగస్వామ్యం ఉండాలనీ, ఇస్లాం మతాన్ని కించపరిచే వారికి కఠిన శిక్షలు విధించాలనీ, నెలకు రూ. 15 వేల వంతున ఇమాములకు జీతం ఇవ్వాలనీ ఉలేమా బోర్డు కోరిన కోరికలు పూర్తిగా మతతత్వ ఆలోచనలతో ఉన్నవే! ఇలాంటి కోరికలనే హిందూ సమాజం సాధించుకోవాలని చూస్తే–ఈ దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, మానవ హక్కులు, మైనార్టీల హక్కులు గల్లంతు కావా? ప్రజలకు విద్యాలయాలు, వైద్యాలయాలు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేయమని ఎన్నికల ముందు రాజకీయ పార్టీల నాయకులను ప్రజలు కోరుకుంటారు. ఉలేమాల బోర్డు డిమాండ్ల స్వరూపాన్ని పరిశీలిస్తే ఈ దేశ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఉంది.

– ఉల్లి బాలరంగయ్య, సామాజిక, రాజకీయ విశ్లేషకులు

యుద్ధంలా 'మహా' రాజకీయం

అనేక రాజకీయ ఒడుదొడుకులు, నిట్టనిలువు చీలికలు, ప్రముఖ నాయకుల అడ్డగోలు దారులు వంటి వాటిని చూసిన తర్వాత, మహారాష్ట్రలో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. ఆరు ప్రముఖ పార్టీలు నేడు (నవంబర్ 20) అగ్నిపరీక్షను ఎదుర్కొంటున్నాయి. 2024 అసెంబ్లీ ఎన్నికలు అనేక విధాలుగా విశేషమైనవి. ఎందుకంటే ఇవి రాష్ట్ర రాజకీయాలలో ఎన్నికల, రాజకీయ చర్చను రూపొందించే అవకాశం ఉన్న కొన్ని కీలకమైన తప్పులను బహిర్గతం చేశాయి. ఈ కథనం అటువంటి ఐదు తప్పులను, అవి విసిరే సంక్లిష్ట సవాళ్లను అందిస్తుంది.

1. **ఉచితాలపై ఆధారపడటం:** మహారాష్ట్ర ఎన్నికల ప్రచారాలన్నీ 'మాఝీ లడ్‌కీ బహిన్ యోజన', ఉచిత ఎల్పీజీ సిలిండర్లు, సీనియర్ సిటిజన్‌లకు ఉచిత తీర్థయాత్రలు వంటి వాటిని లక్ష్యంగా చేసు కున్నాయి. ఉచితాలు ఈ ఎన్నికల్లో ఆధిపత్యం చలా యిస్తున్నాయి. ఇలాంటి ప్రకటనలపై 'మహాయుతి', 'మహా వికాస్ అఘాడీ' కూటముల మధ్య పోటీ కనిపిస్తోంది. ఈ పథకాలు చాలావరకు రాష్ట్ర ఓటర్లలో దాదాపు సగం మందిగా ఉన్న మహిళా ఓటర్లను లక్ష్యంగా చేసుకున్నాయి. స్వల్పకాలిక బుజ్జగింపు చర్యలపై ఆధారపడటం అనేది విపరీతంగా పెరుగుతోంది. ఇది రాష్ట్రంలో సంక్షేమ ఎజెండాకు సమర్థవంతంగా ప్రాధాన్యత నివ్వడంలో వరుస ప్రభుత్వాల దీర్ఘకాలిక వైఫల్యాన్ని నొక్కి చెబుతుంది.

గత రెండు దశాబ్దాలుగా, కీలక అభివృద్ధి సూచికలలో మహారాష్ట్ర కిందికి జారిపోయింది. ప్రధానమంత్రికి ఆర్థిక సలహా మండలి ఇటీవల ఇచ్చిన నివేదిక ప్రకారం, మహారాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి వృద్ధి గత 14 సంవత్సరాలలో రెండు శాతం పాయింట్లు పడిపోయింది. 'వార్షిక విద్యా నివేదిక – 2022' ప్రకారం, రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అంకగణితం, పఠన నైపుణ్యాలలో పేలవంగా ఉన్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ నుండి వెలువడిన 'భారతదేశ నిరుద్యోగ నివేదిక-2023' మహారాష్ట్రలో విద్యావంతులైన నిరుద్యోగిత నిష్పత్తి 2022లో 15 శాతంగా ఉందని పేర్కొంది. దశాబ్దం క్రితం కంటే ఇది 11 శాతం పెరుగుదల. ఈ ప్రాథమిక ఆందోళనలను పరిష్కరించడానికి బదులుగా, పార్టీలు ఎన్నికల లాభాల కోసం ఉచితాల మీద దృష్టి పెడుతున్నాయి.

2. **కరిగిపోయే పొత్తులు, మారుతున్న విధేయతలు:** 2019 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాషాయ కూటమి (బీజేపీ, శివసేన) విచ్ఛిన్నం కావడం 'మహా వికాస్ అఘాడీ' ఏర్పాటుకు దారితీసింది. ఇది భిన్నమైన సిద్ధాంతాలు గల పార్టీల (కాంగ్రెస్, ఎన్సీపీ, శివసేన) మధ్య అసహజ కూటమి. పైగా మనం శివసేన, ఎన్సీపీ రెండు పార్టీలలో అతిపెద్ద చీలికలను చూశాం. భారత రాజకీయాల్లో ఇలాంటి ఫిరాయింపులు అసాధారణం ఏమీకాదు. కానీ ఫిరాయింపు వర్గాలే పార్టీల అసలు పేర్లను, చిహ్నాలను ఉంచుకున్నాయి. ఇది



ఓటర్లలో గందరగోళాన్ని సృష్టించింది. ఇది సాధారణంగా ఎన్నికల ఫలితాలను నిర్ణయించే దీర్ఘకాలిక పొత్తులు, సైద్ధాంతిక ప్రాధాన్యతలు, కేడర్ విధేయతలు వంటి సాంప్రదాయ సమీకరణాలను పూర్తిగా బలహీనపరిచింది. ఇది మహారాష్ట్ర రాజకీయ సంస్కృతిని దెబ్బతీసింది. డబ్బు, బెదిరింపులు, రాజకీయ అవకాశవాదం గతంలో కంటే పెద్ద పాత్రను పోషిస్తున్నాయి.

3. **వ్యవసాయ సంక్షోభాన్ని, వాతావరణ–ప్రేరిత సవాళ్లను పట్టించుకోకపోవడం:** 2024లో దేశంలో జరిగిన పంట నష్టంలో 60 శాతం మహారాష్ట్రలోనే సంభవించిందని 'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' ఇటీవలి నివేదిక వెల్లడించింది. దాదాపు సగం జనాభా వ్యవసాయంపై ఆధారపడి ఉన్నప్పటికీ, రాష్ట్రంలో వ్యవసాయ సంక్షోభాన్ని, వాతావరణ ప్రేరిత సవాళ్లను పరిష్కరించడానికి కృషి జరగ లేదు. రుణమాఫీ వంటి తక్షణ చర్యలకు మించి దీన్ని పరిష్కరించడానికి రాజకీయ పార్టీలకు కచ్చితమైన ప్రణాళిక ఉన్నట్లు కనిపించదు. మరాఠా రిజర్వేషన్ల డిమాండ్ మూలాలు ప్రధానంగా వ్యవసాయాధారిత మరాఠా సమాజం ఎదుర్కొంటున్న సామాజిక-ఆర్థిక సవాళ్లలో ఉన్నాయి. వీరిని ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ, మూల కారణాన్ని పరిష్కరించడంలో రాజకీయ పార్టీలు శ్రద్ధ చూపడం లేదు.

4. **స్థానిక సంస్థల ఎన్నికల్లో జాప్యం:** మహారాష్ట్రలోని పలు స్థానిక సంస్థలకు గత రెండు నుంచి ఐదేళ్లుగా ఎన్నికలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో 29 మున్సిపల్ కార్పొరేషన్లు (రెండు కొత్తవి), 200 కంటే ఎక్కువ మున్సిపల్ కౌన్సిళ్లు, 27 జిల్లా సమితులు ఉన్నాయి. బొంబాయి హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా సర్పంచ్ రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడంతో ఈ ఏడాది గ్రామ పంచాయతీ ఎన్నికలు కూడా జరగలేదు. స్థానిక సంస్థల ఎన్నికలలో జాప్యం వల్ల స్థానిక పరిపాలనా విషయాలపై రాష్ట్ర ప్రభుత్వం అధిక నియంత్రణను సాధించేలా చేసింది. ఇది అట్టడుగు స్థాయిలో ప్రజాస్వామ్యం క్షీణించడం గురించిన ఆందోళనలకు దారితీసింది. 'గట్టర్, మీటర్, నీరు' (మురుగునీటి పారుదల, విద్యుత్, నీరు)కు సంబంధించిన సాధారణ పౌరుల సమస్యలు పరిష్కారం కాలేదు.

5. **అభివృద్ధి విధానం:** ఇటీవలి సంవత్సరాలలో, మెట్రో రైలు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, బుల్లెట్ రైలు వంటి ఉన్నత స్థాయి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు మహారాష్ట్ర గణనీయమైన ప్రాధాన్యమిస్తోంది. ఈ విధానం పెద్ద స్థాయి ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిస్తుంది. స్థానిక రైల్వేలు, ప్రభుత్వ ఆధీనంలో నడిచే రోడ్డు రవాణా, అందుబాటులో ఉండే పబ్లిక్ రోడ్లు వంటి విస్తృత జనాభాకు మరింత నేరుగా ప్రయోజనం చేకూర్చే అవసరమైన సేవలను బలోపేతం చేయాల్సిన ఖర్చుతో ప్రైవేట్, ఉన్నత వర్గాల ఆసక్తులకు ఎక్కువ ప్రాధాన్యత కనబడుతోంది.

2024 మహారాష్ట్ర ఎన్నికలు పాత, కొత్త పార్టీలు, నాయకులు, పొత్తులకు అస్తిత్వ యుద్ధంగా పరిణమించాయి. అంతకు మించి, ఇది ఓటర్లకు నిజమైన పరీక్ష. వారి ఎంపికలే రాబోయే దశాబ్దాల రాష్ట్ర రాజకీయాల గమనాన్ని నిర్ణయిస్తాయి.

– సంజయ్ పాటిల్ | రాజకీయ పరిశోధకుడు
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సత్కీర్తి ఫలం

ఈ లోకంలో ఒక వ్యక్తి ఎన్నాళ్ళు కీర్తివంతుడై ఉంటాడో అన్నాళ్ళు దేవలోకంలో అతడి స్థానం స్థిరమై ఉంటుందని, అందువలన ఈ లోకంలో తరగని కీర్తికి సత్కావ్య రచన ఉత్తమమని సూచించిన కాకునూరి అప్పకవి తన 'అప్పకవీయం' ఇలా చెప్పాడు:

కం. **క్షితి నెవ్వని నామము స/ త్కృతి నెన్నిదినంబులుండు దివి నాపుణ్య/ వ్రతు డంతకాలముండును/ ధృతి నింద్రద్యుమ్నునికి దృష్టాంతము గాన్.** భూలోకంలో రాజైన ఇంద్రద్యుమ్నుడు ఎన్నో గొప్ప కార్యాలను చేసి తరగని కీర్తిని ఆర్జించగా, ఆ కీర్తి ఫలం



జ్యోతిర్మయం

అతడిని స్వర్గలోక వాసిగా చేసింది. కొంతకాలం తరువాత భూలోకంలో అతడి కీర్తి తగ్గి పోయిందనే కారణంతో తిరిగి భూలోకానికి పంపేయబడ్డాడు. అలా భూలోకానికి వచ్చిన ఇంద్ర ద్యుమ్నుడు మార్కండేయ మహర్షిని కలిసి తనను గుర్తించమని అడిగాడు. తాను గుర్తించజాలనని, హిమాలయ ప్రాంతంలో నివసిస్తున్న ప్రావారకర్ణుడనే గుడ్లగూబ, వయసులో పెద్దవాడు గనుక, గుర్తించ గలడని చెప్పి ఆ గుడ్లగూబ వద్దకు పంపాడు. ఇంద్రద్యుమ్నుడు ప్రావారకర్ణుడిని తనను గుర్తించమని అడుగగా, ఆ గుడ్లగూబ కొంతసేపు ఆలోచించి, గుర్తించజాలనని చెప్పి, అక్కడికి దగ్గరలోనే ఇంద్రద్యుమ్నం అనే సరస్సులో నివసిస్తున్న నాళీకజంఘుడనే కొంగ వద్దకు పంపాడు. ఆ కొంగ కూడా ఇంద్రద్యుమ్నుడిని గుర్తించలేక, ఆ కొలనులోనే నివసిస్తున్న ఒక వృద్ధ తాబేలును అడిగింది. ఆ తాబేలు ఇంద్రద్యుమ్నుడిని గుర్తించి, ఆనందంతో కన్నీరు కార్చి 'పుణ్యాత్ముడైన ఆయన నిర్వహించిన యాగాలలో దానం చేసిన వేల వేల గోవుల గిట్టల రాపిడితో ఏర్పడినదే ఈ సరస్సు. ఇందులో ప్రశాంతంగా జీవిస్తూ, దేవుడి వంటి ఆయనకు రోజూ నమస్కరించుకుంటున్నాను!' అని బదులిచ్చింది. తాబేలు సమాధానంతో ఇంద్రద్యుమ్నుడు మళ్ళీ దేవలోకానికి ఆహ్వానించబడ్డాడు. ఈ లోకంలో సత్కర్మాచరణతో సిద్ధించే సత్కీర్తి ఫలం అలా ఉంటుందనడానికి ఇంద్రద్యుమ్నుడి కథ దృష్టాంతమని చెప్పబడింది.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.పంచమి రా.8.33 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** పునర్వసు రా.7.07 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** ఉ.7.05 నుండి 8.41 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.25 నుండి 12.13 వరకు, **అమృతఘడియలు:** సా.4.34 నుండి 6.21 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.11, **సూర్యాస్తమయం:** 5.20.

క్లుప్తంగా...

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



బాలస్వామి (ఫైల్)

బల్మూర్: వ్యవసాయం కోసం చేసిన అప్పులు పెరిగిపోవడంతో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకుంది. బల్మూర్ మండలం అనంతవరం గ్రామానికి చెందిన కొండ్ల బాలస్వామి (57)కి నాలుగు ఎకరాల పొలం ఉంది. నాలుగేళ్లుగా ఏ పంట సాగు చేసినా సరైన దిగుబడి రాలేదు. దీంతో భూమిని తాకట్టు పెట్టి కుటుంబాన్ని నెట్టుకొచ్చారు. ఈ క్రమంలో అప్పుల వారి వేధింపులు తట్టుకోలేక మంగళవారం ఉదయం ఎవరూ లేని సమయంలో తన పొలంలోనే చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. బాలస్వామికి రూ.5 లక్షల వరకు అప్పులు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

నేడు పిల్లల కోసం ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ పిల్లల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఉదయం 11 గంటలకు పిల్లల కోసం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ప్రజావాణి నిర్వహించనున్నారు. పిల్లలు–ప్రజావాణి పేరిట హైస్కూల్, జూనియర్ కాలేజ్ స్థాయి విద్యార్థినీ, విద్యార్థుల ముఖాముఖికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, యునిసెఫ్ చీఫ్ జలాలెమ్ బి.తఫిసి, ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య, మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, పలు శాఖలకు సంబంధించిన రాష్ట్ర స్థాయి అధికారులు హాజరుకానున్నారు. విద్యారంగంలో బాల, బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి కావాల్సిన సౌకర్యాలు, భద్రత వంటి అంశాలపై ఈ ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం కొనసాగనుంది.

19 కిలోల బంగారం చోరీ

రాయపర్తి ఎస్‌బీఐలో తస్కరణ

- తమిళనాడు దొంగల ముఠా పనిగా అనుమానం
- ఘటనా స్థలంలో గ్యాస్‌కట్టర్, తమిళనాడు అగ్గిపెట్టె లభ్యం



ఊడదీసిన కిటికీ

సాక్షి, వరంగల్/ రాయపర్తి: వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని ఎస్‌బీఐలో మంగళవారం తెల్లవారుజామున భారీ దోపిడీ జరిగింది. భవనం కిటికీని తొలగించి లోపలికి వెళ్లిన దుండగులు బ్యాంకులోని మూడు లాకర్లలో ఒకదానిని గ్యాస్‌కట్టర్‌తో పగులగొట్టి దోపిడీకి పాల్పడ్డారు. బ్యాంకులోని అలారం సిస్టంను ధ్వంసం చేశారు. లాకర్‌లోని 19 కిలోలకుపైగా బంగారం చోరీచేసినట్లు గుర్తించారు. దీని విలువ సుమారు రూ.14.82 కోట్లు ఉంటుందని బ్యాంకు అధికారులు తెలిపారు. సీసీ కెమెరా ఫుటేజీకి సంబంధించిన డీవీఆర్‌ను కూడా అపహరించారు. దోపిడీకి గురైన బ్యాంకు రాయపర్తి పోలీసు స్టేషన్‌కు 500 మీటర్ల దూరంలోనే ఉన్నా నిందితులు పక్కా ప్రణాళికతో దోపిడీకి పాల్పడ్డారు. మంగళవారం ఉదయం విధులకు హాజరైన మేనేజర్ సత్యనారాయణ బ్యాంకులో చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వర్ధన్నపేట సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాయపర్తి, వర్ధన్నపేట ఎస్సైలు శ్రవణ్‌కుమార్, రాజు దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలాన్ని వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్ మంగళవారం రాత్రి సందర్శించారు. దోపిడీ జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు.

తమిళనాడు దొంగల పనే?

ఈ దోపిడీకి పాల్పడింది తమిళనాడుకు చెందిన దొంగల ముఠా అని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనా స్థలంలో తమిళ భాషలో ఉన్న 'జోకర్' అగ్గిపెట్టె లభించడంతో ఆ దిశగా దర్యాప్తు ముమ్మరం చేశారు. బ్యాంకు లాకర్‌ను కట్ చేసిన గ్యాస్ కట్టర్‌ను కూడా దొంగలు అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. కేసు దర్యాప్తులో అది కీలకం కానుందని పోలీసులు తెలిపారు. ఈ గ్యాస్‌కట్టర్‌ను అమెజాన్ వెబ్‌సైట్‌లో కొనుగోలు చేసినట్లు గుర్తించిన పోలీసులు.. అది డెలివరీ అయిన చిరునామా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. 25 రోజుల క్రితం కర్ణాటకలోని దావణగెరె జిల్లా న్యామతి పట్టణంలోని ఎస్‌బీఐ బ్రాంచిలో దొంగలు రూ.12.95 కోట్ల విలువైన బంగారాన్ని దోచుకెళ్లారు. అచ్చం అదే తరహాలో ఇక్కడ కూడా దోపిడీ జరగటంతో రెండు దోపిడీలు చేసింది ఒకటే ముఠా అని అనుమానిస్తున్నారు.

బ్యాంకు అధికారుల అలసత్వంవల్లే: ఖాతాదారులు

మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు పనిచేయటంలేదు. దీంతో దొంగలకు చోరీలు చేసి తప్పించుకోవటం తేలికైందని ఖాతాదారులు మండిపడుతున్నారు. మండల కేంద్రానికి బ్యాంకు దూరంగా ఉండటం.. గతంలో సెక్యూరిటీగార్డును నియమించినా ప్రస్తుతం తొలగించటం వల్లే దోపిడీ జరిగిందని చెప్తున్నారు. బ్యాంకులో బంగారం చోరీ అయినట్లు తెలుసుకున్న ఖాతాదారులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని ఆందోళనకు దిగారు. ఎంతో నమ్మకంతో బ్యాంకులో సొమ్ము దాచుకుంటే ఇలా నిర్లక్ష్యం చేయడం ఏమిటని అధికారులను నిలదీశారు. మూడేళ్ల క్రితం ఇప్పుడు పగులకొట్టిన కిటికీ నుంచి కాకుండా మరో కిటికీని పగులగొట్టి దొంగలు బ్యాంకులోకి చొరబడ్డారు. కానీ, లాకర్‌ను ఓపెన్ చేయలేక తిరిగి వెళ్లిపోయారు. పోలీసులు రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహించకపోవటం కూడా దోపిడీలకు కారణమవుతోందని స్థానికులు అంటున్నారు.

చచ్చినా అప్పు కట్టాల్సిందే..!

- మధిరలో మైక్రో ఫైనాన్స్ కంపెనీ హుకుం
- బాధితురాలి ఆత్మహత్యాయత్నం



మధిర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజేశ్వరి

మధిర: తీసుకొన్న అప్పు చెల్లించాలని ఓ మైక్రోఫైనాన్స్ సంస్థ తీవ్ర ఒత్తిడి చేయటంతో ఖమ్మం జిల్లా మధిర మండలం రాయపట్నంకు చెందిన కేతినేని రాజేశ్వరి అనే మహిళ మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. రాజేశ్వరి తండ్రి గుగ్గిళ్లపు వెంకటేశ్వర్లు ఓ మైక్రో ఫైనాన్స్ సంస్థ నుంచి హౌసింగ్ లోన్ తీసుకొన్నారు. కిస్తీల చెల్లింపు కోసం సదరు సంస్థ తీవ్రంగా ఒత్తిడి చేయటంతో ఇటీవల ఆయన ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ తర్వాత రుణం రాజేశ్వరి పేరు మీద ఉందని, రుణం చెల్లించాలని సంస్థ ఏజెంట్లు ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో ఆమె సోమవారం ఆ సంస్థ కార్యాలయం ఎదుట నిరసన తెలిపింది. అయినా 'మీరు చనిపోయినా పర్వాలేదు.. రుణం కిస్తీలు మాత్రం చెల్లించాల్సిందే'నని కంపెనీ అధికారులు తేల్చి చెప్పారు. దీంతో ఆమె ఆత్మహత్య చేసుకొంటున్నట్లు మంగళవారం మందా సైదులుకు వాట్సాప్ మెసేజ్ చేసింది. అప్రమత్తమైన ఆయన సమీపంలోని ఓ సీపీఎం కార్యకర్తను రాజేశ్వరి ఇంటికి పంపారు. ఆమె అప్పటికే ఫ్యాన్‌కు ఉరి వేసుకోవడంతో.. వెంటనే స్థానికుల సాయంతో కిందకు దించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రాజేశ్వరి ఆస్పత్రిలో కోలుకుంటోంది.

డిగ్రీ కాలేజీల బంద్ తాత్కాలిక విరమణ

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ కాలేజీల బంద్‌కు ఇచ్చిన పిలుపును కాలేజీ యాజమాన్యాలు తాత్కాలికంగా విరమించుకున్నాయి. దీంతో ఉస్మానియా వర్సిటీ పరిధిలోని డిగ్రీ కాలేజీల్లో మంగళవారం సెమిస్టర్ పరీక్షలు మొదలయ్యాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కాలేజీలు బంద్‌కు పిలుపు ఇచ్చిన విషయం తెలిసిందే. పరీక్షల సమయంలో కాలేజీల మూతసరికాదని, కొంత వ్యవధి ఇవ్వాలని కోరడంతో యాజమాన్యాలు బంద్ విరమించాయని ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి తెలిపారు.

సచివాలయంలో 'ఫేషియల్' అటెండెన్స్

- అమలుకు సీఎస్ శాంతికుమారి సర్క్యులర్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో నిర్వహించిన ఓ సమీక్షలో తీసుకున్న నిర్ణయం మేరకు ..రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బయోమెట్రిక్ అటెండెన్స్ విధానం అమలు విషయంలో ప్రభుత్వం తొలి అడుగు వేసింది. రాష్ట్ర సచివాలయ ఉద్యోగులకు ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ విధానాన్ని అమల్లోకి తీసుకొస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి సర్క్యులర్ జారీ చేశారు. సచివాలయ హాజరు విధానంలో కచ్చితత్వం, సమర్థత, భద్రతను పెంపొందించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు తెలిపారు. సచివాలయంలోకి ప్రవేశించే సమయంలో, విధులు ముగించుకొని వెళ్లే సమయంలో అటెండెన్స్‌ను నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ నెల 22 నుంచి ఉద్యోగుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభిస్తున్నట్టు సీఎస్ తెలిపారు. సచివాలయంలోని అన్ని శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సర్క్యులేటింగ్ అధికారులు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఈ నిబంధనలను వర్తింపజేస్తూ నిర్ణయం తీసుకున్నారు. సచివాలయ భవనం ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలు, అన్ని ఫ్లోర్లు, లిఫ్టుల వద్ద ఈ యంత్రాలను ఏర్పాటు చేయనున్నారు. సచివాలయంలోకి అనధికార వ్యక్తుల రాకపోకలను నియంత్రించడానికి ఈ విధానం ఉపయోగపడనుంది.

అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్లలో కూడా త్వరలో

రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం బయోమెట్రిక్ అటెండెన్స్ విధానాన్ని త్వరలో అమలుపరిచే అవకాశం ఉంది. ఉపాధ్యాయులకు సైతం బయోమెట్రిక్ అటెండెన్స్‌ను అమలు చేయాలని గతంలో సీఎం నిర్వహించిన సమీక్షలో నిర్ణయించిన విషయం తెలిసిందే.

ఎంజీఎం సూపరింటెండెంట్ రాజీనామా



ఎంజీఎం: వరంగల్‌లోని ఎంజీఎం సూపరింటెండెంట్ మురళి అర్ధంతరంగా తన పదవికి రాజీనామా చేశారు. అనారోగ్య కారణాలతో వారం క్రితం సెలవులో వెళ్లిన మురళి మంగళవారం రాత్రి తన రాజీనామా పత్రాన్ని కాకతీయ మెడికల్ కళాశాల (కేఎంసీ) ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి ద్వారా డీఎంఈకి పంపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నగర పర్యటన ఒకవైపు కొనసాగుతుండగానే సూపరింటెండెంట్ తన పదవికి రాజీనామా చేసిన విషయం వైద్యవర్గాల్లో చర్చనీయాంశమైంది. ఆస్పత్రిలో మెరుగైన సేవలందించేందుకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలతో కలెక్టర్ ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు. ఇందులో కిందిస్థాయి సిబ్బంది సహకారం లోపించడం.. తరచూ ఏదో ఒక ఘటన జరుగుతుండటంతో సూపరింటెండెంట్ మానసిక ఒత్తిడికి గురైనట్టు తెలుస్తోంది. ఇటీవల జరిగిన టెండర్లతోపాటు పలు కొనుగోళ్లలో ఏడీ, ఆర్ఎంఓల మధ్య సమన్వయలోపం మురళికి మరింత తలనొప్పిగా మారాయని అంటున్నారు.

కాపాడిన ప్రాణం.. మళ్లీ తీసుకుంది!

- హాస్పిటల్ పైనుంచి దూకి గృహిణి ఆత్మహత్య

సైదాబాద్: తీవ్ర మనస్తాపం చెందిన గృహిణి ఆత్మహత్యకు యత్నించింది. భర్త సకాలంలో స్పందించడంతో హాస్పిటల్‌లో కోలుకుంది. డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్లాల్సిన ఆమె చికిత్స పొందిన హాస్పిటల్ పైనుంచి దూకి రెండవసారి ఆత్మహత్యకు యత్నించి మరణించింది. సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. చంపాపేట వైశాలీనగర్‌లో నివసించే క్యాబ్ డ్రైవర్ సి.కృష్ణ, దివ్యశ్రీ (28) దంపతులకు ఇద్దరు సంతానం. ఈనెల 17న కృష్ణ బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరయ్యేందుకు రాయచూర్ వెళ్లాడు. సోమవారం ఉదయం అతనికి భార్య ఫోన్ చేసి ఇంటి యజమాని కోడలు తన గురించి ఇతర కిరాయిదారులకు చెడుగా చెబుతోందని చెప్పి బాధపడింది. తాను ఇంటికి వచ్చిన తరువాత మాట్లాడదామని కృష్ణ ఫోన్‌లోనే సర్దిచెప్పాడు. మళ్లీ రాత్రి 11 గంటలకు దివ్యశ్రీ అతనికి ఫోన్ చేసి పిల్లలను మంచిగా చూసుకో అని చెప్పి ఫోన్ పెట్టేసింది. అనుమానం వచ్చి న కృష్ణ ఇంటికి దగ్గరలో ఉండే స్నేహితుడిని పంపాడు. అతను వెళ్లేసరికి ఆమె ఇంట్లో పెయింటింగ్ ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే అతను దివ్యశ్రీని సమీపంలోని హాస్పిటల్‌కు తరలించాడు. మంగళవారం ఉదయం నగరానికి చేరుకున్న కృష్ణ హాస్పిటల్‌కు వెళ్లగా ఆమె కోలుకుందని, డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు చెప్పారు. అతను వాష్‌రూంకు వెళ్లి వచ్చేసరికి ఆస్పత్రి గదిలో ఆమె కనిపించలేదు. ఆస్పత్రి నాలుగో అంతస్తు నుంచి కిందకు దూకి దివ్యశ్రీ ఆత్మహత్యకు పాల్పడింది. తీవ్రగాయాలతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వేములవాడలో రోడ్డెక్కిన ప్రయాణికులు

- గంటల తరబడి బస్సుల కోసం వేచిచూసిన భక్తులు
- ఆయా డిపోల నుంచి సీఎం సభకు బస్సులు తరలడంతో తప్పని ఇబ్బందులు



వేములవాడలో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

సిరిసిల్ల/వేములవాడ అర్బన్: రాజన్నసిరిసిల్ల జిల్లా సిరిసిల్ల, వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులు లేక ప్రయాణికులు రోడ్డెక్కారు. కార్తీకమాసం సందర్భంగా సోమవారం రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు మంగళవారం తిరుగు ప్రయాణంలో బస్సుల కోసం గంటల తరబడి వేచిచూశారు. స్థానిక డిపోల బస్సులు వరంగల్‌లో నిర్వహించిన సీఎం సభకు వెళ్లడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. సీఎం సభకోసం మమ్మల్ని ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. తిప్పాపూర్ తెలంగాణచౌక్ వద్ద రోడ్డుపై బైఠాయించారు. పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. దీంతో కరీంనగర్–సిరిసిల్ల–వేములవాడ చౌరస్తాల నుంచి వచ్చే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని భక్తులతో మాట్లాడి సర్దిచెప్పారు.

గంటల తరబడి బస్సులు లేవు

వేములవాడ రాజన్న దర్శనం కోసం సోమవారం వచ్చినం. మంగళవారం తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళదామని బస్టాండ్‌కు వస్తే బస్సులు లేవు. గంటల తరబడి బస్టాండ్ లోనే కుటుంబంతో కూర్చున్నాం.

- సుశీల భక్తురాలు, గీసుకొండ

ప్రయాణికులను పట్టించుకోకుంటే ఎట్ల?

వేములవాడ బస్టాండ్‌లో బస్సులు లేక ఇబ్బందిగా మారింది. అధికారులను అడిగితే వస్తున్నయి అంటున్నారు తప్ప బస్సులు రావడం లేదు. ఒక్కో బస్సు వస్తే ప్రయాణికుల రద్దీతో సరిపోవడం లేదు. ప్రయాణికుల కోసం బస్సులు వేయకుంటే ఎట్లుంటది.

- సాయిలు, భక్తుడు మహబూబాబాద్

అంత్యక్రియలకు మొబైల్ టార్చే దిక్కు



మొబైల్ టార్చ్ వెలుతురులో బాలయ్య అంత్యక్రియలు నిర్వహిస్తున్న స్థానికులు

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో అధికారుల నిర్లక్ష్యంతో అంత్యక్రియలు కూడా ప్రశాంతంగా చేయలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. సిరిసిల్లలో విలీనమైన రగుడు గ్రామంలోని వైకుంఠధామంలో చాలారోజులుగా విద్యుత్ లైట్లు వెలగటం లేదు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా లైట్లు వేయలేదు. మంగళవారం గ్రామానికి చెందిన బూల బాలయ్య అనే వ్యక్తి చనిపోవడంతో రాత్రి చీకటిలో మొబైల్ ఫోన్ల టార్చ్ వెలుతురులో అంత్యక్రియలు నిర్వహించారు.

పూడిక తీతకు పచ్చజెండా

▶ మొదటి పేజీ తరువాయి

జారీ చేశారు. పూడికతీత కోసం రాజస్తాన్, మహారాష్ట్రల తరహాలో ఆదాయ ఆర్జన విధానంలో భారీ యంత్రాలతో తవ్వకాలు (మెకానికల్ డ్రెడ్జింగ్) నిర్వహించాలని కేబినెట్ సబ్ కమిటీ సిఫారసు చేసింది. అంటే దీనికోసం ప్రభుత్వం ఖర్చు చేయదు..పైగా ప్రభుత్వానికే ఆదాయం రానుంది. తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ (టీజీఎండీసీ) త్వరలో ఏదైనా ఒక జలాశయంలో పూడికతీతకు టెండర్లను ఆహ్వానించి అత్యధిక ధరను కోట్ చేసిన బిడ్డర్‌కు పూడికతీత పనులను అప్పగించే అవకాశం ఉంది. బిడ్డర్ పన్నులు, సెస్, జీఎస్టీ, రాయల్టీని చెల్లించి తవ్విన మట్టి, ఇసుకను విక్రయించుకోవచ్చు. పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే ఇతర జలాశయాల్లో సైతం పూడిక తొలగింపునకు ఇదే మోడల్‌ను అనుసరించడానికి రాష్ట్ర ప్రభుత్వం తదుపరిగా అనుమతి ఇవ్వనుంది.

సగానికి పైగా జలాశయాల్లో భారీగా పూడిక

- రాష్ట్రంలో మొత్తం 929 టీఎంసీల సామర్థ్యం కలిగిన 159 భారీ జలాశయాలున్నాయి. సగానికి పైగా జలాశయాలు 25 ఏళ్లకు పైబడినవే కావడంతో భారీగా పూడిక పేరుకుపోయింది.
- జలాశయాల్లో పూడిక పెరగడంతో క్రమంగా అవి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోతున్నాయి. తద్వారా ఆయకట్టుకు అవసరమైన సాగు నీటికి, అలాగే తాగునీటి సరఫరాలో సైతం లోటు ఏర్పడుతోంది. పర్యావరణ సమస్యలూ తలెత్తుతున్నాయి.
- నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టులో భాగంగా 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన 14 ప్రాజెక్టులపై అధ్యయనం జరపగా, పూడికతో అవి 35 టీఎంసీల (16 శాతం) సామర్థ్యాన్ని కోల్పోయాయి.
- పీఎం కిసాన్ సించాయ్ యోజన (పీఎంకేఎస్‌వై) మార్గదర్శకాల ప్రకారం ఒక టీఎంసీ సామర్థ్యం కలిగిన కొత్త జలాశయాన్ని నిర్మించాలంటే రూ.162 కోట్లు కావాల్సి ఉంటుంది.

సిఫారసులు ఇలా..

- జలాశయాలు, డ్యామ్‌లు, ఆనకట్టలు, బరాజ్‌లు, నదులు, కాల్వల్లో పూడికతీత పనులకు పర్యావరణ అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదు. కేంద్రం ఈ మేరకు మినహాయింపు ఇచ్చింది. పూడికతీత ద్వారా వాటి నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించాలి.
- నీటిపారుదల, గనుల శాఖలు సమావేశమై ఒక నిర్ణయం తీసుకోవాలి. ఇప్పటికే పూడికతీత చేపట్టిన రాష్ట్రాల్లో అధ్యయనం చేయాలి.
- సాగునీటి ప్రాజెక్టులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పూడికతీత జరగాలి. వాటి రక్షణ విషయంలో రాజీపడరాదు.
- పూడికతీతలో సారవంతమైన మట్టిని వెలికితీస్తే రైతాంగానికి ఉచితంగా సరఫరా చేయాలి. రవాణా చార్జీలు రైతులే భరించాలి.

కమ్ముకుంటున్న అణుమేఘాలు

ముంచుకొస్తున్న మూడో ప్రపంచ యుద్ధం?

శరవేగంగా నాటకీయ పరిణామాలు ● రష్యాపైకి ఉక్రెయిన్ దీర్ఘ శ్రేణి క్షిపణులు



రష్యాపై యూఎస్ తయారీ దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణులతో ఉక్రెయిన్ దాడులు. తీవ్రస్థాయిలో మండిపడుతున్న రష్యా. దీన్ని అమెరికాతో కలిసి చేసిన సంయుక్త దాడిగానే పరిగణిస్తామని ప్రకటన. అణు దాడితో దీటుగా బదులిచ్చేందుకు వీలుగా రష్యా అణు విధానాన్ని సవరిస్తూ అధ్యక్షుడు పుతిన్ నిర్ణయం. 'ఏ క్షణాన్నయినా అణు యుద్ధం ముంచుకు రావచ్చు, జాగ్రత్తగా ఉండండి' అంటూ ప్రజలకు యూరప్ దేశాల 'వార్ గైడ్‌లైన్స్'. సోమవారం ఒక్క రోజే శరవేగంగా జరిగిన తీవ్ర ఆందోళనకర పరిణామాలివి! ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి తెర తీసి సరిగ్గా 1,000 రోజులు పూర్తయిన నాడే చోటుచేసుకున్న ఈ తీవ్ర పరిణామాలు గుబులు రేపుతున్నాయి. ఇప్పటికే నాల్కలు చాస్తున్న యుద్ధ జ్వాలలు మరింతగా విస్తరించి మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీస్తాయా అన్న ఆందోళనలు సర్వత్రా తలెత్తుతున్నాయి.

- అమెరికా అనుమతించిన మర్నాడే దాడులు
- మండిపడ్డ పుతిన్, అణు దాడులకు నిర్ణయం!
- ఉక్రెయిన్-అమెరికా సంయుక్త దాడిగా పరిగణన
- ఆ మేరకు రష్యా అణు విధానానికి సవరణలు
- అణుయుద్ధం రావచ్చు, సిద్ధంగా ఉండండి
- ప్రజలకు నాటో సభ్య దేశాల 'వార్ గైడ్‌లైన్స్'
- ఇంటింటికీ కరపత్రాలు, హెచ్చరిక మెయిళ్లు

అపారంగా అణ్వాయుధాలు

రష్యా వద్ద వేలాదిగా అణ్వాయుధాలు పోగుపడి ఉన్నాయి. ప్రపంచంలోకెల్లా అత్యధిక సంఖ్యలో అణు వార్‌హెడ్లున్న దేశం రష్యానే. 1994లో సోవియట్ నుంచి విడిపోయేనాటికి ఉక్రెయిన్ వద్ద కూడా భారీగానే అణ్వాయుధాలుండేవి. ఆ జాబితాలో ప్రపంచంలో మూడో అతి పెద్ద దేశంగా ఉక్రెయిన్ ఉండేది. కానీ రష్యాతో ఒప్పందంలో భాగంగా తన అణ్వాయుధాలన్నింటినీ నాశనం చేసింది. కాకపోతే అమెరికాతో పాటు అణు సంపత్తి ఉన్న పలు దేశాలు ఉక్రెయిన్‌కు దన్నుగా ఉన్నాయి.

క్షిపణులే మాట్లాడతాయి

భారీ క్షిపణి దాడులకు మాకు అనుమతి లభించిందంటూ మీడియా ఏదేదో చెబుతోంది. కానీ దాడులు జరిగేది మాటలతో కాదు. వాటిని ముందుగా చెప్పి చేయరు. ఇక మా తరఫున క్షిపణులే మాట్లాడతాయి

- ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ విజయంతో ఉక్రెయిన్ యుద్ధానికి తెర పడుతుందని, పశ్చిమాసియా కల్లోలమూ కాస్త అదుపులోకి వస్తుందని భావిస్తున్న తరుణంలో అంతర్జాతీయంగా అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. పదవి నుంచి దిగిపోయే ముందు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఇందుకు బీజం పడింది. అమెరికా అందజేసిన దీర్ఘశ్రేణి క్షిపణులను రష్యాలో సుదూర లక్ష్యాలపై దాడుల నిమిత్తం వాడేందుకు ఉక్రెయిన్‌కు ఆయన అనుమతివ్వడం ఒక్కసారిగా ఉద్రిక్తతలను రాజేసింది. దీన్ని రెండు చేతులా అందిపుచ్చుకున్న ఉక్రెయిన్ మంగళవారమే రష్యాపై యూఎస్ దీర్ఘశ్రేణి ఆర్మీ టాక్టికల్ మిసైల్ సిస్టం (ఏటీఏసీఎంఎస్) బాలిస్టిక్ క్షిపణులను ఎడాపెడా ప్రయోగించింది. రష్యాలోని బ్రయాన్స్క్ ప్రాంతమే లక్ష్యంగా దాడులకు దిగింది. ఈ క్షిపణులను ఉక్రెయిన్ యుద్ధంలో వాడటం ఇదే తొలిసారి. అలాంటి చర్యలకు దిగితే తీవ్రస్థాయి ప్రతిస్పందన తప్పదని ఇప్పటికే హెచ్చరించిన రష్యా ఈ పరిణామంపై భగ్గుమంది. తమ భూభాగాలపైకి కనీసం ఆరు అమెరికా తయారీ ఏటీఏసీఎంఎస్ క్షిపణులు వచ్చి పడ్డాయని ధ్రువీకరించింది. వాటిలో ఐదింటిని కూల్చేయడంతో పాటు ఆరో దాన్నీ ధ్వంసం చేసినట్టు ప్రకటించింది.

ఉక్రెయిన్‌పై రష్యా అణు దాడులు!

తాజా పరిణామాలపై రష్యా అధ్యక్షుడు పుతిన్ మండిపడుతున్నారు. మంగళవారం ఆయన రక్షణ తదితర శాఖల అత్యున్నత స్థాయి అధికారులతో భేటీ అయ్యారు. ఉక్రెయిన్ క్షిపణి దాడులను అమెరికాతో కలిసి చేసిన సంయుక్త దాడిగానే పరిగణించాలని నిర్ణయించారు. అందుకు వీలు కల్పించేలా దేశ అణు విధానానికి సవరణ కూడా చేశారు! దాని ప్రకారం సంప్రదాయ ఆయుధాలతో రష్యాపై జరిగే దాడికి ఏ అణ్వాయుధ దేశమైనా మద్దతిస్తే దాన్ని ఆ రెండు దేశాల సంయుక్త దాడిగానే పరిగణిస్తారు. సదరు దేశాలపై అణు దాడులకు దిగుతారా అన్నదానిపై సవరణలో స్పష్టత ఇవ్వలేదు. కాకపోతే రష్యాపై భారీ స్థాయి వైమానిక, బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణి దాడులు జరిగితే అణ్వాయుధాలతో బదులిచ్చేందుకు అది వీలు కల్పిస్తుండటం విశేషం! అంతేగాక మిత్ర దేశమైన బెలారస్‌పై దుందుడుకు చర్యలకు దిగినా అణ్వాయుధాలతో బదులు చెప్పేందుకు తాజా సవరణ అనుమతించనుంది! ఉక్రెయిన్‌కు మరింత సాయం చేయకుండా యూరప్ దేశాలను నియంత్రించడంతో పాటు అవసరమైతే దానిపై అణ్వాయుధ ప్రయోగానికి, అమెరికాపై సైనిక చర్యకు కూడా దిగడం పుతిన్ తాజా నిర్ణయాల ఉద్దేశమని భావిస్తున్నారు. అమెరికా దీర్ఘశ్రేణి క్షిపణులతో ఉక్రెయిన్ చేసిన తాజా దాడులకు బదులుగానే అణు విధాన సవరణ జరిగిందా అన్న ప్రశ్నకు క్రెమ్లిన్ అధికార ప్రతినిధి ద్మిత్రీ పెస్కోవ్ నేరుగా బదులివ్వలేదు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఉండేలా అణు విధానాన్ని అప్‌డేట్ చేయాల్సిందిగా పుతిన్ ఆదేశించారంటూ నర్మగర్భంగా స్పందించారు. ఇటీవలి కాలంలో రష్యా అణు విధానానికి పుతిన్ సవరణ చేయడం ఇది రెండోసారి. రష్యాకు దన్నుగా ఉత్తర కొరియా సైన్యం కూడా ఉక్రెయిన్‌పై యుద్ధంలో పాల్గొంటుండటం తెలిసిందే. దీన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్టు అమెరికా ఇప్పటికే ప్రకటించింది. దీర్ఘశ్రేణి క్షిపణుల వాడకానికి అనుమతి దాని పర్యవసానమేనంటున్నారు. ఈ నేపథ్యంలో యుద్ధ జ్వాలలు త్వరలో కొరియా ద్వీపకల్పం దాకా విస్తరించినా ఆశ్చర్యం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బైడెన్ మతిలేని విధానాలతో ట్రంప్ పగ్గాలు చేపట్టే నాటికే ప్రపంచాన్ని పెనుయుద్ధం ముంగిట నిలిపేలా ఉన్నారని ఆయన కుమారుడు జూనియర్ ట్రంప్ మండిపడటం తెలిసిందే.

నిత్యావసరాలు నిల్వ చేసుకోండి

తాజా పరిణామాలు మూడో ప్రపంచ యుద్ధానికి దారితీసేలా కన్పిస్తుండటంతో యూరప్ దేశాలు భీతిల్లుతున్నాయి. అలాంటి పరిస్థితే తలెత్తితే ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలంటూ స్వీడన్, ఫిన్లండ్, నార్వే, డెన్మార్క్ తదితర నాటో సభ్య దేశాలు తమ పౌరులను హెచ్చరించడం విశేషం. ''ఏ క్షణంలోనైనా అణు యుద్ధం ముంచుకు రావచ్చు. సిద్ధంగా ఉండండి'' అంటూ స్వీడన్ ఏకంగా ఇంటింటికీ కరపత్రాలే పంచుతోంది. 'సంక్షోభమో, యుద్ధమో వస్తే...' అనే శీర్షికతో కూడిన 52 లక్షల కరపత్రాలను సోమవారం నుంచి వారం పాటు పంచనుంది! అది నిజానికి 32 పేజీలతో కూడిన డాక్యుమెంట్. ''మనపై ఎవరైనా దాడికి తెగబడితే దేశ స్వాతంత్ర్య పరిరక్షణకు అందరమూ ఒక్కటవుదాం'' అని అందులో పౌరులకు స్వీడన్ ప్రభుత్వం పిలుపునిచ్చింది. దాంతోపాటు, ''పిల్లల డైపర్లు, బేబీ ఫుడ్, దీర్ఘకాలం నిల్వ ఉండే ఆహార పదార్థాలు, మంచినీరు తదితరాలన్నింటినీ వీలైనంతగా సేకరించి పెట్టుకోండి'' అని సూచించింది. అంతేగాక బాంబు దాడులు జరిగితే వాటిబారి నుంచి ఎలా తప్పించుకోవాలి, గాయపడితే రక్తస్రావాన్ని నిరోధించేందుకు, ప్రాణ నష్టాన్ని తగ్గించేందుకు ఏం చేయాలి, యుద్ధ బీభత్సం చూసి భీతిల్లే చిన్నారులను ఎలా సముదాయించాలి వంటి వివరాలెన్నో పొందుపరిచింది. ''పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత స్వీడన్ ఇలాంటి చర్యకు దిగడం ఇది ఐదోసారి. నార్వే కూడా ఇలాంటి 'యుద్ధ' జాగ్రత్తలతో ప్రజలకు ఎమర్జెన్సీ పాంప్లెంట్లు పంచుతోంది. 'పూర్తిస్థాయి యుద్ధంతో పాటు ఏవైనా అనుకోని పరిస్థితులు ఎదురైతే వారం దాకా ఇల్లు కదలకుండా గడిపేందుకు సిద్ధపడండి' అంటూ అప్రమత్తం చేస్తోంది. డెన్మార్క్ కూడా కనీసం మూడు రోజులకు పైగా సరిపడా సరుకులు, మంచినీరు, ఔషధాలు తదితరాలు నిల్వ ఉంచుకోవాలంటూ తన పౌరులందరికీ ఇప్పటికే ఈ-మెయిళ్లు పంపింది! ఫిన్లండ్ కూడా అదే బాట పట్టింది. 'రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తీవ్రతరమవుతున్న నేపథ్యంలో ఎలాంటి పరిస్థితికైనా సిద్ధంగా ఉండండి. నిత్యావసరాలను వీలైనంతగా సేకరించి పెట్టుకోండి' అంటూ తన పౌరులకు ఆన్‌లైన్ బ్రోషర్లు పంపింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

వచ్చే ఏడాది భారత్‌లో పుతిన్ పర్యటన!

న్యూఢిల్లీ: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వచ్చే ఏడాది భారత్‌లో పర్యటించే వీలుంది. దశాబ్దాల స్నేహం, బలమైన రక్షణ, వాణిజ్య బంధాలు, పరస్పరసహకారాలతో ఇరుదేశాల ద్వైపాక్షిక బంధం పటిష్టంగా ఉన్న నేపథ్యంలో వార్షిక పర్యటనల్లో భాగంగా వచ్చే ఏడాది పుతిన్ భారత్‌కు రావొచ్చని దౌత్యవర్గాలు మంగళవారం వెల్లడించాయి. పుతిన్ పర్యటన వేళ రష్యా ఏఏ అంశాలపై భారత్‌తో ఒప్పందాలు చేసుకోవచ్చు అనేది ఇంకా ఖరారుకాలేదని తెలుస్తోంది. ఈ ఏడాది జూలైలో భారత ప్రధాని నరేంద్ర మోదీ రష్యా రాజధాని మాస్కోలో పర్యటించి పుతిన్‌తో విస్తృతస్థాయి చర్చలు జరిపిన విషయం విదితమే. భారత్, రష్యాల మధ్య ద్వైపాక్షిక బంధం మరింత బలోపేతంకానుందని మంగళవారం రష్యా అధ్యక్ష కార్యాలయం అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో పుతిన్ భారత పర్యటన ఖాయమని దాదాపు స్పష్టమైంది. మంగళవారం ఆయన భారత సీనియర్ సంపాదకులతో వర్చువల్‌గా మాట్లాడారు. '' పుతిన్ త్వరలోనే భారత్‌లో పర్యటిస్తారు. అయితే పర్యటన తేదీలపై ఇరుదేశాలు సంప్రదింపులు జరపాల్సి ఉంది' అని పెస్కోవ్ అన్నారు. అయితే ఏ తేదీల్లో ఎన్ని రోజులు భారత్‌లో పుతిన్ పర్యటిస్తారన్న వివరాలను దిమిత్రీ వెల్లడించలేదు. బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు మోదీ గత నెలలో కజక్‌స్తాన్‌లో పర్యటించిన విషయం తెల్సిందే. దీర్ఘశ్రేణి క్షిపణులను ఉక్రెయిన్‌కు అందించాలని బైడెన్ సారథ్యంలోని అమెరికా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై పెస్కోవ్ మాట్లాడారు. ''అమెరికా నిర్ణయం ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో మరింత ఆజ్యంపోస్తోంది. యుద్ధం మరింతగా విస్తరించడం ఖాయం. బైడెన్ ప్రభుత్వం యుద్ధానికే మద్దతు పలుకుతోంది. శాంతిస్థాపనకు కాదు. రష్యాపై అధునాతన ఆయుధాల వినియోగానికి అమెరికా పచ్చజెండా ఊపిన నేపథ్యంలో మేం కూడా మా అణ్వస్త్ర విధానాన్ని సవరించాల్సిన సమయమొచ్చింది'' అని పెస్కోవ్ అన్నారు. అణ్వాయుధ వినియోగానికి సంబంధించిన కీలక దస్త్రంపై పుతిన్ సంతకం చేసిన వేళ పెస్కోవ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



అమెరికా రవాణామంత్రిగా ఫాక్స్ న్యూస్ వ్యాఖ్యాత



వాషింగ్టన్: అమెరికా రవాణా మంత్రిగా ఫాక్స్ న్యూస్ హోస్ట్ సాన్ డఫీని నామినేట్ చేస్తున్నట్లు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఫాక్స్ న్యూస్‌కు సంబంధించి ట్రంప్ యంత్రాంగంలో ఇది రెండో నియామకం కావడం విశేషం. ఫాక్స్‌న్యూస్ హోస్ట్ పీట్ హెగ్సెత్‌ను రక్షణ మంత్రిగా ట్రంప్ ఇప్పటికే నామినేట్ చేయడం తెలిసిందే. డఫీ నియామకాన్ని సెనేట్ ఆమోదించాల్సి ఉంటుంది. రాజకీయాలు, మీడియా, రియాలిటీ, టీవీ రంగాల్లో విస్తరించిన వైవిధ్యమైన కెరీర్ ఆయన సొంతం. 1990ల చివర్లో ఎంటీవీ 'ది రియల్ వరల్డ్: బోస్టన్'లో కాస్ట్ మెంబర్‌గా ఆయన అందరి దృష్టిని ఆకర్షించారు. తరువాత 'రోడ్ రూల్స్: ఆల్ స్టార్స్'లో కనిపించారు. 2010లో విస్కాన్సిన్ నుంచి ప్రతినిధుల సభకు ఎన్నికవడంతో డఫీ రాజకీయ జీవితం మొదలైంది. 2019లో రాజీనామా చేసి ఫాక్స్ న్యూస్ కంట్రిబ్యూటర్‌గా చేరారు. ప్రస్తుతం ఫాక్స్ బిజినెస్‌లో 'ది బాటమ్ లైన్' వ్యాఖ్యాతగా ఉన్నారు. 2022లో విస్కాన్సిన్ గవర్నర్ పదవిని తిరస్కరించారు.



విడాకులు తీసుకోనున్న ఏఆర్ రహమాన్ దంపతులు

న్యూఢిల్లీ: సంగీత సామ్రాట్, దిగ్గజ సంగీత దర్శకుడు ఏఆర్ రహమాన్ దంపతులు తమ మూడు దశాబ్దాల వైవాహిక బంధానికి స్వస్తి పలకబోతున్నారు. ఈ విషయాన్ని రహమాన్ దంపతుల తరఫున ప్రముఖ విడాకుల లాయర్ వందనా షా ఒక సంయుక్త ప్రకటన మంగళవారం విడుదలచేశారు. '' పెళ్లయిన చాన్నాళ్ల తర్వాత విడిపోవాలన్న కఠిన నిర్ణయానికి వచ్చారు. కొరవడిన భావోద్వేగాలే బంధం బీటలు పడటానికి కారణం. ఒకరిపై ఇంకొకరికి అమితమైన ప్రేమానురాగాలు ఉన్నాసరే అనూహ్య పరిస్థితులు వీళ్లిద్దరి మధ్యా పూడ్చలేని అగాథాన్ని సృష్టించాయి. బాధను దిగమింగి ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. ఈ కష్టకాలంలో వ్యక్తిగత గోప్యతను గౌరవిస్తూ ప్రజలు సైతం ఈ విషయాన్ని అర్థంచేసుకుంటారని ఆశిస్తున్నాం. ఈ కష్టమైన దశను వీళ్లిద్దరూ దాటగలరని భావిస్తున్నా' అని లాయర్ వందనా షా ఆ అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు. ' మా కుటుంబ ప్రైవసీని గౌరవించండి' అని రహమాన్ కుమారుడు అమీన్ సైతం ఇన్‌స్టా గ్రామ్‌లో ఒక పోస్ట్‌పెట్టారు. రహమాన్, సైరా బానూ వివాహం 1995 మార్చినెలలో చెన్నైలో జరిగింది. వీళ్లకు ఖతీజా, రహీమా, అమీన్ అనే పిల్లలున్నారు. వీళ్లది పెద్దలు కుదిర్చిన వివాహం.

వలసదారుల ఏరివేతకు 'ఎమర్జెన్సీ'!

అందుకోసం సైన్యాన్ని కూడా రంగంలోకి దించుతాం: ట్రంప్

వాషింగ్టన్: డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక ఊహించినట్లుగానే సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. అతి కీలకమైన ఎన్నికల అంశంగా మారిన అక్రమ వలసలపై ఆయన తాజాగా కీలక నిర్ణయం వెలువరించారు. సరిహద్దు భద్రతపై జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించే యోచన ఉందని సోమవారం ట్రంప్ ధ్రువీకరించారు. అక్రమ వలసదారులను తిప్పి పంపేందుకు సైన్యాన్ని కూడా రంగంలోకి దించుతామని తన సోషల్ మీడియా హ్యాండిల్ ట్రూత్‌లో ప్రకటించారు! ఈ మేరకు ఓ రిపబ్లికన్ కార్యకర్త చేసిన చేసిన పోస్టును ట్రంప్ రీ పోస్టు చేస్తూ, 'నిజమే' అంటూ కామెంట్ జోడించారు. వలసలను ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. తనను గెలిపిస్తే కనీసం 10 లక్షల మంది అక్రమ వలసదారులను వెనక్కు పంపుతానని, మెక్సికోతో సరిహద్దులను దుర్భేద్యంగా మారుస్తానని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. అమెరికాలో ఏకంగా కోటీ 10 లక్షల మందికి పైగా అక్రమంగా నివసిస్తున్నట్టు అధికారుల అంచనా. ట్రంప్ భారీ బహిష్కరణ ప్రణాళిక లక్షలాది కుటుంబాలపై నేరుగా ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు.ట్రంప్ జనవరి 20న అధ్యక్ష బాధ్యతలు స్వీకరించనుండటం తెలిసిందే. తన కేబినెట్‌ను ఇప్పటికే అతివాదులు, వలసల వ్యతిరేకులతో నింపేశారు. ముఖ్యంగా కీలకమైన ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మాజీ చీఫ్ టామ్ హోమన్‌ను బోర్డర్ జార్ పదవికి ఎంపిక చేశారు. 'అక్రమ వలసదారులారా! సామాన్లు ప్యాక్ చేసుకోవడం మొదలు పెట్టండి. మీ దేశాలకు తిరిగి వెళ్లాల్సిన సమయం వచ్చేసింది' అని గత జూలైలోనే రిపబ్లికన్ పార్టీ సదస్సులో హోమన్ హెచ్చరికలు చేశారు. తమ విభాగం తొలుత 4.25 లక్షల మంది అక్రమ వలసదారులను బహిష్కరిస్తుందని ఆయన ఇటీవల పేర్కొన్నారు. అధ్యక్షుడు జో బైడెన్ పాలనలో రికార్డు సంఖ్యలో అక్రమ వలసదారులు అమెరికాలోకి ప్రవేశించారని ట్రంప్ పదేపదే ఆరోపించడం తెలిసిందే. వారంతా అమెరికా రక్తాన్ని విషపూరితం చేశారంటూ ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వారిని తిప్పి పంపేందుకు అవసరమైతే 1798 నాటి ఏలియన్ ఎనిమీస్ చట్టాన్ని కూడా ప్రయోగిస్తామన్నారు.

నువ్వా.. నేనా?

- మహారాష్ట్రలో నేడే పోలింగ్
- అధికార మహాయుతి, విపక్ష ఎంవీఏ హోరాహోరీ
- శనివారం ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాల వెల్లడి

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. 288 అసెంబ్లీ స్థానాలకు బుధవారం ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. బీజేపీ సారథ్యంలోని అధికార మహాయుతి, కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) భాగ్యరేఖలను 9.7 కోట్ల మంది ఓటర్లు తేల్చనున్నారు. రాష్ట్రమంతటా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని ఎన్నికల అధికారులు తెలిపారు.

హోరెత్తిన ప్రచారం

మహాయుతి తరఫున ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మహారాష్ట్రలో కాలికి బలపం కట్టుకుని తిరిగారు. ముమ్మర ప్రచారంతో హోరెత్తించారు. వారితో పాటు కేంద్ర మంత్రులు, పలు బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు తదితరులు కూడా ప్రచార పర్వంలో చురుగ్గా పాల్గొన్నారు. ఎంవీఏ కూటమి కోసం కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్ర నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ వద్రా ప్రచారం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల అనంతర పరిణామాల్లో ముందుగా శివసేన, అనంతరం ఎన్సీపీల్లో చీలిక రావడం తెలిసిందే. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించడం ద్వారా తమదే అసలైన పార్టీ అని నిరూపించుకునేందుకు షిండే, ఉద్ధవ్ సేనలు; శరద్ పవార్, అజిత్ ఎన్సీపీ వర్గాలు పట్టుదలగా ఉన్నాయి. ఈ ఎన్నికలు వాటికి ఒకరకంగా జీవన్మరణ సమస్యేనని చెప్పాలి. 18–65 ఏళ్ల మధ్య వయసు మహిళలకు నెలకు రూ.1,500 ఆర్థిక సాయం అందిస్తున్న లడ్కీ బహన్ పథకంపైనే మహాయుతి ప్రధానంగా ఆశలు పెట్టుకుంది. మళ్లీ గెలిస్తే ఆ మొత్తాన్ని రూ.2,100కి పెంచుతామని పేర్కొంది. దీనికి విరుగుడుగా తాము మహిళలకు ఏకంగా నెలకు రూ.3,000 ఇస్తామని ఎంవీఏ ప్రకటించింది. మతపరమైన మనోభావాలను రేకెత్తించేందుకు కూడా బీజేపీ శాయశక్తులా ప్రయత్నించింది. అందులో భాగంగా బటేంగే తో కటేంగే, ఏక్ హై తో సేఫ్ హై వంటి నినాదాలు ప్రధానితో పాటు ఆ పార్టీ అగ్ర నేతలందరి నోటా ప్రచారం పొడవునా పదేపదే వినిపించాయి. ఇది సమాజంలో మతపరమైన చీలిక యత్నమేనంటూ రాహుల్‌తో పాటు ఎంవీఏ నేతలంతా దుయ్యబట్టారు.



ఓటేయాలంటు ముంబైలో విద్యార్థినుల ప్రచారం

పార్టీల కోలాటం

మహాయుతి పక్షాల్లో బీజేపీ అత్యధికంగా 149 అసెంబ్లీ స్థానాల్లో బరిలో ఉంది. శివసేన (షిండే) 81, ఎన్సీపీ (అజిత్) 59 చోట్ల పోటీ చేస్తున్నాయి. ఎంవీఏ కూటమి నుంచి కాంగ్రెస్ అత్యధికంగా 101 స్థానాల్లో, శివసేన (యూబీటీ) 95, ఎన్సీపీ (ఎస్పీ) 86 చోట్ల పోటీలో ఉన్నాయి. వీటితో పాటు బరిలో ఉన్న పలు చిన్న పార్టీలు ఈసారి పెద్ద ప్రభావమే చూపేలా కన్పిస్తుండటం విశేషం.

అసెంబ్లీ స్థానాలు	288
మొత్తం ఓటర్లు	9,70,25,119
పురుషులు	5,00,22,739
స్త్రీలు	4,69,96,279
ట్రాన్స్‌జెండర్లు	6,101
మొత్తం అభ్యర్థులు	4,136
స్వతంత్రులు	2,086
రెబెల్స్	156
పోలింగ్ స్టేషన్లు	1,00,186
పోలింగ్ సిబ్బంది	6 లక్షలు

జార్ఖండ్‌లో రెండో విడత

38 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్

రాంచీ: జార్ఖండ్‌లో బుధవారం రెండో, తుది విడతలో 38 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. శనివారం మహారాష్ట్రతో పాటే ఓట్ల లెక్కింపు జరిగి ఫలితాలు వెల్లడవనున్నాయి. రాష్ట్రంలో నవంబర్ 13న తొలి విడతలో 43 సీట్లలో పోలింగ్ ముగియడం తెలిసిందే. జేఎంఎం సారథ్యంలోని పాలక ఇండియా కూటమిని ఎలాగైనా ఓడించాలని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ సంకీర్ణం పట్టుదలగా ఉంది. ఇరు కూటముల నేతలూ సోమవారం రాత్రి దాకా ఇంటింటి ప్రచారంతో హోరెత్తించారు.

రెండో విడత ముఖచిత్రం

పోలింగ్ స్థానాలు	38
మొత్తం అభ్యర్థులు	528
మొత్తం ఓటర్లు	1.23 కోట్లు
పురుషులు	62.2 లక్షలు
స్త్రీలు	60.79 లక్షలు
పోలింగ్ స్టేషన్లు	14,218

మళ్లీ ఎఫ్‌టీఏ చర్చలు

మోదీ, స్టార్మర్ అంగీకారం ● జీ20 సదస్సులో నేతల భేటీ

రియో డి జనిరో: బ్రిటన్, భారత్ మధ్య స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై నెలకొన్న అనుమానాలకు తెర పడింది. దీనిపై చర్చలను పునఃప్రారంభిస్తామని బ్రిటన్ ప్రధాని కియర్ స్టార్మర్ స్పష్టం చేశారు. బ్రెజిల్‌లోని రియో డి జనిరోలో ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అనంతరం ఆయన ఈ మేరకు స్పష్టత ఇచ్చారు. జీ20 శిఖరాగ్ర సదస్సులో భాగంగా నేతలిద్దరూ సమావేశమయ్యారు. బ్రిటన్లో లేబర్ పార్టీ గెలుపుతో ఎఫ్‌టీఏ భవితవ్యం అయోమయంలో పడటం తెలిసిందే. దానికి నేతలిద్దరూ తాజాగా తెర దించారు. పరస్పరం లాభసాటిగా ఉండేలా ఎఫ్‌టీఏ విధివిధానాలు రూపొందుతాయని ఆశాభావం వెలిబుచ్చారు. బెల్‌ఫాస్ట్, మాంచెస్టర్ నగరాల్లో నూతన కాన్సులేట్లు తెరవాలని నిర్ణయించారు. పరారీలో ఉన్న వ్యాపారవేత్తలు విజయ్ మాల్యా, నీరవ్ మోదీలను అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని స్టార్మర్‌కు మోదీ విజ్ఞప్తి చేశారు.

మెరుగైన భవితకు కృషి

మెరుగైన భవిష్యత్తు కోసం చర్యలు చేపట్టాల్సిందిగా జీ20 సభ్య దేశాలకు మోదీ పిలుపునిచ్చారు. సదస్సులో రెండో రోజు సుస్థిరాభివృద్ధి, ఇంధన రంగంలో మార్పులపై ఆయన ప్రసంగించారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం సంపన్న దేశాల బాధ్యత అని గుర్తు చేశారు. పర్యావరణ సవాళ్లను కలసికట్టుగా ఎదుర్కోవడం మానవాళి మనుగడకు చాలా కీలకమని అభిప్రాయపడ్డారు. గాజాకు మరింత మానవతా సాయం అందించాలని, ఉక్రెయిన్ యుద్ధానికి తెర పడాలంటూ సదస్సు డిక్లరేషన్ విడుదల చేసింది. వీటితో పాటు పలు అంశాలపై బుధవారం సదస్సు చివరి రోజు ఉమ్మడి తీర్మానం చేసే అవకాశముంది.

దేశాధినేతలతో మోదీ భేటీలు

ఆతిథ్య దేశం బ్రెజిల్ అధ్యక్షుడు లులా డసిల్వాతో పాటు పలువురు దేశాధినేతలతో మోదీ వరుస భేటీలు జరిపారు. ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ (ఫ్రాన్స్), గాబ్రియెల్ బోరిక్ ఫోంట్ (చిలీ), జేవియర్ మెయిలీ (అర్జెంటీనా), జార్జియా మెలోనీ (ఇటలీ), ప్రబోవో సుబియాంటో (ఇండొనేసియా), పెడ్రో శాంచెజ్ (స్పెయిన్), అబ్దెల్ ఫతా ఎల్ సిసీ (ఈజిప్ట్), యూన్ సుక్ యోల్ (దక్షిణ కొరియా), జోనాస్ గర్ స్టోర్ (నార్వే), లూయిస్ మాంటెనెగ్రో (పోర్చుగీస్), లారెన్స్ వాంగ్ (సింగపూర్), యూరోపియన్ యూనియన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాండర్ లియన్, అంతర్జాతీయ ద్రవ్య నిధి డిప్యూటీ ఎండీ గీతా గోపీనాథ్ తదితరులు వీరిలో ఉన్నారు.


స్టార్మర్‌తో ప్రధాని మోదీ

పోలింగ్ వేళ పంపకం గోల

- మహారాష్ట్రలో కోట్ల నగదు పంచుతున్నారంటూ బీజేపీ నేతల వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసిన విపక్ష పార్టీలు
- వాళ్లే డబ్బు తెచ్చి వీరంగం సృష్టించారన్న బీజేపీ
- పాల్ఘర్ జిల్లాలో హైడ్రామా

ముంబై: మహారాష్ట్రలో నేడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ వేళ పాల్ఘర్ జిల్లాలో బీజేపీ నగదు వివాదం తాజాగా బహిర్గతమైంది. బీజేపీ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే స్వయంగా కోట్ల రూపాయలు పంచుతున్నారంటూ సంబంధిత వీడియోను బహుజన్ వికాస్ అఘాడీ పార్టీ చీఫ్ హితేంద్ర ఠాకూర్ తదితరులు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పాల్ఘర్ జిల్లా విరార్ పట్టణంలోని ఓ హోటల్ హాల్‌లో తావ్డే, నాలాసోపారా బీజేపీ అభ్యర్థి రాజన్ నాయక్ ఓటర్లకు రూ.5 కోట్ల నగదు పంచుతుండగా అడ్డుకున్నామని ఠాకూర్ తదితరులు మీడియాతో చెప్పారు. తావ్డే, బీవీఏ నేతల వాగ్వాదం, నోట్లను తావ్డే ముఖంపైకి విసిరేయడం, ఆయనను పోలీసులు బయటకు తీసుకెళ్లడం వాటిలో కనిపించింది. తావ్డేపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఈసీని కోరింది. హోటల్‌లో రూ.15 కోట్ల పంపకాల లెక్కలు రాసున్న డైరీలు, ల్యాప్‌టాప్ దొరికాయని కాంగ్రెస్ నేత సుప్రియా శ్రీనేత్ ఆరోపించారు. వీటిని బీజేపీ కొట్టిపారేసింది. ''పార్టీ నేతలు, కార్యకర్తలకు పోలింగ్ వేళ విధివిధానాలపై తావ్డే దిశానిర్దేశం చేస్తుండగా విపక్ష నేతలే డబ్బు కట్టలతో వచ్చి వీరంగం వేశారు. రూ.5 కోట్ల నగదు అక్కడ ఉంటే బయటపెట్టాలి . ఇది ఎంవీఏ నేతల డ్రామా. ఈ తమాషా తర్వాత తావ్డే, ఠాకూర్ కలిసి భోంచేశారు'' అని బీజేపీ నేత అమిత్ మాలవీయ ఆరోపించారు. ఘటనపై తావ్డే, మరో 250 మంది బీజేపీ కార్యకర్తలపై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. నగదు, మద్యం పంపిణీపై, ప్రచారం ముగిశాక రాజకీయ సమావేశం ఏర్పాటుచేయడంపై కేసులు నమోదు చేశారు. హోటల్ నుంచి రూ.9.93 లక్షల నగదు, పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు ప్రకటించారు.



ఈ నగరానికి ఏమైంది?
ఈ నగరానికి ఏమైంది.. రాత్రుళ్లు నిద్రపోరేంటి.. ఓ వైపు నైట్ షిఫ్ట్, మరో వైపు టైం పాస్.. ఈ అలవాట్లకు చరమగీతం పాడకుంటే ముప్పు తప్పదని హెచ్చరిస్తున్నారు వైద్య నిపుణులు. - సిటీప్లస్‌లో



పెట్ లవర్స్.. బీ కేర్‌ఫుల్
మనుషులకే కాదు.. పెంపుడు జంతువులకూ చలి కాలంలో వేడి పుట్టించే వివిధ రకాల యాక్సెసరీస్ అందుబాటులోకి వచ్చాయి. ప్రత్యేక స్వెటర్లు జంతువులకు రక్షణగా నిలుస్తున్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 30.0/16.0
నగరంలో బుధవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది. గరిష్టంగా 30, కనిష్టంగా 16 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

తప్పిన పెను ప్రమాదం

కరెంటు స్తంభాన్ని ఢీకొన్న స్కూల్ బస్సు

- ప్రమాద సమయంలో 40 మంది విద్యార్థులు.. పలువురికి స్వల్ప గాయాలు



విద్యుత్ స్తంభానికి ఢీకొన్న అనంతరం చెట్టుకు ఢీకొట్టి ఆగిపోయిన స్కూల్ బస్సు

కీసర: ఓ ప్రైవేటు పాఠశాల బస్సు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొడుతూ వెళ్లి ముందున్న చెట్టుకు ఢీకొని నిలిచిపోయింది. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 40 మంది విద్యార్థులున్నారు. వీరిలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం ఉదయం కీసర మండలం కుందన్‌పల్లి చౌరస్తా సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం.. చీర్యాల చౌరస్తాలోని ఓ ప్రైవేటు స్కూల్ బస్సు రోజు మాదిరిగానే కీసర, కీసరదాయర, రాంపల్లి దాయర, గోధుమకుంట, కుందన్‌పల్లిల నుంచి విద్యార్థులను తీసుకుని వస్తోంది. ఈక్రమంలో కుందన్‌పల్లి చౌరస్తా సమీపంలో ఎదురుగా వచ్చిన కారును తప్పించడానికి డ్రైవర్ బస్సును పక్కకు తిప్పాడు. వేగంతో బస్సు అదుపు తప్పి పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని కొట్టింది. స్తంభం విరిగి కింద పడిపోయింది. ఆ ధాటికి మరో రెండు విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగాయి. కరెంటు తీగలు బస్సుపై పడిపోయాయి. ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. బస్సు అదే వేగంతో చెట్టును ఢీకొట్టి నిలిచిపోయింది. కాగా.. రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బస్సు ఢీకొని ఉంటే పెను ప్రమాదమే సంభవించేది. ప్రమాద సమయంలో బస్సులో 40 మంది విద్యార్థులున్నారు. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ రాజు బస్సును అక్కడే వదిలేసి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. స్థానికంగా ఉన్న ప్రజలు, అటుగా వెళ్తున్న వాహనదారులు విద్యార్థులను బస్సులోంచి బయటకు దింపారు. విషయం తెలిసిన వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకు గురయ్యారు. తమ పిల్లలను వాహనాల్లో ఇళ్లకు తీసుకెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.



ఘటనా స్థలం వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు



ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి పెట్టండి

అధికారులతో నగర మేయర్ విజయలక్ష్మి



లక్డీకాపూల్: ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా అధికారులు పని చేయాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో అడిషనల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, హెచ్‌ఓడీలతో ప్రజావాణి, మై జీహెచ్‌ఎంసీ యాప్, ట్విట్టర్, ఆన్‌లైన్ ఫిర్యాదుల పరిష్కారంపై నిర్వహించిన సమీక్షలో మేయర్ మాట్లాడారు. అధికారుల పనితీరుపై దిశానిర్దేశం చేశారు. ప్రజావాణిలో వస్తున్న ఫిర్యాదులను 15 రోజుల్లోగా పరిష్కరించాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం, జోనల్, సర్కిల్ స్థాయిలో ప్రజావాణిలో ఎక్కువగా టౌన్ ప్లానింగ్‌పై వస్తున్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, నళిని పద్మావతి, గీతా రాధిక, స్నేహ శబరీష్, సుభద్ర దేవి, సత్యనారాయణ, వేణుగోపాల్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, పంకజ, సరోజ, రఘు ప్రసాద్, అశోక్ సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ మెట్రోకు 'ఐజీబీసీ ప్లాటినం'



సాక్షి, సిటీబ్యూరో: దేశంలోనే మొదటిసారిగా హైదరాబాద్ మెట్రో రైల్ ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) ప్లాటినం-సర్టిఫైడ్ మెట్రో నెట్‌వర్క్‌గా గుర్తింపును పొందింది. ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్ నెట్‌వర్క్‌లోని మొత్తం 57 మెట్రో స్టేషన్లకు ప్రతిష్ఠాత్మకమైన ఐజీబీసీ గ్రీన్ ఎగ్జిస్టింగ్ ఎమ్మార్టీఎస్ ప్లాటినం సర్టిఫికేషన్ సాధించినట్లు ఎల్‌అండ్‌టీ అధికారులు తెలిపారు. రెడ్, బ్లూ, గ్రీన్ లైన్ కారిడార్‌లలోని స్టేషన్లన్నింటిలోకీ దేశంలోనే ఈ తరహా సర్టిఫికేషన్ పొందిన మొదటి సంస్థగా నిలిచినట్లు పేర్కొన్నారు. ఐజీబీసీ ఆధ్వర్యంలో ఇటీవల బెంగళూరులో జరిగిన గ్రీన్ బిల్డింగ్ కాంగ్రెస్ కార్యక్రమంలో ఈ సర్టిఫికెట్‌ను పొందినట్లు చెప్పారు.
ఈ సందర్భంగా ఎల్‌అండ్‌టీ మెట్రో ఎండీ, సీఈఓ కేవీబీ రెడ్డి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధీర్ చిప్లుంకర్ మాట్లాడుతూ.. 'నగరానికి పర్యావరణ అనుకూల, సమర్థ, నమ్మకమైన ప్రజా రవాణాను అందించాలనే మా నిబద్ధతను ఈ విజయం పునరుద్ఘాటిస్తుంది' అని హర్షం వెలిబుచ్చారు.

ఇదేం 'మోటో'?

సుమోటో పేరిట డాక్యుమెంట్లు కావాలంటున్న బల్దియా

- అడ్డగోలుగా నోటీసులు జారీ చేస్తున్న జీహెచ్‌ఎంసీ
- గగ్గోలు పెడుతున్న సామాన్య ప్రజలు



సాక్షి, సిటీబ్యూరో: 'తిమ్మిని బమ్మి చేసే సత్తా వారి సొంతం. వారు తల్చుకుంటే లక్షల రూపాయల ఆస్తి పన్ను వేలల్లోనే వస్తుంది. వందల్లో రావాల్సింది వేలల్లో కూడా అవుతుంది'.. జీహెచ్‌ఎంసీ బిల్‌కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ల గురించి సామాన్య జనానికి ఉన్న అభిప్రాయం ఇది. ఈ పరిస్థితిని నివారించేందుకే గతంలో ఆస్తిపన్ను అసెస్‌మెంట్ల కోసం ప్రజల ఇళ్ల వద్దకు ట్యాక్స్ సిబ్బంది వెళ్లవద్దని అప్పటి కమిషనర్ లోకేశ్‌కుమార్ ఆదేశించారు. ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ అసెస్‌మెంట్ చేసుకోవాల్సిందిగా ప్రజలకు సూచించారు. ఆ విధానం వల్ల ఏ డాక్యుమెంట్లు పెట్టినా ఆస్తిపన్ను గుర్తింపు నంబరు(పీటీఐఎన్) జనరేట్ కావడంతో పాటు చివరకు జీహెచ్‌ఎంసీ భవనాలను సైతం ఎవరైనా తమ ఆస్తిగా చూపించుకునే అవకాశం ఏర్పడటంతో దానికి స్వస్తి పలికారు. మరోవైపు.. జీహెచ్‌ఎంసీకి వస్తున్న ఆదాయానికి, ఖర్చులకు హస్తిమశకాంతరం వ్యత్యాసం ఉండటంతో.. ఆదాయం పెంచుకునే చర్యల్లో భాగంగా తిరిగి అసెస్‌మెంట్‌ను ట్యాక్స్ సిబ్బంది 'సుమోటో'గానే చేసేందుకు గత జూలైలో ఆదేశించారు. దీంతో ఎంతో కాలం చేతులు కట్టిపడేసినట్లున్న ట్యాక్స్ సిబ్బందికి ఒక్కసారిగా వెయ్యేనుగుల బలం వచ్చినట్లయింది. ఇంకేముంది? అసెస్‌మెంట్ చేసుకోవాల్సిందిగా కొత్త భవనాల వద్దకు, అసెస్‌మెంట్లలో వ్యత్యాసాలున్నాయంటూ అన్ని భవనాల ప్రజల వద్దకు వెళ్తున్నారు. వారి వైఖరికి ఆసరానిస్తూ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు నోటీసులు జారీ చేస్తున్నారు.

చెప్పిందొకటి.. చేస్తున్నదొకటి
ఆస్తిపన్ను ద్వారా ఆదాయం పెంచుకునే చర్యల్లో భాగంగా.. తేడాలున్నట్లు గుర్తించిన వాణిజ్య భవనాలను, అదనపు అంతస్తులు వెలసిన ఇతరత్రా భవనాలను గుర్తించి నిజమైన ఆస్తి పన్ను విధించాల్సిందిగా సంబంధిత ఉన్నతాధికారులు సూచించారు. ట్యాక్స్ సిబ్బంది మాత్రం నివాస, వాణిజ్య భవనం అన్న తేడా లేకుండా.. అదనపు అంతస్తులు నిర్మించినా, నిర్మించకున్నా జీహెచ్‌ఎంసీ చట్టంలోని సెక్షన్ 213 కింద నోటీసులిచ్చేస్తున్నారు. సదరు సెక్షన్ మేరకు సరైన ఆస్తిపన్ను నిర్ధారించేందుకు జీహెచ్‌ఎంసీ కోరిన వివరాల్ని భవన యజమానులు లేదా ఆక్యుపైయర్లు తెలియజేయాలి.

నోటీసులిలా..

భవనం లేదా స్థలం.. యజమానులు కానీ ఆక్యుపైయర్లు కానీ ఏడు రోజుల్లోగా దిగువ పత్రాలు, సమాచారం అందజేయాలని నోటీసుల్లో పేర్కొంటున్నారు.

1. సేల్ డీడ్
2. లింక్ డాక్యుమెంట్ (ఏదైనా ఉంటే)
3. మంజూరు ప్లాన్/అనుమతి కాపీ
4. ఎప్పటి నుంచి ఉంటున్నారు ?
5.ఆక్యుపెన్సీ సర్టిఫికెట్
6. టాక్స్ రసీదు
7. రిజిస్టర్డ్ లీజ్ డీడ్(ఏదైనా ఉంటే) లేదా రెంటల్ అగ్రిమెంట్
8. భవనం కలర్ ఫొటో

- దశాబ్దాల క్రితం నిర్మాణ అనుమతులు పొందిన వారిలో చాలామంది వద్ద పైన పేర్కొన్న డాక్యుమెంట్లన్నీ అందుబాటులో లేవు. కొన్ని భవనాలు చాలామంది చేతులు మారాయి. వాటన్నింటినీ ఇప్పుడెలా తేవాలో తెలియక వారు ఆందోళనకు గురవుతున్నారు.

లక్ష్యం ఒకటి.. పని మరొకటి

నిజమైన ఆస్తిపన్ను కట్టకుండా లక్షలు, కోట్ల రూపాయల వ్యాపారాలు చేస్తున్నవారి నుంచి సరైన ఆస్తిపన్ను వసూలు చేయడం, ఇప్పటికే ఉన్న భవనాల మీద కొత్తగా నిర్మించిన అదనపు అంతస్తులను ఆస్తి పన్ను పరిధిలోకి తేవడం ద్వారా ఆస్తి పన్ను ఆదాయం పెంచుకోవాలనేది ఉన్నతాధికారుల లక్ష్యం. దీంతోపాటు దశాబ్దం క్రితం జరిగిన కంప్యూటరీకరణ సందర్భంగా చాలా ఇళ్ల ప్లింత్ ఏరియా ఎంత ఉందో నమోదు చేయలేదు. అలాంటి వాటి ప్లింత్ ఏరియాను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు వివరాలు సేకరించాల్సి ఉండగా.. అన్ని ఇళ్లనూ ఒకే గాటన కట్టి నోటీసులిస్తూ సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో.. ఎక్కువ ఆస్తి పన్నును తక్కువ చేస్తామంటూ ట్యాక్స్ సిబ్బంది జేబులు నింపుకొంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. లేని పక్షంలో ఎక్కువ ఆస్తిపన్ను కట్టాలంటూ బెదరగొడుతున్నట్లు సమాచారం. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

50 కోట్లకు చేరారు!

ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ మహిళల సంఖ్య ఇది

- ఏడాదిలో 'జీరో' టికెట్ రూపేణా రూ.1,152 కోట్లు ఆదా
- గ్రేటర్ పరిధిలో 105 శాతం పెరిగిన ఆక్యుపెన్సీ
- రోజుకు సుమారు 14.70 లక్షల మంది మహిళల జర్నీ
- పురుషులు 6.80 లక్షల మంది మాత్రమే..

సాక్షి, సిటీబ్యూరో: సిటీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని వినియోగించుకున్న మహిళల సంఖ్య 50 కోట్లకు చేరింది. గృహిణులు సహా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, విద్యార్థినులు తదితర రంగాల్లో పని చేసే చిరుద్యోగినులు, ఐటీ కారిడార్‌లలో పని చేసే హౌస్‌కీపింగ్ సిబ్బంది వంటి వివిధ కేటగిరీలకు చెందిన మహిళలు ఆర్టీసీ ఉచిత ప్రయాణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న గ్రేటర్ ఆర్టీసీకి వెన్నుదన్నుగా నిలిచారు. ఆర్టీసీ ఆక్యుపెన్సీని రెట్టింపు చేశారు. ఉచిత ప్రయాణ సదుపాయం వల్ల మహిళా ప్రయాణికులకు ఇప్పటివరకు రూ.1,152 కోట్లు ఆదా అయింది. అదే సమయంలో 'జీరో' టికెట్ చార్జీలను ప్రభుత్వమే చెల్లిస్తుండటంతో ఆర్టీసీకి ఆదాయం పెరిగింది. గత సంవత్సరం డిసెంబర్ 7వ తేదీన 'మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. గతంలో 45 శాతం మహిళలు, 55 శాతం పురుషులు సిటీ బస్సుల్లో ప్రయాణం చేసేవారు. ఈ పథకం అమల్లోకి వచ్చినప్పటి నుంచి 70 శాతానికి పైగా మహిళలు, 30 శాతం పురుషులు సిటీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు.

ఆక్యుపెన్సీ అదరహో..
ప్రస్తుతం గ్రేటర్‌లోని 25 డిపోల పరిధిలో సుమారు 2,500 బస్సులు ప్రతి రోజు 7.67 లక్షల కిలోమీటర్లు తిరుగుతున్నాయి. రోజుకు 21.50 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. వీరిలో 14.70 లక్షల మంది మహిళలే కావడం గమనార్హం. 6.80 లక్షల మంది మాత్రమే మగవారు ప్రయాణం చేస్తున్నారు. ఈ పథకాన్ని ప్రవేశపెట్టడానికి ముందు సిటీ బస్సుల్లో ఆక్యుపెన్సీ 65 నుంచి 70 శాతం వరకు ఉంటే ఇప్పుడు ఏకంగా 105 శాతానికి పెరిగింది. ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలే ఎక్కువగా ప్రయాణం చేస్తుండగా మగవారు మెట్రోడీలక్స్, ఏసీ బస్సుల్లో ఎక్కువగా ప్రయాణం చేస్తున్నారు. మెట్రో పాస్‌లపై రాకపోకలు సాగించిన విద్యార్థినులు సైతం ఉచిత పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. దీంతో 1.30 లక్షల బస్సు పాస్‌ల సంఖ్య 60 వేలకు తగ్గినట్లు అధికారులు చెప్పారు. అలాగే మహిళలు, ఎన్జీఓల పాస్‌లు కూడా సుమారు లక్ష వరకు తగ్గాయి.

చిరుద్యోగులకు భరోసా...
వస్త్ర దుకాణాలు షాపింగ్‌మాళ్లు, సూపర్ మార్కెట్లు, మెడికల్ షాపులు, ఐటీ సంస్థలు తదితర ప్రైవేట్ రంగాల్లో పనిచేసే మహిళలకు ఆర్థికంగా ఈ పథకం భరోసా ఇచ్చింది. ప్రతి నెలా సుమారు రూ.3500 వరకు చార్జీల రూపంలో చెల్లించే మహిళలు ఇప్పుడు ఆ డబ్బులను ఇతర అవసరాలకు వినియోగించుకుంటున్నారు. 'ఇంటి కిరాయిలు, కూరగాయల ధరలు, నిత్యావసరవ వస్తువుల ధరలు భారీగా పెరిగిన ప్రస్తుత పరిస్థితుల్లో ఈ భారం తగ్గడం కొద్దిగా ఊరటే కదా' అని అశోక్‌నగర్‌కు చెందిన సునీత అనే ప్రయాణికురాలు అభిప్రాయపడ్డారు.



మెట్రోపై ప్రభావం..
మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయంతో గ్రేటర్‌లో ఆటోలు, సెవెన్ సీటర్ ఆటోలు ఎక్కువగా ప్రభావితమయ్యాయి. నిర్మాణ రంగానికి చెందిన కూలీలు, చిరుద్యోగులు, శివారు ప్రాంతాల నుంచి నగరంలోకి రాకపోకలు సాగించేవారు ఆటోలను ఎక్కువగా వినియోగించేవారు. ప్రస్తుతం ఆ ప్రయాణికులంతా ఆర్టీసీ వైపు మళ్లారు. అలాగే మెట్రోల్లోనూ ప్రయాణించే మహిళల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం ప్రతిరోజూ 4.8 లక్షల మంది వరకు మెట్రోల్లో ప్రయాణం చేస్తున్నారు. ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన తర్వాత కనీసం 10 శాతం మంది మహిళలు ఆర్టీసీ బస్సులను ఆశ్రయించినట్లు మెట్రో అధికారుల అంచనా. మొత్తంగా ఇతర రవాణా సదుపాయాల నుంచి సుమారు 6 లక్షల మందికి పైగా మహిళలు ఆర్టీసీ బస్సుల వైపు మళ్లారు.

యాంటీ బయాటిక్స్

అతిగా వినియోగిస్తే అనర్థమే

గాంధీఆస్పత్రి: యాంటీ బయాటిక్స్ మాత్రలు అతిగా వినియోగిస్తే అనర్థమేనని, రోగ నిరోధక శక్తి తగ్గి మరిన్ని రుగ్మతలకు కారణమవుతుందని వైద్య నిపుణులు హెచ్చరించారు. గాంధీ మెడికల్ కాలేజీ మైక్రో బయోలజీ విభాగం ఆధ్వర్యంలో వరల్డ్ యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ అవేర్‌నెస్ వీక్ సందర్భంగా గాంధీ ఆస్పత్రి, మెడికల్ కాలేజీల ప్రాంగణంలో మంగళవారం యాంటీబయాటిక్స్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి ముఖ్య అతిథులుగా మాట్లాడారు. వైద్యుల సలహా మేరకే యాంటిబయాటిక్స్ వినియోగించాలని సూచించారు. జ్వరం, దగ్గు, జలుబు వంటి సాధారణ రుగ్మతలకు మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసిన యాంటి బయాటిక్స్ ఇష్టానుసారంగా మోతాదుకు మించి వినియోగించడంతో రోగ నిరోధక శక్తి క్రమంగా సన్నగిల్లుతుందన్నారు. అదే సమయంలో సంబంధిత వైరస్ లేదా బ్యాక్టీరియాలు సదరు మందులకు అలవాటు పడి ఆయా మందులు పని చేయవని, వైద్యుల ప్రిస్క్రిప్షన్, సలహా మేరకు మాత్రమే యాంటీ బయాటిక్స్ వాడాలని సూచించారు. 'యూజ్ రైట్ డ్రగ్, రైట్ డోస్, రైట్ టైమ్' నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.
కార్యక్రమంలో మైక్రోబయోలజీ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ రవిశేఖరరావు, ఆర్‌ఎంఓ-1 శేషాద్రి, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ పూజ, ఎంపీహెచ్‌ఓ వేణుగోపాల్, వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న గాంధీ వైద్యులు, సిబ్బంది

జలమండలి ఓటీఎస్‌కు సమీపిస్తున్న గడువు



సాక్షి, సిటీబ్యూరో: జలమండలి పెండింగ్ బిల్లుల చెల్లింపునకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీం (ఓటీఎస్) గడువు ఈ నెల 30తో ముగియనుంది. ఓటీఎస్ సద్వినియోగం మాత్రం అంతంతగానే తయారైంది. దీంతో మొండి బకాయిల వసూళ్ల కోసం జలమండలి ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమైంది. క్షేత్రస్థాయి లైన్‌మెన్ల నుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు భాగస్వాములను చేస్తూ వినియోగదారుల పెండింగ్ బిల్లులు క్లియర్ చేసేలా జలమండలి చర్యలు చేపట్టింది. ప్రతి సర్కిల్ నుంచి సెక్షన్ వరకు టాప్- 20 వినియోగదారుల జాబితా తయారు చేసింది. సర్కిల్‌లో సీజీఎం, డివిజన్‌లో జీఎం. డీజీఎం, సెక్షన్ మేనేజర్లకు వసూళ్ల బాధ్యతలను అప్పగించింది. క్షేత్రస్థాయిలో లైన్లవారీగా రెగ్యులర్ మీటర్ రీడర్లు, కలెక్షన్ బృందాలను బిల్లుల వసూళ్లకు రంగంలోకి దింపింది. అయినప్పటికీ వసూళ్లు రూ.65 కోట్లకు మించలేదు. ఓటీఎస్ గడువు ఈ నెల 30వ తేదీ వరకు ఉండటంతో వినియోగదారులు బిల్లుల చెల్లింపునకు భారీగా ముందుకు వస్తారని జలమండలి ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

హైదరా'బాద్‌షా'

శరవేగంగా ప్రగతి పథంలో భాగ్యనగరం

స్థిరాస్తి రంగ వృద్ధిలో దేశంలోనే తొలి స్థానం

- ఆ తర్వాతే బెంగళూరు, ముంబై, ఢిల్లీ, అహ్మదాబాద్
- మెరుగైన సామాజిక, ఆర్థిక, మౌలిక వసతులు, పరిపాలన
- నైట్‌ఫ్రాంక్ 'ఇండియా ప్రైమ్ ఇండెక్స్' నివేదికలో వెల్లడి

విభాగాల వారీగా నగరాల ర్యాంక్‌లు

విభాగం	హైదరాబాద్	బెంగళూరు	ముంబై	ఢిల్లీ	అహ్మదాబాద్	చెన్నై
సామాజిక-ఆర్థిక సామర్థ్యం	2	1	3	5	6	4
రియల్ ఎస్టేట్	1	2	3	4	5	6
మౌలిక సదుపాయాలు	2	4	3	1	5	6
పరిపాలన	2	5	4	1	3	6

సాక్షి, సిటీబ్యూరో: దేశంలోనే అత్యంత శరవేగంగా అభివృద్ధి చెందుతున్న భాగ్యనగరం 'హైదరాబాద్ బాద్ షా' కిరీటాన్ని దక్కించుకుంది. సామాజిక, ఆర్థిక సామర్థ్యం, రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయాలు, పరిపాలన విభాగాల్లో నగరం మెరుగైన ప్రతిభను కనబరుస్తోంది. ఈమేరకు స్థిరాస్తి రంగం వృద్ధి, అవకాశాల్లో దేశంలోని మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్ ప్రథమ స్థానంలో నిలిచిందని నైట్‌ఫ్రాంక్ 'ఇండియా ప్రైమ్ సిటీ ఇండెక్స్' వెల్లడించింది.

మౌలిక వసతులు కీలకం..
దేశంలోని ఆరు మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఐటీ రంగానికి మించి ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ రంగాల వాటా కలిగి ఉండటం నగరానికి అదనపు ప్రయోజనం. దీంతో నగర ఆర్థిక స్థిరత్వం, వృద్ధి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు స్థిరాస్తి రంగంలో డిమాండ్ ఏర్పడింది. వీటికి తోడు విశాలమైన రోడ్లు, అండర్‌పాస్‌లు, రింగ్ రోడ్లు, మెట్రోలతో ప్రణాళికాబద్ధమైన రవాణా నెట్‌వర్క్ ఉండటంతో గృహాలకు డిమాండ్ మరింత పెరిగింది. గతేడాది గృహాల అమ్మకాలు 6 శాతం మేర పెరిగాయి. ప్రతిపాదిత మెట్రో రైలు విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్‌లతో శివారు ప్రాంతాల్లోనూ రియల్ ఊపందుకుంది. హైదరాబాద్‌లో సంపన్న వర్గాల జనాభా కూడా ఎక్కువే. దేశంలోని అత్యధిక సంపన్న నివాసితుల్లో నగరం మూడో స్థానంలో ఉంది. ఇక్కడ 37,467 మంది సంపన్న జనాభా ఉంది. సమర్థ పరిపాలన, విధానాల అమలు, పట్టణాభివృద్ధి ప్రణాళికల అమలు వంటి కారణాలతో రియల్ ఎస్టేట్ అభివృద్ధితో నగరం దూసుకెళ్తోంది.

వెస్ట్‌లోనే ఎక్కువ..
తుది వినియోగదారులు, పెట్టుబడిదారులకు నగరానికి అత్యంత ప్రాధాన్యముంది. గతేడాది నగరంలో గృహాల ధరలు 11 శాతం పెరిగాయి. ముంబైలో 7 శాతం, బెంగళూరులో 9 శాతం వృద్ధి చెందాయి. స్థిరమైన డిమాండ్, నివాస ధరల వృద్ధిలో హైదరాబాద్‌లో ప్రాజెక్ట్ లాచింగ్స్ జోరుగా సాగుతున్నాయి. కోకాపేట, నార్సింగి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి పశ్చిమ హైదరాబాద్‌లో ఎక్కువగా లాంచింగ్స్ జరుగుతున్నాయి. ఈ విభాగం వాటా 63 శాతంగా ఉంది. ఏటా నగరంలో తలసరి ఆదాయం 19.3 శాతం వృద్ధి చెందుతుంది. నాణ్యమైన జీవన శైలి, రియల్ ఎస్టేట్, హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (హెచ్‌ఎన్‌ఐ)లు హైదరాబాద్ అభివృద్ధికి ప్రధాన కారణం. విద్య, ఆరోగ్యం, విదేశీ పెట్టుబడులు, గిడ్డంగులు నగరంలో అపారమైన వ్యాపార అవకాశాలున్నాయి.

ఒక్కో నగరం.. ఒక్కో తీరు..
జనాభా, భౌగోళిక, పారిశ్రామిక సమ్మేళనాలున్న భారత్‌లో ఒక్కో మెట్రో నగరం ఒక్కో తీరులో అభివృద్ధి చెందింది. సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా పిలిచే బెంగళూరు దేశీయ ఐటీ విప్లవంలో ముందంజలో ఉంది. ఫార్మాస్యూటికల్స్, బయో టెక్నాలజీ రంగంలో తన ముద్రతో హైదరాబాద్ నాలెడ్జ్ హబ్‌గా అవతరించింది. ఆర్థిక రాజధాని ముంబై దేశ ఆర్థిక శక్తికి కేంద్రంగా కొనసాగుతుంటే.. ఢిల్లీ-ఎన్‌సీఆర్ రాజకీయ, పరిపాలన కేంద్రంగా ఒక ప్రధాన వినియోగదారు మార్కెట్‌గా ఉద్భవించింది. ఆటోమేటివ్, తయారీ రంగంలో ప్రధానమైన పారిశ్రామిక మహా నగరంగా చెన్నై, అహ్మదాబాద్‌లో వేగవంతమైన పారిశ్రామికీకరణ, పట్టణ అభివృద్ధిని సూచిస్తోంది.



సొంత ఖాతా వాడలేదు!

- మనీమ్యూల్స్ సహాయమూ తీసుకోలేదు
- ఏటీఎం వినియోగదారుల ద్వారా వసూళ్లు
- తనదైన పంథా అనుసరించిన ఎం.బాలాజీ
- 'ఐ ఫోన్ల' కేసులో జైలుకు వెళ్లింది ఇతగాడే
- కస్టడీకి తీసుకోవాలని పోలీసుల నిర్ణయం

సాక్షి, సిటీబ్యూరో: ఓఎల్ఎక్స్ యాప్‌లో ఉన్న ఐ ఫోన్లే పెట్టుబడిగా, కొంటాను–అమ్ముతానంటూ కథలు చెప్పి... తెలుగు రాష్ట్రాల్లోని 200 మంది నుంచి రూ.60 లక్షలు కాజేసిన బీటెక్ గ్రాడ్యుయేట్ మరిశర్ల బాలాజీ నాయుడు బాధితుల నుంచి డబ్బు వసూలుకు తనదైన పంథా అనుసరించాడు. ఎవరికంటికీ కనిపించకుండా ఇంత మందిని కొల్లగొట్టిన అతగాడు ఏ ఒక్క సందర్భంలోనూ తన బ్యాంక్ ఖాతానో, మనీమ్యూల్స్‌కు చెందినదో వాడలేదు. కేవలం ఏటీఎం, క్యాష్ డిపాజిట్ మెషిన్ కేంద్రాల వద్దకు వచ్చిన వినియోగదారులను దీనికోసం వాడుకున్నాడు. బాలాజీ విచారణలో ఈ విషయం గుర్తించిన పంజగుట్ట పోలీసులు అవాక్కయ్యారు.

అసలు సమయంలో ఆ కేంద్రాల వద్దకు...

సెకండ్ హ్యాండ్ ఐ ఫోన్లు విక్రయించడానికి ఓఎల్ఎక్స్‌లో పోస్టు చేసిన వారితో మాట్లాడి, తాను కొంటానంటూ డిలీట్ చేయించి... అవే వివరాలు తాను పోస్టు చేయడం ఇతడి నైజం అనే విషయం తెలిసిందే. వీటిని చూసి ఆకర్షితులైన వారితో బేరసారాల తర్వాత అసలు యజమానికి సంప్రదించే బాలాజీ ఆపై అసలు కథ ప్రారంభిస్తాడు. రకరకాల కారణాలు చెప్పి ఓ నిర్దిష్ట సమయంలో వాళ్లిద్దరూ ఓ ప్రాంతానికి వచ్చేలా చేసి వారితో ఫోన్ ద్వారా టచ్‌లో ఉంటాడు. సరిగ్గా అదే సమయానికి బాలాజీ సైతం తనకు సమీపంలో ఉన్న ఏటీఎం, క్యాష్ డిపాజిట్ మెషిన్ కేంద్రానికి చేరుకుంటాడు. అక్కడకు వచ్చే వినియోగదారులతో సాంకేతిక కారణాల నేపథ్యంలో తన ఏటీఎం కార్డు పని చేయట్లేదని చెప్తాడు. తనకు బంధువుల నుంచి డబ్బు రావాల్సి ఉందని, ఆ మొత్తాన్ని మీకు బదిలీ చేయిస్తానంటాడు. బాధితులకు ఫోన్ చేసి ఆ వినియోగదారుల నెంబర్ చెప్పి డబ్బు వారికి పంపేలా చేస్తాడు. ఆపై వారితోనే డ్రా చేయించి రూ.100 నుంచి రూ.500 వరకు వారికి ఇచ్చి మిగిలింది తీసుకుని ఉడాయిస్తాడు.

సిమ్‌కార్డులు మాత్రం అతడి పేరుతోనే...

ఈ కారణంగానే కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు అనేక మంది ఏటీఎం వినియోగదారులను అనుమానించి, వారిని ప్రశ్నించాల్సి వచ్చింది. బ్యాంకు ఖాతాల విషయంలో ఇన్ని జాగ్రత్తలు తీసుకునే బాలాజీ సిమ్‌కార్డుల్ని మాత్రం తన పేరుతోనే తీసుకునేవాడు. తిరుపతి చిరునామాతో ఉన్న ఆధార్ కార్డు వినియోగించి ఇవి పొందాడు. ఆ అడ్రస్‌కు తాను వెళ్లనని, పోలీసులు వెళ్లినా తన వివరాలు దొరకవనే అలా చేసినట్లు పోలీసుల ఎదుట అంగీకరించాడు. బాలాజీని సోమవారం అరెస్టు చేసిన పంజగుట్ట పోలీసులు కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. తదుపరి విచారణ నిమిత్తం న్యాయస్థానం అనుమతితో కస్టడీలోకి తీసుకోవడానికి సన్నాహాలు చేస్తున్నారు. మరో పక్క ఇతగాడిపై నగరంలోని వివిధ ఠాణాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లో అనేక పోలీసుస్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయి. దీంతో బాలాజీ అరెస్టుపై ఆయా పోలీసులకు సమాచారం ఇవ్వాలని పంజగుట్ట పోలీసులు నిర్ణయించారు.

యాసీన్ భత్కల్.. మదర్ సెంటిమెంట్!

దేశ వ్యాప్తంగా అనేక విధ్వంసాలకు సూత్రధారి

- వీటిలో 62 మంది మరణానికి కారణం ఇతడే
- 2013లో అరెస్టు..అప్పటి నుంచి జైలు జీవితం
- కుటుంబీకులతోనూ మాట్లాడని ఈ గజ ఉగ్రవాది
- తల్లికి అనారోగ్యం కారణం చూపి పెరోల్ దరఖాస్తు
- కేవలం వీడియో కాల్‌కు మాత్రమే కోర్టు అనుమతి
- ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న ఐఎం కో–ఫౌండర్



సాక్షి, సిటీబ్యూరో: అతడి పేరు యాసీన్ భత్కల్... నిషేధిత ఉగ్రవాద సంస్థ ఇండియన్ ముజాహిదీన్ (ఐఎం) కో–ఫౌండర్... 2013 దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల సహా దేశ వ్యాప్తంగా పలు విధ్వంసాలకు కీలక సూత్రధారి... ఈ దుశ్చర్యలతో 62 మందిని పొట్టన పెట్టుకున్న గజ ఉగ్రవాది... 11 ఏళ్లుగా కారాగారవాసం చేస్తున్న ఇతగాడు ఇప్పటి వరకు కుటుంబీకులతో కనీసం మాట్లాడటానికీ ఆసక్తి చూపలేదు. ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్న యాసీన్.. తాజాగా తన తల్లిని కలవడానికి ఒక రోజు పెరోల్ కోరితే... న్యాయస్థానం వీడియో కాల్‌కు మాత్రమే అంగీకరించింది.

ఐదు విధ్వంసాలకు సూత్రధారి...

కర్ణాటకలోని భత్కల్ ప్రాంతానికి చెందిన సయ్యద్ మహ్మద్ అహ్మద్ జరార్ సిద్దిబప్ప ఐఎం వ్యవస్థాపకుల్లో ఒకడైన రియాజ్ భత్కల్ (2007 జంట పేలుళ్ల కేసు నిందితుడు) సోదరుడు. పదో తరగతి ఫెయిల్ కావడంతో 2005లో దుబాయ్ వెళ్లిన యాసీన్ 2007 నుంచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. 2008లో జరిగిన ఢిల్లీ బాట్లా హౌస్ ఎన్‌కౌంటర్ తర్వాత రియాజ్ తన మరో సోదరుడు ఇక్బాల్ భత్కల్‌తో కలిసి దేశం దాటేశాడు. దీంతో ఐఎం కో–ఫౌండర్‌గా మారిన యాసీన్ నేపాల్‌లోని పోఖారాలో యునానీ డాక్టర్ షారూఖ్ ముసుగులో తలదాచుకున్నాడు. అక్కడ ఉంటూనే రహస్యంగా దేశంలోకి రాకపోకలు సాగిస్తూ 2010, 2012ల్లో పుణే, 2010లో బెంగళూరు స్టేడియం, 2011లో ముంబై, 2013లో హైదరాబాద్‌ల్లో పేలుళ్లు చేయించాడు. వీటిలో 62 మంది మృత్యువాత పడగా... వందల మంది క్షతగాత్రులయ్యారు.

ఇండో–నేపాల్ సరిహద్దుల్లో పట్టివేత...

నగరంలోని దిల్‌సుఖ్‌నగర్‌లో ఉన్న 107 బస్టాప్, ఏ1 మిర్చి సెంటర్ పేలుళ్ల తర్వాత యాసీన్ గ్యాంగ్ అరెస్టు కోసం దేశంలోని అన్ని ఏజెన్సీలు రంగంలోకి దిగాయి. కేంద్ర నిఘా వర్గాలు నేపాల్‌లో భారీ ఆపరేషన్ చేపట్టి ఎట్టకేలకు 2013 ఆగస్టు 28న పట్టుకున్నారు. బీహార్ సరిహద్దుల్లోనే రక్సోల్ వద్ద అరెస్టు చేసినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు ప్రకటించారు. తొలుత హైదరాబాద్ పేలుళ్ల కేసులో యాసీన్ మాడ్యూల్‌ను ఎన్ఐఏ స్పెషల్ కోర్టు విచారించింది. ఈ కేసులో ఇతడికి ఉరి శిక్ష విధించింది. అప్పట్లో యాసీన్ చాలా కాలం చర్లపల్లి జైలులో ఉన్నాడు. ఆపై మిగిలిన కేసుల్లో విచారణ కోసం ఆయా రాష్ట్రాలు ట్రాన్సిట్ వారెంట్‌పై తీసుకువెళ్లాయి. ప్రస్తుతం ఇతగాడు ఢిల్లీలోని తీహార్ జైల్లో కట్టుదిట్టమైన భద్రత మధ్య ఖైదీగా ఉన్నాడు. ఎస్కేప్‌కు ప్లాన్ చేసినట్లు నిఘా వర్గాలు గతంలో గుర్తించాయి.

ఇప్పటి వరకు మాటలు సైతం లేకుండా...

యాసీన్‌కు తల్లిదండ్రులు జరార్ సిద్ధిబప్ప, రెహానా సిద్ధిబప్పలతో పాటు భార్య జాహెదా ఇర్షన్ ఖాన్, పిల్లలు ఉన్నారు. ఈ గజ ఉగ్రవాది ఇప్పటి వరకు కుటుంబీకులతో కనీసం మాట్లాడను కూడా లేదు. వాళ్లు ములాఖత్‌లో కలవడానికి వచ్చినా ఇతగాడు అంగీకరించలేదు. ఇతగాడికి ఇప్పుడు సడన్‌గా మదర్ సెంటిమెంట్ పుట్టుకు వచ్చింది. అనారోగ్యంతో ఉన్న తల్లిని కలవడానికి ఒక రోజు ఎస్కార్ట్ పెరోల్ ఇవ్వాల్సిందిగా కోరుతూ ఢిల్లీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై జైలు అధికారులు అభ్యంతరం తెలిపారు. దాదాపు 2 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న భత్కల్ వరకు యాసీన్‌ను తీసుకువెళ్లి, సురక్షితంగా వెనక్కు తీసుకురావడం పెను సవాల్ అంటూ కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు.



భత్కల్ కుటుంబీకుల నివాసం

వీడియో కాల్‌కు అనుమతించిన కోర్టు...

దీంతో పెరోల్ పిటిషన్‌ను ఢిల్లీ న్యాయస్థానం తిరస్కరించింది. అనారోగ్యంతో ఉన్న తల్లి రెహానాతో వీడియో కాల్ ద్వారా మాట్లాడటానికి మాత్రం అనుమతించింది. అయితే దీనికి కొన్ని షరతులు విధించింది. కేవలం జైలు అధికారులు ఇచ్చిన ఫోన్ మాత్రమే వినియోగించాలని స్పష్టం చేసింది. దీంతో తీహార్ జైలు అధికారులు ఆదివారం వీడియో కాల్ ద్వారా యాసీన్‌ను తన తల్లి రెహానాతో మాట్లాడించారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం... కత్బుల్లాపూర్ వాసి దుర్మరణం



సందీప్‌కుమార్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..కుత్బుల్లాపూర్ పద్మానగర్ ఫేజ్–2 కు చెందిన ఉషా ఫ్యాన్స్ కంపెనీ రిటైర్డ్ ఉద్యోగి రామ్‌ఆశిష్‌సింగ్ కుమారుడు సందీప్‌కుమార్ యాదవ్ అమెరికాలోని ఓహియా రాష్ట్రం మౌంట్ గిలిడ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. దీంతో బుధవారం పద్మానగర్ ఫేజ్–2లో విషాథచాయలు అలుముకున్నాయి..

ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ

సాక్షి, సిటీబ్యూరో: ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం కోసం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసినట్లు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ప్యారడైజ్ జంక్షన్ నుండి శామీర్ పేట్ ఓఆర్ఆర్ జంక్షన్ (ఎస్‌హెచ్–01) వరకు, ప్యారడైజ్ జంక్షన్ నుండి డైరీ ఫామ్ (ఎన్‌హెచ్– 44) వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ కోసం భూసేకరణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిప్యూటీ కలెక్టర్లు, సబ్ రిజిస్ట్రార్లు, సర్వేయర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన రెవెన్యూ గ్రామాల వారీగా భూసేకరణపై సమీక్షించారు. భూసేకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, డీఆర్ఓ వెంకటాచారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, సబ్ రిజిస్ట్రార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

మ్యూజియంలో భువనగిరి ఫోర్ట్‌పై ఫొటో ఎగ్జిబిషన్

చార్మినార్: వరల్డ్ హెరిటేజ్ వీక్ సందర్భంగా సాలార్‌జంగ్ మ్యూజియంలో భువనగిరి ఫోర్ట్‌పై మంగళవారం ప్రత్యేక ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. సృష్టి ఫౌండేషన్, సాలార్‌జంగ్ మ్యూజియం సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌ను ఇంటాక్ కన్వీనర్ అనురాధారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తదితరులు హాజరై ప్రారంభించారు. అనంతరం ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఘన్‌శ్యాం కుసుం, ఆర్బీ నాయక్, మురళీధరన్, రమేష్ కుమార్, సజ్జన్ సింగ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న అనురాధారెడ్డి, మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

హెచ్‌యూజే సభ్యత్వ నమోదు ప్రారంభం

లక్డీకాపూల్: హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (టీడబ్ల్యూజేఎఫ్ అనుబంధం) సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హెచ్‌యూజే అధ్యక్షుడు బి.అరుణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున జర్నలిస్టులు హెచ్‌యూజే సభ్యత్వం స్వీకరించారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ ఉపాధ్యక్షుడు పిల్లి రాంచందర్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు చంద్రశేఖర్, రాధిక, నాయకులు రాజశేఖర్. నవీన్, పద్మరాజు, నాగవాణి, ప్రశాంత్, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు ఇవ్వాలంటూ మూసీ గుడిసె వాసుల వినతి



చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మూసీ గుడిసెవాసులు

లక్డీకాపూల్: మూసీ నది సుందరీకరణ సరే..మా సంగతేంటంటూ శివాజీ బ్రిడ్జి, అఫ్జల్‌గంజ్ గుడిసె వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళనతో గూడు కోల్పోతున్న ర్యాక్ పిక్కర్స్‌కు న్యాయం చేయాలని కోరుతూ ప్రజావాణిలో వినతి పత్రాన్ని అందించారు. మంగళవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డి వద్ద మూసీ గుడిసెవాసులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. గత 30 సంవత్సరాలకు పైగా మూసీనది ఒడ్డున శివాజీ బ్రిడ్జి కింద గుడిసెలు వేసుకొని 150 కుటుంబాలు నివశిస్తున్నాయన్నారు. ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని చెత్త ఏరుకుంటూ జీవిస్తున్నామన్నారు. తమకు గూడు కల్పించాలని కోరారు. దీనిపై ప్రభుత్వం స్పందించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన మాట్ విజ్ఞప్తి చేశారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల హర్షం

రాష్ట్రంలో గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 13.86 కోట్లు మంగళవారం విడుదల చేసింది. దీంతో గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. తమకు నిధులు కేటాయించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డికి పుష్ప గుచ్ఛం ఇచ్చి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నారుల సమగ్ర వికాసానికి గ్రంథాలయాలు అవసరం



అతిథులను సత్కరిస్తున్న వేదకుమార్

సాక్షి, సిటీబ్యూరో: చిన్నారుల్లో సృజనాత్మకతను, జ్ఞానాన్ని పెంచేందుకు గ్రంథాలయాలు ఎంతో దోహదం చేస్తాయని 'బాల చెలిమి' పత్రిక సంపాదకులు, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ చైర్మన్ మణికొండ వేదకుమార్ అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం అఫ్జల్‌గంజ్‌లోని రాష్ట్ర కేంద్రగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లలు ఆటలు, పఠనానికి దూరమవుతున్నారని, వారిలో పఠనాసక్తిని పెంపొందించేందుకు పిల్లల గ్రంథాలయాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం పౌరసమాజం ముందుకు రావాలని కోరారు. గ్రంథాలయాలు కేవలం చదువుకోవాడినికే కాదని, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి అవసరమని చెప్పారు. ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ, కేంద్ర గ్రంథాలయం సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో చిల్డ్రన్స్ ఫైన్ ఆర్ట్స్ డైరెక్టర్ అతికా అహ్మద్, మహిళా విశ్వవిద్యాలయం అధ్యాపకులు డాక్టర్ రోహిణి, రచయిత్రి కన్నెగంటి అనసూయ, కప్పర కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మధుమేహ నివారణకు 'బైద్యనాథ్ చవ్వన్ ఫిట్'

సాక్షి, సిటీబ్యూరో: బైద్యనాథ్ వారి 'చవ్వన్ ఫిట్' షుగర్ ఫ్రీ ఔషధ డయాబెటిక్ రోగులకు ఎంతో ఉపకరిస్తుందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చ్యవన్‌ఫిట్ ఔషధం పురుషులు, మహిళల్లో రోగనిరోధక శక్తిని పెంపొందించడంతోపాటు షుగర్‌ను నియంత్రిస్తుందని పేర్కొన్నారు. పలు పరిశోధనల అనంతరం బైద్యనాథ్ ఫౌండేషన్ బిల్వ, దాస్‌మూల్ వంటి ఆయుర్వేద మూలికలతో ఈ ఔషధాలను తయారు చేసిందని తెలిపారు.

చిన్నారుల్లో సృజనాత్మకత పెంపొందించాలి



సభలో మాట్లాడుతున్న సుద్దాల అశోక్ తేజ

ఇబ్రహీంపట్నం రూరల్: చిన్నారుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచన పెంచే దిశగా పని చేయాలని ప్రముఖ కవి, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ అభిప్రాయపడ్డారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని భారత్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం తెలంగాణ బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో సుద్దాల అశోక్‌తేజ రాసిన ఘల్లుఘల్లు అనే పాటను ప్రముఖ రచయిత నందిని సిద్దారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ.. విష సంస్కృతి, సామ్రాజ్యవాద వినిమయ విలువల నేపథ్యంలో మానవీయ విలువలు కనుమరుగవుతున్నాయని అన్నారు. కులమత, మూఢత్వం పేరుతో దాడులు పెరుగుతున్నాయని తెలిపారు. చిన్నారుల ఆలోచనలను విషపూరితం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రముఖ రచయిత నందిని సిద్దారెడ్డి మాట్లాడుతూ.. బాలల్ని అభ్యుదయం దిశగా ప్రోత్సహించాలని అన్నారు. బాలోత్సవం కార్యదర్శి సోమన్న మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా వందలాది మంది పాఠశాల విద్యార్థులతో వేలాది మంది బాలబాలికలతో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థుల్లో సైంటిఫిక్ టెంపర్, సరికొత్త ఆలోచనల్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భారత్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్ వేణుగోపాల్‌రెడ్డి, బాలోత్సవ కమిటీ బాధ్యుడు బుచ్చిరెడ్డి, జనవిజ్ఞాన వేదిక నాయకులు రమేష్, భాస్కర్, భూదేవి, శ్రీకాంత్, యశోకృష్ణ పాల్గొన్నారు.

కళాకారులను గౌరవించడం మన బాధ్యత

- సీపీ సీవీ ఆనంద్



కార్యక్రమంలో మాట్లాడుతున్న నగర సీపీ సీవీఆనంద్

రాయదుర్గం: కళాకారుల నైపుణ్యాన్ని గుర్తించి వారిని గౌరవించడం ఎంతైనా అవసరమని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని 'టీహబ్' లో తెలంగాణ ఆర్టిస్ట్ అసోసియేషన్ (టీఏఏ) ఆధ్వర్యంలో వివిధ రంగాలకు చెందిన కళాకారులకు ఆయన అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ తెర వెనుక అన్ని రంగాలలో పనిచేసే కళాకారుల కష్టాన్ని గుర్తించి వారికి అవార్డులు అందించడం అభినందనీయమన్నారు. సినిమా, ఇతర రంగాలలో తెర వెనుక పనిచేసే వారికి ఎవరూ ఆశించిన స్థాయిలో గుర్తింపు రాదని, వారికి అవార్డులు అందించి ప్రోత్సహిస్తే మంచిదన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, టీఎంఆర్ఈఐఎస్ అధ్యక్షుడు ఎండీ ఫాహీమ్ ఖురేషి, పద్మశ్రీ ఖాదర్ అలీబేగ్ వంటి ప్రముఖులు, తెలంగాణ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా ది టామ్ కల్చెస్ వ్యవస్థాపకుడు మాలా పాషా, ప్రోగ్రామింగ్ ఆర్ట్స్ కేటగిరిలో ఇక్బాల్ పట్నీ, ఎంటర్‌ప్రెన్యూర్ సుధీర్ షా, ఫ్యాషన్ డిజైనర్ అస్మితా మార్వా తదితరులు అవార్డులు అందుకున్నారు.

లబ్ధిదారులకు సబ్సిడీ త్వరగా అందించాలి: కలెక్టర్

సాక్షి, సిటీబ్యూరో: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులకు వివిధ శాఖల ద్వారా అందించిన వాహనాలకు సంబంధించిన సబ్సిడీని వెంటనే విడుదల చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో టీజీ ప్రైడ్ స్కీమ్ కింద ట్రాన్స్‌పోర్టు, ప్యాసింజర్, గూడ్స్ వాహనాలకు సంబంధించిన సబ్సిడీపై శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుండి సబ్సిడీ అందగానే వెంటనే లబ్దిదారులకు చెల్లించాలని సూచించారు. యువత అభిరుచి మేరకు వివిధ పారిశ్రామిక రంగాల్లో శిక్షణ అందించి వారి ఆర్థిక బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం పవన్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్, డీటీడబ్ల్యూఓ కోటాజీ, ఎల్డీఎం సుబ్రహ్మణ్యం, ఐపిఓ హేమ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినూత్నంగా ఫ్రీడమ్ ఆయిల్ క్యాంపెయినింగ్

సాక్షి, సిటీబ్యూరో: ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్ కంపెనీ వారు తమ ఉత్పత్తుల నాణ్యత గురించి ప్రజలకు వివరించేందుకు వినూత్న పద్ధతుల్లో ప్రచారం చేస్తున్నారు. తాజాగా 'కోర్టు రూమ్' క్యాంపెయిన్ పేరిట కొత్త ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. ఈ యాడ్‌లో నటులు యష్, రాధికలు పాల్గొన్నారు. ఫ్రీడం నూనెలోని స్వచ్ఛతను చాటిచెప్పడమే లక్ష్యంగా ఈ ప్రచారాన్ని ప్రారంభించామని జెమినీ ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ సేల్స్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ప్రజలకు అత్యుత్తమమైన నూనెలను అందించడమే లక్ష్యంగా నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్నామని ఆయన అన్నారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నేడు సంతకాల సేకరణ


నిరసన తెలుపుతున్న అంబేద్కర్ వర్సిటీ ఉద్యోగులు

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పదెకరాల స్థలం జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యోగులు మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసనను కొనసాగించారు. ప్రభుత్వం తన ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐక్య కార్యాచరణ సమితి చైర్‌పర్సన్ పల్లవీ కాబ్దే, కన్వీనర్ వడ్డాణం శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ వేణుగోపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా బుధవారం ఉద్యోగుల సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు ఎల్వీకే రెడ్డి, బానోత్ ధర్మ, కాంతం ప్రేమ్‌కుమార్, రాఘవేంద్ర, రజిత, అవినాష్, కిషోర్, అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొని ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

కొత్త చెరువు అభివృద్ధికి ప్రణాళికలు


కొత్త చెరువు వద్ద పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

బంజారాహిల్స్: ఫిలింనగర్‌లోని కొత్త చెరువును అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సూచించారు. మంగళవారం ఉన్నా ఎండీ జీవన్, ఎస్‌ఈ రత్నాకర్, డీసీ ప్రశాంతితో కలిసి కొత్త చెరువు పరిసరాల్లో పర్యటించారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలన్నారు. చెత్తా చెదారం, పిచ్చిమొక్కలు, వ్యర్థాలు తొలగించాలన్నారు. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగించి సుందరీకరణ చేపట్టాలని, వ్యాపారులందరికీ వెండింగ్ జోన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. షేక్‌పేట రోడ్డును బాగుచేయాలని సూచించారు. అలాగే జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-36లోని బట్టర్‌ఫ్లై పార్కును మరింత సుందరీకరించాలన్నారు.

బాల్‌రెడ్డినగర్‌లో సీసీ రోడ్డు పనులు పూర్తి



అప్పుడు.. ఇప్పుడంటూ జోనల్ కమిషనర్ ఎక్స్‌లో పోస్ట్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని బండారు బాల్‌రెడ్డినగర్ బస్తీలో రూ.35 లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు పనులు దాదాపుగా పూర్తి కావొచ్చాయి. ఈ సందర్భంగా ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి గతంలో రాళ్ల రప్పలతో గుంతలమయమైన రోడ్డు ఫొటోను, ఇప్పుడు సీసీ రోడ్డు వేసిన తర్వాత రూపుదిద్దుకున్న రోడ్డును 'అప్పుడు–ఇప్పుడు' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో స్థానికుల రాకపోకలు సాఫీగా సాగుతాయని వెల్లడించారు. మౌలిక సౌకర్యాల కల్పనలో తాము నిబద్ధతతో పనిచేస్తున్నామని అందులో పేర్కొన్నారు.

బాలికల జీవన నైపుణ్యాలపై అవగాహన


డిజిటల్ స్క్రీన్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

బంజారాహిల్స్: రూం టు రీడ్ ఇండియా ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికా విద్యపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లైఫ్ స్కిల్స్ ఆన్ వీల్ ద్వారా డిజిటల్ స్క్రీన్‌పై జీవన నైపుణ్యాలను తెలియజేశారు. బాలికలు ఏవిధంగా ఆత్మవిశ్వాసంతో ఉండాలి, తమ సమస్యలను తామే ఏవిధంగా పరిష్కరించుకోవాలి, సురక్షితంగా ఎలా ఉండాలి లాంటి అంశాలను స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ స్క్రీన్ వాహనాన్ని రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి గోపాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, రూం టు రీడ్ సంస్థ ప్రతినిధులు సరిత, రాధిక, యమున, స్వప్న, మమతలు పాల్గొన్నారు.

ప్రధాన రోడ్డుపై గొయ్యి.. స్పందించని అధికారులు



పంజగుట్ట: ఎర్రమంజిల్ నుంచి వెంకటరమణ కాలనీకి వెళ్లే మార్గంలో ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూరాలజీ ఆసుపత్రి పక్కన ప్రధాన రహదారిపై గొయ్యి ఏర్పడింది. గత కొన్ని రోజులుగా ఇలానే ఉన్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో ఎంతోమంది రాత్రి వేళల్లో గొయ్యిలో పడటంతో గాయాలపాలవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. దీంతో వాహనదారులకు ఎటువంటి ప్రమాదాలకు గురికాకుండా స్థానికులే కొంతమంది గోతిలో కర్రలు ఏర్పాటు చేసి అప్రమత్తం అయ్యేలా చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గొయ్యిని పూడ్చాలని కోరుతున్నారు.

యువకుడి అదృశ్యం

వెంగళరావునగర్: ఫిజియోథెరపీ క్లినిక్‌కు వెళ్ళిన యువకుడు అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... వెంగళరావునగర్‌కు చెందిన ప్రసాద్‌శర్మ అడ్వొకేట్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. అతని కుమారుడు వై.సాచిత్ బేగంపేటలోని ప్రైవేట్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నాడు. ప్రతిరోజూ సాచిత్ మధురానగర్‌లోని ఫిజియోథెరపీ సెంటర్‌కు వచ్చి ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నాడు. సోమవారం కూడా క్లినిక్‌కు వచ్చాడు. తండ్రి కుమారుడిని త్వరగా ఇంటికి వెళ్ళమని చెప్పి టెంపుల్‌కు వెళ్లాడు. సాయంత్రం శర్మ భార్య తన భర్తకు ఫోన్ చేసి సాచిత్ ఇంటికి రాలేదని తెలియజేసింది. అతని కోసం అనేక ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెట్లు ఎక్కలేక... రోడ్డు దాటలేక..!

ప్రకటనలకే పాదచారుల వంతెనలు..!

- పనిచేయని ఎస్కలేటర్లు, లిఫ్ట్‌లు
- ఫిర్యాదు చేసినా కన్నెత్తిచూడని అధికారులు
- వృద్ధులు, బాలింతలు, అంధులకు తప్పని తిప్పలు

పాదచారులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు జరుగుతుండటంతో వాటిని నివారించేందుకు అధికారులు ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలను అందుబాటులోకి తెచ్చారు. అయితే అక్కడ ఏర్పాటు చేసిన లిఫ్ట్‌లు, ఎస్కలేటర్లు మాత్రం పనిచేయడం మానేశాయి. దీంతో బ్రిడ్జి మెట్లు ఎక్కుతున్న సమయంలో పాదచారులు ఆయాసపడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు మెట్లు ఎక్కలేక.. రోడ్డు దాటలేక ఇబ్బందులు పడుతున్నారు.


బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2 ఎల్వీప్రసాద్ ముందు పాదచారుల వంతెనకు పనిచేయని ఎస్కలేటర్, లిఫ్ట్‌లు

బంజారాహిల్స్: పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిల వద్ద లిఫ్ట్‌లు, ఎస్కలేటర్లు పనిచేయకపోవడంతో పాదచారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు దాటే క్రమంలో బ్రిడ్జి ఎక్కాలంటే అక్కడ ఏర్పాటు చేసిన లిఫ్ట్‌లు, ఎస్కలేటర్లు పనిచేయకపోవడంతో మెట్ల ద్వారానే ఎక్కుతూ అయాసపడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఎదురుగా కొన్నేళ్ల క్రితం ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించారు. ప్రకాష్ ఆర్ట్స్ అనే సంస్థ తమ ప్రకటనలు ప్రదర్శించుకోవడానికి లక్షలాది రూపాయలు నెలనెలా వసూలు చేసుకుంటూ ఈ ఎఫ్‌ఓబీని నిర్వహిస్తున్నది. నిబంధనల ప్రకారం ఈ ఎఫ్‌ఓబీకి రెండు వైపులా లిఫ్ట్‌లు, ఎస్కలేటర్లు పనిచేయాలి. అయితే గత 12 సంవత్సరాలుగా ఈ వంతెనకు లిఫ్ట్‌లు, ఎస్కలేటర్లు పనిచేయడం లేదు. ఫలితంగా పాదచారులు మెట్లెక్కి అలసిపోతున్నారు. నిత్యం ఇక్కడ ఉన్న పీవీఆర్ సినిమాస్, ప్రసాద్ ల్యాబ్స్, కేబీఆర్ పార్కు, రెయిన్‌బో ఆస్పత్రికి నిత్యం వేలల్లో జనం వస్తుంటారు. ఈ క్రమంలో రోడ్డు దాటేటప్పుడు ప్రమాదాలు నివారించేందుకు ఈ ఎఫ్‌ఓబీని వినియోగించుకుంటారు. అయితే వృద్ధులు, అంధులు, బాలింతలు, గర్భిణులు తప్పనిసరి పరిస్థితుల్లో మెట్లెక్కి ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. జీహెచ్‌ఎంసీ ప్రకటనల విభాగం అధికారులు నెలనెలా ఈ సంస్థల నుంచి వేలల్లో డబ్బులు వసూలు చేస్తూ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇక్కడే కాకుండా ముఫకంజా ఇంజినీరింగ్ కళాశాల ముందు కూడా ఎఫ్‌ఓబీ నిర్మించారు. ఇక్కడా లిఫ్ట్‌లు పనిచేయడం లేదు. దీంతో విద్యార్థులు, అధ్యాపకులు ఎఫ్‌ఓబీ మెట్ల ద్వారానే బ్రిడ్జిని దాటుతున్నారు. ఈ ఎఫ్‌ఓబీకి కూడా డిజిటల్ బోర్డులో భారీగా ప్రకటనలపై డబ్బులు రాబడుతున్నారు. దీంతో కేవలం ప్రకటన కోసమే ఈ ఎఫ్‌ఓబీలు ఉన్నాయనే చందంగా మారాయని, ఎస్కలేటర్లు లేకపోవడంతో పాదచారులు బ్రిడ్జి దాటేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ కమిషనర్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ దృష్టి పెట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అసలు ఈ పాదచారుల వంతెనల నిర్వహణ నిబంధనలు ఏమిటీ, జీహెచ్‌ఎంసీ ప్రకటనల విభాగం ఏమి చేస్తున్నది అనేదానిపై విచారణ జరిపితే ఈ ప్రకటనల బోర్డుల బాగోతం వెలుగు చూసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎఫ్‌ఓబీలపై ప్రకటనల దందాలో జీహెచ్‌ఎంసీ అధికారుల పాత్ర పెద్దఎత్తున ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సైఫాబాద్ సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా శైలజ బాధ్యతలు



బంజారాహిల్స్: మాసబ్ ట్యాంక్‌లోని సైఫాబాద్ సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ శైలజ బాధ్యతలు స్వీకరించారు. ఉస్మానియా యూనివర్సిటీ బోటనీ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసిన శైలజను ఇక్కడకు ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన జే. లక్ష్మణ్‌నాయక్ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్‌గా బదిలీ అయ్యారు.

సత్కారం


షబ్బీర్‌కు మెమొంటోను అందజేస్తున్న పీస్ కమిటీ ప్రతినిధులు

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్ హెచ్‌ఎఫ్ నగర్ బస్తీకి చెందిన సంఘ సేవకుడు, పీస్ కమిటీ నాయకుడు మహ్మద్ షబ్బీర్‌ను సన్మానించారు. సెంట్రల్ పీస్, వెల్ఫేర్ సౌత్, వెస్ట్ జోన్ ప్రతినిధులు ఆయన సేవలకు గుర్తించి మంగళవారం సత్కరించి మెమొంటో అందించారు. ఈ సందర్భంగా సౌత్,వెస్ట్ జోన్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ మోజమ్ అలీ మాట్లాడుతూ వివిధ వర్గాలకు చెందిన ఉత్సవాలు, వేడుకల్లో షబ్బీర్ అందిస్తున్న సేవలకు గుర్తింపుగా తాము సత్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీస్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించండి

కాచిగూడ: మనువాదుల నుంచి రాజ్యాంగాన్ని రక్షించాలని టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర కన్వీనర్ తిప్పారపు సంపత్ పిలుపునిచ్చారు. జాతీయ కాంగ్రెస్ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో నవంబర్ 26వ తేదీన రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలోని తల్కాతొర స్టేడియంలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

కులగణన సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలి


మాట్లాడుతున్న బాబా ఫసియుద్దీన్

కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్

రహమత్‌నగర్: కులగణన సర్వేలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ స్పష్టం చేశారు. కులగణన కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. బోరబండ ఎస్ఆర్ఆర్‌పురం సైట్-1 షహీద్ తుర్రేబాజ్ ఖాన్ కమ్యూనిటీ హాల్లో మంగళవారం ఎన్యుమరేటర్స్, సూపర్‌వైజర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబా ఫసియుద్దీన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్నివర్గాలకు చెందిన ప్రజలకు జనాభా ప్రాతిపదికన ప్రభుత్వ ఫలాలు అందించాలన్న మహత్తర లక్ష్యంతో కులగణన కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ప్రతిష్టాత్మకమైన ఈ కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన కోరారు. ఇకపై ప్రతివారం ఎన్యుమరేటర్స్, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. ఈ సమావేశంలో వార్డు అధికారి విశ్వపతి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి



ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

వెంగళరావునగర్: బాలికలు ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేయాలని మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలియజేశారు.వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని వెంగళరావునగర్‌కాలనీ ప్రభుత్వ పాఠశాలలో రూం టు రీడ్‌స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం బాలికా విద్యా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ యుక్త వయసులోనే బాలికలకు అనే సవాళ్ళు ఎదురవుతుంటాయని పేర్కొన్నారు. ఎన్ని ఆటంకాలు, ఎన్ని సమస్యలు మనకు ఎదురైనా ఎలాంటి బెరుకును ప్రదర్శించకుండా అన్నింటినీ ఎదురిస్తూ విజయాన్ని చేరుకోవాలని తెలిపారు. ఆపత్కాల సమయంలో పోలీసులు మీకు అండగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు సాయినాథ్‌రెడ్డి, శివకుమార్, రూం టు రీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పీఎల్‌వి సరోజ, సరిత, మమత, రాధిక, యమున, స్వప్న, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాఠశాల వార్షికోత్సవ వేడుకలు


నాగ్ అశ్విన్‌ను సత్కరిస్తున్న ఫౌండర్ బుట్టా రేణుక

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.7లోని మెరీడియన్ స్కూల్‌లో మంగళవారం అంతర్‌ధ్వని పేరుతో నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దర్శకుడు నాగ్ అశ్విన్‌తో పాటు వీహబ్ సీఈవో సీతా పల్లచోల్ల పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థినీ, విద్యార్థులకు నాగ్ అశ్విన్ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ఫౌండర్ బుట్టా రేణుక, వైస్ ప్రిన్సిపాల్ లలితా నాయుడు, ప్రిన్సిపాల్ నిషిరాజా తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసును ఛేదించిన జూబ్లీహిల్స్ పోలీసులు

నిందితుల అరెస్టు.. ఆభరణాలు స్వాధీనం



బంజారాహిల్స్: సాహితీ ఇన్‌ఫ్రా ఎండీ లక్ష్మీనారాయణ అఖిలారెడ్డి ఇంట్లో జరిగిన దొంగతనం కేసును జూబ్లీహిల్స్ పోలీసులు ఛేదించారు. జూబ్లీహిల్స్ సీఐ వెంకటేశ్వర‌రెడ్డి, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌లతో కలిసి ఏసీపీ వెంకటగిరి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్ 54లో వర మహాలక్ష్మీ సిల్క్స్ ఎదురుగా గల ప్లాట్ నెంబర్ 1167 ఇంట్లో హఫీజ్‌పేట గోపాల్‌నగర్‌కు చెందిన రేవు సురేష్ (30), మాదాపూర్ కాకతీయ హిల్స్‌కు చెందిన అవిటి పల్లారావు (52), మాదాపూర్ చందునాయక్ తండాకు చెందిన తౌటి సుబ్బారావు (38)లు వాచ్‌మెన్లుగా పనిచేస్తున్నారు. వారి స్వస్థలాల్లో ఇళ్లను పునఃనిర్మాణం చేసేందుకు డబ్బు అవసరం పడింది. దీంతో వారు అఖిలారెడ్డి ఇంట్లో రూ.10 లక్షల విలువైన బంగారం, వెండి, డైమండ్ ఆభరణాలను దొంగతనానికి పాల్పడ్డారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆ ముగ్గురితో పాటు దొంగిలించిన సొత్తును కొనుగోలు చేసిన జూబ్లీహిల్స్ వెంకటగిరికి చెందిన గోల్డ్ వ్యాపారి యోగేష్ శాంతిలాల్ జైన్‌ను కూడా అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.5,97,000ల విలువైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

పేదల అభ్యున్నతికి ఇందిరాగాంధీ కృషి


బోరబండలో బాబా ఫసియుద్దీన్


ఎస్పీఆర్‌హిల్స్‌లో సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: పేదల అభ్యున్నతి కోసం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విశేష సేవలు అందించారని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. ఇందిరా గాంధీ 107 జయంతి వేడుకలు రహమత్‌నగర్, బోరబండ డివిజన్‌లలో మంగళవారం ఘ నంగా నిర్వహించారు. బోరబండలోని షహీద్ తుర్రేబాజ్‌ఖాన్ కమ్యూనిటీ హాల్లో జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్, ఎస్పీఆర్‌హిల్స్‌లో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, రహమత్‌నగర్‌లో నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవాని శంకర్‌లు కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇందిరాగాంధీకి ఘనంగా నివాళి అర్పించారు.

శ్రీనగర్‌కాలనీలో...

ఇందిరాగాంధీ జయంతి వేడుకలు మంగళవారం ఎర్రగడ్డ హేమావతినగర్‌లో కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


హేమావతినగర్‌లో నివాళులర్పిస్తున్న ఎర్రగడ్డ కాంగ్రెస్ నేతలు

నిత్యావసర సరుకుల అందజేత


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న వెంకటేష్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ గురుబ్రహ్మనగర్‌లో సోమవారం ఉదయం పవర్ షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లు కాలిపోగా ఆ కుటుంబాలకు జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ బాసటగా నిలిచారు. ఇచ్చిన హామీ మేరకు మంగళవారం ఘటనా స్థలానికి వెళ్లి ఒక్కో కుటుంబానికి 20 కిలోల బియ్యం, కిరాణా సరుకులు, వంట సామగ్రిని అందజేశారు.

24న దివ్యాంగుల సహాయ పరికరాల గుర్తింపు శిబిరం

కాచిగూడ: దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్హులైన దివ్యాంగులకు సహాయ పరికరాలు ఉచితంగా అందించేందుకు, అర్హులను గుర్తించేందుకు ఈ నెల 24వ తేదీన ఉదయం 10 గంటలకు ఖైరతాబాద్‌లోని సరస్వతి విద్యామందిర్‌లో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి


ఇందిరాగాంధీకి నివాళులు అర్పిస్తున్న డాక్టర్ అస్మతున్నీసా

బంజారాహిల్స్: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు మంగళవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-10లోని గాయత్రీహిల్స్ లిటిల్‌స్టార్ హైస్కూల్ ప్రిన్సిపాల్, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు డాక్టర్ అస్మతున్నీసా పాఠశాలలో ఇందిరాగాంధీ చిత్రపటానికి ఉపాధ్యాయులతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నెక్లెస్‌రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. అక్కడి నుంచి మహిళలతో కలిసి గాంధీభవన్‌కు వెళ్లి ఇందిరాగాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశానికి ఇందిరాగాంధీ చేసిన సేవలను కొనియాడారు.

కొట్టేసిన కొమ్మలతో రోడ్డు బ్లాక్


కొట్టేసిన చెట్ల కొమ్మలతో బ్లాక్ అయిన రోడ్డు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్ రవి ఫొటో స్టూడియో ముందు ఇటీవల కరెంటు వైర్లకు అడ్డుగా ఉన్నాయని చెట్ల కొమ్మలు కొట్టేసి రోడ్డు పక్కన పడేశారు. రోజులు గడుస్తున్నా వాటిని తొలగించకపోవడంతో అసలే ఇరుకుగా ఉన్న ఈ రోడ్డులో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని, సోషల్ మీడియాలోనూ ఫిర్యాదు చేశామని స్థానిక యువకుడు మార్ల వెంకటేష్ ఆరోపించాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీటిని తొలగించాలని కోరాడు.

నాగాలాండ్ సీఎంతో సుచిరిండియా సీఈఓ కిరణ్ భేటీ



సాక్షి, సిటీబ్యూరో: బల్గేరియా గౌరవ కాన్సుల్, సుచిరిండియా సీఈఓ అండ్ ఎండీ లయన్ వై. కిరణ్ ఢిల్లీలో నాగాలాండ్ ముఖ్యమంత్రి నీఫ్యూ రియోను మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ నీఫ్యూ రియోకు అద్భుతమైన నాయకత్వ లక్షణాలున్నాయని, మన రాష్ట్ర పురోగతి పట్ల ఆయన చూపిస్తున్న అపారమైన నిబద్ధత, నాయకత్వ గుణాలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. పర్యాటకం, సాంస్కృతిక రంగాల్లో నాగాలాండ్ అభివృద్ధి కోసం వినూత్న ఆలోచనలను నీఫ్యూ రియోతో కిరణ్ పంచుకున్నారు. అనంతరం కిరణ్‌ను తెలంగాణ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక అభివృద్ధి కార్యక్రమాలకు సలహాదారుడిగా ఉండాలని నాగాలాండ్ సీఎం కోరారు. ఈ సమావేశం నాగాలాండ్ సాంస్కృతిక, ఆర్థిక ప్రాధాన్యతను పెంపొందించేందుకు కీలక భాగస్వామ్యాలను ఏర్పరచడంలో కీలకమైందని ఆయన తెలిపారు.

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల సత్తా

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు హెచ్‌పీఎస్ రామంతపూర్ సీబీఎస్‌ఈ లెవల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో సత్తా చాటారు. విద్యార్థులు పర్యావరణ సుస్థిరత నుంచి సాంకేతిక పురోగతి వరకు ప్రాజెక్టులను ప్రదర్శించి ఆలోచింపజేశారు. అందులో భాగంగా జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ పదో తరగతి చదువుతున్న ధ్వనిసోని ప్రధాన సూత్రధారిగా 'వైబ్రేషన్ ఎనర్జీ ఎక్స్‌ప్రెస్' పేరుతో రూపొందించిన ప్రాజెక్టు న్యాయనిర్ణేతలను సైతం ఆశ్చర్యపరిచింది. ఈ ప్రాజెక్టు నేషనల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనకు వెళుతుందని, దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలల ప్రాజెక్టులతో పోటీపడుతుందని ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

యువతి అదృశ్యం


అఖిల

ఖైరతాబాద్: హోంసైన్స్ కాలేజీలో బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్న యువతి అదృశ్యమైన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన బోడావత్ అఖిల (21) లక్డీకాపూల్‌లోని హోంసైన్స్ కళాశాలలో బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతోంది. ఈ నెల 17న కళాశాల హాస్టల్ నుంచి హాస్పిటల్‌కు వెళ్తున్న అంటూ ఔట్‌వార్డు రిజిస్టర్‌లో ఎంట్రీ చేసి వెళ్లిన అఖిల సాయంత్రమైనా రాకపోవడంతో హెడ్ వార్డెన్ కవిత తండ్రి నర్సింహకు తెలియజేసింది. తెలిసిన వారి వద్ద విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం హైదరాబాద్‌కు నర్సింహ ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్న రమేష్‌పై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి బుధవారం । 20 । నవంబర్ । 2024

నగరంలో యుఈఎల్ 'ఇండియా టూర్'



సాక్షి, సిటీబ్యూరో: యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ లండన్(యూఈఎల్) ఇండియా టూర్ 2024లో భాగంగా నగరంలో ఇండస్ట్రీ అడ్వైజరీ బోర్డు(ఐఏబీ)ని ప్రారంభించింది. సిమెన్స్, టి–హబ్‌ల భాగస్వామ్య సహకారంతో మంగళవారం టి–హబ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉన్నత విద్యలో సుస్థిరతను పెంపొందించడంతో పాటు దేశంలోని విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య భాగస్వామ్యాలను పెంపొందించడంలో కీలక అడుగుగా నిలిచింది. యుఈఎల్ ఆధ్వర్యంలోని మూడు నగరాల పర్యటనలో భాగంగా హైదరాబాద్ రెండవ ప్రస్థానంగా సంస్థ ఇండస్ట్రీ అడ్వైజరీ బోర్డును ప్రారంభించారు. ఐఏబీ ప్రారంభంతో పాటు జరిగిన హెచ్‌ఆర్ రౌండ్‌టేబుల్, డిజిటల్ పరివర్తన, ఉద్యోగుల అనుభవం, వైవిధ్యతతో పాటు మానవ వనరులలో తాజా పోకడలు, సవాళ్లను చర్చించడానికి పరిశ్రమ నాయకులు, విద్యావేత్తలు, ప్రభుత్వ అధికారులను ఒకచోట చేర్చింది. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ లండన్ వైస్ ఛాన్సలర్ అమండా జె.బ్రోడెరిక్ మాట్లాడుతూ.. సాంకేతిక నైపుణ్యం, వ్యవస్థాపక స్ఫూర్తికి పేరుగాంచిన హైదరాబాద్‌లో తమ ఇండియా టూర్ సరైన నేపథ్యమని భావిస్తున్నట్లు తెలిపారు. యుఈఎల్ నిబద్ధతలో భాగంగా అంతర్జాతీయ భాగస్వామ్యానికి గ్లోబల్ పవర్ హౌస్‌గా భారతదేశం పాత్రను గుర్తించడం సంస్థ ప్రధాన అంశమని చెప్పారు. ప్రముఖ భారతీయ సంస్థలు, ఇండస్ట్రీ ప్లేయర్‌లతో భాగస్వామ్యం చేసుకోవడం ద్వారా విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించాలని యుఈఎల్ లక్ష్యంగా పెట్టుకుంది. విద్యార్థులు ఆచరణాత్మక అనుభవాన్ని పొందేందుకు, భవిష్యత్ కెరీర్‌లకు సిద్ధమయ్యేలా చేస్తుందని, ప్రపంచ పౌరసత్వంతో సహా వివిధ నేపథ్యాలను ఈ పర్యటన అన్వేషిస్తుందని పేర్కొన్నారు.

మత్స్యకారుల సంక్షేమం కోసం కృషి

- రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్
- 21 నుంచి 24 వరకు ప్రపంచ మత్స్యకార దినోత్సవాలు



అబిడ్స్: ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ప్రపంచ మత్స్యకార దినోత్సవాలను నిర్వహిస్తామని రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ వెల్లడించారు. తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం కోసం, మత్స్యకారుల అభివృద్ధి కోసం ఫిషరీస్ ఫెడరేషన్ నిరంతరం పాటుపడుతోందన్నారు. నగరంలోని ఐమ్యాక్స్ థియేటర్ పక్కన నిర్వహించే ఈ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మంత్రులు శ్రీధర్ బాబు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, పలువురు ఎమ్మెల్సీలు, పలువురు చైర్మన్లు పాల్గొంటారన్నారు. ఫుడ్ ఫెస్టివల్‌లో ప్రతిభ కనబర్చిన మత్స్యకారులకు అవార్డులు అందజేస్తామని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం చెరువుల్లో ఉచితంగా చేప పిల్లల పంపిణీ చేపట్టిందన్నారు.

సెమీకండక్టర్, చిప్ డిజైన్‌లో నూతన డిప్లొమా

అత్యాధునిక సాంకేతిక డిప్లొమా అందించనున్న ఐఐటీ భువనేశ్వర్

భాగస్వామ్యం కుదుర్చుకున్న స్టార్టప్ మోసార్ట్ ల్యాబ్స్



సాక్షి, సిటీబ్యూరో: వీఎల్‌ఎస్‌ఐ విభాగానికి చెందిన స్టార్టప్ మోసార్ట్ ల్యాబ్స్, ఐఐటీ భువనేశ్వర్ సంయుక్తంగా సెమీ కండక్టర్, చిప్ డిజైన్ విభాగంలో అత్యాధునిక సాంకేతిక డిప్లమా కార్యక్రమాన్ని అందించబోతున్నట్లు మోసార్ట్ ల్యాబ్స్ సీఈవో రాజేష్‌గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులను వీఎల్‌ఎస్‌ఐలోని సెమీకండక్టర్ టెక్నాలజీ, అనలాగ్ డిజైన్, డిజిటల్ డిజైన్, డిజైన్ వెరిఫికేషన్, ఫిజికల్ డిజైన్, లే అవుట్ డిజైన్, వ్యాలిడేషన్, టెస్ట్, మెషర్మెంట్స్ వంటి అనేక విభాగాల్లో పరిశ్రమ నిపుణులుగా మార్చే నైపుణ్యాలను అందించనున్నామని తెలిపారు. ఈ భాగస్వామ్యంలో భాగంగా ఐఐటీ భువనేశ్వర్ డీన్ ప్రొ.దినకర్, మోసార్ట్ ల్యాబ్స్ సీఈఓ రాజేష్‌గుప్తా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో భాగంగా ఐఐటీ భువనేశ్వర్ డైరెక్టర్ డా.శ్రీపాద్ కర్మాల్కర్ మాట్లాడుతూ ఐఐటీ భువనేశ్వర్ వ్యూహాత్మక భాగస్వామ్యాల ద్వారా విద్య, పరిశ్రమల నైపుణ్యాన్ని అనుసంధానం చేయడానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులను పరిశ్రమలకు సిద్ధం చేసి సెమీకండక్టర్ విభాగంలో అత్యుత్తమ భవిష్యత్ అవకాశాల కల్పనకు కృషి చేస్తామన్నారు. డా.కృష్ణకాంత్ అవళూర్, ప్రొ.వి.పాండురంగ, ప్రొ.ప్రశాంత్ కుమార్ సాహు, ప్రొ.విజయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూముల్లో రియల్ వ్యాపారం చేసిన వారిపై చర్యలు

- ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రీతమ్
- లబ్ధిదారుల భూముల పరిశీలన



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రీతమ్

శంషాబాద్: దళితుల అభివృద్ధి కోసం గతంలో ఎస్సీ కార్పొరేషన్ కేటాయించిన భూముల్లో రియల్ ఎస్టేట్ చేసిన వారిపై కఠిన చర్యలుంటాయని ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రీతమ్ అన్నారు. పట్టణంలోని సాతంరాయిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కోట్ల విజయభాస్కర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సాతంరాయిలోని సర్వే నంబర్–17లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 30 మంది దళితులకు భూములు కేటాయించారు. ఆరేళ్ల క్రితం మాజీ ప్రజాప్రతినిధి కుమారుడు, ఓ ప్రభుత్వ ఉద్యోగి అందులోని 15 మందికి సంబంధించిన స్థలాలను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం విక్రయించారని ఆరోపిస్తూ టీపీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ తదితరులు కార్పొరేషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి చైర్మన్ ఆ భూములను పరిశీలించారు. దళితుల అభివృద్ధి కోసం కేటాయించిన భూములను అమ్మడం, కొనడం రెండు కూడా నేరమేనన్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని తహసీల్దార్ రవీందర్ దత్‌కు ఆయన సూచించారు. భూముల క్రయివిక్రయాలకు పాల్పడ్డ వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అన్నారు.

ఎడ్యుకేషన్ వరల్డ్ ఇండియా స్కూల్ ర్యాంకింగ్స్‌లో.. టాప్‌లో హైదరాబాద్

- టాప్–10లో స్థానం పొందిన 'చిరెక్' ఇంటర్నేషనల్ స్కూల్
- నగరానికి ఏకంగా 25 అవార్డులు తీసుకొచ్చిన చిరెక్



సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా అందించే 'ఎడ్యుకేషన్ వరల్డ్ ఇండియా స్కూల్ ర్యాంకింగ్స్ 2024–25'లో నగరానికి చెందిన చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్ టాప్–10లో స్థానం సంపాదించింది. టాప్–10లో ఒకటిగానే కాకుండా ఇంటర్నేషనల్ డే స్కూల్ విభాగంలో దేశంలో ఏడో ర్యాంక్, తెలంగాణలో మొదటి ర్యాంక్ పొందిందని స్కూల్ ప్రిన్సిపల్ సంచిత రాహా తెలిపారు. కో–ఎడ్ డే స్కూల్ విభాగంలో దేశంలో 8వ స్థానంలో, తెలంగాణలో మొదటి స్థానంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుందని అన్నారు. క్యాంపస్ డిజైన్, ఆర్కిటెక్చర్‌లో గ్రాండ్ జ్యూరీ అవార్డును కూడా అందుకుని దేశవ్యాప్తంగా తెలంగాణ విద్యా వ్యవస్థను అగ్రస్థానంలో నిలబెట్టిందని వివరించారు. స్కూల్ టీచర్ వెల్ఫేర్, డెవలప్‌మెంట్, ఫ్యాకల్టీ కాంపిటెన్స్, అకడమిక్ రెప్యుటేషన్, కో–కరిక్యులర్ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్‌తో పాటు విద్యార్థుల పట్ల వ్యక్తిగత శ్రద్ధపై అత్యధిక పాయింట్లను పొంది అవార్డులను అందుకున్నామన్నారు.





ఆన్‌లైన్‌లోనే బేరసారాలు

క్యాబ్ అగ్రిగేటర్ల నయా ట్రెండ్

బేరం కుదిరితేనే బండి కదులుతుంది | చార్జీలు పెంచేందుకు ఇదో ఎత్తుగడ | క్యాబ్ బుక్ అయినా తప్పని పడిగాపులు

సాక్షి, సిటీబ్యూరో: కార్తీక్.. హబ్సిగూడ నుంచి గచ్చిబౌలికి వెళ్లేందుకు ఓ క్యాబ్ బుక్ చేసుకున్నాడు. రూ.550ల చార్జీ నమోదైంది. పరవాలేదనుకొని బుక్ చేశాడు. 6 నిమిషాల్లో క్యాబ్ తన వద్దకు వస్తున్నట్లు మొబైల్ యాప్‌లో కనిపించింది. కానీ నిర్ణీత గడువు దాటినా క్యాబ్ రాలేదు. కానీ యాప్‌లో మాత్రం అదే ఆరు నిమిషాల సమయం కనిపిస్తోంది. దాంతో పాటు కొత్తగా మరో నోటీస్ కనిపించింది. ఆ రూట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉన్నందువల్ల రూ.580, రూ.630, రూ.680 వరకు ఏదో ఒక చార్జీని ఎంపిక చేసుకోవాలని సూచించింది. తప్పనిసరి కావడంతో రూ.580 చెల్లించేందుకు సిద్ధమయ్యాడు. కానీ మరో ఐదు నిమిషాలు గడిచినా క్యాబ్ రాలేదు. దాంతో రూ.రూ.630 వద్ద నమోదు చేసుకొన్నాడు. క్షణాల్లో క్యాబ్ వచ్చేసింది. ప్రయాణికుల తప్పనిసరి అవసరాన్ని సొమ్ము చేసుకొనేందుకు కొన్ని క్యాబ్ అగ్రిగేటర్ సంస్థలు ఇలా ఆన్‌లైన్ బేరసారాలకు దిగుతున్నాయి. 'బుకింగ్ ప్రకారం నమోదైన చార్జీల ప్రకారం వచ్చేందుకు క్యాప్టెన్ (డ్రైవర్) సిద్ధంగా లేడంటూ' సరికొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టాయి. రద్దీ ఉన్నా లేకున్నా ప్రయాణికుల నిలువు దోపిడీకి పాల్పడుతున్నాయి. క్యాబ్ అగ్రిగేటర్‌లపైన ప్రభుత్వానికి ఎలాంటి నియంత్రణ లేకపోవడంతో చార్జీల వసూళ్లు ఆ సంస్థల ఇష్టారాజ్యంగా మారింది. కొత్తగా ఆన్‌లైన్‌లోనే ఇలా బేరాలకు దిగడం పట్ల ప్రయాణికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆన్‌లైన్ బేరాల వల్ల తరచూ రెట్టింపు చార్జీలను చెల్లించాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. కొన్ని క్యాబ్‌లు మాత్రం 'విధించిన చార్జీల్లో మార్పులు ఉండవచ్చనే సూచనతో బుక్ అవుతున్నాయి. కానీ చివరి వరకు పెద్దగా తేడా ఉండటం లేదు. కొన్ని క్యాబ్‌లు మాత్రం బేరం కుదిరితేనే కదులుతున్నాయి.

చార్జీలు పైపైకి..

గ్రేటర్‌లో ఓలా, ఊబెర్, రాపిడో వంటి క్యాబ్‌లతో పాటు మనయాత్రి వంటివి కొత్తగా మరిన్ని క్యాబ్‌లు అందుబాటులోకి వచ్చాయి. క్యాబ్ సంస్థలు ఇచ్చే



కమిషన్ లెక్కల ప్రకారం డ్రైవర్లు ఒక అగ్రిగేటర్ నుంచి మరో అగ్రిగేటర్‌కు మారుతున్నారు. నగరంలో సుమారు 60 వేల క్యాబ్‌లు వివిధ సంస్థలతో అనుసంధానమై ఉన్నాయి. అలాగే మరో 50 వేల ఆటోలు, సుమారు 40 వేలకు పైగా బైక్ ట్యాక్సీలు ఆయా సంస్థలతో కలిసి ఉన్నాయి. కొత్తగా వస్తోన్న క్యాబ్ సంస్థలతో అగ్రిగేటర్‌ల మధ్య పోటీ పెరుగుతోంది. దీంతో డ్రైవర్‌లను ఆకట్టుకొనేందుకు రకరకాల ఆఫర్‌లను ప్రకటిస్తున్నాయి. కొన్ని సంస్థలు ఎక్కువ కమిషన్లతో ఆకట్టుకుంటుండగా, మరికొన్ని ఇలా ఆన్‌లైన్‌లోనే చార్జీలను పెంచేస్తూ డ్రైవర్‌లను తమవైపు తిప్పుకుంటున్నాయి. ఇలా క్యాబ్ సంస్థల మధ్య పెరిగిన పోటీ కొంత మేరకు డ్రైవర్‌లకు కలిసి వచ్చినప్పటికీ ప్రయాణికులకు మాత్రం భారంగా మారుతోంది. గంట గంటకు చార్జీలు మారుతున్నాయి. కొన్ని రూట్‌లలో క్షణాల్లోనే ఈ మార్పు కనిపించడం గమనార్హం.

- సాధారణంగా ఉదయం, సాయంత్రం వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో మాత్రమే సాధారణ చార్జీలపైన 25 శాతం నుంచి 30 శాతం వరకు పెరిగే అవకాశం ఉంటుంది. కానీ అందుకు భిన్నంగా అన్ని వేళల్లోనూ ఎక్కువ చార్జీలే కనిపిస్తున్నాయని కూకట్‌పల్లికి చెందిన శ్రీకాంత్ అనే ప్రయాణికుడు చెప్పారు. కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీ నుంచి తాను రెగ్యులర్‌గా గచ్చిబౌలి వరకు ప్రయాణం చేస్తున్నట్లు చెప్పారు. నిజానికి క్యాబ్ అగ్రిగేటర్‌ల మధ్య పెరిగిన పోటీ వల్ల ప్రయాణికులకు తక్కువ చార్జీలతో క్యాబ్ సదుపాయం లభించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా క్యాబ్ సంస్థలకు, డ్రైవర్‌లకు లాభదాయకంగా మారింది. అంతిమంగా ఆ భారాన్ని ప్రయాణికులు భరించాల్సి వస్తోంది.

దూరమైతేనే ఓకే..

ఒకవైపు చార్జీలపైన బేరసారాలు ఇలా ఉండగా, మరోవైపు క్యాబ్ డ్రైవర్లు సైతం ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నారు. గమ్యస్థానంతో నిమిత్తం లేకుండా ప్రయాణికుల బుకింగ్ ప్రకారం క్యాబ్ సర్వీస్ అందుబాటులో ఉండాలి. కొందరు డ్రైవర్లు 10 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ప్రయాణాలకు మాత్రమే వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. తక్కువ దూరం ఉండే ప్రయాణాల పట్ల విముఖతను చూపుతున్నారు. అందుకోసం ప్రయాణికులకు ఫోన్ చేసి ఎక్కడికి వెళ్లాలంటూ ఆరా తీస్తున్నారు. ప్రయాణికులు తక్కువ దూరం ఉన్న డెస్టినేషన్ చెబితే ఆటోమేటిక్‌గా క్యాబ్ రద్దయిపోతుంది. 'కాలనీల నుంచి మెట్రోస్టేషన్లు, రైల్వేస్టేషన్లు, ప్రధాన బస్‌స్టేషన్లకు క్యాబ్‌లు బుక్ చేసుకున్నప్పుడు ఇలాంటి పరిస్థితి ఎదురవుతోంది.' అని మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన సుధ తెలిపారు.

నియంత్రణ ఎలా..

గ్రేటర్ హైదరాబాద్‌లో క్యాబ్ సంస్థలపై నియంత్రణ కొరవడింది. బెంగళూర్ వంటి నగరాల్లో రవాణాశాఖ నియంత్రణలోనే క్యాబ్ సంస్థలు పని చేస్తున్నాయి. క్యాబ్‌లు అందజేసే సేవలు, చార్జీలతో పాటు అన్ని అంశాలపైన అధికారులు నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంటుంది. కానీ నగరంలో మాత్రం అలాంటి అవకాశం లేదు. దీంతో ఇంటి నుంచే నేరుగా బయలుదేరేందుకు క్యాబ్‌లు చక్కటి రవాణా సదుపాయంగా అందుబాటులో ఉన్నప్పటికీ చార్జీల్లో మాత్రం దూకుడు కనిపిస్తోంది.

నగరంలో నేడు

- ఇందిరా పార్క్ సమీపంలోని ఎన్టీఆర్ స్టేడియంలో భక్తి టీవీ ఆధ్వర్యంలో కోటి దీపోత్సవం సాయంత్రం 5.30 నుంచి రాత్రి 10 గంటల వరకు కొనసాగుతుంది.
- అంబర్‌పేట్ దేవస్థానం సేవా సమితి ఆధ్వర్యంలో అంబర్‌పేట మెయిన్ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద ఉదయం 9 గంటల నుంచి బొడ్రాయి కార్యక్రమం ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజు నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

9న ధరణి మోసాలపై రాష్ట్రస్థాయి సదస్సు



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విమలక్క తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ధరణిలోని తప్పులు, మోసాలపై విచారణను రెవెన్యూ అధికారుల చేతిలో పెట్టడం సరికాదని విచారణను వారికి అప్పగించడం అంటే దొంగకు తాళం చెవి ఇవ్వడమేనని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉభయ రాష్ట్రాల చైర్మన్ విమలక్క విమర్శించారు. వచ్చేనెల 9న మోసాల పుట్ట ధరణి దొల్లతనపు భూమాత అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా సుందరయ్య విజ్ఞానకేంద్రం వద్ద రాష్ట్ర సదస్సు కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ధరణిని అడ్డుపెట్టుకొని గత ప్రభుత్వంలోని నేతలు, భూస్వాములు, రియల్టర్లు పెద్ద ఎత్తున భూములను కాజేశారని విమర్శించారు. తెలంగాణ రైతు కూలి పోరాట సమితి అధ్యక్షుడు పట్లోల నాగిరెడ్డి, న్యాయవాది ఆచార్య, కట్టా భగవంతరెడ్డి, జి.వెంకటేశ్వర్‌రావు, రవిచంద్ర, రమేష్, రమా, సరస్వతి పాల్గొన్నారు.

అన్నం, కూరగాయలతో శివుడికి అలంకారం



హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని శివాలయంలో కార్తీక మాస విశేష పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా అన్నపూజ కార్యక్రమం, ప్రత్యేక అలంకరణ దర్శనం భక్తులను కనువిందు చేసింది. అలాగే క్యారెట్లు, కాకరకాయ, బెండకాయ తదితర కూరగాయలతో అలంకరణ భక్తజనులను కట్టిపడేసింది. ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో అర్చకులు రిపుంజయశర్మ ఆధ్వర్యంలో విశేష అలంకరణ, అర్చనలు, అభిషేకాలు కొనసాగుతున్నాయి.

– సనత్‌నగర్

ఆర్టిజన్స్‌కు విద్యార్హతను బట్టి కన్వర్షన్ ఇవ్వాలి



విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ సదస్సులో అభివాదం చేస్తున్న నాయకులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాష్ట్రంలో విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్స్‌కు విద్యార్హతను బట్టి కన్వర్షన్ ఇవ్వాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ చైర్మన్ ఏ.ఈశ్వర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ ఏజేసీ ఆధ్వర్యంలో మంగళవారం సదస్సు జరిగింది. విద్యుత్ సంస్థలో సుమారు రెండు వేల మంది ఆర్టిజన్స్‌గా పనిచేస్తున్నారని, అంతకుముందు వీరందరూ కాంట్రాక్టు కార్మికులుగా పనిచేశారని తెలిపారు. ఈ కార్మికులందరూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కొండంత ఆశలు పెట్టుకొని జీవిస్తున్నారని అన్నారు. 2006 సంవత్సరంలో 7114 సీజేఎల్‌ఎం పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారని, ఈ పోస్టులన్నీ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతోనే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేస్తే ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేయించారని చెప్పారు. సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులతోనే సీజేఎల్‌ఎం పోస్టులను భర్తీ చేయాలని, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆదేశం ఇచ్చారని, ఆ ఆదేశాల మేరకు అప్పటి ట్రాన్స్‌కో సీఎండీ రేచర్ చటర్జీ 7114 సీజేఎం పోస్టులను కాంట్రాక్టు కార్మికులతోనే భర్తీ చేశారని గుర్తుచేశారు. అందువల్ల ఆర్టిజన్స్‌ను వారి విద్యార్హతను బట్టి కన్వర్షన్ ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ ఎంఏ వాజీర్, కో చైర్మన్ బి.శంకర్, జి.నాగరాజు, నాయకులు ఎస్.సదానందం, చంద్రారెడ్డి, లింగం పాల్గొన్నారు.

ఏజీ వర్సిటీని సందర్శించిన అమెరికా ఎంబసీ సైంటిస్ట్



సైంటిస్ట్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: అమెరికా ఎంబసీలోని యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ సీనియర్ అగ్రికల్చర్ సైంటిస్ట్ డాక్టర్ సంతోష్‌కుమార్‌సింగ్ మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో అధికారులతో సమావేశమయ్యారు. తెలంగాణ సాగు పద్ధతులు, విశ్వవిద్యాలయం చేస్తున్న బోధన, బోధన విస్తరణ తదితర అంశాల గురించి చర్చించారు. వాతావరణ మార్పులు, ప్రభావాలను అధిగమించడానికి అనుసరించాల్సిన వ్యూహాలు, రూపొందించాల్సిన ప్రణాళికలు ఇతర అంశాలపై చర్చించారు.

అక్కినేని అమల ఇంట్లో సర్వే



బంజారాహిల్స్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కులగణన సర్వేలో సినీనటి అక్కినేని అమల పాల్గొని ఎన్యుమరేటర్లు ఇచ్చిన ప్రశ్నావళిని భర్తీ చేసి అందించారు. జూబ్లీహిల్స్‌లో నివసించే అక్కినేని నాగార్జున సతీమణి అమల నివాసానికి సర్కిల్ నోడల్ ఆఫీసర్ సాయిశ్రీనివాస్, సూపర్‌వైజర్ శివకుమార్, ఎన్యుమరేటర్ వినయ్‌కుమార్ వెళ్లి ఈ సర్వే పూర్తి చేశారు. ప్రశ్నావళిలో పూర్తి సమాచారాన్ని ఆమె ఎన్యుమరేటర్‌కు అందజేశారు.

స్కూల్, ఆశ్రమాలు, సంస్థల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

సాక్షి, సిటీబ్యూరో: జిల్లాలో దివ్యాంగుల సంక్షేమానికి నిర్వహించే ఆశ్రమాలు, పాఠశాలలు, వివిధ సంస్థలు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా సంక్షేమ అధికారి రాజేందర్ తెలిపారు. అనుమతి లేకుండా ఆశ్రమాలు, సంస్థలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. దివ్యాంగుల సంక్షేమ చట్టం 2016 ప్రకారం రిజిస్ట్రేషన్ కోసం 25వ తేదీలోపు హైదరాబాద్ జిల్లా, దివ్యాంగులు, వయోవృద్ధులు ట్రాన్స్ జెండర్ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలకు ఫోన్ నంబర్: 96404 52773 సంప్రదించవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సందేహాలకు దివ్యాంగుల టోల్‌ఫ్రీ నంబర్ 155326కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

1000 కి.మీ దాటిన డీసిల్టింగ్!

- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ల క్లీనింగ్
- 80 వేలకు పైగా మ్యాన్‌హోల్ టు మ్యాన్‌హోల్
- కొనసాగుతున్న 90 రోజుల సీవరేజీ స్పెషల్ డ్రైవ్

సాక్షి, సిటీబ్యూరో: సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీగా హైదరాబాద్ మహానగరాన్ని తీర్చిదిద్దేందుకు జలమండలి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీవరేజీ స్పెషల్ డ్రైవ్ డ్రైనేజీ ఆపరేషన్ సోమవారం నాటికి వెయ్యి కిలో మీటర్లు దాటింది. మ్యాన్‌హోల్స్ టు మ్యాన్‌హోల్స్ డీసిల్టింగ్‌తో అండర్ గ్రౌండ్ పైప్‌లైన్లలో అడ్డంకులు బయటపడి దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభిస్తోంది. మ్యాన్‌హోల్స్ ఓవర్‌ఫ్లో ఫిర్యాదులను బట్టి గుర్తించిన అత్యంత సమస్యాత్మక డ్రైనేజీ పైప్‌లైన్‌లో మార్గాల్లోనే ఈ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది.

80 వేల మ్యాన్‌హోల్స్ శుభ్రం

90 రోజుల సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 46 రోజుల్లో సుమారు 1,027 కిలోమీటర్ల మేర 8,107 ప్రాంతాల్లో 80వేల మ్యాన్‌హోల్ టూ మ్యాన్‌హోల్ డీసిల్టింగ్ జరిగినట్లు జలమండలి ప్రకటించింది. మొత్తం మీద జలమండలి పరిధిలో సీవరేజీ పైప్‌లైన్ వ్యవస్థ సుమారు 9,769.74 కిలోమీటర్ల వరకు ఉండగా, అందులో 612 కిలోమీటర్ల ట్రంక్‌లైన్ ఉంది. పైప్‌లైన్‌కు అనుసంధానంగా సుమారు 6,31,398 మ్యాన్‌హోల్స్ ఉన్నట్లు జలమండలి రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

డీసిల్టింగ్‌పై టెక్నాలజీ నిఘా

సీవరేజ్ స్పెషల్ డ్రైవ్ క్షేత్రస్థాయి పనితీరుపై సరికొత్త టెక్నాలజీ నిఘా కొనసాగుతోంది. సీవరేజ్ నెట్‌వర్క్‌కు జీఐఎస్ మ్యాపింగ్‌తో డాష్‌బోర్డు ద్వారా పనితీరును పర్యవేక్షిస్తున్నారు. ఎండీ స్థాయి నుంచి జనరల్ మేనజర్ స్థాయి వరకు రోజువారిగా జూమ్ మీటింగ్ ద్వారా క్షేత్రస్థాయి పనులను సమీక్షిస్తున్నారు. పైప్‌లైన్ క్లీనింగ్, డీసిల్టింగ్, సిల్ట్ తరలింపులో ప్రతిభ కనబరుస్తున్న మేనేజర్ల ప్రశంసలు, పని తీరులో అలసత్వం ప్రదర్శిస్తూ వెనుకబడిన మేనేజర్లకు మెమోలతో మొట్టికాయలు తప్పడం లేదు. దీంతో క్షేత్రస్థాయి సెక్షన్ మేనేజర్లు పోటీ పడుతుండటంతో సీవరేజ్ పనుల్లో వేగం కనిపిస్తోంది.

తగ్గుతున్న ఫిర్యాదులు

ఈ స్పెషల్ డ్రైవ్‌లో ప్రధానంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై దృష్టి సారించారు. మ్యాన్‌హోల్ టు మ్యాన్‌హోల్ డీసిల్టింగ్‌తో వాటికి పరిష్కార మార్గం చూపడం వల్ల రోజూ వచ్చే సీవరేజ్ ఫిర్యాదులు చాలా తగ్గిపోయాయి. జలమండలి పరిధిలోని మొత్తం మీద సెప్టెంబర్‌లో వినియోగదారుల ఇంటి వద్ద మురుగుకు సంబంధించిన ఫిర్యాదులు 12,105 నమోదు కాగా, అక్టోబర్ నెలలో 9,697 నమోదై, 2,408 ఫిర్యాదులు తగ్గాయి. అంటే 20శాతం ఫిర్యాదులు తగ్గాయి. సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫిర్యాదులు సెప్టెంబర్ 30,105 నమోదు కాగా, అక్టోబర్‌లో 23,293 నమోదయ్యాయి. 6,812 ఫిర్యాదులు తగ్గాయి. అంటే 23శాతం ఫిర్యాదులు తగ్గినట్లు కనిపిస్తోంది. డిసెంబర్ చివరి నాటికి ఫిర్యాదుల్ని 30 శాతం తగ్గించాలని లక్ష్యంగా స్పెషల్ డ్రైవ్ కొనసాగుతోంది.

మరింత కష్టపడితే..

– జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

రోజువారీగా వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడం కంటే, అసలు ఆ ఫిర్యాదుల శాతాన్ని తగ్గించడమే అసలైన విజయమని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి అన్నారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌పై మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. స్పెషల్ డ్రైవ్‌పై అన్ని వర్గాల ప్రజల నుంచి స్పందన వచ్చిందని ఎండీ వెల్లడించారు. ప్రజల నుంచే కాకుండా, ప్రజా ప్రతినిధులు సైతం సానుకూలంగా స్పందించారని చెప్పారు. వినియోగదారులకు మంచి సేవలు అందించి వారిని సంతృప్తి పర్చడమే అధికారుల విధి అని పేర్కొన్నారు. రోజు వారీ పనుల్లో వారు ఎదుర్కొన్న సవాళ్లు, అనుసరించిన వ్యూహాల్ని ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రతిభ కనబర్చిన టాప్–10 సెక్షన్ల మేనేజర్లను సత్కరించారు. సమీక్షలో ఈడీ మయాంక్ మిట్టల్, ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్–2 స్వామి, పర్సనల్ డైరెక్టర్ సుదర్శన్, సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు, మేనేజర్లు పాల్గొన్నారు.



సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, బుధవారం, 20, నవంబర్, 2024

ఈ నగరానికి ఏమైంది.. రాత్రుళ్లు నిద్రపోరేంటి.. ఓ వైపు నైట్ షిఫ్ట్స్, మరోవైపు టైం పాస్.. ఈ అలవాట్లకి చరమగీతం పాడకుంటే ముప్పు తప్పదని హెచ్చరిస్తున్నారు వైద్య నిపుణులు.. నగర ప్రజలను ప్రస్తుతం ప్రధానంగా వేధిస్తున్న సమస్య నిద్రలేమి తనం. ఇందుకు ఆలస్యంగా నిద్రపోవడమే ముఖ్యమైన కారణం. సగటున నగరవాసుల ఆన్‌స్క్రీన్ సమయం రాత్రుళ్లే ఎక్కువగా ఉంటుందని పలు సర్వేలు తేటతెల్లం చేస్తున్నాయి. ఇందులో నైట్ షిఫ్ట్స్ ఓ భాగమైతే.. రాత్రుళ్లు రోడ్లపై షికార్లు, రకరకాల గ్యాడ్జెట్లు వినియోగిస్తూ అర్ధరాత్రి వరకూ టైంపాస్ చేయడం మరో కారణం. దీంతో నగరజీవి ప్రశాంతమైన నిద్రకు దూరమవుతున్నాడని నిపుణులు చెబుతున్న మాట.

– సాక్షి, సిటీబ్యూరో






ఈ నగరానికి ఏమైంది?

వేధిస్తున్న నిద్రలేమి సమస్య

రాత్రంతా ఉద్యోగాలు, అర్ధరాత్రి దాటేంత వరకూ పర్యాటక ప్రాంతాల్లో రకాల ఈవెంట్స్, ఇంటికి చేరుకున్నా అర్ధరాత్రి దాటేంత వరకూ మొబైల్ ఫోన్‌లో చాటింగ్, టైంపాస్ వెరసి నగర జీవికి నిద్రను దూరం చేస్తున్నాయి. రానురానూ ఉదయం ఆలస్యంగా లేవడం, రాత్రి ఆలస్యంగా నిద్రపోవడం నగర ప్రజల జీవన శైలిగా మారిపోతోంది. ఉద్యోగం, పాఠశాల విద్యార్థులు, గృహిణులు, యువత ఇలా ఏ ఏజ్ గ్రూపు వారిదైనా దాదాపు ఇదే దినచర్యగా మారుతోంది.



రాత్రిళ్లే.. సరైన సమయమట!..

కుటుంబ సభ్యులతో బయటకు వెళ్లేందుకు నగర ప్రజలకు రాత్రి వేళల్లోనే సమయం దొరుకుతుందని ఎక్కువ మంది అభిప్రాయపడుతున్నారు. రోజు వారీ విధులు ముగించుకుని ఇంటికి చేరాక కాసేపు కుటుంబ సభ్యులు, స్నేహితులతో గడిపేందుకు ఇదే సరైన సమయమని చెబుతున్నారు. దీంతో అర్ధరాత్రి వరకూ నగరంలోని ప్రముఖ ప్రాంతాలైన ట్యాంక్‌బండ్, ఎన్‌టీఆర్ మార్గ్‌కి వెళ్లి సేదతీరుతున్నారు. మరికొందరైతే హోటల్స్, మ్యూజిక్, డ్యాన్స్, ఇతర ఈవెంట్స్‌తో అర్ధరాత్రి వరకూ ఎన్‌జాయ్ చేస్తున్నారు. సినిమా షోలు సైతం రాత్రి 11.30 గంటలకు మొదలయ్యే థియేటర్లు ఉన్నాయి. నగరంలో పబ్ కల్చర్ కూడా భారీగా పెరిగింది. మాదాపూర్, జూబ్లీహిల్స్, రాయదుర్గం, హైటెక్ సిటీ, కేపీహెచ్‌బీ, మెహిదీపట్నం తదితర ప్రదేశాల రహదారులు అర్ధరాత్రి జన సంచారంతో కిటకిటలాడుతున్నాయి. పగలు ట్రాఫిక్ ఇబ్బందులకు భయపడి రాత్రిళ్లు బయటకు వెళ్లి, చల్లని వాతావరణంలో పర్యాకట ప్రాంతాలను చుట్టివస్తున్నారు.


పెరిగిన ఆన్ స్క్రీన్ టైం..

మహానగరంలో విద్యార్థి దశ నుంచే టీవీ, మొబైల్ ఫోన్‌లకు ఎక్కువ సమయం అతుక్కపోతున్నారు. ఆపై యువత, ఉద్యోగులు విధి నిర్వహణలో కంప్యూటర్, ల్యాప్‌టాప్‌ల ముందే సగం కాలం గడిపేస్తున్నారు. దీంతో రోజులో మొబైల్ వాడకం 4 గంటలుగా నమోదవుతోంది. దీనికి తోడు టైంపాస్ కోసం పిచ్చి పిచ్చి యాప్స్‌లో రీల్స్, వీడియోలు చూస్తూ కాలం గడిపేస్తున్నారు. దీంతో నిద్రపై తీవ్ర ప్రభావం పడుతోందని నిపుణులు పేర్కొంటున్నారు.









కళ్లపై తీవ్ర ప్రభావం..

నిద్ర లేమి వల్ల శరీరం, కళ్లు, మెదడుపై ఒత్తిడి పెరుగుతుంది. కళ్లు పొడిబారిపోవడం, చూపు మందగించడం, కళ్లు ఎర్రగా మారడం, మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్, మానసిక రోగాలు వచ్చే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. ఎక్కువ సమయం స్క్రీన్ చూడాల్సి వస్తే వైద్యుల సూచన మేరకు కళ్లజోడు వినియోగించడం మంచిదని నిపుణులు పేర్కొంటున్నారు. చిన్న పిల్లలు ఎక్కువ సమయం స్క్రీన్ చూడటం వల్ల చూపు మందగిస్తుంది. మెల్లకన్ను వచ్చే అవకాశాలు ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నిద్ర లేమి వల్ల శారీరకంగా, మానసికంగా ఒత్తిడికి గురవుతారని చెబుతున్నారు.

ప్రశాంతమైన నిద్ర అవసరం



ప్రస్తుత కాలంలో గ్యాడ్జెట్స్ లేకుండా జీవితం లేదు. అయితే అతిగా వినియోగించడం వల్ల కన్ను, మెదడుపై ఒత్తిడి పెరుగుతోంది. దీని వల్ల సైడ్ ఎఫెక్ట్స్ మొదలవుతాయి. మనకు మానసిక, శారీరక ప్రశాంతతకు సరైన నిద్ర అవసరం. అందుకే మొబైల్ చూసే సమయంలో కనీసం 25 సెంటీమీటర్ల దూరంలో చూడాలి. రాత్రి వేళల్లో వెలుతురు లేకుండా మొబైల్ చూడొద్దు. కంప్యూటర్‌పై పనిచేసే ఉద్యోగులు ప్రతి గంటకు పది నిమిషాలు కంటికి రెస్ట్ ఇవ్వాలి. కను రెప్పలు ఎక్కువ మూసి, తెరుస్తుండాలి. సరైన నిద్ర ఉన్నప్పుడే శరీరం, మెదడు రీఫ్రెష్ అవుతుంది. మెలుకువ వచ్చిన తరువాత ఫ్రెష్‌గా వర్క్ ప్రారంభిస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

– జీవీ రమణకుమార్, నేత్ర వైద్యుడు



పిల్లలు చెప్పిన బుర్రకథ..

తెలంగాణ సంస్కృతిని ప్రదర్శించిన సుచిత్ర అకాడమీ విద్యార్థులు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా 'ఇతిహాసమ్: తెలంగాణ వారసత్వ సంపద ప్రతిధ్వని' థీమ్‌తో సుచిత్ర అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. సుచిత్ర అకాడమీ వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా 'సుచిత్ర ఇన్నోవేషన్ సెంటర్'ను మంగళవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా బ్రహ్మంగారి బుర్ర కథ ప్రదర్శన, తెలంగాణ సంస్కృతిలోని ప్రత్యేక ప్రజా తిరుగుబాట్లను ప్రతిబింబించే ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలకు రష్యాలో భారత దేశ మాజీ అంబాసిడర్ అయిన బలా వెంకటేశ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. అకాడమీ వ్యవస్థాపక చైర్మన్ కృష్ణంరాజు మాట్లాడుతూ.. విద్యార్థులు తెలంగాణలోని సుసంపన్న సంపదను ప్రదర్శనల ద్వారా ప్రాణం పోశారని అన్నారు.

మైన్ అండ్ యువర్స్

తాజ్ కృష్ణలో ఫ్యాషన్, పెళ్లి ఆభరణాలు, లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్

బంజారాహిల్స్‌లోని హోటల్ తాజ్ కృష్ణలో మైన్ అండ్ యువర్స్ వెడ్డింగ్ ఎగ్జిబిషన్ మంగళవారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో భారతదేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ డిజైనర్లు, వెడ్డింగ్ ఫ్యాషన్, టాప్ జ్యూవెలర్స్ వంటి 50కిపైగా డిజైన్లను ప్రదర్శిస్తున్నారు. అత్యంత విలాసవంతమైన వెడ్డింగ్ ఫ్యాషన్ షాపింగ్ ఈ ప్రదర్శన ప్రత్యేకతగా వ్యవస్థాపకులు హర్‌ప్రీత్ సింగ్ తెలిపారు. ఈ ప్రదర్శనలో నటి దివి, ప్రగ్యా అయ్యగారి (మిస్ సుప్రానేషనల్ ఆసియా–2023), నటి దీక్షా పంత్, సిరిపాప మరికొందరు మోడల్స్, ఫ్యాషన్ ప్రేమికులు, జ్యూవెలరీ ఔత్సాహికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఫ్యాషన్ షో అలరించింది.

– సాక్షి, డెస్క్







పెడిగ్రీ ప్రో హైకాన్–24

24న కెనైన్ క్లబ్ ఆధ్వర్యంలో కుక్కలు, పిల్లులు, పెంపుడు ప్రేమికులకు ప్రత్యేక ఈవెంట్

లక్డీకాపూల్ : పెడిగ్రీ ప్రో హైకాన్–24 పేరిట నగరంలో కుక్కలు, పిల్లులు, పెంపుడు ప్రేమికుల పెట్ షో జరుగుతుంది. ఈ నెల 24న నార్సింగిలో ఓఎం కన్వెన్షన్‌లో హైదరాబాద్ కెనైన్ క్లబ్ నిర్వహిస్తుంది. జంతువుల సంక్షేమాన్ని, పెంపుడు జంతువులను ప్రేమించే సంఘాన్ని ఒకచోట చేర్చి పెంపుడు జంతువుల యాజమాన్యాన్ని ప్రోత్సహించే దిశగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన న్యాయనిర్ణేతల మార్గదర్శకత్వంలో ఛాంపియన్‌షిప్ టైటిల్స్ కోసం పోటీపడనున్నారు. ఇండియన్ క్యాట్ క్లబ్ క్యాట్ షోలో కొన్ని అరుదైన జాతులు, బ్రిటిష్ షార్ట్‌హైర్స్, రాగ్‌డాల్స్, మైనే కూన్స్ వంటి అనేక రకాల జాతులను ఇందులో ప్రదర్శిస్తారు. జర్మన్ షెపర్డ్స్, లాబ్రడార్స్, గోల్డెన్ రిట్రీవర్స్, షిహ్ త్జుస్ వంటి ప్రముఖ జాతులను ప్రత్యేక తరహాలో పోటీలో ఉంచి టాప్ 10 బ్రీడ్ అవార్డులు ప్రదానం చేస్తారు. అంతే కాకుండా ఇంటరాక్టివ్ గేమ్స్‌తో పాటు పెంపుడు జంతువుల ప్రేమికులకు ఆకర్షణీయమైన ఫన్ పెట్ యాక్టివిటీ ఏర్పాటు చేయనున్నారు.

చలికాలంలో పెంపుడు జంతువులకు కేర్ అవసరం | **జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న నిపుణులు..**

పెట్ లవర్స్.. బీ కేర్‌ఫుల్..

పెంపుడు జంతువులు.. మన జీవన శైలిలో ఓ భాగం. అయితే ఆ మూగ జీవాలను ప్రాణప్రదంగా భావించేవారు కోకొల్లలు. కంటికి రెప్పలా కాస్తూ.. విడదీయరాని మైత్రి బంధాన్ని కొనసాగించేవారు మరికొందరు. మనుషుల్లానే చలికాలంలో వాటికీ రక్షణ అవసరమే.. అందుకే జంతు ప్రేమికులు చలి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని వాటిపట్ల జాగ్రత్తగా మసలుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మనుషుల మాదిరిగానే వాటికీ సీజనల్ వ్యాధులు వస్తాయి. సరైన జాగ్రత్తలు తీసుకుంటే వాటి ఆరోగ్యానికీ ఢోకా ఉండదని చెబుతున్నారు కెన్నెల్ క్లబ్ ఆఫ్ ఇండియా, తెలంగాణ కెనైన్ అసోసియేషన్ కార్యదర్శి విశాల్ సూదం.

– సనత్‌నగర్



మార్కెట్లో వేడి పుట్టించే ప్రత్యేక దుస్తులు

మనుషులకే కాదు.. పెంపుడు జంతువులకూ చలికాలంలో వేడి పుట్టించే వివిధ రకాల యాక్సెసరీస్ అందుబాటులోకి వచ్చాయి. కుక్కలకు సౌకర్యవంతంగా ఉండడంతో పాటు ఎప్పటికప్పుడు వాష్ చేసుకునేందుకు వీలుగా ఫ్లాట్ బెడ్, రౌండ్ బెడ్లు దొరుకుతున్నాయి. కుక్కలు, పప్పీస్ చలి తీవ్రతను వీటి ద్వారా అరికట్టవచ్చు. దీంతోపాటు ప్రత్యేక స్వెట్టర్లు జంతువులకు రక్షణ నిలుస్తున్నాయి. అన్ని సైజుల కుక్కలకూ అనువుగా ఉండేలా వివిధ మోడళ్లతో ఊలుతో తయారుచేసిన స్వెట్టర్లు లభిస్తున్నాయి. ఇవి కూడా వాటి సైజు, నాణ్యత ఆధారంగా వివిధ ధరల్లో లభిస్తున్నాయి. అలాగే. కాళ్లకు రక్షణ కలిగించే రీతిలో శీతాకాలంలో షూష్ అందుబాటులో ఉన్నాయి.

కాలుష్యం బారిన పడకుండా..

శీతాకాలంలో మంచు కారణంగా గాలిలో తేమ శాతం కారణంగా గాలి నాణ్యత తక్కువగా ఉంటుంది. దీంతో పెంపుడు జంతువులు వాయు కాలుష్యం బారిన పడి శ్వాసకోశ వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉంది. అందుకే బయటకు తీసుకెళ్లకపోవడమే ఉత్తమం. పెట్స్ ఆరోగ్యంగా ఉండడానికి రెగ్యులర్‌గా గ్రూమింగ్ చేయడం అవసరం. నీళ్లు తాగించేందుకు ఉపయోగించే గిన్నెలు, పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.





సీజనల్ వ్యాధులు..

శీతాకాలలో వ్యాధులు సంక్రమించే అవకాశం ఎక్కువ. చలి కాలంలో ఫ్లీస్, టిక్, మైట్స్ (గోమర్లు) అనే బాహ్య పరాన్నజీవులు కుక్కల చర్మంపై చేరతాయి. దీంతో జుట్టు రాలిపోవడం, టిక్ ఫీవర్ రావడం, బ్లడ్ లాస్ కావడం, దురదలు కారణంగా కుక్కలు వాటంతట అవే శరీరాన్ని కొరుక్కుంటాయి. గాలి సంక్రమణ ద్వారా ఒక కుక్క నుంచి మరో కుక్కకు పాకుతుంటాయి. అందుకోసం ముందుగానే నిపుణుల సలహా మేరకు బెల్టు టైపులో ఉండే యాంటీ టిక్ కాలర్ ఏర్పాటు చేయడం రక్షణగా ఉంటుంది. అలాగే తరచూ యాంటీ రాబీస్, సెవన్ ఇన్ వన్ వంటి టీకాలను వేయించాలి. షాంపో, పౌడర్, స్ప్రేస్‌తో ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తే ఆరోగ్యకరంగా ఉంటాయి.

ప్రత్యేక శ్రద్ధ అవసరం..

శీతాకాలంలో మంచుకురిసే అవకాశం ఉన్నందున సాధ్యమైంత వరకూ పెంపుడు జంతువులకు ప్రత్యేక షెల్టర్ గానీ, ఇంట్లో వెచ్చని ప్రదేశాన్ని గానీ కేటాయిస్తే బాగుంటుంది. ముఖ్యంగా పప్పీస్ విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి. వాటి దినచర్యలో ఏవైనా మార్పులు వస్తే.. వైద్యుల సలహా పాలించాలి.

– విశాల్ సూదం, కెనైన్ అసోసియేషన్



తొలగింపు కుదరదు..

ఇకపై వద్దు

▶ మొదటి పేజీ తరువాయి



ప్రవేశపెట్టిన సర్వీస్ రూల్స్ ద్వారా భర్తీ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ సర్వీస్ నిబంధనల్లోని రూల్ 3.. జూనియర్ లెక్చరర్ల పోస్టులను నోటిఫికేషన్ ఇచ్చి లేదా పదోన్నతితో భర్తీ చేయాలని చెబుతోంది. డిగ్రీ లెక్చరర్లకూ ఇలాంటి నిబంధనే వర్తిస్తుంది. మేమంతా జూనియర్, డిగ్రీ లెక్చరర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టులకు నిబంధనల మేరకు అర్హులం. జూనియర్, డిగ్రీ లెక్చరర్ల పోస్టులను కాలేజ్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేసేలా ఆంధ్రప్రదేశ్ కాలేజ్ సర్వీస్ కమిషన్ చట్టం 1985ను ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. అయితే, ఈ చట్టం 2001లో రద్దయింది. ఆ తర్వాత నుంచి పారదర్శక విధానం లేకుండా కాంట్రాక్టు విధానంలో ఎంపిక కమిటీ పోస్టులను భర్తీ చేయడం ప్రారంభించింది. 2002 తర్వాత నుంచి నేరుగా ఈ పోస్టులను భర్తీ చేయలేదు. ఈ క్రమంలో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ కోసం 2016, ఫిబ్రవరి 26న ప్రభుత్వం చట్టవిరుద్ధంగా సెక్షన్ 10ఏను చేరుస్తూ ప్రభుత్వం జీవో16ను తెచ్చింది. దీంతో అర్హతలు లేని వారు ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు' అని పిటిషనర్లు వాదించారు.

విద్యాశాఖ వాదన..

'పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 101 మేరకు.. నిర్దీత వ్యవధిలో ఇప్పటికే ఉన్న చట్టాన్ని సవరణ చేసే, రద్దు చేసే వీలు సర్కార్‌కు ఉంది. 2014, జూన్ 2కు ముందున్న వారినే క్రమబద్ధీకరణ, రిజర్వేషన్లు కూడా వర్తింపు.. ఇలా సెక్షన్ 10ఏలో ఆరు నిబంధనలు చేర్చి ఆ మేరకే క్రమబద్ధీకరించాం. భవిష్యత్తులో మరిన్ని పోస్టులను భర్తీ చేయనున్నందున నిరుద్యోగ యువత అవకాశాలను జీవో 16 నిర్వీర్యం చేస్తుందన్న పిటిషనర్ల ఆందోళన సరికాదు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా క్రమబద్ధీకరణ జరిగిందనడం అర్థరహితం. జీవో 16 మేరకున్న పోస్టులను 2023, ఏప్రిల్ 30న జీవో 38 ద్వారా క్రమబద్ధీకరించాం' అని విద్యాశాఖ పేర్కొంది. 5,544 మందిని క్రమబద్ధీకరిస్తే కొందరినే ప్రతివాదులుగా పేర్కొనడంపై అనధికారిక ప్రతివాదుల (క్రమబద్ధీకరించిన వారు) తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. దీన్ని పరిగణనలోకి తీసుకుని రిట్ పిటిషన్లను కొట్టివేయాలన్నారు.

శృంగేరి శారద పీఠానికి వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డులోని శ్రీ శృంగేరీ శారద పీఠంలో జగద్గురువు శ్రీ విధుశేఖర భారతి స్వామిజీని మంగళవారం మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దర్శించుకున్నారు. పీఠంలోని ధార్మిక భవనంలో స్వామిజీ ఆశీర్వచనం తీసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. విజయ యాత్రలో భాగంగా స్వామిజీ దక్షిణాదిలోని 3 రాష్ట్రాల్లో 40 రోజుల పాటు పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా 18, 19 తేదిల్లో విజయవాడలోని శివరామకృష్ణ క్షేత్రంలో బస చేసిన ఆయనను వైఎస్ జగన్ కలిశారు. ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్, వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్లు అవుతు శైలజారెడ్డి, బెల్లం దుర్గ తదితరులు జగన్ వెంట ఉన్నారు. వైఎస్ జగన్ రాకను తెలుసుకొని పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అక్కడికి చేరుకోవడంతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. వీరందరికీ చిరునవ్వుతో వైఎస్ జగన్ అభివాదం చేశారు.



వైఎస్ జగన్‌కు ప్రసాదం అందిస్తున్న స్వామీజీ

బందోబస్తు మధ్య
'ఫ్యూచర్' రోడ్డుకు సర్వే

- గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణం కోసం కొంగరకలాన్ నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు భూసేకరణ
- పరిహారం చెల్లింపు విషయంలో స్పష్టత కరువు
- రైతులు, మహిళల నిరసన

కందుకూరు/ఇబ్రహీంపట్నం రూరల్: ఫ్యూచర్ సిటీ ఏర్పాటులో భాగంగా ప్రభుత్వం చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు సర్వే పనులను మంగళవారం పోలీసు బందోబస్తు మధ్య చేపట్టారు. ఈ సందర్భంగా భూములు ఇచ్చి తామెక్కడికి వెళ్లాలంటూ రైతులు ఆవేదన వెలిబుచ్చారు. భూములు కోల్పోతున్న వారికి ఎంత పరిహారం ఇస్తారు? ఎలా న్యాయం చేస్తారో చెప్పకుండా పోలీసులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారులు సర్వే చేస్తుండగా.. కొంగరకలాన్‌లో కలెక్టరేట్ వెనక వైపు చేపట్టిన సర్వే పనులను అడ్డుకుని మహిళలు నిరసన తెలిపారు. రాజు అనే యువ రైతు తమ భూమి తీసుకుంటే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. దీంతో పోలీసులు అతన్ని సముదాయించి అక్కడి నుంచి పంపించారు.

330 అడుగుల రహదారి

రంగారెడ్డి జిల్లా కందుకూరు, యాచారం మండలాల్లో గత ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీని నిర్మించడానికి సిద్ధమైన విషయం తెలిసిందే. అక్కడికి చేరుకునేలా ఓఆర్ఆర్ ఎగ్జిట్ 13 నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు 330 అడుగుల రహదారి నిర్మాణానికి ప్రతిపాదించింది. ఇందుకోసం ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్, మహేశ్వరం మండలం కొంగరకుర్దు, కందుకూరు మండలం లేమూరు, తిమ్మాపూర్, రాచులూరు, గుమ్మడవెల్లిలో రిజర్వు ఫారెస్ట్, పంజగూడ,



కొంగరకలాన్ రెవెన్యూలో సర్వే చేయడానికి వచ్చిన అధికారులతో వాగ్వాదం చేస్తున్న రైతులు

మీర్‌ఖాన్‌పేటలో కలిపి మొత్తం 449.27 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించింది. ఫ్యూచర్ సిటీ రోడ్డు కోసం ఇటువైపు కందుకూరు మండలం రాచులూరుతోపాటు అటువైపు ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్‌లో అధికారులు ఏకకాలంలో సర్వే పనులు ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, కందుకూరు తహసీల్దార్ గోపాల్, మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐలు సీతారామ్, వెంకట్‌తోపాటు పోలీసుల బందోబస్తు నడుమ సర్వే నిర్వహించారు. అక్కడి రైతులు అధికారులకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. అంత పెద్ద రోడ్డు నిర్మిస్తే పొలాలు మొత్తం పోయి, రోడ్డున పడాల్సి వస్తుందని వాపోయారు. సమావేశం ఏర్పాటు చేసి తర్వాత వివరాలు వెల్లడిస్తామని చెప్పి అధికారులు సర్వేను కొనసాగించారు.

పక్కకు ఒరిగిన భవనం

- హైదరాబాద్ మాదాపూర్ సమీపంలో కలకలం
- నాలుగంతస్తుల భవనంలోని అందరూ సురక్షితం

గచ్చిబౌలి (హైదరాబాద్): రాజధాని నగరంలోని మాదాపూర్ ఐటీ కారిడార్‌కు చెంతనే ఉన్న సిద్ధిఖీనగర్‌లో నాలుగు అంతస్తుల భవనం పక్కకు ఒరిగిన ఘటన కలకలం రేపింది. వసుకుల లక్ష్మణ్ అనే వ్యక్తి ప్లాట్ నం. 1639లో 70 గజాల స్థలంలో జీప్లస్ ఫోర్ భవనాన్ని నిర్మిచారు. ఫ్లోర్‌కు రెండు పోర్షన్ల చొప్పున నాలుగు ఫ్లోర్లు నిర్మాణం చేశారు. ఆ భవనంలో మొత్తం 48 మంది అద్దెకు ఉంటున్నారు. వారంతా చెంతనే ఉండే ఐటీ కంపెనీల్లో హౌజ్‌కీపింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం సాయంత్రం 7 గంటల సమయంలో గోడ కూలినట్లు శబ్దం వచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. కానీ రాత్రి 8.30 గంటల సమయంలో పెద్దగా శబ్దం వచ్చి భవనం ఒరిగిపోతోందని అరుపులు వినిపించడంతో అందరూ భయాందోళనలకు గురయ్యారు. ప్రాణాలు అరచేతిలో పట్టుకొని ఆదరాబాదరాగా కిందకు వచ్చేశారు. ఇంతలోనే మూడో అంతస్తులో ఉండే సాదిక్ హుస్సేన్ కిందికి దూకగా అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ఈలోగా అందరూ కిందకు వచ్చేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే భవనం నిర్మించినట్లు తెలుస్తోంది.

పక్క స్థలంలో గుంతలు తీయడంతోనేనా..

ఈ భవనం పక్కనే ఉండే 1605, 1638 ప్లాట్లను కలిపి భవనం నిర్మించేందుకు పిల్లర్లు వేయడానికి గుంతలు తవ్వారు. వీటితో భవనానికి ఇబ్బంది వస్తుందని ఈ భవన యజమాని వారిని హెచ్చరించారు. అయినా వారు వినలేదు. దీనివల్లే ఈ



ఒరిగిన భవనం

భవనం పరిస్థితి ఇలా మారిందని కొందరు అంటున్నారు. ఘటనా స్థలాన్ని జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, శేరిలింగంపల్లి టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ, మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్, డీఆర్‌ఎఫ్ సిబ్బంది పరిశీలించారు. పక్కకు ఒరిగిన భవనం చుట్టూ ఉండే పది భవనాల్లో నివాసం ఉండేవారిని ముందు జాగ్రత్త చర్యగా ఖాళీ చేయించి వేరేచోటికి తరలించారు. ఈ



భవనాన్ని ఆనుకొని తీసిన గుంత

భవనం ముందు కేవలం పదిఫీట్ల రోడ్డు మాత్రమే ఉంది. భవనాన్ని ఇంజనీర్లు పరిశీలించి నాణ్యతను నిర్ణయిస్తారని, వారి నివేదిక ఆధారంగా ఒరిగిన భవనాన్ని తొలగిస్తామని ఉపేందర్‌రెడ్డి వెల్లడించారు. అలాగే ఈ భవనం వెనుక లోతైన గుంతలు తీసిన బిల్డర్‌పైనా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

భవనం విరిగిందని అరుపులు వినిపించడంతో వచ్చేశా..

'మేము మొదటి అంతస్తులో ఉంటున్నాం. రాత్రి 8.30 గంటల సమయంలో శబ్దం వచ్చింది. కొద్దిసేపటికే ఇంట్లోని సామాన్లు కిందపడిపోవడం ప్రారంభమైంది. అదే సమయంలో భవనం విరిగిందని అరుపులు వినిపించడంతో వంట చేస్తున్న స్టవ్ ఆర్పకుండానే భయంతో కిందికి వచ్చేశా' అని జహారుల్ చెప్పారు.

పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు పెంచాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

విజయనగర్ కాలనీ: పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీల రిజర్వేషన్‌ను 22 నుంచి 42 శాతం వరకు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. మంగళవారం మాసబ్‌ట్యాంక్ దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్‌లోని డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్ బి.వెంకటేశ్వరరావును బీసీ నాయకులతో కలిశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం డెడికేటెడ్ బీసీ కమిషన్‌ను నియమించాలని, దీనికి విస్తృతమైన, న్యాయపరమైన, రాజ్యాంగపరమైన అధికారాలున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కులగణన చేసి దాని ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచితే న్యాయపరమైన, చట్టపరమైన అవరోధాలుండవని చెప్పారు. అగ్ర కులాలకు విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు పెట్టినప్పుడు 50 శాతం సీలింగ్ కాలం చెల్లిన



డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

విధానమని సుప్రీంకోర్టు తెలిపిందన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకుడు గుజ్జ కృష్ణ, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, వేముల రామకృష్ణ, గొరిగె మల్లేశ్, జిల్లపల్లి అంజి, సతీశ్, అల్లంపల్లి రామకోటి, వీరన్న, అనంతయ్య, సి.రాజేందర్, జయంతి, రాఘవేందర్, వంశీకృష్ణ, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యసభ నుంచి జేఎన్‌యూ కోర్టుకు కె.లక్ష్మణ్

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోనే ప్రతిష్టాత్మకమైన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ కోర్టుకు తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ నామినేట్ అయ్యారు. అలాగే, మధ్యప్రదేశ్‌కు చెందిన సుమేర్‌సింగ్ సోలంకి, మహారాష్ట్రకు చెందిన సుఖ్‌దేవ్ రావ్ బోండేలను కూడా నామినేట్ చేస్తూ.. రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ నిర్ణయం తీసుకున్నారు. వార్షిక నివేదికలు, వార్షిక ఖాతాలు, ఆడిట్ రిపోర్టులు, జేఎన్‌యూ వార్షిక బడ్జెట్‌పై చర్చించేందుకు, పరిశీలించేందుకు వైస్‌చాన్స్‌లర్ అధ్యక్షతన ప్రతీ ఏటా ఈ కోర్టు సమావేశమవుతుంది. అలాగే, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్, అకడమిక్ కౌన్సిల్ చర్యలను సమీక్షించే అధికారాలు కూడా ఈ కోర్టుకు ఉంటాయి. లోక్‌సభ స్పీకర్ నామినేట్ చేసిన ఆరుగురు ఎంపీలు, రాజ్యసభ చైర్మన్ నామినేట్ చేసిన నలుగురు ఎంపీలు.. మొత్తం 10మంది ఎంపీలు ఈ కోర్టులో సభ్యులుగా ఉంటారు.

ఆర్టీఐ చట్టాన్ని సద్వినియోగించు కోవాలి

గంగా రజినీ ప్రియారెడ్డి

సాక్షి, హైదరాబాద్: సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గంగా రజినీ ప్రియారెడ్డి అన్నారు. సమాచార హక్కు చట్టం సాధన కమిటీ తెలంగాణ రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ అధ్యక్షుడు చంటి ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సూర స్రవంతి.. రజినీప్రియారెడ్డికి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రజినీ ప్రియారెడ్డి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని, అధికారుల్లో జవాబుదారీతనం కొరవడిందని ఆందోళన వ్యక్తంచేశారు. నిర్దీత సమయంలోపు సమాచారం అందించకపోతే అప్పిలేట్ అధికారికి అప్పీల్ చేసుకోవచ్చని, ఇక్కడా స్పందన రాకపోతే రాష్ట్ర సమాచార చట్టం చీఫ్ కమిషనర్‌కు అప్పీల్ చేసుకోవాలని సూచించారు.

వృత్తి, విద్యలో మహిళలకు మద్దతుగా ఉంటాం

యూఎస్ పబ్లిక్ డిప్లమసీ ఆఫీసర్

సాక్షి, హైదరాబాద్: వృత్తిపరంగా, విద్యలో, నాయకత్వంలో మహిళలకు తాము మద్దతుగా నిలుస్తామని, వారితో కలిసి ముందుకు సాగుతామని యూఎస్ కాన్సులేట్ పబ్లిక్ డిప్లమసీ ఆఫీసర్ ఎమిలియా స్మిత్ అన్నారు. నగరంలో నిర్వహించిన ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్–2024 తెలంగాణ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో మంత్రి సీతక్కతో కలిసి ఆమె పాల్గొన్నారు.

పేదలకు 'సూపర్ వెరైటీ' రేషన్

- త్వరలో బీపీఎల్ కుటుంబాలకు అందజేస్తాం
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు (బీపీఎల్) త్వరలోనే 'సూపర్ వెరైటీ'రకం ఆహారధాన్యాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా బీపీఎల్ కుటుంబాలకు నాణ్యమైన ఆహార ధాన్యాలను అందించాలని నిర్ణయించినట్లు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో ఆహారధాన్యాలు అతి తక్కువ శాతం వృథా అవుతున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని తెలిపారు. అన్ని రాష్ట్రాల్లో ఐసీఏఆర్‌ఐఈఆర్ నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం తేలిందని చెప్పారు. ఆహార ధాన్యాల వృథాను అరికట్టిన పౌరసరఫరాల శాఖ కమిషనర్, సిబ్బందిని మంత్రి అభినందించారు. పీడీఎస్ ద్వారా నెలకు 2.8 కోట్ల మందికి 6 కేజీల చొప్పున ఉచిత బియ్యం సరఫరాతోపాటు 49 లక్షల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచిత ఫోర్టిఫైడ్ రైస్‌ను అందిస్తున్నట్టు వివరించారు.

నీటిపారుదల శాఖలో పదవీకాలం పొడిగింపు వద్దు

జలసౌధ ఎదుట ఇంజనీర్ల ఆందోళన

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖలో పదవీ విరమణ చేసిన ఇంజనీర్ల పదవీకాలాన్ని పొడిగించడాన్ని వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లోని జలసౌధ ఎదుట వివిధ ఇంజనీర్ల సంఘాలు ఆందోళన నిర్వహించాయి. పదవీకాలం పొడిగింపుతో పదోన్నతులు లభించక నష్టపోతున్నామని నిరసన తెలిపాయి. పదవీకాలం పొడిగింపులను మానుకుని వెంటనే పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశాయి. ఇంజనీర్స్ అసోసియేషన్, ఇరిగేషన్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్, తెలంగాణ ఇరిగేషన్ గెజిటెడ్ ఇంజనీర్స్ అసోసియేషన్, అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ మద్దతు



తెలిపింది. అనంతరం నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ (జనరల్) జి.అనిల్‌కుమార్‌ను వేర్వేరుగా కలిసి సంఘాల నేతలు వినతి ప్రతం అందజేశారు. కార్యక్రమంలో టీజీఓ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపైనా
అబద్ధాలే

- అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ఆరోపణలన్నీ అసత్యాలే
- కూటమి సర్కారు విడుదల చేసిన సామాజిక ఆర్థిక సర్వేనే నిదర్శనం
- స్థిర ధరల ఆధారంగా వైఎస్సార్ సీపీ హయాంలో పెరిగిన వృద్ధి రేటు
- 2022–23లో 5.81 శాతం... 2023–24లో ఏకంగా 7.35% వృద్ధి
- జాతీయ స్థాయిని మించి రాష్ట్ర తలసరి ఆదాయం
- గత మూడేళ్లుగా రాష్ట్ర సొంత ఆదాయంలో పెరుగుదల
- 2023–24 సామాజిక ఆర్థిక సర్వే సాక్షిగా బట్టబయలైన వాస్తవాలు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

జీవో 29ని రద్దు చేయాలి

- నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు డిమాండ్
- స్పందించకుంటే ఆదిలాబాద్ టు ఖమ్మం వరకు పాదయాత్ర

పంజగుట్ట(హైదరాబాద్): రూల్ ఆఫ్ రిజర్వేషన్, రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉన్న జీవో 29ని వెంటనే రద్దు చేయాలని నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆ జీవోను రద్దు చేయకపోతే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బస్సు యాత్ర చేపట్టి ప్రతీ గ్రామాన్ని కదిలించిన నిరుద్యోగ జేఏసీ.. అదే కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగ వ్యతిరేక విధానాలను ప్రచారం చేస్తూ ఆదిలాబాద్ నుంచి ఖమ్మం అడవుల వరకు పాదయాత్ర నిర్వహిస్తామని హెచ్చరించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ ప్రతినిధులు జనార్దన్, ఇంద్రానాయక్, హరికృష్ణ, ప్రశాంత్‌కుమార్, మహేశ్ గౌడ్‌లు మాట్లాడారు. ఎన్నికల ముందు మీ వెనుక మేము ఉన్నాం అని మమ్మల్ని బస్సుయాత్రకు ప్రోత్సహించిన బల్మూరి వెంకట్, రియాజ్ ఇప్పుడు ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు. అప్పుడు బస్సు యాత్ర చేసి ప్రతీ గ్రామాన్ని కదిలించామని, ఇప్పుడు పాదయాత్ర చేసి నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసం గురించి వివరించి, 30 లక్షల కుటుంబాలను.. కోటీ 20 లక్షల ఓటర్లను కదిలిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.



జనార్దన్

వెరిఫికేషన్ పూర్తయినా నియామకాల్లేవు!

- ప్రజాభవన్‌లో డీఎస్సీ–2008 బాధితుల ఆవేదన

లక్డీకాపూల్ (హైదరాబాద్): తమకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయ్యి 50 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వడం లేదని డీఎస్సీ–2008 అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన దాదాపు 200 మందికి పైగా అభ్యర్థులు మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు తరలివచ్చారు. 15 ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమకు ఉద్యోగాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు కూడా అవకాశం ఇచ్చిందని వారు తెలిపారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 1,400 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకున్నట్టు వెల్లడించారు. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులకు, విద్యాశాఖ అధికారులకు ధన్యవాదాలు చెబుతున్నామని, అయితే 50 రోజులు గడుస్తున్నా తదుపరి ప్రక్రియపై ముందడుగు పడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కౌన్సెలింగ్ షెడ్యూల్ ఇచ్చి, అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.



డీఎస్సీ అభ్యర్థుల సమస్యపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

అభ్యర్థులతో చిన్నారెడ్డి చర్చలు

ప్రజాభవన్‌లో న్యాయం కోరుతూ బైఠాయించిన డీఎస్సీ–2008 అభ్యర్థులతో రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి చర్చలు జరిపారు. విద్యాశాఖ కమిషనర్ నర్సింహారెడ్డి, ఇతర అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అభ్యర్థుల జాబితా రూపకల్పన ప్రక్రియ చివరి దశలో ఉందని, రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్సీ–2008 సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, కార్యదర్శి మెరుగు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జితేందర్‌రెడ్డి వర్సెస్ చాముండేశ్వరనాథ్

రేపు తెలంగాణ ఒలింపిక్ సంఘం ఎన్నికలు

సాక్షి, హైదరాబాద్: సుదీర్ఘ విరామం.. కోర్టు వివాదాలు ముగిసిన తర్వాత తెలంగాణ ఒలింపిక్ సంఘం (టీఓఏ) ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఈ నెల 21న ఒలింపిక్ భవన్‌లో ఈ ఎన్నికలు జరగనున్నాయి. ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది జూన్‌లోనే ఎన్నికల కోసం నోటిఫికేషన్ ఇచ్చినా, వేర్వేరు కారణాలతో ఈ ప్రక్రియ కోర్టుకు చేరింది. ఇప్పుడు అన్నీ చక్కబడటంతో రాష్ట్రంలోని వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు బరిలో నిలిచారు. మొత్తం 68 మంది ఓటర్లు ఉండగా, ముగ్గురికి ఓటింగ్ అర్హత లేదని రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. దీంతో 65 ఓట్ల నుంచే విజేత ఎవరో తేలనుంది. ప్రధానంగా అధ్యక్ష పదవిపైనే పోటీ నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఢిల్లీలో కేబినెట్ హోదాలో ప్రత్యేక ప్రతినిధిగా ఉన్న ఏపీ జితేందర్‌రెడ్డి (రోయింగ్ సంఘం



జితేందర్‌రెడ్డి



చాముండేశ్వరనాథ్

) అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘంలో కూడా అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. అధికార పార్టీకి చెందిన వ్యక్తి కావడంతోపాటు క్రీడా సంఘాల్లో తనకున్న పరిచయాలు గెలిపిస్తాయని ఆయన నమ్ముతున్నారు. అయితే మరోవర్గం నుంచి ఆంధ్ర మాజీ క్రికెటర్, తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు వి.చాముండేశ్వరనాథ్ ప్రత్యర్థిగా ఉన్నారు. ఓటింగ్‌కంటే ముందే జితేందర్‌ను పోటీ నుంచి తప్పించి తాను గెలిచేందుకు చాముండి ప్రయత్నిస్తున్నారు. దీనికి సంబంధించి కీలకాంశాన్ని ఆయన భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) దృష్టికి తీసుకెళ్లారు. 70 ఏళ్లు దాటిన జితేందర్‌రెడ్డి పోటీకి అనర్హుడన్నారు. పైగా ఓటర్ల జాబితాలో పలు తప్పులు జరిగినట్లు ఆయన చెబుతున్నారు. నిజానికి తెలంగాణ ఒలింపిక్ సంఘంలో కొంతకాలంగా వివాదాలు సాగుతున్న నేపథ్యంలో అక్కడి పరిస్థితులను సమీక్షించే ఒక నివేదిక ఇవ్వాల్సిందిగా వీపీ షియాద్‌తో ఐఓఏ ఏకసభ్య కమిటీని నియమించింది. దీనికి 10 డిసెంబర్ వరకు గడువు ఇచ్చింది. కాబట్టి ఈ నివేదిక వచ్చే వరకు ఎన్నికలను నిలిపి వేయాల్సిందిగా చాముండి కోరుతున్నారు. అయితే తాను నామినేషన్ వేసిన సమయంలో 70 ఏళ్లలోపే ఉన్నానని, కోర్టుల కారణంగా ఆలస్యమైతే అది తనకు వర్తించదని జితేందర్ స్పష్టం చేశారు. ప్రధాన కార్యదర్శి పదవి కోసం పి.మల్లారెడ్డి (సైక్లింగ్ సంఘం), సి.బాబూరావు (బాక్సింగ్), కోశాధికారి పదవికి సతీశ్ గౌడ్ (తైక్వాండో), ప్రదీప్‌కుమార్ (కయాకింగ్ అండ్ కనోయింగ్) పోటీ పడుతున్నారు. అధ్యక్ష, కార్యదర్శి పదవులకు మినహా మిగతా అన్ని పదవులకు ఏకగ్రీవ ఎంపిక జరగడం ఖాయమైంది.

లగచర్ల కుట్రదారులనూ శిక్షించాలి

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఉద్యోగ సంఘాల జేఏసీ వినతి

సాక్షి, హైదరాబాద్: వికారాబాద్ జిల్లా లగచర్లలో అధికారులపై దాడికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకొనేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కోరింది. అధికారులపై దాడితో ఉద్యోగుల నైతిక స్థైర్యం దెబ్బతిన్నదని తెలిపింది. ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి నేతృత్వంలో పలు సంఘాల ప్రతినిధులు మంగళవారం గవర్నర్‌ను కలిసి లగచర్ల దాడిపై ఫిర్యాదు చేశారు. రైతుల ముసుగులో అధికారులపై దాడి చేసినవారితోపాటు, దాడికి ప్రేరేపించిన కుట్రదారులపై కూడా కఠిన చర్యలు తీసుకొనేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. ఇలాంటి ఘటనలపై కఠినంగా వ్యవహరించకపోతే దాడులు ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించే ప్రమాదం ఉందని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని వివరించారు. జేఏసీ నేతల విజ్ఞప్తిపై గవర్నర్ సానుకూలంగా స్పందించారని లచ్చిరెడ్డి చెప్పారు. గవర్నర్‌ను కలిసినవారిలో జేఏసీ నేతలు డా. నిర్మల, జీఎస్ కుమారస్వామి, కె. రామకృష్ణ, ఎస్.రాములు, రమేష్ పాక, మేడి రమేష్, దర్శన్ గౌడ్, ఫూల్ సింగ్ చౌహాన్, మహిపాల్ రెడ్డి, అంజయ్య, రాబర్ట్ బ్రూస్ తదితరులు ఉన్నారు.


స్వప్నరాణి



ప్రెజర్ నుంచి ప్లెజర్‌కు...

పోటీ పరీక్షల ఒత్తిడి, ఉద్యోగంలో పని ఒత్తిడి, సంసార జీవితంలో ఆర్థిక సమస్యల ఒత్తిడి, వ్యాపారంలో నష్టాల ఒత్తిడి... 'ఒత్తిడి' రాక్షస పాదాల కింద ఎన్నో జీవితాలు నలిగిపోతున్నాయి. అయితే ఒత్తిడి అనేది తప్పించుకోలేని పద్మవ్యూహమేమీ కాదు. ఒత్తిడిని చిత్తు చేసే వజ్రాయుధం, ఔషధం సంగీతం అని తెలిసిన స్వప్నరాణి... ఆ ఔషధాన్ని పిల్లల నుంచి పెద్దల వరకు, గృహిణుల నుంచి ఉద్యోగుల వరకు ఎంతోమందికి చేరువ చేస్తోంది. మరోవైపు మరుగునపడిన జానపదాలను వెలికి తీస్తూ ఈ తరానికి పరిచయం చేస్తోంది. 'సంగీతం ఈ కాలానికి తప్పనిసరి అవసరం' అంటుంది.

సంగీతం... ఈ కాలానికి తప్పనిసరి అవసరం

'సంగీతం మనకు ఏం ఇస్తుంది?' అనే ప్రశ్నకు ఒక్క మాటల్లో జవాబు చెప్పలేం. సంగీతం అనేది తీరని దాహం. ఎంత నేర్చుకున్నా నేర్చుకోవాల్సింది ఎంతో ఉంటుంది. పాఠశాల విద్యార్థుల నుంచి ఉద్యోగుల వరకు ఎంతోమంది ఒత్తిడి గురవుతున్నారు. అందుకే ఈ కాలానికి సంగీతం అనేది తప్పనిసరి అవసరం.

సంగీతం వినడమే కాదు నేర్చుకోవడం కూడా గొప్ప అనుభవం. నా పరిశోధనలో భాగంగా మరుగున పడిన ఎన్నో జానపదాలను సేకరించిన వాటిని ఈ తరానికి పరిచయం చేస్తున్నాను.

– స్వప్నరాణి

నిజామాబాద్‌కు చెందిన స్వప్నరాణి సంగీతం వింటూ పెరిగింది. సంగీతం ఆమె అభిరుచి కాదు జీవనవిధానంగా మారింది. యశ్వంత్‌రావ్ దేశ్ పాండే దగ్గర హిందుస్తానీ సంగీతంలో డిప్లొమా, పాలకుర్తి రామకృష్ణ దగ్గర కర్ణాటక సంగీతంలో డిప్లొమా చేసింది. తిరుపతిలోని పద్మావతి విశ్వవిద్యాలయంలో సంగీతంలో ఎంఏ, పీహెచ్‌డీ చేసింది. ఉత్తర తెలంగాణలో సంగీతంలో పీహెచ్‌డీ చేసిన మొదటి వ్యక్తిగా గుర్తింపు పొందింది.

'ఇందూరు జానపద సంగీతంలో శాస్త్రీయ ధోరణులు' అనే అంశంపై పరిశోధన చేసింది. తన పరిశోధనలో భాగంగా నిజామాబాద్ జిల్లాలో ఆరువందలకు పైగా జానపద పాటలను సేకరించింది.

సంగీతం అనేది నిలవ నీరు కాదు. అదొక ప్రవాహ గానం. ఆ గానాన్ని సంగీత అధ్యాపకురాలిగా విద్యార్థులకు మాత్రమే కాదు వయో భేదం లేకుండా ఎంతోమందికి చేరువ చేస్తోంది స్వప్నరాణి.

స్వప్నరాణి దగ్గర సంగీత పాఠాలు నేర్చుకోవడానికి కనీస అర్హత ఏమిటి?

'నాకు సంగీతం నేర్చుకోవాలని ఉంది' అనే చిన్న మాట చాలు.

నిజామాబాద్‌లోని ప్రభుత్వ జ్ఞాన సరస్వతి సంగీత, నృత్య పాఠశాలలో అసిస్టెంట్ లెక్చరర్‌గా పనిచేస్తున్న డాక్టర్ తిప్పోల్ల స్వప్నరాణి 'నాకు వచ్చిన సంగీతంతో నాలుగు డబ్బులు సంపాదించాలి' అనే దృష్టితో కాకుండా 'నాకు వచ్చిన సంగీతాన్ని పదిమందికి పంచాలి' అనే ఉన్నత లక్ష్యంతో తన ప్రయాణాన్ని ప్రారంభించింది.

స్వప్నరాణి దగ్గర పాఠాలు నేర్చుకున్న వారిలో కాస్తో కూస్తో సంగీత జ్ఞానం ఉన్నవారితో పాటు బొత్తిగా స ప స లు కూడా తెలియని వారు కూడా ఉన్నారు.

స్వప్న శిష్యుల్లో సాధారణ గృహిణుల నుంచి ప్రభుత్వ ఉద్యోగుల వరకు ఎంతోమంది ఉన్నారు.

'సంగీతం గురించి వినడమే కానీ అందులోని శక్తి ఏమిటో తెలియదు. స్వప్న మేడమ్ సంగీత పాఠాల ద్వారా ఆ శక్తిని కొంచెమైనా తెలుసుకునే అవకాశం వచ్చింది. స్ట్రెస్ బస్టర్ గురించి ఏవేవో చెబుతుంటారు. నిజానికి మనకు ఏ కాస్త సంగీతం వచ్చినా ఒత్తిడి అనేది మన దరిదాపుల్లోకి రాదు' అంటుంది ఒక గృహిణి.

'సంగీతం నేర్చుకోవాలనేది నా చిన్నప్పటి కల. అయితే రకరకాల కారణాల వల్ల ఆ కల కలగానే మిగిలిపోయింది. రిటైర్‌మెంట్‌కు దగ్గరలో ఉన్నాను. ఈ టైమ్‌లో సంగీతం ఏమిటి అనుకోలేదు. స్వప్నగారి పాఠాలు విన్నాను. నా కల నెరవేరడం మాట ఎలా ఉన్నా... సంగీతం వల్ల ఒత్తిడికి దూరంగా ప్రశాంతంగా ఉండగలుగుతున్నాను' అంటుంది ఒక ప్రభుత్వ ఉద్యోగి.

ఇప్పటికి ఐదుసార్లు శత గళార్చన కార్యక్రమాలు నిర్వహించిన స్వప్న 'సహస్ర గళార్చన' లక్ష్యంతో పనిచేస్తోంది.

'రాగం(నాదం), తాళంలో శృతిలయలు ఉంటాయి. నాదంలో 72 ప్రధాన రాగాలు ఉంటాయి. ఏ శబ్దం ఏ రాగంలో ఉండాలో ట్రాక్ తప్పకుండా ఉండాలంటే నేర్చుకునేవారిలో ఏకాగ్రత, నిబద్ధత తప్పనిసరిగా ఉండాలి. ఒక దీక్షలా అభ్యసిస్తేనే సంగీతంలో పట్టు సాధించడం సాధ్యమవుతుంది' అంటుంది స్వప్నరాణి.

భవిష్యత్తుకు సంబంధించి స్వప్నరాణికి కొన్ని లక్ష్యాలు ఉన్నాయి. తన విద్యార్థులను ప్రతి ఏటా పుష్య బహుళ పంచమి రోజున తమిళనాడులోని తంజావూరు జిల్లా తిరువాయూరులో జరిగే త్యాగరాజ ఆరాధనోత్సవాలకు సంసిద్ధం చేయడం వాటిలో ఒకటి. భవిష్యత్తులో సహస్ర గళార్చన కార్యక్రమాలు ఎక్కువగా చేసే లక్ష్యంతో శిష్యులను తీర్చిదిద్దుతుంది.

– టి భద్రారెడ్డి, సాక్షి, నిజామాబాద్

తల్లీ.. నీకు సెల్యూట్!



నాడు ఝాన్సీ లక్ష్మీబాయి తన దత్త పుత్రుడిని వీపుకు కట్టుకుని జవనాశ్వాన్ని దౌడు తీయిస్తూ బ్రిటిష్ వారిపై కత్తి ఝళిపిస్తే, నేడు ఈ రాజ్‌కోట్ యువతి తన బిడ్డను మోటార్ బైక్ పైన కూర్చోబెట్టుకుని, వీపుకు బ్యాగు తగిలించుకుని, డెలివరీ ఏజెంట్‌గా జీవన పోరాటం సాగిస్తోంది! ఈ దృశ్యాన్ని చూసిన 'విష్వెద్' అనే ఇన్‌స్టాగ్రామ్ యూజర్ ఆమెను వీడియో తీసి, బ్యాక్ గ్రౌండ్‌లో కత్తి పట్టిన ఝాన్సీరాణిని ఆమెకు జత కలిపి పెట్టిన పోస్ట్‌కు ఇప్పటివరకు 9 లక్షలకు పైగా లైకులు వచ్చాయి. నెటిజెన్‌లు తమ కామెంట్‌లలో ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ''బైక్ నడుపుతున్నావ్.. బద్రం సిస్టర్'' అని జాగ్రత్తలు చెబుతున్నారు. హెల్మెట్ పెట్టుకోవాలని కొందరు సూచిస్తున్నారు. కాళ్లకు చెప్పులు తొడుక్కోవాలని మరికొందరు కోరుతున్నారు. ఈ యువతి గత నెల రోజులుగా డెలివరీ ఏజెంటుగా పని చేస్తోంది. ఇన్‌స్టాలో వెల్లడైన వివరాలను బట్టి.. ఈమె హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేసింది. పెళ్లయ్యాక, ఎన్ని ప్రయత్నాలు చేసినా ఉద్యోగం రాలేదు. ఇక ఇప్పుడైతే.. ''బిడ్డ తల్లివి కదా.. ఉద్యోగం ఎలా చేస్తావ్?'' అని అడుగుతున్న వారే ఎక్కువమంది! చివరికి డెలివరీ ఏజెంట్ ఉద్యోగాన్ని ఎంచుకుని, తనతోపాటు కొడుకునూ వెంట బెట్టుకుని ధైర్యంగా జీవనయానం సాగిస్తోంది.

ఇంటిప్స్

దుస్తులపై మరకలు పోవాలంటే..

- నూనె మరకలు పోవాలంటే చాక్‌పీస్ పొడి చల్లి, రుద్ది, అర గంట తర్వాత లిక్విడ్ సోప్‌తో ఆ క్లాత్‌ని శుభ్రపరచాలి.
- కాఫీ మరక పోవాలంటే బేకింగ్ సోడాను ఉపయోగించాలి.



- చాకొలెట్ మరకలు పోవాలంటే వెనిగర్‌తో రుద్ది, ట్యాప్ వాటర్ కింద పెట్టి, శుభ్రం చేయాలి.
- పెయింట్ మరకలు పోవాలంటే ముందు టూత్ బ్రష్‌తో వీలైనంతవరకు కలర్ తీసేయాలి. ఒక భాగం బ్లీచ్‌కు 3 భాగాల నీటిని కలిపి మరిగించి, ఆ నీటిలో క్లాత్‌ని ముంచి, పది నిమిషాల తర్వాత శుభ్రపరచాలి.

లీగల్

మీ హక్కును మీరు కాపాడుకోవచ్చు

నేను ఇటీవలే హైదరాబాద్ శివార్లలో కొంతపొలం కొన్నాను. కొనేముందు అమ్మకందార్లు మాకు హద్దురాళ్ళు కూడా చూపించారు. భూమి కొనుగోలు చేసిన తర్వాత కొన్నాళ్ళకి మా హద్దుల ప్రకారం ఫెన్సింగ్ వేసుకుందాము అని వెళ్ళగా, మాకు భూమి అమ్మినవారు – మాకు దక్షిణాన వున్నవారు కూడా మా భూమి హద్దులు అవి కాదు అని, దాదాపు 10 గుంటల భూమి నష్టపోయేలా హద్దులు చూపిస్తున్నారు. అది మా ప్రాంతం కాదు కాబట్టి ఏమీ అనలేక పోతున్నాం. కోర్టుకు వెళ్తే కేసులు పరిష్కారం అయేసరికి చాలాకాలం పడుతుంది. అంతవరకూ మా భూమిలో మేము ఏమీ చేసుకోలేము అంటున్నారు. దయచేసి మా సమస్యకు ఒక పరిష్కారం చూపగలరు.

– జి. రామ్మోహన్, కందుకూరు

భూమిని కొనేటప్పుడు హద్దులు సరిగా చూసుకుని, వీలైతే హద్దురాళ్ళు పాతుకుని, పక్కన వున్న భూమి యజమానులను కూడా సంప్రదించి కొంటే, ఇలాంటి సమస్యలు తలెత్తవు. ఏదేమైనా, మీరు ప్రభుత్వానికి సరైన స్టాంప్ డ్యూటీ కట్టి, చట్టప్రకారం రిజిస్టర్ చేసుకున్నారు కాబట్టి, అంతగా భయపడాల్సిన అవసరం లేదు. మీరు వెంటనే మీకు దగ్గరలోని ఏదైనా 'మీ సేవా' కేంద్రానికి వెళ్లి, 'ఎఫ్–లైన్' అప్లికేషన్/దరఖాస్తు చెయ్యండి. ప్రభుత్వ నిర్ణీత రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకున్నట్లు అయితే 45 రోజుల లోగా రెవిన్యూ అధికారులు మీ భూమిని సర్వేచేసి, హద్దులు చూపిస్తారు. అలా చేయని పక్షంలో, పైఅధికార్లకు, ఆర్.డీ.ఓ కి ఫిర్యాదు/దరఖాస్తు పత్రం ఇవ్వండి. అప్పటికీ చేయకపోతే మీరు సర్వే కోసం హై కోర్టును ఆశ్రయించవచ్చు. సర్వే అనంతరం కూడా ఏమైనా సమస్య వుంటే, సివిల్ కోర్టులో వ్యాజ్యం ద్వారా మీ భూమిలో మరొకరు జోక్యం చేసుకోకుండా ఆర్డరు పొందవచ్చు.

సివిల్ కోర్టులో కేసులు ఆలస్యం అవుతాయి అనేమాట కొంతవరకూ నిజమే. కానీ త్వరితగతిన మీ కేసు పరిష్కరించటానికి చట్టపరమైన వెసులుబాట్లు కూడా ఉన్నాయి. కేసు నడిచినంతవరకు మీ భూమిలో మీరు ఏమీ చేసుకోలేరు అన్నది అవాస్తవం. హద్దుల సమస్య ఉన్నంత భూమి వరకు మీ పక్క వారు రానివ్వరు. మిగతా భూమిలో మీరు ఏమైనా చేసుకోవచ్చు. పూర్తిగా కేసు పరిష్కారం అయ్యేలోపు మధ్యంతర ఉత్తర్వులు పొంది, మీ హక్కుని మీరు కాపాడుకోవచ్చు. కోర్టుకు వెళ్తే ఆలస్యం అవుతుంది అని కోర్టుకు వెళ్ళకపోతే భూమే పోవచ్చు కాబట్టి జాగ్రత్త! చట్టపరమైన చర్యలలో మాత్రమే పరిష్కారాలు పొందాలి. అప్పుడే శాశ్వత పరిష్కారాలు అందుతాయి. అలా కాదని అనుకుంటే ముందు ముందు సమస్యలు మరింత జటిలం కావచ్చు!



– శ్రీకాంత్ చింతల,
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం *sakshifamily3@gmail.com* కు మెయిల్ చేయవచ్చు.

వివాహ అనుబంధం



వినదగ్గదే శ్రీమతి చెబుతుంది

'శ్రీవల్లి నా పెళ్లాం. పెళ్లాం మాట మొగుడు వింటే ఎట్టా ఉంటుందో పెపంచకానికి చూపిస్తా' అని తాజాగా విడుదలైన 'పుష్ప2' ట్రైలర్‌లో హీరో అంటాడు. సానుకూల వివాహ అనుబంధంలో భార్య మాటకు విలువ ఇవ్వడం కుటుంబానికి మంచిది అంటారు నిపుణులు. 'భార్య మాట వినే భర్త'ను లొంగుబాటుగా చెప్పే పితృస్వామ్య పరంపర ఉన్నా దాని వల్ల లాభం కంటే నష్టాలే ఎక్కువ అంటున్నారు. కుటుంబ జీవనంలో కీలక నిర్ణయాలే కాదు మంచీ చెడుల్లో భార్య సలహా వినదగ్గది. కొన్ని పరిశీలనలు.

'ఒక వివాహబంధం విజయవంతం కావాలంటే ముందు వినడం నేర్చుకోవాలి' అంటున్నారు ప్రవర్తనా నిపుణులు. 'భార్యాభర్తలు మొదట ఎదుటి వారు ఏం చెప్తున్నారనేది ఓపిగ్గా వింటే చాలు ఆ బంధం సగం సఫలమైనట్టే' అని వారు అంటున్నారు.

మన సమాజంలో భార్య మాట వినే భర్త గురించి పరిహాసం ఆడటం ఉంది. 'భార్యా విధేయుడు' అంటూ గేలి చేసేవారు కూడా ఉంటారు. సమాజం ఇంత ముందడుగు వేసినా 'భార్య మాట వినడంలో తప్పు ఏముంది' అని ఆలోచించే పరిస్థితి లేదు. అమెరికాలో కొత్తగా పెళ్లయిన దాదాపు 130 జంటలను పరిశీలించిన ఒక జాన్ గోట్ మ్యాన్ అనే సైకాలజిస్ట్ 'భార్య చెప్పేది సానుకూలంగా వినే భర్త ఉన్న జంటలు సంతోషంగా గడపడం' గమనించాడు. 'అలాగని ఈ జంటల్లో భర్త మాట భార్య వినకపోవడం అంటూ లేదు. వారు ఎలాగూ వింటారు' అంటాడు గోట్ మ్యాన్. భారతీయ సమాజంలో భర్తకు ఎదురు నిలవడం అందరు భార్యలు చేయరు. అయితే జోక్‌గానో, గొణుగుతున్నట్టుగానో, అనునయంగానో చెప్పే భార్యలు ఉంటారు. 'అలాంటి భార్యలు చెప్పింది విని ముందుకు సాగే భర్త ఉన్న జంటలు కూడా ఇంచుమించు గొడవలు లేకుండా ఉంటున్నాయి' అంటాడు గోట్‌మ్యాన్.

భార్యాభర్తల్లో 'అతను చెప్పేది ఏముందిలే' అని భార్య అనుకున్నా 'ఆమెకేం తెలుసు ఆమె ముఖం' అని భర్త అనుకున్నా ఆ వివాహబంధం ప్రమాదంలో పడుతుంది. ఏ వివాహ బంధమైనా ఒకరి దృష్టికోణం నుంచి నడవదు. కాపురంలో తల్లి తరపు వాళ్లు, తండ్రి తరుపు వారు ఉంటారు. స్నేహితులు ఉంటారు. ఇద్దరి వేరు వేరు కెరీర్‌లు ఉంటాయి. అంటే ఒక సమస్యకు కచ్చితంగా కనీసం రెండు దృష్టికోణాలుంటాయి. భర్తలు కేవలం తమ దృష్టికోణమే సరైనది అనుకోకూడదు. 'స్త్రీలు జాగ్రత్తగా అన్నీ గమనించి భర్తకు సూచనలు చేస్తారు. ఆ సూచనలను భర్త ఆమెతో చర్చించాలి. నా మాటే నెగ్గాలి అని తప్పు నిర్ణయం తీసుకోవడం వల్ల నష్టం ఇద్దరికీ వస్తుంది' అంటాడు గోట్‌మ్యాన్.

భర్త తన సంపాదన, అప్పులు, ఇచ్చిన హామీలు, కొన్న/కొనబోయే ఆస్తులు, పిల్లల కోసం పొదుపు, ఆరోగ్య విషయాలు... ఇవన్నీ భార్యకు తెలియచేస్తూ ఆమె సలహాను వినాల్సి ఉంటుంది. అలాగే భర్త ఇంట్లో లేనప్పుడు పిల్లల ప్రవర్తన, వారి కదలికలు, బంధువుల రాకపోకలు వచ్చే డిమాండ్లు ఇవన్నీ భార్య తప్పకుండా భర్తకు చేరవేయాలి. ముఖ్యంగా పిల్లలను కరెక్ట్ చేయాల్సిన అంశాలు భార్య లేవనెత్తినప్పుడు భర్త నిర్లక్ష్యం చేయరాదు. అవి సమస్యలు తెస్తాయి.

అందుకే గతంలో స్త్రీల మాట చెల్లుబాటయ్యే సందేశం ఇస్తూ 'పెళ్లాం చెబితే వినాలి' లాంటి సినిమాలు వచ్చాయి. ఇన్నేళ్ల తర్వాత 'ఫైర్'లాంటి పుష్ప కూడా 'పెళ్లాం మాట వినాలి' అంటున్నాడు.

భార్య సరైన సలహా ఇస్తే దానిని ఎందుకు వినకూడదు చెప్పండి?

నివాళి




ఉమా దాస్‌గుప్తా

దుర్గ ఉంది.. ఉంటుంది...

చావుకు దగ్గర పడుతున్న దుర్గ తన తమ్ముడు అపూని పిలిచి 'నేను కోలుకున్నాక మళ్లీ రైలుని చూద్దాంలే. ఈసారి ఇంకా దగ్గరి నుంచి' అంటుంది. ఆమె కోలుకోదు. రైలును చూడదు. ఆ అమ్మాయి చనిపోయాక కుటుంబం మొత్తం బహుశా ఆ రైలులోనే పల్లెను వదిలి పట్నానికి వలస పోతుంది. మన దేశంలో పేదరికం పిల్లల్ని నేటికీ కబళిస్తోంది. పౌష్టికాహార లోపం వారిని చిన్న జ్వరానికి కూడా మృత్యువుకు దగ్గర చేస్తోంది. 70 ఏళ్ల క్రితం 'పథేర్ పాంచాలి'లో దుర్గ పాత్ర పోషించిన ఉమా దాస్‌గుప్తా మరణించారు. కాని ఆమె పాత్ర ఇంకా ఉంది. ఆమెలాంటి పిల్లలూ ఇంకా ఉన్నారు.

ఇరుగు పొరుగు వారితో దయగా ఉండాలని మతాలు చెబుతాయి. కాని దుర్గ ఇంటి పక్కన ఉన్న ధనవంతులు దయ లేని వారు. 'నిశ్చిందిపూర్' అనే చిన్న పల్లెటూళ్లో ఒక పూజారి కూతురైన పది పన్నెండేళ్ల దుర్గ వారి ఇంటి నుంచి కాయో నేలరాలిన పండో దొంగిలించుకుని వస్తూ ఉంటుంది. ఆమె చిన్నారి తమ్ముడు 'అపూ'కు అక్కంటే ప్రాణం. తూనీగలకు మల్లే తిరుగాడే ఆ అక్కాచెల్లెళ్ల ప్రపంచం అత్యంత అమాయకమైనది. వారికి కడుపు నిండా తినాలని, ఒంటినిండా కొత్తబట్టలు కట్టుకోవాలని కూడా తెలీవు. కారణం వారు ఎప్పుడూ చూడలేదు. తండ్రి సంపాదించలేదు. ఏవో నాలుగు డబ్బులు ఎలాగైనా సంపాదించుకొస్తానని పట్నం వెళ్లిన తండ్రి ఎంతకీ రాడు...ఇంట్లో పేదరికం తాండవం చేస్తుంది. గంజి కూడా దొరకదు. అయినా సరే ఆశ మిగిలే ఉంటుంది. తమ ఇంటికి దూరంగా ఉన్న రైలును చూడటానికి తమ్ముణ్ణి వెంటబెట్టుకుని వెళ్లిన దుర్గ వాన కురియగా ఆ వానలో మనసారా తడిసి సేద తీరుతుంది. ఇంటికి వచ్చాక జ్వరం తెచ్చుకుంటుంది. మందులు ఆ రోజుల్లో ఎక్కడివి? ఏదైనా బలమైన తిండి పెట్టాలంటే పదార్థాలు ఎక్కడివి? ఒంటరి తల్లి ఆ కూతురికి చేయగలిగిందల్లా తడిబట్ట పెట్టడమే. ఆ రాత్రి ఉరుములు మెరుపుల వాన. ఇల్లు పాక్షికంగా కూలిపోతుంది. వాన వెళుతూ వెళుతూ దుర్గ బలహీన ఒంటిలోని ప్రాణవాయువును కూడా తనతో తీసుకెళ్లిపోతుంది. దుర్గా... బంగారంలాంటి దుర్గా.... 'పథేర్ పాంచాలి' (1955) చూసిన ప్రేక్షకులు ఆజన్మాంతం ఆ పాత్రను మర్చిపోలేరు. ఆ దుఃఖానుభూతి బలీయమైనది.

నవలను సినిమాగా

ఇటాలియన్ నియోరియలిజమ్ సినిమాలతో ప్రభావితమైన వాస్తవిక చిత్రం తీయాలని తలపోసిన దర్శకుడు సత్యజిత్ రే అప్పటికే గొప్ప ప్రజాదరణ పొందిన 'పథేర్ పాంచాలి' నవలను అందుకు ఎంచుకున్నాడు. పథేర్ పాంచాలి రచయిత బిభూతిభూషణ్ బందోపాధ్యాయ. మూడేళ్లపాటు అప్పుసప్పు చేస్తూ కష్టపడితే తప్ప సినిమా పూర్తి చేయలేకపోయాడు సత్యజిత్ రే. ఇందులో దుర్గ పాత్రకు ఆయన కోల్‌కతాకు చెందిన ఉమా దాస్‌గుప్తాను తీసుకున్నాడు. ఒక స్కూల్ ఫంక్షన్‌లో ఉమాదాస్‌గుప్తాను చూసిన సత్యజిత్‌రే వెంటనే స్కూల్ ప్రిన్సిపాల్‌ని ఆ తర్వాత ఉమాదాస్ గుప్తా తల్లిదండ్రులను కలిసి ఒప్పించాడు.

ఒక్క సినిమా నటి

ఆ రోజుల్లో బాలనటీనటులు నాటకీయంగా సినిమాల్లో నటించేవారు. కాని ఉమా దాస్ గుప్తా చేస్తున్నది తొలి సినిమా అయినా సత్యజిత్ రే చెప్పింది అర్థం చేసుకుని అద్భుతంగా నటించింది. 'ఆ అమ్మాయి ఫస్ట్ టేక్‌ను ఓకే చేసేలా నటించింది. నీటిలో చేపలా సులువుగా చేసింది' అని సత్యజిత్ రే మెచ్చుకున్నాడు. అయితే ఆ తర్వాత ఉమాదాస్ గుప్తా ఒకటీ అరా సినిమాల్లో కనిపించింది తప్ప మరే ముఖ్యపాత్రలోనూ నటించలేదు. టీచర్‌గా పనిచేస్తూ రిటైర్ అయ్యాక 84వ ఏట సోమవారం (నవంబర్ 18) మరణించింది. ఆమెకు ఒక కుమార్తె ఉంది.

ఇప్పుడు కూడా

స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా భారత దేశంలో పిల్లలకు పౌష్టికాహారం అందడం లేదు. ఎదిగే వయసులో వారికి అందాల్సిన పోషకాల మీద ప్రభుత్వాల శ్రద్ధ అరాకొరానే ఉంది. జీవన ప్రమాణాలు 'పథేర్ పాంచాలి'కీ నేటికీ ఏమేరకు పెరిగాయి. భార్యాపిల్లలను ఖర్మానికి వదిలి వలస వచ్చి పని చేయక తప్పని స్థితి పల్లెల్లోని పేదవారికి నేటికీ ఉంది. అందుకే దుర్గ ఈ దేశంలో చిరంజీవి.

ఇఫీలో గుస్సాడీ నృత్యం



తెలంగాణ సంప్రదాయ నృత్య వైభవం మరోసారి జాతీయ అంతర్జాతీయ వేదికలపై తళుక్కుమననుంది. గోవాలో అట్టహాసంగా బుధవారం జరుగనున్న అంతర్జాతీయ భారత్ చిత్రోత్సవం (ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా.. ఇఫీ) ప్రారంభ కార్యక్రమంలో తెలంగాణకు చెందిన ఆదివాసీ గోండు గిరిజనుల గుస్సాడీ నృత్యం ప్రదర్శనకు అవకాశం దక్కించుకుంది. ఈ నృత్య కళాకారునిగా ఇటీవలే కీర్తిశేషులైన పద్మశ్రీ కనకరాజు జాతీయ స్థాయిలో పేరొందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రతిష్ఠాత్మక చిత్రోత్సవంలో తెలంగాణ సంప్రదాయ నృత్య ప్రదర్శనకు నోచుకోవడం, ఆ ప్రదర్శనలో పాల్గొనే కళాకారులు అందరూ దివంగత కనకరాజు శిష్యులే కావడంతో ఇది గత నెలలోనే దివికేగిన గుస్సాడీ నృత్య దిగ్గజానికి ఘన నివాళిగా చెప్పొచ్చు.

– సాక్షి, హైదరాబాద్





జాతీయ స్కూల్ గేమ్స్ చాంపియన్‌గా తెలంగాణ టీటీ జట్టు

నిర్ణాయక మ్యాచ్‌లో జతిన్ దేవ్ రాణించడంతో జాతీయ స్కూల్ గేమ్స్ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్‌లో తెలంగాణ స్కూల్ గేమ్స్ సమాఖ్య (ఎస్‌జీఎఫ్) బాలుర జట్టు చాంపియన్‌గా అవతరించింది. డామన్ అండ్ డియూలో ఈ టోర్నమెంట్ జరిగింది. అండర్-17 బాలుర టీమ్ ఫైనల్లో తెలంగాణ జట్టు 3-2తో మహారాష్ట్ర జట్టుపై నెగ్గింది. తొలి మ్యాచ్‌లో జతిన్ దేవ్ 8-11, 6-11, 8-11తో ఇషాన్ చేతిలో ఓడిపోయాడు. రెండో మ్యాచ్‌లో ఆరుష్ రెడ్డి 11-7, 11-4, 11-7తో పార్థ్ వినోద్‌పై గెలిచాడు. మూడో మ్యాచ్‌లో తరుణ్ కేదార్‌నాథ్ 11-13, 11-7, 14-12, 7-11, 12-10తో శుభ్ నారాయణ్‌ను ఓడించడంతో తెలంగాణ జట్టు 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. నాలుగో మ్యాచ్‌లో ఆరుష్ రెడ్డి 11-8, 6-11, 8-11, 11-13తో ఇషాన్ చేతిలో ఓడిపోవడంతో స్కోరు 2-2తో సమమైంది. ఐదో మ్యాచ్‌లో జతిన్ 11-6, 5-11, 11-9, 11-7తో పార్థ్‌ను ఓడించడంతో తెలంగాణ జట్టు విజేతగా నిలిచింది.


లాల్‌రెమ్‌సియామి
నవ్‌నీత్ కౌర్

ఎదురులేని భారత్

ఐదోసారి ఆసియా మహిళల చాంపియన్స్ ట్రోఫీలో ఫైనల్లోకి

- సెమీఫైనల్లో 2-0తో జపాన్‌పై ఘనవిజయం
- నేడు చైనాతో టైటిల్ పోరు
- సాయంత్రం గం. 4:45 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

రాజ్‌గిర్ (బిహార్): మరోసారి సాధికారిక ఆటతీరుతో అలరించిన భారత మహిళల హాకీ జట్టు సొంతగడ్డపై జరుగుతున్న ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో ఐదోసారి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. మంగళవారం జరిగిన రెండో సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ 2-0 గోల్స్ తేడాతో 2018 జకార్తా ఆసియా క్రీడల విజేత జపాన్ జట్టును ఓడించింది. భారత్ తరఫున వైస్ కెప్టెన్ నవ్‌నీత్ కౌర్ (48వ నిమిషంలో), లాల్‌రెమ్‌సియామి (56వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. సలీమా టెటె నాయకత్వంలో ఈ టోర్నీలో ఆడుతున్న భారత జట్టుకిది వరుసగా ఆరో విజయం కావడం విశేషం. లీగ్ దశలో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో నెగ్గిన టీమిండియా నాకౌట్ మ్యాచ్‌లోనూ గెలుపొందింది. నేడు జరిగే ఫైనల్లో పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత, ప్రస్తుత ఆసియా క్రీడల చాంపియన్ చైనా జట్టుతో భారత్ తలపడుతుంది. తొలి సెమీఫైనల్లో చైనా 3-1తో మలేసియాపై గెలిచింది. లీగ్ దశలో భారత జట్టు 3-0తో చైనాపై గెలిచింది. అదే ఫలితాన్ని నేడూ పునరావృతం చేస్తే భారత జట్టు మూడోసారి ఆసియా చాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను సొంతం చేసుకుంటుంది. అంతేకాకుండా దక్షిణ కొరియా (2010, 2011లలో) జట్టు తర్వాత వరుసగా రెండుసార్లు ఈ టైటిల్‌ను నెగ్గిన జట్టుగా భారత్ గుర్తింపు పొందుతుంది. గతంలో భారత జట్టు 2016, 2023లలో విజేతగా నిలిచింది. 2013, 2018లలో రన్నరప్ ట్రోఫీ సాధించింది.

జపాన్‌తో జరిగిన సెమీఫైనల్లో భారత్ పూర్తి ఆధిపత్యం చలాయించింది. మ్యాచ్ మొత్తంలో భారత జట్టుకు 12 పెనాల్టీ కార్నర్‌లు లభించగా... ఒక్కదానిని కూడా టీమిండియా సద్వినియోగం చేసుకోలేకపోయింది. లేదంటే భారత గెలుపు ఆధిక్యం భారీగా ఉండేది. మరోవైపు జపాన్ కేవలం ఒక్క పెనాల్టీ కార్నర్‌కే పరిమితమైంది.


చైనా జట్టు

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

‘ఆ జ్ఞాపకాలన్నీ పదిలం’



నాదల్‌కు ఫెడరర్ భావోద్వేగ లేఖ

మలాగా (స్పెయిన్): ‘ఒకటి మాత్రం నిజం...నేను నీపై గెలిచిన మ్యాచ్‌లకంటే నువ్వు నన్ను ఎక్కువ సార్లు ఓడించావు. నీలా నాకు ఎవరూ సవాల్ విసరలేదు. మట్టి కోర్టుపైన అయితే నీ ఇంటి ఆవరణలోకి వచ్చి ఆడినట్లే అనిపించేది. అక్కడ నీ ముందు నిలబడితే చాలు అనిపించేందుకు కూడా ఎంతో కష్టపడాల్సి వచ్చేది. నా ఆటలో లోపాలు ఉన్నాయేమో అని చూసుకునేలా నువ్వే చేశావు. నీపై పైచేయి సాధించే క్రమంలో రాకెట్ మార్చి కూడా నా అదృష్టాన్ని పరీక్షించుకోవాల్సి వచ్చింది’ ... టెన్నిస్‌కు వీడ్కోలు పలుకుతున్న రాఫెల్ నాదల్‌ను ఉద్దేశించి మరో దిగ్గజం రోజర్ ఫెడరర్ చేసిన ప్రశంసాపూర్వక వ్యాఖ్య ఇది. సుదీర్ఘ కాలం ఆటను శాసించిన వీరిద్దరిలో ఫెడరర్ రెండేళ్ల క్రితం రిటైర్ కాగా... ఇప్పుడు నాదల్ వంతు వచ్చింది. 20 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌తో ఫెడరర్ కెరీర్ ముగిస్తే... 22 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌తో నాదల్ గుడ్‌బై చెప్పాడు. కోర్టులో ప్రత్యర్థులే అయినా మైదానం బయట వీరిద్దరి మధ్య మంచి స్నేహం ఉంది. ప్రపంచ టెన్నిస్ సర్క్యూట్‌లో తమ పరస్పర గౌరవాన్ని, అభిమానాన్ని వీరిద్దరు చాలాసార్లు ప్రదర్శించారు. నాదల్ రిటైర్మెంట్ నేపథ్యంలో నాటి జ్ఞాపకాలతో ఫెడరర్ ఒక లేఖ రాశాడు.

ఆటను ఇష్టపడేలా చేశావు...

‘నువ్వు రిటైర్ అవుతున్న సందర్భంగా కొన్ని విషయాలు పంచుకోవాలని భావించాను. మ్యాచ్ సమయంలో బొమ్మల కొలువులా వాటర్ బాటిల్స్‌ను పేర్చడం, జుట్టు సవరించుకోవడం, అండర్‌వేర్‌ను సరిచేసుకోవడం... అన్నీ ఒక పద్ధతిలో ఉండటం అంతా కొత్తగా అనిపించేది. నేను ఆ ప్రక్రియను కూడా ఇష్టపడేవాడిని. నాకు మూఢనమ్మకాలు లేవు కానీ నువ్వు ఇలా కూడా ఆకర్షించావు. టెన్నిస్‌పై నా ఇష్టం మరింత పెరిగేలా చేశావు. దాదాపు ఒకే సమయంలో కెరీర్ ప్రారంభించాం. 20 ఏళ్ల తర్వాత చూస్తే నువ్వు అద్భుతాలు చేసి చూపించావు. 14 ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్స్‌తో స్పెయిన్, యావత్ టెన్నిస్ ప్రపంచం గర్వపడేలా చేశావు’ అని ఫెడరర్ అన్నాడు.

ఆ రోజు మర్చిపోలేను...

2004 మయామి ఓపెన్‌తో మొదలు పెట్టి వీరిద్దరు 40 సార్లు తలపడ్డారు. ఇందులో నాదల్ 24 సార్లు, ఫెడరర్ 16 సార్లు గెలిచారు. ‘నేను తొలిసారి వరల్డ్ నంబర్‌వన్‌గా మారి సగర్వంగా నిలిచినప్పుడు నీతో మయామిలో తలపడి ఓడాను. అరుదైన ప్రతిభ గలవాడివని, ఎన్నో ఘనతలు సాధిస్తావని అప్పటి వరకు నీ గురించి గొప్పగా విన్నదంతా వాస్తవమేనని అర్థమైంది. 50 వేల మంది సమక్షంలో ఆడిన రికార్డు మ్యాచ్‌తో సహా మనం కలిసి ఆడిన రోజులన్నీ గుర్తున్నాయి. కొన్నిసార్లు ఎంతగా పోరాడే వాళ్లమంటే ఆట ముగిశాక వేదికపై ఒకరిని పట్టుకొని మరొకరు నడవాల్సి వచ్చేది’ అని ఫెడరర్ గుర్తు చేసుకున్నాడు.



నీతో స్నేహం వల్లే...

మలార్కాలో 2016లో నాదల్ అకాడమీ ప్రారంభోత్సవానికి ఫెడరర్ హాజరు కాగా... రెండేళ్ల క్రితం ఫెడరర్ చివరి టోర్నీ లేవర్ కప్‌లో అతని కోసం భాగస్వామిగా నాదల్ ఆడాడు. ‘అకాడమీ ప్రారంభోత్సవానికి నాకు నేనే ఆహ్వానం ఇచ్చుకున్నాను. ఎందుకంటే నన్ను బలవంతం చేయలేని మంచితనం నీది. కానీ నేను రాకుండా ఎలా ఉంటాను. ఆ తర్వాత నీ అకాడమీలో నా పిల్లలు శిక్షణ తీసుకోవడం ఎంతో ఆనందాన్నిచ్చింది. వాళ్లు ఎడంచేతి వాటం ఆటగాళ్లుగా తిరిగి రాకుండా చాలని మాత్రం కోరుకున్నాను. లేవర్ కప్‌లో చివరిసారి నీతో కలిసి ఆడినప్పుడు కన్నీళ్లు ఆగలేదు. నా కెరీర్‌లో అవి ఎంతో ప్రత్యేక క్షణాలు’ అని ఫెడెక్స్ భావోద్వేగం ప్రదర్శించాడు.

కమాన్ రఫా...

కెరీర్‌లో చివరి మ్యాచ్ ఆడుతున్న వేళ నాదల్‌కు ఫెడరర్ ప్రత్యేక అభినందనలు తెలియజేశాడు. ‘భావోద్వేగంతో మాటలు రాని పరిస్థితి రాక ముందే నేను చెప్పాల్సిందంతా చెప్పేశాను. నీ ఆఖరి మ్యాచ్ ఆడిన తర్వాత మాట్లాడుకోవాల్సినవి ఇంకా చాలా ఉన్నాయి. ఈ సమయంలో నీకు నా అభినందనలు. ఇప్పుడు, ఇకపై కూడా నీ పాత మిత్రుడు చప్పట్లతో గట్టిగా నిన్ను ప్రోత్సహిస్తూనే ఉంటాడనే విషయం మరచిపోవద్దు’ అని ఫెడరర్ ముగించాడు.

అంధుల టి20 ప్రపంచకప్ టోర్నీకి భారత్ దూరం

పాకిస్తాన్‌లో ఆడేందుకు టీమిండియాకు అనుమతి నిరాకరించిన కేంద్రం

న్యూఢిల్లీ: డిఫెండింగ్ చాంపియన్ భారత అంధుల క్రికెట్ జట్టు ఈసారి టి20 ప్రపంచకప్ బరిలోకి దిగడంలేదు. పాకిస్తాన్‌లో ఈ నెల 23 నుంచి డిసెంబర్ 3 వరకు జరిగే ఈ టోర్నీలో పాల్గొనేందుకు కేంద్ర ప్రభుత్వం టీమిండియాకు అనుమతి ఇవ్వలేదు. భద్రతా కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం తెలిపింది. ముందనుకున్న షెడ్యూల్ ప్రకారం బుధవారం వాఘా సరిహద్దు గుండా భారత అంధుల క్రికెట్ జట్టు పాకిస్తాన్‌కు వెళ్లాల్సి ఉంది. దీనికోసం కేంద్ర క్రీడాశాఖ నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) మంజూరు చేసింది. కానీ విదేశీ వ్యవహారాల శాఖ భద్రతాపరమైన సమస్యలుండటంతో అక్కడికి వెళ్లేందుకు నిరాకరించింది. వచ్చే ఏడాది పాక్‌లో జరిగే చాంపియన్స్ ట్రోఫీకి టీమిండియాను అనుమతించని ప్రభుత్వం తమ జట్టుకూ నిరాకరించడంలో అభ్యంతరం లేదని... కానీ ఈ విషయాన్ని సెలక్షన్ ట్రయల్స్, శిబిరానికి ముందే చెప్పి ఉంటే బాగుండేదని భారత అంధుల క్రికెట్ సంఘం కార్యదర్శి శైలేంద్ర యాదవ్ తెలిపారు.



పదహారేళ్ల తర్వాత...


● కుంచాకో బోబన్, మమ్ముట్టి, మోహన్‌లాల్

మోహన్‌లాల్, మమ్ముట్టి కాంబినేషన్‌లో దాదాపు యాభైకి పైగా సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. అయితే 2008లో రిలీజైన ‘ట్వంటీ 20’ చిత్రం తర్వాత మోహన్‌లాల్, మమ్ముట్టి కలిసి ఓ ఫుల్ లెంగ్త్ సినిమా చేయలేదు. పదహారేళ్ల తర్వాత మోహన్‌లాల్, మమ్ముట్టి ఓ సినిమాలో నటిస్తున్నారు. మలయాళంలో ‘మాలిక్, టేకాఫ్, సీ యూ సూన్’ వంటి సినిమాలతో దర్శకుడిగా పేరు సంపాదించుకున్న మహేశ్ నారాయణన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో కుంచాకో బోబన్ ఓ కీలక పాత్రలో నటిస్తుండగా, మరో కీలక పాత్రలో ఫాహద్ ఫాజిల్ నటించనున్నట్లు సమాచారం. ఈ సినిమా చిత్రీకరణ శ్రీలంకలో మొదలైంది. మమ్ముట్టి, మోహన్‌లాల్, కుంచాకోల మధ్య కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే... మమ్ముట్టి హీరోగా నటించిన ‘కాదల్ కదన్ను ఒరు మాతుకుట్టి’ (2013) చిత్రంలో మోహన్‌లాల్ నటించారు. కానీ ఈ చిత్రంలో మోహన్‌లాల్‌ది అతిథి పాత్ర. ఈ ఇద్దరు స్టార్స్ కలిసి చాలా గ్యాప్ తర్వాత చేస్తున్న తాజా ఫుల్ లెంగ్త్ చిత్రంపై అంచనాలు ఉన్నాయి.

మీకు తెలిసినోడి కథ

‘అల్లరి’ నరేశ్ టైటిల్ రోల్‌లో నటించిన తాజా చిత్రం ‘బచ్చల మల్లి’. ఈ చిత్రానికి ‘సోలో బ్రతుకే సో బెటర్’ ఫేమ్ సుబ్బు మంగదేవి దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో అమృతా అయ్యర్ హీరోయిన్‌గా నటించగా, రోహిణి, రావు రమేష్, అచ్యుత్ కుమార్, బలగం జయరామ్, హరితేజ, ప్రవీణ్, ‘వైవా’ హర్ష ఇతర కీలక పాత్రలు పోషించారు. ‘బచ్చలమల్లి’ సినిమాను డిసెంబరు 20న రిలీజ్ చేస్తున్నట్లుగా వెల్లడించి, ఈ సినిమా కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ‘ఇది మీ కథ... లేకపోతే మీకు తెలిసినోడి కథ’ అని ఈ సినిమాను ఉద్దేశించి, ‘ఎక్స్’లో పేర్కొన్నారు ‘అల్లరి’ నరేశ్. ఈ సినిమాకు సంగీతం: విశాల్ చంద్రశేఖర్, కెమెరా: రిచర్డ్ ఎమ్. నాథన్.


● ‘అల్లరి’ నరేశ్

సినిమా

ప్రేక్షకులు ఆశ్చర్యపోతారు

- విశ్వక్ సేన్



‘‘నాలుగైదేళ్లుగా జరుగుతున్న ఒక బర్నింగ్ పాయింట్‌ని ‘మెకానిక్ రాకీ’ సినిమాలో టచ్ చేశాం. సినిమా చూస్తున్నప్పుడు అసలు ఇంతకాలం ఈ పాయింట్‌ని ఎవరూ ఎందుకు టచ్ చేయలేదు? అనిపిస్తుంది. ఈ సినిమా విడుదలయ్యే లోపు మేం చెబుతున్న పాయింట్‌తో ఇంకేదైనా సినిమా వస్తుందా? అనే భయం ఉండేది. కానీ ఏ సినిమా రాలేదు. ‘మెకానిక్ రాకీ’లో మేం చెప్పిన అంశానికి ప్రేక్షకులు తప్పకుండా సర్‌ప్రైజ్ అవుతారు’’ అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో విశ్వక్ సేన్ హీరోగా నటించిన చిత్రం ‘మెకానిక్ రాకీ’. ఈ సినిమాలో మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా నటించారు. రామ్ తాళ్లూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదలవుతోంది. ఈ సందర్భంగా విశ్వక్ సేన్ విలేకరులతో పంచుకున్న విశేషాలు.

- రవితేజ ముళ్లపూడి కొత్త దర్శకుడైనా చాలా స్మార్ట్‌గా ఆలోచిస్తాడు. ‘మెకానిక్ రాకీ’ కథని తను బాగా తీయగలడని బలంగా నమ్మాను.. చాలా అద్భుతంగా తీశాడు. ఈ సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులు ముందు డైరెక్టర్‌ని, ఆ తర్వాత తన రైటింగ్‌ని మెచ్చుకుంటారు. స్క్రీన్‌ప్లేకి చాలా మంచి పేరు వస్తుంది. వాస్తవ ఘటనలను ఆధారంగా చేసుకొని తీసిన సినిమా ఇది. ఆ సంఘటనలకి ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. ‘మెకానిక్ రాకీ’లో మేం సందేశం ఇవ్వడం లేదు. అయితే కావాల్సిన వారు అందులో నుంచి సందేశాన్ని తీసుకోవచ్చు.
- ‘మెకానిక్ రాకీ’ సినిమా చాలా వినోదాత్మకంగా ఉంటుంది. ఫస్ట్ హాఫ్‌కి సెకండ్ హాఫ్‌కి జోనర్ మారుతుంది. సెకండ్ హాఫ్ మొదలైన పది నిమిషాల తర్వాత వేరే లెవల్లో ఉంటుంది. ఆ సమయంలో ఆడియన్స్‌కి ఫోన్ వచ్చినా జవాబు ఇవ్వకుండా కథలో లీనమవుతారు. మేం ట్రైలర్‌లో కథని పెద్దగా చెప్పలేదు. సినిమాలో ఊహించని విధంగా చాలా కథ ఉంది. కుటుంబ ప్రేక్షకులు, యువతరం.. ఇలా అన్ని వర్గాల వారికి మా సినిమా నచ్చుతుందనే నమ్మకం ఉంది.
- రామ్ తాళ్లూరిగారు చాలా ఓపికగా ఈ సినిమా చేశారు. నేను ‘మెకానిక్ రాకీ’ని, ‘గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి’ని కూడా ఒకే సమయంలో చేశాను. ఈ కారణంగా చాలా టైమ్ పట్టింది. ఈ ప్రాసెస్‌లో రామ్ తాళ్లూరిగారు నన్ను చాలా సపోర్ట్ చేశారు. ఈ చిత్రంలో నా పాత్రతో పాటు మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్, వీకే నరేష్, రఘు, సునీల్‌గార్ల పాత్రలకి సమానమైన ప్రాధాన్యం ఉంటుంది. జేక్స్ బిజోయ్ నేపథ్య సంగీతం అదిరిపోతుంది. ప్రస్తుతం నేను నటిస్తున్న ‘లైలా’ సినిమా 60 శాతం పూర్తయింది. ఆ తర్వాత దర్శకులు సుధాకర్‌తో ఓ చిత్రం, అనుదీప్‌తో ఓ మూవీ చేస్తాను. ‘కల్ట్’ సినిమాని మార్చిలో మొదలుపెడతాం. అలాగే ‘ఈ నగరానికి ఏమైంది 2’ స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది.

మరో మెట్టు ఎక్కాను - యశ్ పూరి


● యశ్ పూరి, సమంత

‘‘సిటాడెల్: హనీ బన్నీ’ వెబ్ సిరీస్‌లో సమంత, వరుణ్ ధావన్ లాంటి అద్భుతమైన నటీనటులతో కలిసి నటించే చాన్స్ రావడం నా కెరీర్‌లో మరచిపోలేను’’ అని యశ్ పూరి అన్నారు. ‘చెప్పాలని ఉంది, అలనాటి సిత్రాలు, శాకుంతలం, హ్యాపీ ఎండింగ్’ వంటి సినిమాలతో నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు యశ్ పూరి. తాజాగా ఆయన నటించిన వెబ్ సిరీస్ ‘సిటాడెల్: హనీ బన్నీ’. వరుణ్ ధావన్, సమంత ప్రధాన పాత్రల్లో రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహించిన ఈ సిరీస్ ఈ నెల 6 నుంచి అమేజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సిరీస్‌లో ఓ కీలక పాత్ర పోషించిన యశ్ పూరి మాట్లాడుతూ– ‘‘సిటాడెల్: హనీ బన్నీ’ సిరీస్ నా కెరీర్‌ని మరో మెట్టు పైకి తీసుకెళ్లింది. ఇలా కెరీర్ పరంగా మరో మెట్టు ఎక్కే అవకాశాన్ని ఇచ్చిన రాజ్, డీకే గార్లకు, సపోర్ట్ చేసిన సమంతగారికి కృతజ్ఞతలు’’ అని చెప్పారు.

నా జీవితంలో ఓ ఉద్యమం జరిగింది

- రాకింగ్ రాకేష్


● చరణ్ అర్జున్, అంజి, హరీష్ రావు, రాకేష్, అనన్య

రాకింగ్ రాకేష్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం ‘కేశవ చంద్ర రమావత్ (కేసీఆర్). ఇందులో అనన్యా కృష్ణన్ హీరోయిన్. ‘గరుడవేగ’ అంజి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఎమ్మెల్యే హరీష్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాజీ మంత్రి రోజా మాట్లాడుతూ– ‘‘నా బిడ్డలాంటి వ్యక్తి రాకేష్ తీసిన ఈ ‘కేసీఆర్’ చిత్రం పెద్ద విజయం సాధించాలి. ‘బలగం’ సినిమాలానే ‘కేసీఆర్’ చిత్రం కూడా చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. ఈ సినిమా కోసం తాను సంపాదించిన ప్రతి రూపాయిని రాకేష్ ఖర్చుపెట్టాడు. తన ఇంటిని కూడా త్యాగం చేశాడు’’ అన్నారు. ‘‘ఈ సినిమాకు ఒక ఉద్యమ నాయకుడి పేరు పెట్టుకున్నాం. నిజంగా నా జీవితంలో ఒక ఉద్యమమే జరిగింది. ఈ సినిమా కోసం నన్ను నమ్మి, నా వెంట ఉన్న రాఘవన్నకి రుణపడి ఉంటాను’’ అని తెలిపారు రాకింగ్ రాకేష్. ‘‘మంచి ఎమోషనల్ కంటెంట్ ఉన్న ఇలాంటి సినిమాలను ప్రేక్షకులు ప్రోత్సహించాలని కోరుకుంటున్నాను’’ అన్నారు అంజి. ఈ కార్యక్రమంలో నటులు శివ బాలాజీ, ధనరాజ్, ‘సుడిగాలి’ సుధీర్, హైపర్ ఆది, బిగ్ బాస్ విన్నర్ పల్లవి ప్రశాంత్, గాయకులు గోరేటి వెంకన్న, నిర్మాత చదలవాడ శ్రీనివాస రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.


ఓ తల్లి ప్రతీకారం

తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో అటు హీరోయిన్‌గా ఇటు లేడీ ఓరియంటెడ్ సినిమాల్లో నటించి, తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు తాప్సీ. తాజాగా ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న హిందీ చిత్రం ‘గాంధారి’. దేవాశిష్ మఖీజా దర్శకత్వం వహిస్తున్నారు. యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాకు కనికా థిల్లాన్ కథ అందించడంతో పాటు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ఎలాంటి డూప్ లేకుండా యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నారట తాప్సీ. తల్లీకూతుళ్ల అనుబంధం, ఓ తల్లి ప్రతీకారం అంశాల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని సమాచారం. కిడ్నాప్ అయిన తన కుమార్తెను కాపాడుకునేందుకు ఓ తల్లి చేసే పోరాటం నేపథ్యంలో ఈ సినిమా రూపొందుతోంది. వెండితెరపై తాప్సీ తల్లి పాత్రలో కనిపించనున్న తొలి చిత్రం ఇదే. త్వరలో ‘గాంధారి’ సినిమా విడుదల తేదీని ప్రకటించనుంది యూనిట్. ఇదిలా ఉంటే... తాప్సీ ఓ ప్రధాన పాత్రలో నటించి, కనికా థిల్లాన్ కథ అందించిన ‘హసీన దిల్‌రుబా’, ఫిర్ ఆయీ హసీన దిల్ రుబా’లకు మంచి స్పందన లభించింది. దీంతో వీరి కాంబినేషన్‌లో రూపొందుతున్న ‘గాంధారి’పై బాలీవుడ్‌లో మంచి అంచనాలున్నాయి.


● తాప్సీ

ఏడు లోకాల్లో పరకామణి

సుమన్ బాబు హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం ‘ఎర్రచీర’. ఈ సినిమా డిసెంబర్ 20న రిలీజ్ కానుండగా ‘పరకామణి’ అనే కొత్త చిత్రానికి ఆయన శ్రీకారం చుట్టారు. సుమన్ బాబు స్వీయ దర్శకత్వంలో రూపొందించనున్న ఈ సినిమా టైటిల్ ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సుమన్ బాబు మాట్లాడుతూ– ‘‘సోషియో ఫ్యాంటసీ నేపథ్యంలో రూపొందనున్న చిత్రమిది. సృష్టిలోని ఏడు లోకాలను చూపిస్తూ, అద్భుతమైన గ్రాఫిక్స్‌తో ‘పరకామణి’ని తెరకెక్కించనున్నాం. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రూ. 20 కోట్లతో నిర్మిస్తాం. ఈ చిత్రంలో ఇద్దరు ప్రముఖ హీరోలు నటిస్తారు. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తాం’’ అన్నారు.


● సుమన్ బాబు

మూడు రోజులు నిద్రపోలేదు

- వేణు ఊడుగుల



‘‘నీది నాది ఒకే కథ, విరాటపర్వం’ వంటి సినిమాలతో ప్రశంసలు అందుకున్న దర్శకుడు వేణు ఊడుగుల నిర్మాతగా మారారు. రాహుల్ మోపిదేవితో కలిసి సాయిలు కంపాటిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, ‘రాజు వెడ్స్ రాంబాయి’ అనే సినిమాను ప్రకటించారు. ఖమ్మం, వరంగల్ బోర్డర్ నేపథ్యంలో వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ సినిమాను వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న విడుదల చేయనున్నారు. ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. ‘మీకో విషయం చెప్పనా... బొగ్గుతోని మా ఇల్లందు మండలంకి ఎంత పేరు వచ్చిందో అట్లనే మా ప్రేమతో మా ఊరికి అంత పేరు వచ్చింది. రాజు మాటలో చెప్పాల్నంటే మా ప్రేమ ఒక తీన్మార్. మా ప్రేమ ఒక దోమార్...’ అనే డైలాగ్స్ ఈ వీడియోలో ఉన్నాయి. ఈ సందర్భంగా వేణు ఊడుగుల మాట్లాడుతూ– ‘‘సాయిలు నాతో మూడేళ్లుగా ట్రావెల్ చేస్తున్నాడు. వాళ్ల ప్రాంతంలో జరిగిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా ఓ కథ రాశానని చెప్పాడు. కథ విన్న నాకు అద్భుతమైన ఫీలింగ్ కలిగింది. ఇలాంటి వైవిధ్యమైన ప్రేమకథను నేనెప్పుడూ చూడలేదు... వినలేదు. ఈ సినిమా క్లైమాక్స్ నన్ను మూడు రోజులు నిద్ర పోనివ్వలేదు’’ అని అన్నారు. ఈ సినిమాకు సంగీతం: సురేష్ బొబ్బిలి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
239	65
77,578	23,518

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	18,860	▲ 70
డోజోన్స్	43,235	▽ 154
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,099	▽ 10
డాక్స్	19,060	▽ 129
షాంఘై	3,346	▲ 22
నికాయ్	38,414	▲ 194

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

	ధర	మార్పు
బంగారం (99.9 స్వచ్ఛత)	75,873	▲ 1,065
బంగారం (99.5 స్వచ్ఛత)	75,569	▲ 1,061
వెండి (కిలో)	90,956	▲ 1,667

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	84.00	85.02
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	105.81	108.63
€	యూరో	ఒకటి	88.27	90.87
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.18	55.55
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.59	55.77
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.41	65.89
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.58	23.12
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	22.10	23.88
¥	చైనా యువాన్	ఒకటి	10.76	12.59

రూఫ్‌టాప్ సౌరభం!



పర్యావరణానుకూల 'గ్రీన్' పాలసీల పుణ్యమా అని దేశంలో సౌర విద్యుత్ రంగం వెలుగులు విరజిమ్ముతోంది. గృహాల్లో రూఫ్‌టాప్ సోలార్ కనెక్షన్లు భారీగా ఎగబాకుతున్నాయి. ముఖ్యంగా కేంద్రం అమల్లోకి తెచ్చిన పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన ప్రభావంతో ఈ విభాగంలో సౌర విద్యుత్ సామర్థ్యం ఆరు నెలల్లోనే రెట్టింపు కావడం విశేషం!

– సాక్షి, బిజినెస్ డెస్క్

- పీఎం సూర్య ఘర్ యోజన ఎఫెక్ట్...
- ఆరు నెలల్లో 4 లక్షల సోలార్ కనెక్షన్లు జత
- 1.8 గిగావాట్ల సామర్థ్యం ప్లస్...
- ఆకట్టుకుంటున్న భారీ సబ్సిడీ, రుణ సదుపాయం
- 2027 నాటికి 30 గిగావాట్ల గృహ సౌర విద్యుత్ లక్ష్యం

సోలార్ పవర్ 'టాప్'లేపుతోంది! నివాసాల్లో సౌర విద్యుత్ వాడకం జోరందుకుంది. మోదీ సర్కారు ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రతిష్టాత్మక ఫ్లాగ్‌షిప్ పథకం పీఎం సూర్య ఘర్ యోజనను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి దేశంలో దాదాపు 4 లక్షలకు పైగా గృహ సోలార్ కనెక్షన్లు కొత్తగా జతయ్యాయి. వీటి మొత్తం స్థాపిత సామర్థ్యం (ఇన్‌స్టాల్డ్ కెపాసిటీ) 1.8 గిగావాట్లు (జీడబ్ల్యూ)గా అంచనా. ఈ ఏడాది మార్చి నాటికి నివాస రూఫ్‌టాప్ సోలార్ సామర్థ్యం 3.2 జీడబ్ల్యూగా నమోదైంది. అంటే, దీంతో పోలిస్తే గడిచిన ఆరు నెలల కాలంలో 50 శాతం పైగా సామర్థ్యం ఎగబాకినట్లు పరిశ్రమ వర్గాల తాజా గణాంకాల్లో వెల్లడైంది. ఇదంతా పీఎం సూర్య ఘర్ స్కీమ్ చలవేనని పరిశీలకులు చెబుతున్నారు. మొత్తంమీద చూస్తే, దేశంలో రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ సామర్థ్యం 2024 మార్చి నాటికి 11.9 జీడబ్ల్యూగా ఉంది. ఇందులో అత్యధికంగా సుమారు 60 శాతం వాటా వాణిజ్య, పారిశ్రామిక విభాగాలదే!

దేశంలో సౌర విద్యుత్ వినియోగాన్ని భారీగా పెంచడంలో భాగంగా 2027 నాటికి నివాస గృహాల రూఫ్‌టాప్ సోలార్ స్థాపిత సామర్థ్యాన్ని 30 గిగావాట్లకు పెంచాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీన్ని సాధించాలంటే ఏటా 8–10 జీబ్ల్యూ వార్షిక సామర్థ్యం గల రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లు జతకావాల్సి ఉంటుంది. 'మిగులు విద్యుత్‌ను తిరిగి విక్రయించడంతో సహా డిస్కమ్‌ల నుంచి అనుమతులను పొందడం విషయంలో ప్రభుత్వం నిబంధనలను సడలిస్తోంది. రుణ సదుపాయంతో పాటు ప్రజల్లో సౌర విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటుపై అవగాహన పెంచేలా చర్యలు చేపడుతుండటంతో ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతోంది' అని ఇక్రా వైస్ ప్రెసిడెంట్ విక్రమ్ వి. పేర్కొన్నారు. ఈ స్కీమ్ ద్వారా సబ్సిడీ మొత్తాన్ని భారీగా పెంచడం, సోలార్ మాడ్యూల్స్‌పై వ్యయాలను తగ్గించడం, వినియోగదారుల్లో ఈ టెక్నాలజీ పట్ల అవగాహన పెంపొందించడం వంటి అంశాల నేపథ్యంలో రెసిడెన్షియల్ రూఫ్‌టాప్ సోలార్ మార్కెట్ వృద్ధికి పుష్కలమైన అవకాశాలున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. 'రాష్ట్ర నియంత్రణ సంస్థలు ఈ స్కీమ్ అమలుకు దన్నుగా నిలుస్తున్నాయి. గృహ సోలార్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసుకునే కస్టమర్లకు నెట్ మీటరింగ్‌ను అందిస్తున్నాయి. దీనికి తోడు తక్కువ వడ్డీకే రుణాలు లభిస్తున్నాయి. కొన్నేళ్ల క్రితం వీటి ఏర్పాటుకు రుణాలిచ్చే సంస్థలు అరకొరగానే ఉండేవి. ఇప్పుడు 25కు పైగా ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులతో పాటు ఎన్‌బీఎఫ్‌సీలు, ఫిన్‌టెక్ కంపెనీలు రుణాలిస్తున్నాయి. దీంతో నివాసపరమైన రూఫ్‌టాప్ సోలార్ మార్కెట్ పుంజుకుంటోంది' అని విక్రమ్ చెప్పారు.

ఏటా 8-10 గిగావాట్లు..

సబ్సిడీ పెంపు.. తక్కువ వడ్డీకే రుణం..

ఇంటి డాబాలపై సౌర విద్యుత్ సిస్టమ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వ తోడ్పాటు ఎప్పటి నుంచో ఉంది. ఖర్చు తడిసిమోపెడవుతుండటంతో ప్రజల నుండి పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. అయితే, గ్రీన్ ఎనర్జీ పాలసీపై గట్టిగా దృష్టిపెట్టిన కేంద్ర ప్రభుత్వం గృహాల్లో సోలార్ వెలుగులు పెంచేందుకు పీఎం సూర్య ఘర్ స్కీమ్‌ను తీసుకొచ్చింది. ప్రధానంగా అధిక వ్యయ సమస్యకు చెక్ పెట్టేందుకు సోలార్ మాడ్యూల్స్‌పై సబ్సిడీని 40% నుంచి 60%కి పెంచింది. 7% వడ్డీకే రుణ సదుపాయం కూడా కల్పిస్తోంది. దీంతో రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసుకునే వారి సంఖ్య గత కొన్ని నెలలుగా భారీగా పెరిగినట్లు జేఎంకే రీసెర్చ్, ఎనలిటిక్స్ తాజా నివేదికలో వెల్లడైంది. కాగా, ఈ జోరు ఇలాగే కొనసాగితే నివాస సౌర విద్యుత్ సామర్థ్య విస్తరణలో ఈ స్కీమ్ గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందనేది నిపుణుల మాట!

సవాళ్లున్నాయ్...

గృహాల్లో సోలార్ వినియోగాన్ని పెంచే లక్ష్యంతో మోదీ సర్కారు 2027 నాటికి కోటి ఇళ్లలో రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసేందుకు ఏకంగా రూ.75,021 కోట్ల మొత్తాన్ని (ప్రభుత్వ వ్యయం) కేటాయించింది కూడా. భారత్ నిర్దేశించుకున్న పునరుత్పాదక ఇంధన లక్ష్యాలు, 2070 నాటికి కర్బన ఉద్గార రహిత (నెట్ జీరో) దేశంగా అవతరించాలన్న సంకల్పానికి సూర్య ఘర్ పథకం చేదోడుగా నిలుస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే, ఇందుకు చాలా సవాళ్లు పొంచి ఉన్నాయని... ముఖ్యంగా దేశీయంగా నివాస రంగానికి దేశీయ సోలార్ మాడ్యూల్స్ లభ్యతను పెంచాల్సి ఉందంటున్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా దేశంలో ఫొటోవోల్టాయిక్ సెల్, మాడ్యూల్ తయారీ సామర్థ్యం, డిమాండ్ మధ్య భారీ అంతరం ఉందని, ఈ మేరకు ప్లాంట్ల సామర్థ్యం భారీగా పెరగాల్సి ఉందనేది వారి అభిప్రాయం. చిన్న, మధ్య తరహా గృహ విద్యుత్ వినియోగదారులు ఈ స్కీమ్‌ను ఉపయోగించుకునేలా మరింత ప్రోత్సహించాలని కూడా నిపుణుల సూచిస్తున్నారు.





'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్‌కు కొరత
వచ్చే నెలలో విశాల్ 'మెగా'మార్ట్ ఐపీవో

జీఆర్‌టీ జ్యువెలర్స్ డైమండ్ ఫెస్టివల్

హైదరాబాద్: ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ జీఆర్‌టీ జ్యువెలర్స్ డైమండ్ ఫెస్టివల్‌ను ప్రకటించింది. ఇందులో భాగంగా ప్రత్యేకంగా చేతితో తీర్చిదిద్దిన వజ్రాలు, అన్‌కట్ వజ్రాల విలువపై 25% వరకు డిస్కౌంట్ అందిస్తుంది. ప్లాటినం ఆభరణాల తయారీ చార్జీలపై 30% తగ్గింపు ఇస్తుంది. ఈ ప్రత్యేక ఆఫర్లు ఒరియానా లైట్ వెయిట్ వజ్రాభరణాలకూ వర్తిస్తుంది. అత్యుత్తమ వజ్రాభరణాలను అత్యంత కచ్చితత్వంతో కస్టమర్లకు అందించేందుకు 'డైమండ్ ఫెస్టివల్' నిర్వహిస్తున్నామని, ఆఫర్లు అందరూ వినియోగించుకోవాలని జీఆర్‌టీ జ్యువెలర్స్ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు.

కనిష్ట స్థాయిల్లో కొనుగోళ్లు

- సెన్సెక్స్ లాభం 239 పాయింట్లు
- 23,500 స్థాయి పైకి నిఫ్టీ

ముంబై: కనిష్ట స్థాయిల వద్ద బ్యాంకులు, ఐటీ, ఆటో షేర్లకు కొనుగోళ్లకు మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు వరుస నష్టాల నుంచి కోలుకున్నాయి. సెన్సెక్స్ 239 పెరిగి 77,578 వద్ద స్థిరపడింది, నిఫ్టీ 65 పాయింట్లు బలపడి 23,518 వద్ద ముగిసింది. ఉదయం సూచీలు లాభాలతో మొదలయ్యాయి. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు కొనుగోళ్ల ఉత్సాహంతో మిడ్ సెషన్ కల్లా భారీ లాభాలు ఆర్జించాయి. ఒక దశలో సెన్సెక్స్ 1,113 పాయింట్లు ఎగసి 78,452 వద్ద, నిఫ్టీ 300 పాయింట్లు బలపడి 23,780 వద్ద గరిష్టాలు తాకాయి. అయితే రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య పోరు మరింత ఉద్రిక్తం అయ్యే సంకేతాలతో ఇన్వెస్టర్లు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. ఆఖర్లో నెలకొన్న అమ్మకాల ఒత్తిడితో సూచీల లాభాలు పరిమితమయ్యాయి. మెటల్, ఆయిల్‌అండ్‌గ్యాస్, ఇంధన షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. రంగాల వారీగా రియల్టీ, ఆటో, సర్వీసెస్ ఇండెక్సులు 1.50% పెరిగాయి.



అదానీ ఇన్‌ఫ్రా చేతికి పీఎస్‌పీ ప్రాజెక్ట్స్

- 30 శాతం వాటా కొనుగోలుకి రెడీ
- ఒప్పందం విలువ రూ. 685 కోట్లు
- మరో 26% వాటాకు ఓపెన్ ఆఫర్!



న్యూఢిల్లీ: నిర్మాణ రంగ కంపెనీ పీఎస్‌పీ ప్రాజెక్ట్స్‌లో 30.07 శాతం వాటాను అదానీ ఎంటర్‌ప్రైజెస్ యూనిట్.. అదానీ ఇన్‌ఫ్రా కొనుగోలు చేయనుంది. ఇందుకు రూ. 685.36 కోట్లు వెచ్చించనుంది. తద్వారా నిర్మాణ సామర్థ్యాలను ఏకీకృతం చేయాలని భావిస్తోంది. పీఎస్‌పీకి నాయకత్వం వహిస్తున్న ప్రహలాద్‌భాయ్ ఎస్.పటేల్ నుంచి ఈ వాటాను అదానీ గ్రూప్ సొంతం చేసుకోనుంది. దీంతో పీఎస్‌పీ ప్రాజెక్ట్స్ వాటాదారులకు ఓపెన్ ఆఫర్‌ను సైతం ప్రకటించనుంది. ఇటీవల అదానీ గ్రూప్ విభిన్న రంగాలలో విస్తరించే బాటలో ఇతర సంస్థలను కొనుగోలు చేస్తున్న సంగతి తెలిసిందే.

ప్రమోటర్‌గా..

ప్రహలాద్‌భాయ్ ఎస్.పటేల్‌తో అదానీ ఇన్‌ఫ్రా షేర్ల కొనుగోలు ఒప్పందాన్ని(ఎస్‌పీఏ) కుదుర్చుకున్నట్లు పీఎస్‌పీ ప్రాజెక్ట్స్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. కంపెనీ చెల్లించిన వాటా మూలధనంలో 30.07 శాతం వాటాకు సమానమైన 1,19,19,353 షేర్లను విక్రయించేందుకు ప్రహలాద్‌భాయ్ అంగీకరించినట్లు వెల్లడించింది. ప్రస్తుతం పీఎస్‌పీ ప్రాజెక్ట్స్‌లో ప్రమోటర్లకు 60.14 శాతం వాటా ఉంది. ప్రహలాద్‌భాయ్ 47.76 శాతం వాటాను కలిగి ఉన్నారు. దీనిలో 30.07 శాతం వాటాను అదానీ ఇన్‌ఫ్రాకు విక్రయిస్తున్నారు. వెరసి ఈ లావాదేవీ తదుపరి పీఎస్‌పీ ప్రాజెక్ట్స్‌లో మొత్తం ప్రమోటర్ల వాటా 30.07 శాతానికి పరిమితంకానుంది. మరోవైపు పీఎస్‌పీ సాధారణ వాటాదారుల నుంచి మరో 26 శాతం వాటా కొనుగోలుకి అదానీ ఇన్‌ఫ్రా ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది. వెరసి పీఎస్‌పీలో అదానీ ఇన్‌ఫ్రా అతిపెద్ద వాటాదారుగా అవతరించనుంది. బోర్డులో డైరెక్టర్లను నియమించనుంది. ఫలితంగా ఓపెన్ ఆఫర్ పూర్తయిన పిదప పీఎస్‌పీ ప్రాజెక్ట్స్ ప్రమోటర్లలో ఒకటిగా అదానీ ఇన్‌ఫ్రా నిలవనుంది. కాగా.. తాజా డీల్ తదుపరి రెండు వైపులా ప్రమోటర్లు ఐదేళ్లపాటు కంపెనీ షేర్లను విక్రయించేందుకు వీలుండదు.

షేరు ధర తీరిలా...

ఇండస్ట్రియల్, ఇన్‌స్టిట్యూషనల్, రెసిడెన్షియల్ ప్రాజెక్టులను చేపట్టే పీఎస్‌పీ ప్రాజెక్ట్స్ సూరత్ డైమండ్ ఎక్స్ఛేంజీ తదితర లగ్జరీ ప్రాజెక్టులను సైతం నిర్మించింది. 2024 సెప్టెంబర్‌కల్లా రూ. 6,546 కోట్ల విలువైన ఆర్డర్ బుక్‌ను కలిగి ఉంది. కాగా.. మంగళవారం షేరు ధర బీఎస్‌ఈలో 4.4% ఎగసి రూ. 672 వద్ద ముగిసింది. షేరుకి రూ. 575 ధర(15% డిస్కౌంట్)లో తాజా డీల్‌కు తెరతీసింది.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

గ్రూప్-2.. తుది వ్యూహం!

టీజీపీఎస్సీ ఎగ్జామ్స్

» డిసెంబర్ 15, 16 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు
» డిస్క్రిప్టివ్ ప్రిపరేషన్, ఆబ్జెక్టివ్ ప్రాక్టీస్ ముఖ్యం
» సిలబస్‌పై పట్టు సాధించాలంటున్న నిపుణులు

తెలంగాణలో లక్షల మంది అభ్యర్థులు ఎదురుచూస్తున్న గ్రూప్ 2 పరీక్షలు డిసెంబర్ 15, 16 తేదీల్లో జరుగనున్నాయి. మొత్తం 783 పోస్టుల భర్తీకి నాలుగు పేపర్లుగా గ్రూప్-2 పరీక్షలను టీజీపీఎస్సీ నిర్వహించనుంది. ఉద్యోగార్థులు ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే ఈ పరీక్షలకు మరో 25 రోజుల సమయం మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో.. గ్రూప్ 2లో విజయానికి రివిజన్ వ్యూహం, ఎగ్జామ్ డే టిప్స్‌పై ప్రత్యేక కథనం..



నాలుగు పేపర్లలో జరిగే గ్రూప్ 2 పరీక్షలో..జనరల్ స్టడీస్, హిస్టరీ, పాలిటీ, సొసైటీ, ఎకానమీ, తెలంగాణ ఉద్యమం నుంచి ప్రశ్నలు ఉంటాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో అభ్యర్థులు రివిజన్‌పై ప్రధానంగా దృష్టిపెట్టాలి. ఇప్పటి వరకూ చదివిన అంశాలను పదేపదే పునశ్చరణ చేసుకోవాలి. ప్రస్తుత సమయంలో కొత్త పుస్తకాలు, కొత్త టాపిక్స్‌కు దూరంగా ఉండటమే మేలు. ప్రతి రోజూ ప్రతి పేపర్ చదివేలా ప్లాన్ చేసుకోవాలి.

డిస్క్రిప్టివ్ విధానం

గ్రూప్ 2 పరీక్షలు ఆబ్జెక్టివ్ విధానంలో ఉన్నప్పటికీ.. అభ్యర్థులు డిస్క్రిప్టివ్ పద్ధతిలో ప్రిపేషన్ సాగించాలని నిపుణులు సూచిస్తున్నారు. వ్యాసరూప విధానంలో సబ్జెక్టుపై పట్టు సాధిస్తూ.. ఆబ్జెక్టివ్ బిట్స్‌ను ప్రాక్టీస్ చేయడం మేలు చేస్తుందని పేర్కొంటున్నారు. అన్ని కోణాల్లో అవగాహన ఉంటేనే సమాధానాలు ఇచ్చేవిధంగా ప్రశ్నలు అడుగుతున్నారు. కాబట్టి ప్రస్తుత సమయంలో డిస్క్రిప్టివ్ పద్ధతిలో చదువుతూ.. ఆయా అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలి. ప్రతి రోజు సగటున 8నుంచి 10గంటల సమయం ప్రిపరేషన్‌కు కేటాయించేలా టైమ్ టేబుల్ రూపొందించుకోవాలి.

ఉమ్మడి అంశాలకు

ఆయా టాపిక్స్‌కు సంబంధించి నిర్వచనం మొదలు తాజా పరిణామాల వరకూ.. సమగ్ర అవగాహన పెంచుకోవాలి. అదేవిధంగా సదరు పేపర్లలో ఉన్న ఉమ్మడి అంశాలను గుర్తించి.. వాటిని ఒకే సమయంలో చదివేలా ప్రణాళిక రూపొందించుకోవాలి. జనరల్ స్టడీస్, కరెంట్ అఫైర్స్, ఇంటర్నేషనల్ రిలేషన్స్, హిస్టరీ, పాలిటీ, సొసైటీ, ఎకానమీలో పేపర్ల వారీగా కామన్‌గా ఉన్న టాపిక్స్‌ను గుర్తించాలి. వాటిని ఒకే సమయంలో పూర్తి చేసుకోవాలి. దీంతోపాటు సదరు అంశాలను అనుసంధానం చేసుకుంటూ అధ్యయనం చేయాలి.

సొంత నోట్స్ ఎంతో మేలు

అభ్యర్థులు ప్రిపరేషన్ ప్రారంభం నుంచే ఆయా సబ్జెక్ట్‌లలోని ముఖ్యమైన అంశాలతో సొంత నోట్స్ రాసుకుంటారు. ప్రస్తుత సమయంలో దీన్ని రివిజన్ కోసం సద్వినియోగం చేసుకోవాలి. ఆయా విభాగాలకు సంబంధించి ముఖ్యమైన అంశాలు, పాయింట్లతో రాసుకున్న నోట్స్‌ను చదువుతూ ముందుకు సాగాలి. సొసైటీకి సంబంధించి మతాలు, సామాజిక వర్గాలు, గిరిజన సమస్యలు, ప్రాంతీయ సమస్యలు, ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా ఒక అంశాన్ని చదివేటప్పుడు అన్ని కోణాల్లో అధ్యయనం చేయాలి. ఉదాహరణకు సామాజిక వర్గాలనే పరిగణనలోకి తీసుకుంటే.. ఆ వర్గాల నిర్వచనానికే పరిమితం కాకుండా.. వాటి ఆవిర్భావ చరిత్ర, విస్తరణ, తాజా పరిస్థితులు, జనాభా సంఖ్య.. ఇలా అన్నింటినీ చదవాలి. అప్పుడే సదరు టాపిక్స్‌పై సంపూర్ణ అవగాహన ఏర్పడుతుంది.

గణాంక సమాచారం

గ్రూప్-2 అభ్యర్థులు గణాంక సహిత సమాచారాన్ని ఔపోసన పట్టాలి. ముఖ్యంగా ఎకానమీ, జాగ్రఫీలో ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. 2011 జన గణన, గణాంకాలపై పట్టు సాధించాలి. చరిత్రకు సంబంధించి ముఖ్యమైన సంవత్సరాలు–సంబంధిత సంఘటనలతో కూడిన జాబితా రూపొందించుకోవాలి. ప్రతి పేపర్‌లో పూర్తిగా ఫ్యాక్టువల్ డేటా ఆధారంగా అడిగే ప్రశ్నలు కొన్ని ఉంటాయి. కాబట్టి డేటాపై పట్టు సాధిస్తే ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు గుర్తించే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు తెలంగాణలో ఎస్సీ, ఎస్టీల జనాభా శాతం ఎంత; ఏ జిల్లాలో ఎక్కువ, ఏ జిల్లాలో తక్కువ; రాష్ట్రంలో, దేశంలో జన సాంద్రత, గ్రామీణ, పట్టణ జనాభా తీరుతెన్నులు, దేశంలో, రాష్ట్రంలో లింగ నిష్పత్తి వంటివి.

తెలంగాణపై ప్రత్యేక దృష్టి

తెలంగాణ అంశాలకు పరీక్షలో ప్రాధాన్యం లభించే అవకాశం ఉంది. కాబట్టి ముందుగా తెలంగాణ పాలసీపై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా తెలంగాణ ఏర్పాటు, అనంతరం ఎలాంటి కొత్త విధానాలు తెచ్చారో తెలుసుకోవాలి. అదే విధంగా రాష్ట్రంలో ఆయా వర్గాల కోసం అమలు చేస్తున్న నూతన పథకాలపై అవగాహన పెంచుకోవాలి. వెనుకబడిన తరగతులు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు తదితర వర్గాలకు సంబంధించి తెచ్చిన నూతన పథకాల గురించి తెలుసుకోవాలి.

పేపర్-4 స్కోరింగ్

గ్రూప్-2 అభ్యర్థులు పేపర్-4 పై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలి. ఈ పేపర్‌ను 'తెలంగాణ ఆలోచన (1948–1970), ఉద్యమ దశ (1971–1990), తెలంగాణ ఏర్పాటు దశ, ఆవిర్భావం (1991–2014)) దశగా పేర్కొన్నారు. ముఖ్యంగా 1948 నుంచి 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు వరకూ జరిగిన ముఖ్య ఉద్యమాలు, ఒప్పందాలు, ముల్కీ నిబంధనలు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీలు–వాటి సిఫార్సులు వంటి వాటిపై సమగ్ర అవగాహన పెంచుకోవాలి. దీంతోపాటు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా రూపొందించిన పునర్ వ్యవస్థీకరణ బిల్లులో తెలంగాణకు సంబంధించి ప్రత్యేకంగా పొందుపరచిన అంశాలు, కల్పించిన హక్కులపై దృష్టి సారించాలి.

పరీక్ష రోజు ఇలా

ఓఎంఆర్ షీట్ అత్యంత అప్రమత్తంగా

పరీక్షలో సమాధానాలు గుర్తించేందుకు ఉద్దేశించిన ఓఎంఆర్ షీట్ నింపడలో అభ్యర్థులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలి. ఓఎంఆర్ షీట్‌ను తప్పులు లేకుండా నింపడంతోపాటు సమాధానాలు బబ్లింగ్ చేసే క్రమంలో.. ప్రశ్న సంఖ్య, ఆప్షన్‌ను క్షుణ్నంగా గుర్తించాలి. ఎంతో మంది ఓఎంఆర్ షీట్‌ను పూర్తి చేయడంలో పొరపాట్లు చేసి.. సమాధానాలన్నీ సరిగా రాసి కూడా విజయం చేజార్చు కుంటున్నారు. అదేవిధంగా హాల్‌టికెట్ అందుబాటులోకి రాగానే డౌన్‌లోడ్ చేసుకోవాలి.

ప్రశ్నలు చదవడానికి సమయం

పరీక్ష రోజున సమాధానాలిచ్చే క్రమంలో.. ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వాలనే తొందరపాటును వీడాలి. ముందుగా ప్రశ్న పత్రాన్ని చదివేందుకు కొంత సమయం కేటాయించాలి. కనీసం పది నిమిషాలపాటు ప్రశ్న పత్రం పరిశీలించాలి. ఫలితంగా ప్రశ్న పత్రం క్లిష్టత స్థాయిపై ప్రాథమిక అవగాహన ఏర్పడుతుంది. ఆ తర్వాత సులభంగా భావించిన ప్రశ్నలకు ముందుగా సమాధానం ఇవ్వాలి. అనంతరం ఓ మోస్తరు క్లిష్టత ప్రశ్నలకు సమాధానం గుర్తించాలి. చివరగా అత్యంత క్లిష్టమైన ప్రశ్నలపై దృష్టి పెట్టాలి. దీనికి భిన్నంగా ముందు తమకు అవగాహన లేని ప్రశ్నలకు సమాధానాలిచ్చేందుకు ఉపక్రమిస్తే.. సమయం వృధా కావడమే కాకుండా.. సమాధానాలు స్ఫురించక.. మానసికంగా ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉంది. పర్యవసానంగా తమకు తెలిసిన ప్రశ్నలకు కూడా సమాధానం ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతుంది.

ఎలిమినేషన్.. చివరగా

ఆబ్జెక్టివ్ విధానంలో జరిగే పరీక్షల్లో చాలా మంది అభ్యర్థులు చేసే పని.. ఎలిమినేషన్ టెక్నిక్‌ను అనుసరించడం. అంటే.. నాలుగు సమాధానాల్లో.. ప్రశ్నకు సరితూగని సమాధానాలను ఒక్కొక్కటిగా తొలగించి.. చివరగా మిగిలిన ఆప్షన్‌ను సమాధానంగా గుర్తిస్తారు. ఈ టెక్నిక్‌ను కూడా పరీక్ష చివరి దశలోనే అమలు చేయాలి. అప్పటికే తమకు సమాధానాలు తెలిసిన అన్ని ప్రశ్నలను పూర్తి చేసుకున్నామని భావించాకే ఎలిమినేషన్ లేదా గెస్సింగ్‌పై దృష్టి పెట్టాలి.

'స్పెషల్' ఫోకస్

తెలంగాణ ప్రత్యేక అంశాలను చదివేటప్పుడు తెలంగాణ హిస్టరీ, తెలంగాణ జాగ్రఫీ, తెలంగాణ ఎకానమీపై అభ్యర్థులు లోతైన అవగాహన పెంచుకోవాలి. తెలంగాణ చరిత్రలో శాతవాహనులు, ఇక్ష్వాకులు, కాకతీయులు, కుతుబ్ షాహీలు, అసఫ్ జాహీల కాలంలో పాలన తీరుతెన్నులు, ముఖ్య పరిణామాలు; సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలు, కళలు, సాహిత్యం, శిల్పం, తెలంగాణలోని కవులు –రచనలు; కళలు; ముఖ్య కట్టడాలు వంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అదే విధంగా స్వాతంత్ర్యోద్యమంలో తెలంగాణ ప్రాంత ప్రమేయం ఉన్న సంఘటనలపై అవగాహన ఏర్పరచుకోవాలి. తెలంగాణలోని ముఖ్యమైన నదులు–పరీవాహక ప్రాంతాలు; ముఖ్యమైన పంటలు; భౌగోళిక ప్రాధాన్యం ఉన్న ప్రదేశాలు, పర్యాటక ప్రదేశాలపై దృష్టి పెట్టాలి. దీంతోపాటు తెలంగాణ భౌగోళిక స్వరూపం, విస్తీర్ణం, జనాభా వంటి అంశాలపై అవగాహన అవసరం. ఎకానమీలో తెలంగాణ స్థూల రాష్ట్రీయోత్పత్తి, ముఖ్యమైన పథకాలు, 2011 జనాభా గణాంకాలు; ముఖ్యమైన పరిశ్రమలు–ఉత్పత్తిదాయకత, రాష్ట్ర ప్రధాన ఆదాయ వనరులపై పట్టు సాధించాలి. తాజా బడ్జెట్ గణాంకాలు, ఆయా శాఖలు, పథకాలకు కేటాయింపులపై అవగాహన ఏర్పరచుకోవాలి.

ప్రాక్టీస్ టెస్టులు

ప్రస్తుతం సమయంలో ప్రాక్టీస్ టెస్టులు, మోడల్ టెస్టులకు హాజరవడం కూడా మేలు చేస్తుంది. దీని వల్ల ఆయా సబ్జెక్ట్‌లలో తమకు ఇప్పటి వరకు లభించిన పరిజ్ఞాన స్థాయిపై అవగాహన లభిస్తుంది. ఇంకా చదవాల్సిన అంశాలపై స్పష్టత వస్తుంది. అదే విధంగా తాము చేస్తున్న పొరపాట్లను విశ్లేషించుకుని, పరీక్షలో వాటిని సరిదిద్దుకునే వీలుంటుంది.



ఐపీఏ, న్యూఢిల్లీలో 33 పోస్టులు

న్యూఢిల్లీలోని ఇండియా పోర్ట్స్ అసోసియేషన్ (ఐపీఏ) దేశవ్యాప్తంగా ఉన్న పోర్టుల్లో డైరెక్ట్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 33.
» పోస్టుల వివరాలు: అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్–25, జూనియర్ ఎగ్జిక్యూటివ్ –08.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్(సివిల్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 30 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» వేతనం: నెలకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టులకు రూ.50,000 నుంచి రూ.1,60,000. జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు రూ.30,000 నుంచి రూ.1,20,000.
» పనిచేయాల్సిన ప్రదేశాలు: దీన్‌దయాళ్ పోర్ట్, ముంబై పోర్ట్ అథారిటీ, మోర్ముగో ఓడరేవు అథారిటీ, న్యూ మంగళూరు పోర్ట్ అథారిటీ, చిదంబరనార్ పోర్ట్ అథారిటీ, విశాఖపట్నం పోర్ట్ అథారిటీ, కామరాజర్ పోర్ట్ లిమిటెడ్.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ, వైద్య పరీక్షలు, సర్టిఫికెట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 20.11.2024
» వెబ్‌సైట్: https://www.ipa.nic.in

హాల్ నాసిక్‌లో వివిధ ఉద్యోగాలు

నాసిక్‌లోని హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్) షార్ట్ టర్మ్ ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 08.
» పోస్టుల వివరాలు: జూనియర్ స్పెషలిస్ట్–04, మిడిల్ స్పెషలిస్ట్–04.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ(మెకానికల్ /ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఏరోనాటికల్/ప్రొపల్షన్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 25.11.2024
» వెబ్‌సైట్: https://hal-india.co.in

ఎన్ఎంపీఏ, మంగళూరులో 33 పోస్టులు

మంగళూరులోని న్యూ మంగళూరు పోర్ట్ అథారిటీ(ఎన్ఎంపీఏ) డైరెక్ట్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 33.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ(లా), బీఈ/బీటెక్(సివిల్/మెకానికల్/ఎలక్ట్రికల్), ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» వేతనం: నెలకు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇంజనీర్, స్పోర్ట్స్ ఆఫీసర్ పోస్టులకు రూ.40,000 నుంచి రూ.1,40,000, మిగతా పోస్టులకు రూ.50,000 నుంచి రూ.1,60,000.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ, వైద్య పరీక్షలు, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌ద్వారా .
» దరఖాస్తులకు చివరితేది: 27.12.2024.
» వెబ్‌సైట్: http://newmangaloreport.gov.in

డబ్ల్యూఐఐ, డెహ్రాడూన్‌లో 17 పోస్టులు

డెహ్రాడూన్‌లోని వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(డబ్ల్యూఐఐ) ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకిదరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 17.
» పోస్టుల వివరాలు: ప్రాజెక్ట్ అసోసియేట్1–08, టెక్నికల్ అసిస్టెంట్–01, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్–01, ప్రాజెక్ట్ అసోసియేట్2–02, ప్రాజెక్ట్ అసిస్టెంట్–02, ఫీల్డ్ వర్కర్–03.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ(వైల్డ్ లైఫ్ సైన్స్/జువాలజీ/ఫారెస్ట్రీ/లైఫ్ సైన్స్/ఎన్విరాన్‌మెంట్ సైన్స్), ఇంజనీరింగ్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 50 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» దరఖాస్తులకు చివరితేది: 30.11.2024.
» వెబ్‌సైట్: https://wii.gov.in

నాన్నకు ప్రేమతో..

ఆరేళ్ల క్రితం తప్పిపోయిన తండ్రి
నాన్న జ్ఞాపకార్థం కూతుళ్ల అన్నదానం
అన్నదాన సహపంక్తిలో ప్రత్యక్షమైన తండ్రి
మాతృదేవోభవ అనాథాశ్రమంలో ఘటన

మతిస్థిమితం కోల్పోయిన తండ్రి ఆరేళ్ల క్రితం ఎటో వెళ్లిపోయాడు..
తండ్రి జాడ కోసం ఆయన ఇద్దరు కూతుళ్లు వెదకనిచోటు లేదు.. మొక్కని దేవుడు లేదు.. కానీ, ఆ తండ్రి జాడ తెలియలేదు. అయినా ఆ బిడ్డలు తండ్రిని మరిచిపోలేదు..
అనాథల్లోనే తండ్రిని చూసుకొంటూ అనేక అనాథాశ్రమాల్లో అన్నదానం చేస్తూ వచ్చారు. అలా ఒక అనాథాశ్రమంలో తమ తండ్రి జ్ఞాపకార్థం అన్నదానం చేస్తుండగా..
ఆ తండ్రే భోజనం కోసం పంక్తిలో కూర్చొని కనిపించాడు. ఈ ఘటన బాలాపూర్ మండలం నాదర్‌గుల్ గ్రామంలోని మాతృదేవోభవ అనాథాశ్రమంలో జరిగింది.


మహబూబ్‌నగర్ జిల్లా లింగాల తాలూకా బాకారం గ్రామానికి చెందిన దేరంగుల బాలయ్య (58) కుటుంబంతో 20 ఏళ్ల క్రితం బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చి రామంతాపూర్‌లో స్థిరపడ్డాడు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు దివ్య, లావణ్య ఉన్నారు. మతి స్థిమితం కోల్పోయిన బాలయ్య ఆరేళ్ల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఎన్నోచోట్ల వెదికినా ఆచూకీ లభించలేదు. కాగా, ఆరేళ్ల క్రితం మాతృదేవోభవ అనాథాశ్రమం వ్యవస్థాపకుడు గట్టు గిరి జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మతల్లి ఆలయానికి వెళ్లగా.. గుడి బయట బాలయ్య దీన స్థితిలో రోడ్డు పక్కన కనిపించాడు. కడుపు పట్టుకొని రోదిస్తుండటంతో ఏమైందని అడిగినా.. సమాధానం చెప్పలేదు. దీంతో బాలయ్యను గిరి తన అనాథాశ్రమానికి తీసుకెళ్లారు. ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలో చికిత్స కూడా చేయించడంతో బాలయ్య పరిస్థితి కొద్దిగా కుదుటపడింది. కానీ, ఆయన తన కుటుంబ వివరాలు చెప్పలేకపోవటంతో ఆశ్రమంలోనే ఆశ్రయం కల్పించారు. బాలయ్య కూతుళ్లు దివ్య, లావణ్య తప్పిపోయిన తండ్రి ఎక్కడైనా అనాథగా ఉంటున్నాడేమోనని ప్రతి అనాథాశ్రమంలో భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో నెల క్రితం మాతృదేవోభవ అనాథాశ్రమానికి వెళ్లి అక్కడి అనాథలకు అన్నదానం చేస్తుండగా బాలయ్య ఇతర అనాథలతోపాటు పంక్తిలో కూర్చున్నాడు. అతడిని లావణ్య, దివ్య గుర్తించి ఒక్కసారిగా భావోద్వేగానికి గురయ్యారు. ఆనందంతో తండ్రిని అక్కున చేర్చుకొని కన్నీరు పెట్టుకొన్నారు. బాలయ్య కూడా తన కూతుళ్లను గుర్తించి పరవశం చెందారు. తమ తండ్రిని ఆరోగ్యంగా అప్పగించిన ఆశ్రమం వ్యవస్థాపకుడు గట్టు గిరికి జీవితాంతం రుణపడి ఉంటామని లావణ్య, దివ్య తెలిపారు. ఆరేళ్ల తర్వాత తండ్రిని చూసిన కూతుళ్లు, తాతను చూసిన నలుగురు మనవళ్ల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఈ ఘటన ఆశ్రమంలోని ప్రతి ఒక్కరిని కదిలించింది.


కుటుంబ సభ్యులతో బాలయ్య...

– బంజారాహిల్స్

అక్కడ ఒక రోజు ఉంటే.. 40 సిగరెట్లు తాగినట్టే!

రోజురోజుకు గాలి కాలుష్యం పెరిగిపోతోంది. పరిశ్రమలు, వాహనాల నుంచి వెలువడే విష వాయువుల నుంచి దుమ్ము, ధూళి దాకా ఎన్నో కలుషితాలు వాతావరణంలో చేరుతున్నాయి. అలాంటి గాలిని పీల్చినప్పుడు కలుషితాలు శరీరంలోకి చేరి.. శ్వాసకోశ వ్యాధులు, వివిధ ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయి. ఇటీవల పాకిస్తాన్‌లోని లాహోర్ నగరం ప్రపంచంలోనే అత్యంత ఎక్కువగా వాయు కాలుష్యం ఉన్న నగరంగా నిలిస్తే... మన దేశ రాజధాని ఢిల్లీ దానితో పోటీపడుతూ గాలి కాలుష్యంలో రికార్డులను సృష్టిస్తోంది. ఈ దెబ్బకు స్కూళ్లు మూసేసి.. ఆన్‌లైన్‌లో ఇళ్ల నుంచే తరగతులు నడిపించాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో వాయు కాలుష్యాన్ని ఎలా కొలుస్తారు? దానితో ప్రమాదమేంటనే వివరాలు తెలుసుకుందామా..



కలుషిత గాలిని పీల్చినకొద్దీ..

కలుషితాలు ఉన్న గాలిని పీల్చినప్పుడు అవి మన శరీరంలో చేరుతాయి. దీన్ని లెక్కించేందుకు సిగరెట్లు తాగినప్పుడు మన శరీరంలో చేరే పొల్యూషన్‌తో పోలుస్తారు. గాలి ఏక్యూఐ 50 పాయింట్లు దాటాక ప్రతి 22 పాయింట్లు పెరిగిన కొద్దీ.. ఆ గాలిని (24 గంటల పాటు) పీల్చినవారు ఒక సిగరెట్ తాగినదానితో సమానంగా పొల్యూషన్‌కు లోనవుతారనేది లెక్క.

గాలి నాణ్యత లెక్కలను ప్రకటించే 'ఏక్యూఐ డాట్ ఇన్' వెబ్‌సైట్ గణాంకాల ప్రకారం.. సోమవారం (18న) మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఢిల్లీలోని ముండ్కా ప్రాంతంలో ఏక్యూఐ 950 పాయింట్లు దాటింది. అక్కడి గాలిని 24 గంటల పాటు పీలిస్తే.. 40కిపైగా సిగరెట్లు తాగిన దానితో సమానం అన్నమాట.

ఢిల్లీలోని జహంగీర్‌పురి, ఆనంద్ విహార్ ప్రాంతాల్లోనూ 650 వరకు ఏక్యూఐ నమోదైంది. అక్కడివారు ఒక రోజులో 32 సిగరెట్లు తాగినట్టే. హరియాణా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లోనూ ఏక్యూఐ ఐదారు వందల వరకు నమోదవుతోంది.

హైదరాబాద్ నగరంలోని పారిశ్రామిక ప్రాంతాలు, అత్యంత రద్దీ ప్రదేశాల్లోనూ కొన్ని సమయాల్లో 150 వరకు ఏక్యూఐ నమోదవుతూ ఉంటుంది.

ఏమిటీ ఏక్యూఐ లెక్క

వ్యర్థాలను తగలబెట్టినప్పుడు, పరిశ్రమలు, వాహనాల నుంచి వెలువడే విషపూరిత వాయువులు, దుమ్ము, ధూళి (పీఎం 2.5, పీఎం 10) కలుషితాలు వాతావరణంలో చేరుతాయి. ఆ కలుషితాల శాతాన్ని పరిశీలించి, గాలి నాణ్యతను నిర్ధారించడమే 'ఏక్యూఐ (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్)'. ఇది ఎంత ఎక్కువగా ఉంటే.. గాలి నాణ్యత అంత దారుణంగా ఉంటుందన్న మాట.

సాధారణంగా ఏక్యూఐ 50 పాయింట్లలోపు ఉంటే గాలి నాణ్యత బాగుందని.. 100 ఏక్యూఐ వరకు ఉంటే ఫరవాలేదని లెక్క. అంతకన్నా ఎంతెంత పెరిగితే.. ఆ గాలి నుంచి మనకు అంత ముప్పు పెరిగిపోతున్నట్టే.

భారీ పరిశ్రమలు, థర్మల్ పవర్ ప్లాంట్లు, విపరీతంగా వాహనాల రద్దీ ఉండే ప్రదేశాలు, భారీ నిర్మాణాలు జరిగే చోట గాలిలో కలుషితాల స్థాయి చాలా ఎక్కువగా ఉంటుంది. ఆయా చోట్ల ఏక్యూఐ అత్యంత ప్రమాదకరంగా ఐదారు వందల పాయింట్ల వరకు నమోదయ్యే అవకాశం ఉంటుంది.

..: సాక్షి సెంట్రల్ డెస్క్ :..

కూత పెట్టనున్న హైడ్రోజన్ రైలు..

సాక్షి, హైదరాబాద్: అధునాతన సౌకర్యాలతో సరికొత్త రైళ్లను అందుబాటులోకి తెస్తున్న భారత రైల్వే.. త్వరలోనే హైడ్రోజన్‌తో నడిచే రైళ్లను పట్టాలెక్కించబోతోంది. వచ్చే నెలలోనే తొలి రైలును ప్రయోగాత్మకంగా నడిపించనుంది. జర్మనీ సాంకేతిక పరిజ్ఞానం సాయంతో.. మన రైల్వే సొంతంగానే ఈ రైళ్లను తయారు చేస్తోంది. ఇప్పటికే అధిక వ్యయం, కాలుష్య కారకమైన డీజిల్ రైళ్లను తొలగించి ఎలక్ట్రిక్ రైళ్ల సంఖ్యను పెంచుతుండగా.. ఇకపై ఏ మాత్రం కాలుష్యం ఉండని హైడ్రోజన్ రైళ్లు పట్టాలపై పరుగెత్తనున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఈ అంశంలో జర్మనీ ముందుంది. ఆ దేశం గణనీయ సంఖ్యలో హైడ్రోజన్ రైళ్లను నడుపుతోంది. దానితోపాటు చైనా, రష్యా, ఇటలీ హైడ్రోజన్ రైళ్లు నడుపుతున్నాయి. వాటి సరసన ప్రపంచంలో ఐదో దేశంగా భారత్ రికార్డు సృష్టించనుంది.

మొదట హిల్ స్టేషన్లలో..
వచ్చే నెలాఖరులో హరియాణాలోని జింద్–సోనిపట్ మధ్య 90 కిలోమీటర్ల మార్గంలో తొలి హైడ్రోజన్ రైలును ప్రయోగాత్మకంగా నడిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పర్యావరణానికి హాని చేయని ఈ హైడ్రోజన్ రైళ్లను తొలుత హిల్ స్టేషన్ల రూట్లలో నడపాలని రైల్వే శాఖ ప్రాథమికంగా నిర్ణయించింది. డార్జిలింగ్ హిమాలయన్ రైల్వే, నీలగిరి మౌంటెయిన్ రైల్వే, ఇతర హిల్ స్టేషన్లలో డీజిల్ ఇంజిన్లతో నడుపుతున్న రైళ్లను తొలగించి హైడ్రోజన్ రైళ్లను ప్రవేశపెట్టనుంది. తర్వాత దశలవారీగా సాధారణ రూట్లలోనూ నడపనుంది.

భవిష్యత్ ఇంధనం హైడ్రోజనే...
బొగ్గు, చమురు నిల్వలు తరిగిపోతుండటం, అవి కాలుష్య కారకం కావడంతో... ప్రత్యామ్నాయ ఇంధనాలపై ప్రపంచ దేశాలు దృష్టిపెట్టాయి. ఈ క్రమంలో కాలుష్యం వెలువడని, తరిగిపోని హైడ్రోజన్‌ను భవిష్యత్తు ఇంధనంగా భావిస్తున్నాయి. దీనితో వాహనాలను నడిపే సాంకేతికతలను కొన్ని దేశాలు అభివృద్ధి చేశాయి. ఈ క్రమంలోనే మన రైల్వే కూడా వేగంగా ప్రయోగాలు పూర్తి చేసి హైడ్రోజన్ రైళ్లను పట్టాలెక్కించే దిశగా ముందుకు వెళుతోంది. రెండేళ్ల క్రితమే ఈ ప్రాజెక్టును చేపట్టగా.. డిసెంబర్ చివరిలో ప్రయోగాత్మక పరిశీలన మొదలవుతోంది.



ఒక్కో రైలు కోసం రూ.80 కోట్ల వ్యయం..

50 రైళ్లను సిద్ధం చేసే దిశగా కసరత్తు

ప్రాజెక్టు విశేషాలివీ..

- నీటి నుంచి హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేస్తారు. ఆ హైడ్రోజన్‌ను, ఆక్సిజన్‌తో కలిపినప్పుడు రసాయన చర్య జరిగి వెలువడే శక్తి ద్వారా రైలును నడిపిస్తారు. ఇందుకోసం రైలు ఇంజిన్లలో హైడ్రోజన్, ఆక్సిజన్ ట్యాంకులను ఏర్పాటు చేస్తారు.
- ఒకసారి ఇంధనాన్ని నింపితే వెయ్యి కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని అంచనా.
- హైడ్రోజన్ ఇంజిన్లు డీజిల్ ఇంజిన్ల కంటే 65 శాతం తక్కువ శబ్దాన్ని ఉత్పత్తి చేస్తాయి. ప్రస్తుత పరిజ్ఞానం మేరకు గరిష్టంగా 140 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయని.. 54.6 సెకన్లలోనే వంద కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటాయని నిపుణులు చెబుతున్నారు.
- ఒక కిలో హైడ్రోజన్ ఇంధనం 4.5 లీటర్ల డీజిల్‌తో సమానంగా శక్తిని అందిస్తుంది. ఓ అంచనా మేరకు ఒక్కో హైడ్రోజన్ రైలు ద్వారా ఏడాదికి రూ.16 లక్షల డీజిల్ ఆదా అవుతుంది.
- ఒక డీజిల్ ఇంజిన్ ద్వారా ఏడాదిలో 4,000 టన్నుల కార్బన్ డయాక్సైడ్ వెలువడుతుంది. హైడ్రోజన్ ఇంజిన్‌తో ఆ కాలుష్యానికి అడ్డుకట్ట పడుతుంది. హైడ్రోజన్ ఇంజిన్‌లో ఇంధనాన్ని మండించిన తర్వాత వ్యర్థాలుగా నీరు, నీటి ఆవిరి వెలువడతాయి.
- రైల్వే తొలుత 35 హైడ్రోజన్ రైళ్లను రూపొందించాలని భావించినప్పటికీ తాజాగా ఆ సంఖ్యను 50కి పెంచింది.
- ప్రస్తుత పరిజ్ఞానం ప్రకారం ఒక్కో రైలు తయారీకి రూ.80 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తోంది. వీటి తయారీకి రూ.2,800 కోట్లను కేటాయించారు.
- రైల్వే రోజుకు 3 వేల కిలోల హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యంతో ఒక ప్లాంటును ఏర్పాటు చేస్తోంది. తర్వాత హిల్ స్టేషన్లలో ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.



ఐలాండ్ అందాలు అదరహో..



గోవిందరావుపేట: ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పర్యాటక కేంద్రమైన లక్నవరంలో మూడో ఐలాండ్ అందాలు ముచ్చటగొలుపుతున్నాయి. లక్నవరం జలాశయంలో రూ.7 కోట్ల వ్యయంతో 8 ఎకరాల విస్తీర్ణంలో టీఎస్‌టీడీసీ, ఫ్రీకోట్స్ సంస్థ సంయుక్త భాగస్వామ్యంతో దీనిని అభివృద్ధి చేశాయి. పర్యాటకుల ఆహ్లాదానికి ప్రాధాన్యమిస్తూ పచ్చని ఉద్యాన వనాలు నిర్మించారు. 21 కాటేజీలు ఉండగా, అందులో నాలుగింటిని కుటుంబ సభ్యులతో బస చేసేందుకు ఏర్పాటు చేశారు. ఈ ఐలాండ్‌లో ఐదు ఈత కొలనులు ఉండగా, వాటిలో నాలుగింటిని వ్యక్తిగత కాటేజీలకు అనుబంధంగా నిర్మించారు. పిల్లల కోసం ప్రత్యేకంగా ఈత కొలనులు, ఆట వస్తువులు అందుబాటులో ఉన్నాయి. పెద్దల కోసం రెండు స్పాలు, రెస్టారెంట్‌లు కూడా ఏర్పాటు చేశారు. ఈ ఐలాండ్‌ను మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క బుధవారం ప్రారంభించనున్నారు.

కోహిర్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 9.5 డిగ్రీలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పతనమవుతున్నాయి. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణానికి కాస్త అటుఇటుగా నమోదు కాగా.. కనిష్ట ఉష్ణోగ్రతలు మాత్రం 3 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. గరిష్ట ఉష్ణోగ్రత నిజామాబాద్‌లో 32.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కాగా, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 12 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. రాష్ట్రంలో అతి తక్కువగా సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 9.5 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. 30 ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రత 15 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

హైదరాబాద్‌లో రేపట్నుంచి ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21 నుంచి 24 వరకు హైదరాబాద్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం గ్రౌండ్, ఐమాక్స్ థియేటర్ పక్కన ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, మత్స్యకార సంఘాల నేతలు తదితరులు పాల్గొననున్నారు. కార్యక్రమంలో పలు రకాల చేప వంటకాలు ప్రదర్శించనున్నారు. చేప వంటకాల్లో ప్రతిభ కనబర్చిన మత్స్యకారులకు అవార్డులు అందిస్తారు.

మహిళా ఖాకీ దళం సిద్ధం

ఖిలా వరంగల్: రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాలకు చెందిన మహిళా సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లు 1,148 మంది వరంగల్ మామునూరు పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో శిక్షణ పొందారు. ఇందులో సివిల్ 843 మంది, ఏఆర్ 305 మంది అభ్యర్థులున్నారు. 9 నెలల పాటు సాగిన శిక్షణ ఈనెల 21న జరిగే పాసింగ్ అవుట్ పరేడ్‌తో ముగియనుంది. ఈ మేరకు పీటీసీలో ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) హాజరుకానున్నారు. నేరాలు త్వరగా ఛేదించే విధంగా అధునాతనమైన సాంకేతిక టెక్నాలజీతో ప్రతి కానిస్టేబుల్ శిక్షణ పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ తెలిపారు.


మామునూరు పీటీసీలో మాక్ దీక్షాంత్ పరేడ్‌లో ట్రైనీ కానిస్టేబుళ్లు

సవాళ్లకు అనుగుణంగా శిక్షణలో మార్పులు

'సాక్షి' ఇంటర్వ్యూలో టీజీపీఏ డైరెక్టర్ అభిలాష బిస్త్
- సైబర్ నేరాల దర్యాప్తు, మాదక ద్రవ్యాల నిరోధంపై కానిస్టేబుళ్లకు ప్రత్యేక పాఠాలు
- కొత్త నేర చట్టాలపై అవగాహన కల్పించినట్లు వెల్లడి..
- రేపు రాష్ట్రవ్యాప్తంగా 8,047 మంది కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్



సాక్షి, హైదరాబాద్: క్షేత్రస్థాయిలో మారిన నేరసరళి, పోలీస్ విధుల ఆధారంగా నూతన కానిస్టేబుళ్ల శిక్షణలో పలు మార్పు లు చేసినట్టు తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్, శిక్షణ విభాగం డీజీ అభిలాష బిస్త్ తెలిపారు. రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల నియంత్రణకు సంబంధించిన సైబర్ సెక్యూరిటీ అంశాలు, మత్తు పదార్థాల రవాణాకు అడ్డుకట్ట వేసేలా యాంటీ నార్కోటిక్స్ ఆపరేషన్స్‌కు సంబంధించిన అంశాలను ఈసారి కానిస్టేబుల్స్ శిక్షణలో అదనంగా చేర్చినట్టు వెల్లడించారు. లింగ వివక్షకు తావులేకుండా శిక్షణలో పలు కీలక అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా 8,047 మంది కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్ సందర్భంగా 'సాక్షి'ప్రత్యేక ఇంటర్వ్యూలో బిస్త్ పలు అంశాలను పంచుకున్నారు.

సిలబస్‌లో సైబర్ సెక్యూరిటీ: రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 19 పోలీస్ శిక్షణ కేంద్రాల నుంచి 8,047 మంది కానిస్టేబుళ్లు పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొననున్నారు. వీరిలో 4,116 మంది సివిల్ కానిస్టేబుళ్లు, 3,685 మంది ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్), 228 మంది ఐటీ కమ్యూనికేషన్స్, 18 మంది పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ (పీటీఓ) కానిస్టేబుళ్లు ఉన్నారు. శిక్షణ సిలబస్‌లో సైబర్ సెక్యూరిటీకి సంబంధించిన అంశాలు, యాంటీ నార్కోటిక్స్ ఆపరేషన్స్ అంశాలను తొలిసారిగా చేర్చి అవగాహన కల్పించాం. సైబర్ నేర విధానం (మోడస్ అపరెండీ) ఎలా ఉంటుంది, ఇతర అంశాలపై కనీస పరిజ్ఞానం ఉండేలా తరగతులు నిర్వహించాం. యాంటీ నార్కోటిక్స్ ఆపరేషన్స్‌లో పాల్గొనడం, దర్యాప్తులో పై అధికారులకు సహకరించడం తదితర అంశాల్లో తర్ఫీదు ఇచ్చాం.

సెల్ఫ్ డిఫెన్స్‌కు ప్రాధాన్యత
ఇన్‌డోర్‌తో పాటు ఔట్‌డోర్ శిక్షణలో సెల్ఫ్ డిఫెన్స్‌కు ప్రాధాన్యత పెంచాం. పని ఒత్తిడి తట్టుకునేలా శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేలా కొన్ని మార్పులు చేశాం. క్షేత్రస్థాయిలో విధుల్లో ఉండే సివిల్ కానిస్టేబుళ్లకు కూడా నూతన నేర చట్టాలపై అవగాహన కల్పించేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాం. నేర దర్యాప్తు, కేసుల నమోదు, క్షేత్రస్థాయి విధుల్లో తరచూ అవసరమయ్యే చట్టాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చాం. అదేవిధంగా నేరం జరిగిన ప్రాంతానికి చేరుకోగానే ఏం చర్యలు తీసుకోవాలి, పై అధికారి వచ్చే వరకు క్రైం సీన్‌ను కాపాడడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చాం. ఈ బ్యాచ్‌లో 5,470 మంది గ్రాడ్యుయేట్లు, 1,361 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఉన్నారు. 15 మంది ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన వారున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

స్మార్ట్ స్నాకింగ్‌కే మనోళ్ల మొగ్గు

సంప్రదాయ చిరుతిళ్ల కంటే ఆరోగ్యవంతమైన స్నాక్స్‌కే ప్రాధాన్యం

- పట్టణ వినియోగదారుల్లో ఆరోగ్య ఉత్పత్తులపై పెరుగుతున్న మక్కువ
- ఆసియా పసిఫిక్ మార్కెట్‌లో భారత స్నాక్ అండ్ కన్ఫెషనరీ ఇండస్ట్రీకి రెండోస్థానం
- కన్జ్యూమర్ ఇంటెలిజెన్స్ కంపెనీ నీల్‌సెన్ ఐక్యూ సర్వేలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: దేశంలో చిరుతిళ్ల అలవాటు క్రమంగా పెరుగుతోంది. అయితే ఈ విషయంలో ఆరోగ్యకరమైన చిరుతిళ్ల రకాల ఎంపిక, ప్రాధాన్యాలు మాత్రం డామినేట్ చేస్తున్నాయి. రుచికి రుచితో పాటు ఆరోగ్యం కాపాడుకునేందుకు భారతీయులు మొగ్గుచూపుతున్నారు. 'సూపర్‌ఫుడ్స్'మొదలుకుని 'మల్టీగ్రేన్ బైట్స్', అదనంగా చక్కెర జత చేయని పదార్థాలు, వేయించని (ఫ్రై చేయని) తినుబండారాల వంటి వాటిని అధికంగా చిరుతిళ్లలో భాగంగా ఎంచుకుంటున్నారు. తాము తీసుకునే ఆహారంతో పాటు, స్నాక్స్ వంటి వాటి విషయంలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

దక్షిణాదిలో..

ఇండియాలో ఈ నయా ట్రెండ్ అనేది ముఖ్యంగా ప్రధాన నగరాల్లో క్రమంగా పుంజుకుంటున్నట్టుగా తెలుస్తోంది. ఈ విధంగా 'స్మార్ట్ స్నాక్స్'విషయంలో దక్షిణాది రాష్ట్రాలతో పాటు ఈస్ట్ ఇండియా ప్రాంతం 60 శాతానికి పైగా మార్కెట్ కలిగి ఉన్నట్టుగా స్పష్టమవుతోంది. అయితే ఈ మార్పు అనేది ఇతర రంగాలను సైతం ప్రభావితం చేయడం విశేషం. నగరాలతో పాటు ఇతర ప్రాంతాల్లోని ప్రజలు ఆరోగ్య పరిరక్షణకు, పోషక విలువలతో కూడిన ఆహారం, చిరుతిళ్లకు ప్రాధాన్యం ఇస్తుండడంతో ఫిట్‌నెస్‌తో ముడిపడిన వస్తువులు, వంటగదుల్లో ఎయిర్ ఫ్రయర్స్ వంటి వాటికి గణనీయంగా డిమాండ్ పెరుగుతున్నట్టు తేలింది. దేశవ్యాప్తంగా ఆరోగ్యకరమైన చిరుతిళ్లకు డిమాండ్ పెరగడంతో.. ఆసియా పసిఫిక్ ప్రాంత మార్కెట్‌లో భారత్ అత్యంత వేగంగా పెరుగుతున్న రెండో స్నాక్ అండ్ కన్ఫెషనరీ ఇండస్ట్రీగా రూపాంతరం చెందుతోంది. తాజాగా కన్జ్యూమర్ ఇంటెలిజెన్స్ కంపెనీ నీల్‌సెన్‌ఐక్యూ సర్వే నివేదికలో ప్రస్తుతం 63 శాతం భారతీయులు ఆరోగ్యకరమైన చిరుతిళ్ల ఎంపిక (హెల్దియర్ స్నాక్ ఆప్షన్స్)లో చురుకుగా వ్యవహరిస్తున్నట్టు వెల్లడైంది. అలాగే వివిధ వస్తువులు, స్నాక్స్ ప్యాకెట్లపై ముద్రించిన లేబుళ్లలో పేర్కొన్న దినుసులు వంటి వస్తువుల వివరాల ప్రాతిపదికన పోషక విలువలను అంచనావేసి ఆయా వస్తువులను కొనుగోలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

హెల్దీ వైపే మొగ్గు..

జీవనశైలి అలవాట్లతో పెరుగుతున్న అనారోగ్యాల నేపథ్యంలో ఎముకల ఆరోగ్యం, రోగనిరోధకశక్తి, గుండె ఆరోగ్యం, జీర్ణక్రియ వంటి వాటికి దోహదపడే స్నాక్స్‌కు మొగ్గుచూపుతున్నట్టు ఈ అధ్యయనం తేల్చింది. స్మార్ట్‌స్నాకింగ్‌పై పెరుగుతున్న అవగాహన కారణంగా సంప్రదాయబద్ధ చిరుతిళ్ల కంటే కూడా వీటి ఉత్పత్తులకు డిమాండ్ 1.2 శాతం పెరిగినట్టు స్పష్టమవుతోంది. చిరుతిళ్ల ఎంపికలోనూ సహజమైన మూలకాలు, దినుసులు, ముఖ్యమైన పోషకాలు కలిగిన వాటినే అధికశాతం ఎంచుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ స్నాక్స్‌లోనూ తక్కువ మోతాదులో అందుబాటులో ఉన్న ధరల్లో 'సింగిల్ సర్వ్‌ప్యాక్'వంటి వాటికి అధిక డిమాండ్ ఉన్నట్టుగా సర్వేలో తేలింది. ఈ మారుతున్న ట్రెండ్‌కు తగ్గట్టుగా వినియోగదారుల వస్తువుల కంపెనీలు కూడా తమ వ్యూహాలకు మరింత పదును పెడుతున్నాయి. ప్రస్తుతం ఇండియాలో ప్రతీ ఐదు స్నాక్స్‌లో ఒకటి ఆరోగ్యప్రధాన కోణంలో మార్కెట్ చేస్తున్నారు. గతంలో వివిధ రకాల చిప్స్, షుగరీ బిస్కెట్స్ వంటివి దుకాణాల్లో ఎక్కువసంఖ్యలో కనిపించగా ఇప్పుడా పరిస్థితి మారింది. చిరుతిళ్లతో సహా ఇతర ఆహార అలవాట్ల విషయంలో ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడమనేది పట్టణ ప్రాంతాల్లోని 'ఫుడ్‌కల్చర్'ను గణనీయంగా మార్చేయడం శుభపరిణామం అని నిపుణులు అంచనా వేస్తున్నారు.



మంగళవారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆమె చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని ఇందిర విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, దానం, గీతారెడ్డి, విజయారెడ్డి తదితరులు

రేవంత్ వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ నేతలు

సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిలను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీజేపీ నేతలు కాసం వెంకటేశ్వర్లు, ప్రకాశ్‌రెడ్డి, ఎస్.కుమార్ తీవ్రంగా ఖండించారు. రేవంత్‌రెడ్డి పదిజన్మలు ఎత్తినా మోదీ స్థాయికి చేరుకోలేరన్నారు. కిషన్‌రెడ్డి గురించి కూడా మాట్లాడే స్థాయి రేవంత్‌కు లేదని, ఆయన రాజకీయాల్లోకి వచ్చే నాటికి రేవంత్ చెడ్డీ అయినా సరిగా వేసుకున్నాడో లేదని మండిపడ్డారు. మంగళవారం రాత్రి బీజేపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రం ఖర్మకొద్దీ లాటరీ లెక్క నీకు సీఎం సీటు వచ్చింది..ఎవడో సన్నాసి చేసిన పాపాలకు నీకు కలిసొచ్చి సీటెక్కినవ్. విలువ కాపాడుకో 'అని హితవు పలికారు.'నువ్వు కూర్చున్నది సీఎం సీటు. వీధిరౌడీవి కాదు. ఈ సీటుకు సూటయ్యేలా మాట్లాడు. హైదరాబాద్ రోడ్ల మీద ఉరికిస్తాం. చానమంది ముఖ్యమంత్రులను చూసినం. నీ అహంకారాన్ని నేలకు దించుతాం. మేము దండయాత్ర మొదలుపెడితే ఇల్లు దాటలేవు బిడ్డా..నోరు అదుపులో పెట్టుకో 'అని వారు హెచ్చరించారు.

'మహా' ప్రచారంలో తెలంగాణ రాజకీయాలు

సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సహా కాంగ్రెస్, బీజేపీ నేతల హోరాహోరీ ప్రచారం

- ఉభయ పార్టీలకు మహారాష్ట్ర ఎన్నికలు కీలకం
- సర్వశక్తులూ ఒడ్డిన రెండు జాతీయపార్టీలు
- తెలంగాణ సరిహద్దు, తెలుగు ప్రాబల్య ప్రాంతాల్లో విస్తృత ప్రచారం





సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ రాజకీయ నేతల సవాళ్లు, ప్రతి సవాళ్లు చర్చనీయాంశమయ్యాయి. ప్రచారం సోమవారం సాయంత్రం ముగియగా.. జాతీయపార్టీలైన బీజేపీ, కాంగ్రెస్.. తెలంగాణ కేంద్రీకృతంగా పరస్పర ఆరోపణలు, విమర్శలతో ఎన్నికల వాతావరణాన్ని వేడెక్కించాయి. ఈ రెండు పార్టీల ముఖ్యనేతలు ఎన్నికల ప్రచారపర్వం ముగిసేదాకా కూడా అక్కడే ఉన్నారు. తెలంగాణలో ఏడాది పాలనలో రైతురుణ మాఫీ, పెద్దసంఖ్యలో ఉద్యోగాల కల్పన, ఇతర ప్రధాన హామీలు నెరవేర్చామంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, ఇతర ముఖ్యనేతలు వివరించారు. ఈ మేరకు అక్కడి వార్తాపత్రికలు, ప్రసార, ప్రచార సాధనాల్లోనూ పెద్ద ఎత్తున ప్రకటనలు కూడా ఇచ్చారు.

రేవంత్ వ్యాఖ్యలతో దుమారం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గుజరాత్ గులాంగా మారారంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేయడం తీవ్ర దుమారం రేపింది. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని రుణమాఫీని చేశామని, ఇక్కడ మూసీ పునరుజ్జీవం చేస్తుంటే బీజేపీ నేతలు అడ్డుపడుతున్నారని, గుజరాత్‌లో సబర్మతి నది ప్రాజెక్టును మెచ్చుకుంటున్నారని విమర్శలు గుప్పించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు మహారాష్ట్రలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కాగా జార్ఖండ్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌పార్టీ తెలంగాణలో ఇచ్చిన గ్యారంటీలు, హామీలు అమలు చేయలేదంటూ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ముఖ్యనేతలు డాక్టర్ కె.లక్ష్మణ్, డీకే అరుణ, రాష్ట్ర పార్టీ నేతలు జి.మనోహర్‌రెడ్డి, ఎస్.కుమార్ తదితరులు కాంగ్రెస్ ప్రచారాన్ని తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ఎన్నికల్లో ఏ మొహం పెట్టుకుని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలు, హామీలను అమలు చేయకుండా మహారాష్ట్రలో అబద్ధపు ప్రచారాలు చేస్తోందని ఆరోపించారు. తెలంగాణలో 6 గ్యారంటీలు అమలు చేశామని, రాష్ట్రం సస్యశ్యామలంగా ఉందంటూ, అద్భుతంగా పాలన అందిస్తోందని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉన్నారని అబద్ధపు ప్రచారాలు చేస్తోందన్నారు. సోనియాగాంధీ, ప్రియాంకాగాంధీ, రాహుల్ గాంధీ వంటి నేతలు తెలంగాణలో యాత్రలు చేపట్టి.. అనేక రకాల హామీలిచ్చారని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటీ సరిగ్గా అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఇచ్చిన గ్యారంటీలు, హామీలు అమలు చేశామంటూ.. మహారాష్ట్రలో తెలంగాణ ముఖ్యమంత్రి పేరిట పత్రికల్లో ప్రకటనలు వేయిస్తోందంటూ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే అబద్ధాలకు చిరునామా అంటూ కిషన్‌రెడ్డి, డాక్టర్ కె.లక్ష్మణ్ ధ్వజమెత్తారు. రెండు జాతీయపార్టీలకు మహారాష్ట్ర ఎన్నికలు కీలకం కావడంతో.. తెలంగాణ సరిహద్దు ప్రాంతాలతో పాటు తెలుగు ప్రజల ప్రాబల్యమున్న ప్రాంతాల్లో రాష్ట్ర పార్టీ నేతలు, కార్యకర్తలతో విస్తృత ప్రచారం నిర్వహించారు.

మనీలాండరింగ్ కేసులో ఆయిల్ కంపెనీ ఆస్తుల జప్తు

బ్యాంకులను మోసగించిన కేసులో రూ.2.43 కోట్ల ఆస్తులు అటాచ్

సాక్షి, హైదరాబాద్: బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాన్ని దారిమళ్లించడంతోపాటు మనీలాండరింగ్‌కు పాల్పడిన ఆరోపణలపై బ్లోసమ్స్ ఆయిల్స్ అండ్ ఫ్యాట్స్ కంపెనీపై నమోదైన కేసులో ఈడీ అధికారులు చర్యలు ప్రారంభించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న సర్వడే వినోద్‌కుమార్, జన్‌శక్తి ఆయిల్ ప్రొడక్ట్స్ కంపెనీకి చెందిన ఎం.వెంకట నాగేంద్రలకు చెందిన రూ.2.43 కోట్ల విలువైన స్థిరాస్తులను జప్తు చేశారు. ఈ మేరకు ఈడీ, హైదరాబాద్ జోనల్ కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. బ్లోసమ్స్ కంపెనీ ప్రమోటర్, డైరెక్టర్ టీజీ సూర్యానారాయణ, ఇతరులు పలు ఫోర్జరీ పత్రాలు చూపి ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, ఇండియన్ బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో రుణాలు తీసుకుని ఆ సొమ్మును పలు కంపెనీల్లోకి, వ్యక్తిగత ఖాతాల్లోకి నిబంధనలకు విరుద్ధంగా దారిమళ్లించారు. ఇలా రెండు బ్యాంకులకు రూ.266.74 కోట్ల రుణాలు ఎగవేసిన ఆరోపణలపై కేసు నమోదు చేసిన సీబీఐ అధికారులు 2019 ఫిబ్రవరిలో హైదరాబాద్ సీబీఐ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టిన ఈడీ అధికారులు తాజాగా నివాస సముదాయాలు, కమర్షియల్ ప్రాపర్టీలు కలిపి రూ.2.43 కోట్ల విలువైన ఆస్తులు జప్తు చేశారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్టు వారు వెల్లడించారు.

తెలుసుకోవలసిందే..!

ప్రతి అంశానికీ గూగుల్ శోధన

- హైడ్రా నేపథ్యంలో సర్వత్రా ఆసక్తి
- భూములపై పరిజ్ఞానం పెంచుకుంటున్న సామాన్యులు
- బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్, రైల్వే, సైనిక్, ఎయిర్‌పోర్ట్ జోన్ల వివరాల సేకరణ
- భూములకు సంబంధించి సేత్వార్, ఖాస్రాపై శోధన

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: స్మార్ట్ యుగం నడుస్తున్న ప్రస్తుత నేపథ్యంలో ప్రతి అంశాన్ని తెలుసుకునేందుకు, విజ్ఞానాన్ని పెంచుకునేందుకు ఇంటర్‌నెట్ ద్వారా గూగుల్, చాట్ జీపీటీ, వాట్సాప్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, యూట్యూబ్ చూడడం సాధారణమైంది. మెయిన్ స్ట్రీమ్ మీడియాతో పాటు సోషల్ మీడియాలో సైతం భూ సంబంధిత అంశాలను తెలుసుకునేందుకు సామాన్యులు శోధిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేని చర్చకు తావిచ్చిన 'హైడ్రా'ఏర్పాటు, తదుపరి పరిణామాల నేపథ్యంలో ప్లాట్లు, భూములు, అపార్ట్‌మెంట్లు, ఇళ్లు కొనుక్కునే వారితో పాటు సామాన్యులు సైతం ఆయా వివరాలను తెలుసుకునేందుకు ఇంటర్‌నెట్‌లో వెతుకుతున్నారు. ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవెల్), బఫర్ జోన్ (సహజ నీటి వనరులకు మధ్యలో ఉన్న భూ మి.. రెండు చెరువుల మధ్యలోని భూమిలో సాగు మాత్రమే చేయాలి), రైల్వే జోన్ (రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా 100 మీటర్ల పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేయకూడదు), వాగులు, కాలువలు, గ్రీన్ బెల్ట్, సైనిక్ జోన్, ఎయిర్‌పోర్ట్ జోన్ భూముల్లో నిర్మాణాలు ఏ మేరకు, ఎంత మేరకు చేయాలో శోధించే వారి సంఖ్య పెరుగుతోంది. భూములు, భవనాలు కొనుగోలు చేసినవారితో పాటు సాధారణ వ్యక్తులు సైతం అధికారులు ఇచ్చిన అనుమతులపై నమ్మకం కుదరక.. పూర్తి వివరాలను తెలుసుకుంటున్నారు.

భూముల చరిత్ర సైతం..

భూముల వివరాలను తెలుసుకోవడంలో భాగంగా.. ఇప్పటికే కొనుగోలు చేసిన వారు, కొనుగోలు చేయాలనుకుంటున్న వారు, సాధారణ వ్యక్తులు యూట్యూబ్‌లో నిపుణులు చెబుతున్న విశ్లేషణలను ఎక్కువగా చూస్తున్నారు. భవిష్యత్ అవసరాల కోసం భూములపై పెట్టుబడులు పెట్టేవారు, అధికారులు ఇచ్చిన అనుమతులను సైతం పరిగణనలోకి తీసుకోని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే భూములు కొనుక్కుని.. కోర్టు కేసుల నేపథ్యంలో ఇబ్బంది పడుతున్నవారు కూడా భూ సంబంధిత అంశాలను క్షుణ్ణంగా తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలో భవిష్యత్తులో బ్యాంకు రుణాలు, ఆయా భూములు, భవనాలపై విద్య తదితర రుణాలకు ఇబ్బంది ఎదురు కాకుండా.. ఆయా భూముల గత చరిత్రను తెలుసుకుంటున్నారు. సేత్వార్, ఖాస్రా నుంచి మొదలు పెట్టి.. ప్రస్తుత పరిస్థితి వరకు తెలుసుకుంటున్నారు. అధికారులు ఇచ్చిన అనుమతులను అడుగడుగునా అనుమానిస్తున్న పరిస్థితి నెలకొంది. ఒకపట్టాన అంతుపట్టని రెవెన్యూ అంశాలను తెలుసుకునేందుకు చాలామంది ఇంటర్‌నెట్‌లో కుస్తీ పడుతున్నారు.

41 సీఆర్పీ కింద బెయిల్ ఇవ్వొద్దు

జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు బక్కి వెంకటయ్య విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ : ఎస్సీ, ఎస్టీలపై దాడులు చేస్తున్న నిందితులకు 41 సీఆర్పీ కింద బెయిల్ ఇవ్వకుండా చొరవ చూపాలని జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వాన్‌ను తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కోరారు. మంగళవారం ఢిల్లీలోని జాతీయ ఎస్సీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్ కిషోర్ మక్వాన్, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హన్సర్‌సింగ్ ఆర్యాలతో బక్కి వెంకటయ్య, సభ్యులు జిల్లా శంకర్, లక్ష్మీనారాయణ, ప్రవీణ్, రాంబాబు నాయక్, నీలాదేవి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారికి వినతిపత్రం సమర్పించి చర్చించారు. దళిత, గిరిజనుల రక్షణకు వచ్చిన ప్రత్యేక చట్టానికి 41 సీఆర్పీని వర్తింపచేయొద్దని కోరారు.

బీజేపీకి బీటీంగా సీఎం రేవంత్: కార్తీక్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: సిద్ధాంతపరంగా పూర్తి వైరుధ్యం కలిగిన బీజేపీ, కాంగ్రెస్ తెలంగాణలో మాత్రం కలిసికట్టుగా పనిచేస్తున్నాయని బీఆర్‌ఎస్ నేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి విమర్శించారు. బీజేపీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీటీంలాగా తయారయ్యారన్నారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాంతీయ పార్టీలను అణగదొక్కేందుకు అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేశాయని ఆరోపించారు. రెండు జాతీయ పార్టీలు బీఆర్‌ఎస్, కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని పని చేస్తున్నాయని కార్తీక్‌రెడ్డి మండిపడ్డారు. కేంద్రమంత్రి బండి సంజయ్ సీఎం రేవంత్‌కు సహాయ మంత్రిలా పనిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో బీజేపీ 8 ఎంపీ స్థానాల్లో గెలవడంలో రేవంత్ సహకారం ఉందని ఆరోపించారు. కేటీఆర్‌ను అరెస్టు చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. బండి సంజయ్‌కు దమ్ముంటే లగచర్ల ఘటనపై సీబీఐ విచారణ కోసం డిమాండ్ చేయాలని కార్తీక్‌రెడ్డి సవాలు విసిరారు. బీఆర్‌ఎస్‌ను నిషేధించాలని బండి సంజయ్ హాస్యాస్పద ప్రకటనలు చేస్తున్నారని ఎద్దేవాచేశారు.

'గంగపుత్ర (బెస్త) కులస్తులను ఎంబీసీ జాబితాలో చేర్చాలి'

సాక్షి, హైదరాబాద్: గంగపుత్ర (బెస్త) కులస్తులను అత్యంత వెనకబడిన ఎంబీసీ జాబితాలోకి చేర్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టంగుటూరి రాజేశ్ ఖన్నా కోరారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో మంగళవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, ప్రజావాణి ఇన్‌చార్జి జి.చిన్నారెడ్డికి ఈమేరకు వినతిపత్రం అందించారు. 2018లో ప్రభుత్వం ప్రకటించిన 36 కులాల్లో గంగపుత్ర (బెస్త) కులస్తులకు చోటు కల్పించలేదని ఆవేదన వ్యక్తంచేశారు.

సాగరంలో శోధన


బ్యాలస్ట్ వాటర్ ట్రీట్‌మెంటు టెస్టు ఫెసిలిటీ పరీక్షా పరికరాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

అనంత సాగరంలో పరిశోధనలకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సముద్ర గర్భంలో దాగి ఉన్న రహస్యాలను ఛేదించాలని సంకల్పించింది. అపురూప జలచరాలు.. ఖనిజ సంపదను గుర్తించేందుకు చర్యలు చేపట్టింది. ప్రకృతి విపత్తులను ముందుగా పసిగట్టేందుకు ప్రణాళిక రూపొందించింది. అందులో భాగంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీని ప్రారంభించింది. ప్రతిష్టాత్మక సెంటర్‌ను వాకాడు మండలం తూపిలిపాళెంలో ఏర్పాటు చేసింది. ఇందుకోసం రూ.500 కోట్లు వెచ్చించింది. అధునాతన పరికరాల సాయంతో నిర్దేశిత లక్ష్యాలను అధిగమించే ఈ కేంద్రం ఎలా పనిచేస్తుందో వివరించే విశేషాలతో 'సాక్షి' ప్రత్యేక కథనం.

తూపిలిపాళెంలో ఓషన్ టెక్నాలజీ కేంద్రం

- జలరాశులు, ఖనిజ సంపదలపై నిత్య పరిశోధనలు
- విపత్తులను ముందుగా పసిగట్టేందుకు శ్రీకారం
- మెరైన్ కోర్సులు చదివిన యువతకు ఉద్యోగావకాశాలు

వాకాడు: అనుకోకుండా 2004 డిసెంబర్ 26న ముంచుకు వచ్చిన సునామీ కారణంగా ఊహకు అందనంత ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లింది. ఇది దృష్టిలో ఉంచుకునే భారత పరిశోధకులు ఇలాంటి విపత్తులు భవిష్యత్‌లో తలెత్తకుండా ముందుగానే పసిగట్టేందుకు ప్రణాళిక రచించారు. అందులో భాగంగానే తొలుత చెన్నైలో ఎన్‌ఐఓటీ కేంద్రం ఏర్పాటు చేశారు. అక్కడ కొన్ని పరిశోధనలు ప్రారంభించారు. వీటికి మరింత టెక్నాలజీని జోడించి ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తూపిలిపాళెం వద్ద భారీ ఎన్‌ఐఓటీ కేంద్రానికి రూ.500 కోట్లతో 2015 మే 25వ తేదీన శ్రీకారం చుట్టింది. ఇది ఎట్టకేలకు గత ఏడాది డిసెంబర్ నాటికి పూర్తయింది. అయితే ఎన్నికల కోడ్ కారణంగా ప్రారంభోత్సవం వాయిదా పడింది. ఈ క్రమంలోనే వారం రోజుల కిందట ఈ ప్రతిష్టాత్మక సెంటర్‌ను ప్రారంభించారు. కేంద్ర ఎర్త్, సైన్స్ పర్యవేక్షణలో ఈ సెంటర్ నడుస్తుంది. సునామీ, ఇతర వాతావరణ విషయాలను ముందుగానే పసిగట్టేందుకు దోహదపడుతుంది. మెరైన్ కోర్సులు చదివిన నిరుద్యోగ యువతకు ఈ కేంద్రంలో ఉపాధి కల్పనకు అవకాశముంటుంది.

ఎన్‌ఐఓటీ అంటే ..

కేంద్ర ఎర్త్, సైన్స్‌శాఖ 1993లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ కేంద్రాన్ని చెన్నైలో ఏర్పాటు చేసింది. ఈ కేంద్రానికి గవర్నింగ్ కౌన్సిల్‌తోపాటు ఎందరో శాస్త్రవేత్తలను నియమించి సముద్రంలో పరిశోధనలు సాగిస్తున్నారు. సముద్రంలోని జలచర రాశులతోపాటు ఖనిజ సంపదను గుర్తించి వెలికి తీసేలా ఈ కేంద్రం పనిచేస్తుంది. గతంలో వివిధ సర్వేలు నిర్వహించగా వాకాడు మండలం, తూపిలిపాళెం సమీపంలోని పామంజి తీర ప్రాంతం ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్(ఈఈజెడ్)గా గుర్తించారు. అందుకే ఇక్కడ ఎన్‌ఐఓటీ కేంద్రం ఏర్పాటు చేశారు. దీని ద్వారా సముద్రంలోని లివింగ్ నాన్ లివింగ్ రిసోర్స్ (జలచర, ఖనిజ వనరులు)గుర్తించేలా పరిశోధనలు చేపడుతున్నారు.


ఎన్‌ఐఓటీ కార్యాలయ భవనం

వాటర్ ట్రీట్‌మెంట్ టెస్టు ఫెసిలిటీ పరీక్ష కేంద్రం

బ్యాలస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ టెస్టు ఫెసిలిటీ పరీక్షా కేంద్రం ఏర్పాటుకు పనులు ఇంకా సాగుతున్నాయి. ఇది సముద్రం, నదీ ముఖద్వారాల మధ్య ఏర్పాటు చేయనున్నారు. దీనిని భారతదేశంలోనే తూర్పు తీరంలో వ్యూహాత్మక ఉష్ణ మండల ప్రాంతమైన తూపిలిపాళెం పామంజి తీరంలో ఏర్పాటు చేయనున్నారు. తద్వారా బంగాళాఖాతం నుంచి 35 పీపీటీ సముద్రపు ఉప్పు నీటిని, స్వర్ణముఖి నది ముఖద్వారం నుంచి 15 పీపీటీ నీటిని అలాగే బకింగ్ హామ్ కెనాల్ నుంచి 2 పీపీటీ నీటిని తీసుకుని రెండు పరిణామాల సమూహంలోని 5 రకాల జీవులను ఏక కాలంలో పెంచడానికి అత్యాధునిక సర్రోగేట్ పరీక్ష కేంద్రంగా ఇది పనిచేస్తుంది. ఇన్‌లెట్, అవుట్‌లెట్ వాటర్‌ను ఫిజికో కెమికల్, బయోలాజికల్ పరిమితులను విశ్లేషించడానికి ఎన్‌ఐఓటీ చెన్నై వారు కోట మండలం, చిట్టేడులో ఎన్‌ఏబీఎల్ గుర్తింపు పొందిన స్టేట్ ఆఫ్ ఆర్ట్ ల్యాబొరేటరీని సైతం ఏర్పాటు చేశారు.


ఎన్‌ఐఓటీకి స్థల కేటాయింపు సమయంలో నాటిన బోర్డు

తీరం నుంచే పరిశోధన

సముద్ర గర్భంలో ఏముందో తెలుసుకునే డీప్ ఓషన్ బాటమ్ ప్రెజర్ రికార్డర్ (డీఓపీఆర్), ఎనర్జీ ఫ్రెష్ వాటర్ మెరైన్ సెన్సార్ సిస్టమ్, మెరైన్ బయోటెక్నాలజీ, వ్యవసాయం, టూరిజం అభివృద్ధి, ఓషన్ అకాస్టిక్ అండ్ మోడలింగ్ రీసెర్చ్ డెవలప్‌మెంట్, ఓషన్ ఎలక్ట్రానిక్ వంటి వాటితో సముద్రం తీరం నుంచే పరిశోధనలు చేస్తారు. భూమిపై ఉండే నిర్మాణాలపై టెక్నాలజీ గ్రూపుతో భూ కంపాలను పసిగడతారు. అదేవిధంగా సముద్ర గర్భంలో ఉన్న మైనింగ్ కాపర్, కోబాల్ట్, నికిల్, మాంగనీస్, నేచురల్ గ్యాస్ వంటివి గుర్తించి వెలికి తీసే పనులు కూడా ఈ ఎన్‌ఐఓటీ పనిచేస్తుంది. అంతే కాకుండా సముద్రంలో కేబుల్ నెట్‌వర్క్ వేసేందుకు కూడా ఈ కేంద్రం ఉపకరిస్తుంది. సాగర గర్భంలో ఉన్న అత్యంత ఖరీదైన ఖనిజ సంపదపై పరిశోధనలు జరిపేందుకు అత్యంత ప్రాధాన్యతనిస్తుంది. ఈ కేంద్రానికి అనుబంధంగా కోట మండలం, చిట్టేడు వద్ద పరిపాలనా భవనాలతోపాటు సిబ్బందికి క్వార్టర్స్ సైతం నిర్మించారు. పరిశోధనా కేంద్రం నిర్మాణం, నిర్వహణ ఇతరత్రా ఖర్చుల కోసం తొలుత రూ.75 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిసింది.


బ్యాలస్ట్ వాటర్ ట్రీట్‌మెంటు టెస్టు ఫెసిలిటీ పరీక్షా పరికరం


ఎన్‌ఐఓటీ పరిశోధనా కేంద్రం యంత్రాల ముఖచిత్రం

తెలుగు రాష్ట్రాల్లో ఉల్లి ధరలు సాధారణం

రిటైల్ ధరలు జాతీయ సగటు కంటే తక్కువగా ఉన్నాయన్న కేంద్రం



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ చర్యలతో తెలుగు రాష్ట్రాల్లో ఉల్లి ధరలు సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని మంగళవారం వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ పేర్కొంది. ధరల స్థిరీకరణ నిధి జోక్యం ఉల్లి ధరలపై గణనీయమైన ప్రభావం చూపినట్లు తెలిపింది. మెజారిటీ రాష్ట్రాల్లో సగటు రిటైల్ ధరలు జాతీయ సగటు కంటే తక్కువగా ఉన్నాయని పేర్కొంది. రిటైల్ ధరలు జాతీయ సగటు కంటే తక్కువ ఉన్న జాబితాలో ఏపీ, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, బిహార్, కర్ణాటక, గుజరాత్, చండీగఢ్, హరియాణా, గోవా తదితర రాష్ట్రాలు ఉన్నాయని వివరించింది.

కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకురాలు ఆత్మహత్యాయత్నం

ఏజెన్సీ రద్దు చేయడంతో మనస్తాపం

చీరాల అర్బన్: మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీని రద్దు చేయడంతో మనస్తాపం చెందిన ఏజెన్సీ నిర్వాహకురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం బాపట్ల జిల్లాలో జరిగింది. చీరాలలోని కస్తూరిబా గాంధీ మున్సిపల్ హైస్కూలులో మధ్యాహ్న భోజన పథకం కాంట్రాక్టర్‌గా పని చేస్తున్న పుష్పలత మంగళవారం పాఠశాలలో చీమల మందు నీళ్లలో కలుపుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయాన్ని గమనించిన హెల్పర్ పాఠశాల ఉపాధ్యాయులకు చెప్పడంతో ఆమెను 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై ఆమె భర్త కిషోర్ మాట్లాడుతూ 14 ఏళ్లుగా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కుకింగ్ ఏజెన్సీని నిర్వహిస్తున్నామని, కొద్ది నెలలుగా ఏజెన్సీ నిర్వహణ బాగాలేదంటూ ఏదో ఒక కారణంతో తమను తప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఏజెన్సీ రద్దుకు పేరెంట్స్ కమిటీ ఆమోదం తెలిపారంటూ ఏజెన్సీ కాంట్రాక్టును రద్దు చేస్తున్నామని మంగళవారం హెచ్‌ఎం చెప్పారని, దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు.ఇదే విషయమై స్కూల్ హెచ్‌ఎం కృష్ణమోహనరావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం తయారు చేసే వంట మనిషి విధుల్లో నిర్లక్ష్యంగా ఉందని, ఆమెను ఎంఈవో తొలగించారన్నారు. భోజనం నాణ్యతగా ఉండడం లేదంటూ గతంలో రెండు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. అయినా ఎలాంటి మార్పు లేనందున తొలగిస్తూ నోటీసులు జారీ చేశామన్నారు. నోటీసులను ఆమెకు ఇవ్వగా తన భర్తతో చెప్పి తీసుకుంటానని చెప్పి వెళ్లిందన్నారు. అనంతరం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని హెల్పర్ వచ్చి తనకు చెప్పిందని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమెను తొలగించామన్నారు.

కుమార్తెను కడతేర్చిన తండ్రి



ఆస్పరి: కర్నూలు జిల్లా ఆస్పరి మండలంలోని తంగరడోణ గ్రామంలో మంగళవారం ఓ వ్యక్తి కన్న కూతురును కడతేర్చాడు. వీరేష్, పద్మావతి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వీరేష్ మద్యానికి బానిసై భార్యను వేధించగా పద్మావతి ముగ్గురు కుమార్తెలను వదిలి కొడుకుతో పుట్టింటికి వెళ్లిపోయింది. ఇద్దరు కుమార్తెలు వ్యవసాయ పనులకు వెళ్తుండగా, చిన్న కుమార్తె మౌనిక(11) జెడ్పీ హైస్కూల్లో 6వ తరగతి చదువుతోంది. మంగళవారం మౌనిక బీరువాలోంచి వీరేష్ డబ్బులు తీసుకుంటుండగా గమనించి తాతకు చెబుతానని చెప్పగా ఆగ్రహానికి గురైన తండ్రి పక్కనే ఉన్న తాడు తీసుకుని కుమార్తె గొంతుకు బిగించాడు. దీంతో ఊపిరాడక బాలిక అక్కడికక్కడే మృతి చెందింది.

ఎగరడానికో లెక్కుంది


ఎగరాలంటే రెక్కలే ఉండాలా? అవసరం లేదు... వెనుక జెట్‌ప్యాక్ తగిలించుకుని నిలువుగా గాల్లోకి ఎగురుతున్న ఈ దృశ్యం బెంగళూరు ప్యాలెస్ మైదానంలోనిది. మంగళవారం బెంగళూరు టెక్ సమ్మిట్- 2024 ప్రారంభమైంది. ఇందులో దేశ విదేశాల నుంచి సాంకేతిక రంగ సంస్థల నిపుణులు పాల్గొనగా.. ఓ జెట్‌ప్యాక్‌ను ఒక వ్యక్తి ఇలా ప్రదర్శించాడు. - శివాజీనగర

గంగపుత్రులను మోసగించిన ప్రభుత్వం

- గద్దెనెక్కిన తొలి ఏడాదే మత్స్యకార భరోసా ఎగ్గొట్టారు
- అప్సడా మాజీ వైస్ చైర్మన్ వడ్డి రఘురాం మండిపాటు




సాక్షి, అమరావతి: ఆచరణ సాధ్యం కాని దొంగ హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం గంగపుత్రులను నిలువునా మోసగించి వారి ఆశలను గంగలో కలిపేసిందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, అప్సడా మాజీ కో వైస్ చైర్మన్ వడ్డి రఘురాం ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మత్స్యకారులకు ఏమి చేయలేదంటూ అసెంబ్లీలో మంత్రి అచ్చెన్నాయుడు పచ్చి అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటని మంగళవారం ధ్వజమెత్తారు. ప్రతీ మత్స్యకార కుటుంబానికి రూ.20వేల చొప్పున నిషేధ భృతి ఇస్తామని నమ్మబలికి ఓట్లు దండుకున్న కూటమి ప్రభుత్వం... అధికారంలోకి వచ్చి ఐదున్నర నెలలైనా ఒక్కపైసా కూడా జమచేయలేకపోయిందన్నారు. పైగా ఇప్పట్లో తాము నిషేధ భృతి ఇవ్వలేమని నిస్సిగ్గుగా చెప్పడం ,అధికారంలోకి వస్తే వారు ఏ స్థాయిలో మోసగిస్తారో మరోసారి రుజువైందన్నారు. జోన్‌తో సంబంధం లేకుండా ఆక్వా రైతులందరికి యూనిట్ రూ.1.50కే విద్యుత్ సరఫరా చేస్తామని ఇచ్చిన హామీని కూడా అటకెక్కించేశారని ధ్వజమెత్తారు. నిషేధ భృతిని రూ.4 వేల నుంచి రూ.10వేలకు పెంచడమే కాదు..ఐదేళ్లూ వేట నిషేధ సమయంలోనే మత్స్యకార భరోసా అందించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఆయిల్‌పై సబ్సిడీ బాబు హయాంలో ఏటా సగటున 716 బోట్లకు రూ.59.42 కోట్లు జమ చేస్తే, వైఎస్సార్‌సీపీ హయాంలో ఏటా సగటున 18వేల బోట్లకు రూ.148.04 కోట్లు జమ చేసిందన్నారు. వాస్తవాలు కళ్లెదుట కన్పిస్తున్నా మంత్రి అచ్చెన్న అబద్ధాలు ఎలా చెబుతారని ప్రశ్నించారు.

యాప్రమత్తం

- రోడ్డు ప్రమాదాల నివారణకు ఐఆర్‌ఏడీ యాప్
- తరుచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాల గుర్తింపు
- ముందస్తు సమాచారంతోవాహన చోదకులకు అవగాహన

అమలాపురం టౌన్: తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అందుకు అనుగుణంగా అప్రమత్తమయ్యేలా రాష్ట్ర పోలీస్ శాఖ ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటా (ఐఆర్‌ఏడీ) యాప్‌ను రూపొందించి దాని అమలుకు చర్యలు చేపట్టింది. జిల్లా పోలీసు శాఖ ఈ యాప్‌ను వినియోగించే విధానాలపై సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చింది. ప్రతీ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై నుంచి కానిస్టేబుల్ వరకూ ఈ యాప్‌పై అవగాహన కల్పిస్తోంది. ఎస్పీ బి.కృష్ణారావు ఈ నెల 16న యాప్‌ను ప్రారంభించారు. ఐఆర్‌ఏ డేట్ బేస్ నమోదు గురించి జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, పోలీసు స్టేషన్ల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఐఆర్‌ఏడీ రోల్ అవుట్ మేనేజర్ జీవీ రామారావు, డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డు బ్యూరో (డీసీఆర్‌బీ) సీఐ వి.శ్రీనివాసరావుల ఈ శిక్షణ తరగతులను పర్యవేక్షించారు.



అవగాహన పెంచాలి

కొత్తగా వచ్చిన ఐఆర్‌ఏడీ యాప్‌పై పోలీస్ సిబ్బంది పూర్తి స్థాయి అవగాహనతో ఉండడమే కాకుండా వాహన చోదకులకు జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది ఎక్కడికక్కడ రోడ్డు ప్రమాదాల నివారణ నిబంధనలపై అవగాహన కల్పించాలని ఎస్పీ కృష్ణారావు యాప్ శిక్షణ తరగతుల్లో సూచించారు. వాహన చోదకులు విధిగా హెల్మెట్లు ధరించాలని, సీటు బెల్టులు పెట్టుకోవాలని స్పష్టం చేశారు. వాహనాలను నిర్లక్ష్యంగా, పరధ్యానంగా నడపకుండా డ్రైవింగ్ సమయంలో పూర్తి అప్రమత్తతో ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ఎంత ప్రమాదకరమో వాహన చోదకులకు పోలీసు అధి కారులు తరుచూ కౌన్సెలింగ్ ద్వారా తెలియజేయాలన్నారు. లైసెన్స్‌ను లేకుండా టీనేజ్ పిల్లలకు మోటారు సైకిళ్ల నడిపే అధికారం లేదని, తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పులు తీసుకురావాలని సూచించారు.



రోడ్డు ప్రమాదాల స్పాట్లను గుర్తించేది ఇలా..

ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగిన ప్రదేశానికి పోలీస్ దర్యాప్తు అధికారి (ఐఓ) వెళ్లి అక్కడ ఐఆర్‌ఏడీ యాప్ ద్వారా ప్రమాద సమాచారాన్ని నమోదు చేయాలి. ఇదే స్పాట్‌లో గతంలో రోడ్డు ప్రమాదాలు జరిగాయా? లేదా? అనే అంశంపై ఆ అధికారి అక్కడే అధ్యయనం చేస్తారు. ఒకవేళ అదే స్పాట్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతుంటే ఆ విషయాన్ని యాప్‌లో నమోదు చేయాలి. ఈ సమాచారాన్ని ఇటు ఎస్పీ కార్యాలయానికి, అటు రాష్ట్ర పోలీస్ కార్యాలయానికి యాప్ ద్వారా పంపించాలి. యాప్‌లో రోడ్డు ప్రమాదాల సమాచారాన్ని నమోదు చేస్తూనే అక్కడ ఇక ముందు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడతారు. వాహనాల డ్రైవర్లకు తెలిసేలా ఇక్కడ రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందంటూ హెచ్చరికలు బోర్డులు ఏర్పాటు చేస్తారు.

మండలి మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్సీలు ఏమన్నారంటే..

అవి ప్రభుత్వ భవనాలే



2017లో నిర్మించిన ఈ అసెంబ్లీ భవనాలను కూడా చాలా అద్భుతంగా కట్టారని అప్పట్లో అందరూ చంద్రబాబును ప్రశంసించారు. కానీ వర్షం వస్తే లీకులైన పరిస్థితి చూశాం. మంత్రుల ఛాంబర్లలో కూడా వాష్ రూమ్స్ లేని దుస్థితి. ఇప్పుడు ప్రతిపక్ష సభ్యులకి ఇచ్చిన రూములను ఒకసారి పరిశీలించాలి. మహిళా సభ్యులకు ఇచ్చిన రూముల్లో కనీసం వాష్ రూమ్‌లు కూడా లేవు. కాబట్టి, అద్భుతంగా కట్టామని చెబుతున్న ఈ అసెంబ్లీ భవనాలను కూడా ప్రజలు వచ్చి పరిశీలించాలి. రుషికొండలో నిర్మించిన భవనాలన్నీ జగన్, వైసీపీకి సంబంధించిన భవనాలుగా సీఎం చంద్రబాబు చిత్రీకరిస్తున్నారు. ఎన్నికల్లో కూడా ఇలాగే ఆరోపణలు చేసి లబ్ధి పొందాలని చూశారు. ఈరోజు మండలిలో సాక్షాత్తు మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. ఆ భవనాలను వీఎంసీ అనుమతులు తీసుకుని కట్టారని చెప్పారు. కోర్టు తీర్పునకు లోబడి భవనాలు నిర్మించారని అన్నారు. హరిత రిసార్ట్స్ స్థానంలోనే ఈ భవనాలను నిర్మించారని మంత్రి క్లారిటీ ఇచ్చారు. రుషికొండలో మంత్రులు, ఉపముఖ్యమంత్రి పర్యటించినప్పుడు కూడా చాలా అద్భుతంగా కట్టారని పొగిడారు. రుషికొండలో నిర్మించినవి ప్రభుత్వ భవనాలు తప్ప.. జగన్, పార్టీకో సంబంధించినవి కాదు. ప్రభుత్వంలో ఉన్నవాళ్లు ఆ భవనాలను ఏ విధంగా ఉపయోగించుకోవాలో ఆలోచించాలి. 2014 –19, 2019 –24 మధ్యకాలంలో జరిగిన ప్రభుత్వాల అభివృద్ధిపై చర్చించేందుకు మేము సిద్ధం. – లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ

వారి పరిస్థితి దయనీయం ...



కూటమి ప్రభుత్వం వచ్చాక 104, 108, అంగన్వాడి ఆశా వర్కర్ల పరిస్థితి దయనీయంగా మారింది. వాళ్ల న్యాయబద్ధమైన డిమాండ్స్ ప్రభుత్వం తీర్చాలి. 104, 108 ను వైఎస్సార్ తీసుకువస్తే గత సీఎం జగన్ వాటికి తగినన్ని నిధులు కేటాయించి ఎంతో వృద్ధిలోకి తెచ్చారు. ప్రమాదాలు జరిగినప్పుడు 104, 108 లు పది నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుని ఎంతోమందిని ప్రాణాపాయ పరిస్థితి నుండి కాపాడాయి. అంగన్వాడి, ఆశా వర్కర్ల పీఎఫ్, గ్రాట్యూటీ, సర్వీస్ లో చనిపోతే దహన సంస్కారాలకు రూ.20,000 ఆర్థిక సాయం చేయడం వంటి కార్యక్రమాలు అమలు చేయాలి. ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి. గతంలో కొంతమందిని రెగ్యులరైజ్ చేయడం జరిగింది. ఎన్నికల కోడ్ దృష్ట్యా కొన్ని ఆగిపోయాయి. మిగిలిన వారిని ఈ ప్రభుత్వ రెగ్యులరైజ్ చేయాలి. – వరుదు కళ్యాణి, ఎమ్మెల్సీ

వర్సిటీలకు వీసీలను నియమించాలి..



రాష్ట్రంలో ఉన్నత విద్యా మండలి, విశ్వవిద్యాలయాల తీరుపై వాయిదా తీర్మానం ఇచ్చాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమ చంద్రారెడ్డి రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా కూడా ఉన్నత విద్యా మండలి చైర్మన్ ను నియమించలేదు. ఇప్పటివరకు ఇన్చార్జ్ చైర్మన్ గా ఉన్న ఆయన రెండు వర్సిటీలకు వీసీగా అప్షై చేసుకున్నారు. రాష్ట్రంలోని 15 యూనివర్సిటీలకు పైగా పర్మినెంట్ వీసీలు లేరు. అందరూ ఇన్చార్జి వీసీలే. కూటమి ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ వీసీలను నియమించాలి. వర్సిటీల్లోని 5 వేలకు పైగా ఖాళీగా ఉన్న అసిస్టెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయాలి. ఉన్నత విద్యా మండలికి చైర్మన్ లేకపోవడం, యూనివర్సిటీలకు పర్మినెంట్ వైస్ ఛాన్సలర్లు లేకపోవడంతో విద్యా ప్రమాణాలు కొరవడుతున్నాయి. – కేఎస్ లక్ష్మణరావు, పీడీఎఫ్ ఎమ్మెల్సీ

సేఫ్ గార్డ్స్ విధానాలను పాటించాలి




గత సమావేశాల్లో కానీ, జరుగుతున్న సమావేశాల్లో కానీ పీడీఎఫ్ వేసిన ప్రశ్నలకు సంబంధించి ఒక్కదానిపై కూడా చర్చించలేదు. ఈ విషయాన్ని స్పీకర్, చైర్మన్ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. మేము కూడా ప్రశ్నోత్తరాలు, లఘు ప్రశ్నలు, బడ్జెట్ పై మాట్లాడటం వంటివి చేయొచ్చు. ఈరోజు ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించిన సమస్యను సభ దృష్టికి తీసుకువచ్చాం. ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించిన సేఫ్ గార్డ్స్ విధానాలను పాటించాలి. విశాఖ డైరీ కి సంబంధించి లీటర్ పాల సేకరణ ధరను రూ.35 నుంచి రూ.32 లకు తగ్గించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో లక్షల మంది రైతులు నష్టపోతున్నారు. మంత్రి గారికి చెబితే అది మా పరిధిలో లేదని అంటున్నారు. మరి, ప్రభుత్వాలు కంట్రోల్ చేయలేని చట్టాలను ఎందుకు చేస్తున్నారో సమాధానం చెప్పాలి. – ఐ.వెంకటేశ్వరరావు, పీడీఎఫ్ ఎమ్మెల్సీ

'అరబిందో' కాంట్రాక్టర్ ని ఎందుకు తప్పించారు..



ఈ రోజు మండలిలో పోర్టులకు సంబంధించి చర్చ జరిగింది. గత ప్రభుత్వంలో రూ. 25 వేల కోట్లతో 4 పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిషింగ్ జెట్టీలకు శ్రీకారం చుట్టారు. రామాయపట్నం పోర్టు పనులు 65% పూర్తయ్యాయి. మచిలీపట్నం, మూలపేట పోర్టుల పనులు 45% పూర్తయ్యాయి. ఈ పోర్టులను ప్రైవేటు పరం చేస్తున్నారని ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేటు పరం చేయట్లేదని ప్రభుత్వం చెబుతోన్నా.. రామాయపట్నం పోర్టుకు సంబంధించి 'అరబిందో' కాంట్రాక్టర్ ని ఎందుకు తప్పించారు. రాష్ట్ర విభజన జరిగినప్పుడు తెలంగాణను ధనిక రాష్ట్రంగా అభివర్ణించారు. ఈ నేపథ్యంలో జగన్ దూర దృష్టితో పోర్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఇటీవల చంద్రబాబు, రేవంత్ రెడ్డి బేటి జరిగినప్పుడు తీర ప్రాంతంలో, టీటీడీలో రేవంత్ రెడ్డి వాటా కోరారు. జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్లింది అనడానికి ఇదే ఉదాహరణ. – తూమాటి మాధవరావు, ఎమ్మెల్సీ

పరిశ్రమలపై చర్చ జరగలేదు...



మండలిలో ఇండస్ట్రీస్ మీద చర్చ సరిగ్గా జరగలేదు. బడ్జెట్లో రూ.3,150 కోట్ల మాత్రమే కేటాయించడం జరిగింది. కూటమి ప్రభుత్వ రాగానే ఇండస్ట్రీలు డెవలప్ చేస్తామని చెప్పారు. ఏపీలో ముఖ్యంగా రైస్ మిల్లు, స్పిన్నింగ్ మిల్లులు భారీగా ఉన్నాయి. వీటిపైన 75,000 మంది ప్రత్యక్షంగా, లక్ష మంది పరోక్షంగా ఆధారపడి ఉన్నారు. స్పిన్నింగ్ మిల్లులు గత రెండేళ్లుగా సంక్షోభంలో ఉన్నాయి. పరిశ్రమలకు సంబంధించిన రాయితీలను ఇంకా పెంచాల్సిన అవసరం ఉంది. – వంకా రవీంద్రనాథ్, ఎమ్మెల్సీ

ఆ భవనాలకు అన్నీ అనుమతులున్నాయి



విశాఖపట్నంలోని రుషికొండ భవనంపై మండలిలో చర్చ జరిగింది. స్క్వేర్ ఫీట్ కి రూ.25 వేలు ఖర్చు చేశారని, ఇంద్ర భవనం లాగా ఉందని మంత్రులు అంటున్నారు. గతంలో సీఎంలు విశాఖ వెళ్తే హోటల్స్ లో ఉండేవారు. ఇప్పుడు ఈ భవనం నిర్మాణంతో రాష్ట్రపతి, పీఎం, సీఎం ఉండడానికి ఉపయోగించవచ్చు. మండలిలో రుషికొండ భవనానికి సంబంధించి మంత్రి మాట్లాడుతూ అన్ని పర్మిషన్లు ఉన్నాయని చెప్పారు. అటువంటప్పుడు ఎన్నికల సమయంలోను, అసెంబ్లీలోను చంద్రబాబు ఎందుకు వైఎస్ జగన్‌పై దుష్ప్రచారం చేసినట్లు. మంత్రి ఒకలా... చంద్రబాబు ఒకలా ఎందుకు మాట్లాడాతారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు వాస్తవాలు మాట్లాడటం నేర్చుకోవాలి. – సిపాయి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ

సభను తప్పుద్రోవ పట్టిస్తున్నారు




రుషికొండలో ఉన్న పర్యాటక శాఖకు చెందిన పాత రిసార్టు స్థానే కొత్త రిసార్టు నిర్మించాలనే గత జగన్ ప్రభుత్వం అత్యాధునిక వసతులతో కూడిన రిసార్టును నిర్మిస్తే రాష్ట్ర శాసన మండలిలో టీడీపీ సభ్యులు సభను తప్పుద్రోవ పట్టించే విధంగా మాట్లాడారు. 7.86 ఎకరాలకు సంబంధించి అన్ని రకాల పర్యావరణ ఇతర అనుమతులు తీసుకుని 2.78 ఎకరాల విస్తీర్ణంలో నూతన రిసార్టులను నిర్మించారు. రుషికొండలో నిర్మించిన వివిధ భవనాలను గతంలో ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి సందర్శించి మంచి భవనాలు నిర్మించారని అన్నారని గుర్తు చేశారు. కానీ నేడు వాటిపై పెద్దఎత్తున విమర్శించడం ఎంత వరకు సబబు? – డా.కె.రవిబాబు, ఎమ్మెల్సీ

మంత్రులు సమాధానాలు సరిగా లేవు..



బడ్జెట్ పై చర్చ సందర్భంగా సభలో మంత్రులు చెబుతున్న సమాధానాలు సరిగా లేవు. అధికారంలో ఉండి కూడా ప్రతిపక్షంలో ఉన్నట్టు మాట్లాడుతున్నారు. రాష్ట్రంలో మహిళల రక్షణ గురించి హోం మంత్రి మాట్లాడుతున్నవన్నీ అబద్ధాలే. విశాఖలో లా విద్యార్థినిపై గ్యాంగ్ రేప్ జరిగింది. మొన్న పెద్ద గంట్యాడలో అమ్మాయిని కొడితే చర్యలు లేవు. చిన్నారిపై వృద్ధుడు అత్యాచారం చేస్తే అరెస్టులు లేవు. అందువల్లే ఇప్పుడు భయం లేకుండా లా విద్యార్థినిపై గ్యాంగ్ రేప్ జరిగింది. – నర్తు రామారావు, ఎమ్మెల్సీ

పదోన్నతులు లభించక నష్టపోతున్నారు..



పంచాయతీరాజ్, ప్రభుత్వ ఉపాధ్యాయుల మధ్య నాలుగు దశాబ్దాలుగా పదోన్నతుల విషయంపై సమస్య పరిష్కారం కాలేదు. దీనివల్ల ఉపాధ్యాయులు పదోన్నతులు లభించక నష్టపోతున్నారు. వీరి మధ్య న్యాయమైన సమస్యలు ఉన్నాయి. ప్రభుత్వం తక్షణమే ఈ సమస్యలు పరిష్కరించాలి. కడప – రేణిగుంట రోడ్డు ద్వారా నిత్యం హైదరాబాద్, కర్నూలు ఇతర ప్రాంతాల నుంచి నిత్యం తిరుపతికి వేల వాహనాలు తిరుగుతున్నాయి. ప్రస్తుతం డబుల్ రోడ్డుగా ఉండటం వల్ల 130 కిలోమీటర్ల దూరం ప్రయాణించేందుకు 3 గంటలు పడుతుంది. కడప – రేణిగుంట మధ్య గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు మంజూరై ఉంది. వీటి టెండర్లు పూర్తయ్యాయి. కడప, సిద్ధవటం, ఒంటిమిట్ట, రాజంపేట, ఓబులవారిపల్లి, శెట్టిగుంటలో భూసేకరణ పూర్తి అయింది. అయితే నష్టం పరిహారం పూర్తి స్థాయిలో జరగలేదు. ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించాలి. – ఎంవీ రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ

సాక్షి ప్లస్
బుధవారం ॥ 20-11-2024
సాగుబడి
అనూరాధ కార్తె : నవంబర్ 19 నుంచి



కుమ్‌ఖాత్

కుమ్‌ఖాత్ సిట్రస్ జాతి పండు. నారింజలాగే ఉంటుంది. కానీ, గుండ్రంగా కాకుండా కోడి గుడ్డు మాదిరిగా ఓవెల్ ఆకారంలో చిన్నగా (1-2 అంగుళాలు) ఉంటుంది. చైనా దీని పుట్టిల్లు. 500 ఏళ్ల క్రితం దీన్ని ఫార్చునెల్లా అని పిలిచేవారట. చైనీస్ భాషలో గామ్ (అంటే బంగారం), గ్వాత్ (టాంగెరిన్స్‌కు మరో పేరు) మాటల కలయిక వల్ల కుమ్‌ఖాత్ అనే పేరు ఈ పంటకు, పండుకు స్థిరపడింది. 400 ఏళ్ల క్రితమే ఈ పంట యూరప్‌కి, అమెరికాకు చేరింది. ఇది అతి చలిని, అతి వేడిని కూడా తట్టుకొని బతకగల విలక్షణ నారింజ జాతి పంట. దీన్ని తొక్క తీపిగా ఉంటుంది. దాంతో పాటుగా తినేయొచ్చు.


కొత్త పంట

కుమ్‌ఖాత్ పండ్లు వగర, పులుపు, కొద్దిగా తీపి కలగలిసిన రుచి కలిగి ఉంటుంది. కట్ చెయ్యాల్సిన అవసరం లేకుండా నోట్లో పెట్టుకొని తినెయ్యగలిగే ఈ పండ్లలో విటమిన్ సి, పీచు పదార్థం పుష్కలంగా ఉన్నాయి. ఐరన్, బి కాంప్లెక్స్ విటమిన్లు, మాంగనీసు, రాగి, కాల్షియం తదితర పోషకాలు కూడా ఉన్నాయి. కుమ్‌ఖాత్ పండులోని విత్తనాలు కూడా తినదగినవే. ఆరోగ్యదాయకమైన ఒమెగా -3 ఫ్యాటీ ఆసిడ్స్ వున్నాయి. నీటి శాతం కూడా ఎక్కువే.

కుమ్‌ఖాత్ పండ్ల జాతిలో అనేక రకాలున్నాయి. జనాదరణ పొందిన రకాలు.. నగమి, మరుమి, మీవ. మురుమి, మీవ కుమ్‌ఖాత్ రకాల పండ్లు గుండ్రంగా ఉంటాయి. ఓవెల్ షేప్‌లో కొంచెం పుల్లగా ఉండే నగమి పండ్ల కన్నా తియ్యగా ఉంటాయి.

తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్

నారింజ జాతి పండ్లలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. మధుమేహం ఉన్న వారిలో ఈ పండ్లు బ్లడ్ గ్లూకోజ్‌ను పెంచవు. అతి తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్‌తో పాటు పుష్కలంగా యాంటీఆక్సిడెంట్లు ఉన్నందున కుమ్‌ఖాత్ పండ్లు షుగర్ వ్యాధిగ్రస్తులకు మేలు చేస్తాయి.

అధిక పీచు

కుమ్‌ఖాత్ పండ్లలో పీచుతో కూడిన సంక్లిష్ట పిండిపదార్థాలుంటాయి. కాబట్టి, జీర్ణకోశంలో ఎక్కువ సేపు అరిగిపోకుండా ఉంటాయి. ఎక్కువ సేపు కడుపు నిండుగా ఉంటుంది. అందువల్ల బరువు పెరగకుండా ఉండేందుకు తోడ్పడుతుంది. దీనిలోని జీర్ణమయ్యే పీచుకు విరేచనాలను అరికట్టే గుణం ఉంది. ఇది జీర్ణకోశంలోని అదనపు నీటిని పీల్చుకొని, జెల్ మాదిరిగా ఏర్పడుతుంది. అందువల్ల, ఎక్కువ సార్లు విరేచనాలు అవుతూ ఉంటే గుప్పెడు కుమ్‌ఖాత్ పండ్లు నోట్లో వేసుకుంటే సరి.

ఆరోగ్యదాయకమైన కొవ్వులు

కుమ్‌ఖాత్ పండ్లలో కొవ్వు చాలా తక్కువ. కాబట్టి, అధిక కొలెస్ట్రాల్‌తో బాధపడేవారు వారి దినసరి ఆహారంలో కుమ్‌ఖాత్ పండ్లను చేర్చుకుంటే మంచిది. ఈ పండ్లలోని విత్తనాలను కూడా నమిలి తినాలి. ఈ విత్తనాల్లో ఒమెగా ఫాటీ ఆసిడ్లు ఉంటాయి కాబట్టి దేహంలో బాడ్ కొలెస్ట్రాల్ తగ్గి, గుడ్ కొలెస్ట్రాల్ పెరుగుతుంది.

యాంటీఆక్సిడెంట్‌గా ఉపయోగం

కుమ్‌ఖాత్ పండ్లలో విటమిన్ ఎ, సి వంటి యాంటీఆక్సిడెంట్ విటమిన్లు ఉన్నాయి. ఫ్రీ రాడికల్స్ దేహంలో ఎక్కువైతే కణ నిర్మాణం దెబ్బతింటుంది. మన దేహంలో ఫ్రీ రాడికల్స్ కలిగించే ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను కుమ్‌ఖాత్ పండ్లలోని యాంటీఆక్సిడెంట్లు తగ్గిస్తాయి.

గుండె ఆరోగ్యానికి మేలు

కుమ్‌ఖాత్ పండ్లలోని విటమిన్ సి, పీచు, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ ఎ వంటి పోషకాలు రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయి గుండె పోటు రాకుండా చూస్తాయి. గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. అలా అధిక రక్తపోటును అదుపులో ఉంచుతాయి. మొత్తంగా గుండె ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి. ఎల్‌డిఎల్‌ను తగ్గించటం ద్వారా గుండె సమస్యల్ని నిరోధిస్తాయి.

ఇన్‌ఫ్లమేషన్‌కు చెక్

కుమ్‌ఖాత్ పండ్లలో కీంప్‌ఫెరాల్, లుటియోలిన్, హెస్పెరిడిన్, క్యుఎర్సెటిన్, సి-గ్లైకోసైడ్ వంటి ఫ్లేవనాయిడ్లు ఉన్నాయి. సి-గ్లైకోసైడ్ దేహంలో వాపును నివారించే గుణం కలిగిఉన్నట్లు పరిశోధనల్లో తేలింది. రోగనిరోధక వ్యవస్థలో ఇన్‌ఫ్లమేటరీ రీయాక్షన్‌ను, ప్రమాదకరమైన ఫ్రీ రాడికల్స్ పుట్టుకను తగ్గించటంలో సి-గ్లైకోసైడ్ ఉపయోగపడుతుంది.

కుమ్‌ఖాత్ పోషకవిలువలు:

100 గ్రాముల కుమ్‌ఖాత్ పండ్లలో పోషకవిలువలు ఇలా ఉంటాయి... శక్తి : 71 కిలోకేలరీలు; పిండిపదార్థాలు : 15.9 గ్రా; మాంసకృత్తులు : 1.8 గ్రా; కొవ్వు : 0.8 గ్రా; పీచు : 6.5 గ్రా; విటమిన్ ఎ : 15 మిల్లీ గ్రాములు; విటమిన్ సి : 43.9 ఎం.జి; రిబోఫ్లేవిన్ : 0.09 ఎం.జి; క్లోరిన్ : 8.4 ఎం.జి; కాల్షియం : 62 ఎం.జి; ఐరన్ : 0.87 ఎం.జి; మెగ్నీషియం : 20 ఎం.జి; మాంగనీసు : 0.13 ఎం.జి; జింక్ : 0.17



యాంటీబాక్టీరియల్ ప్రభావం

కుమ్‌ఖాత్ పండు తొక్కలోని నూనెకు సూక్ష్మక్రిములను హరించే గుణం ఉందని పరిశోధనల్లో తేలింది. ఆహార పదార్థాలపై పెరిగే బూజు, సూక్ష్మజీవులను నిరోధించడానికి ఇది ఉపయోగపడుతుంది. తద్వారా ఆహార పదార్థాలు త్వరగా చెడిపోకుండా ఎక్కువ కాలం నిల్వ ఉంచేందుకు ఇది దోహదం చేస్తుంది.

కేన్సర్‌నూ అరికడుతుంది

కుమ్‌ఖాత్ పండులో ఉండే అపిజెనిన్ అనే ఫ్లేవనాయిడ్ కేన్సర్ కణాల పెరుగుదలను అడ్డుకుంటుందని పరిశోధనల్లో తేలింది. అపిజెనిన్ కేన్సర్ కణాలను ఇతర ఆరోగ్యకరమైన కణాలకు పాకకుండా అరికట్టగలుగుతుందని భావిస్తున్నారు.

ఊబకాయాన్ని తగ్గిస్తుంది:
కుమ్‌ఖాత్ పండ్లలోని పోన్సిరిన్ అనే ఓ ఫ్లావనాయిడ్ ఊబకాయాన్ని తగ్గించటంలో కీలక పాత్ర పోషిస్తుంది. దేహం కొత్త కొవ్వు కణాలను తయారు చేసుకోకుండా అడ్డుకోవటం ద్వారా బరువు పెరగకుండా ఉండేందుకు పోన్సిరిన్ దోహదపడుతుందని ఒక అధ్యయనంలో వెల్లడైంది. దీనితోపాటు ఈ పండ్లలోని అధిక పీచుపదార్థం కడుపులో ఎక్కువ సేపు దన్నుగా ఉండటం వల్ల ఆకలి భావనను త్వరగా కలగనివ్వదు.

కంటి చూపునకు మంచిది

కుమ్‌ఖాత్ పండ్లలో బీటా కరోటెన్ రూపంలో విటమిన్ ఎ పుష్కలంగా ఉంది. ఈ పండ్లలో ఉన్న 11 కెరొటినాయిడ్లలో ఇదొకటి. బీటీ కరోటెన్, జియాక్సాంతిన్, లుటీన్ వంటి కెరొటినాయిడ్లు కంటి ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి. కంటి చూపు బాగుండాలంటే విటమిన్ ఎ తోడ్పాటుతో రోడోప్సిన్ ఉత్పత్తి అవుతుంది.

మూడ్ డిజార్డర్లకూ...

వత్తిడి సమస్యలను, మూడ్ డిజార్డర్లను, నిద్ర సమస్యలను విటమిన్ సి ఆహారాలు అరికడతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. వత్తిడి, కుంగుబాటు, ఆందోళనల తీవ్రతను తగ్గించటం ద్వారా మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే యాంటీడిప్రెసెంట్ మాదిరిగా కుమ్‌ఖాత్ పండ్లు పనిచేస్తాయి. ఆరోగ్య దాయకమైన నిద్రకు దోహదం చేస్తాయి. అయితే, అది ఏ విధంగా దోహద పడతాయో ఇంకా స్పష్టంగా తెలియదు.

ఎముక పుష్టికి..

ఎముక పెరుగుదలలో విటమిన్ సి పాత్ర కీలకమైనది. విటమిన్ సి కొల్లజెన్ ఏర్పడటానికి దోహదపడుతుంది. కుమ్‌ఖాత్ పండ్లలో కాల్షియం, విటమిన్ సి పుష్కలంగా ఉన్నాయి.

ఎముకలు పటుత్వాన్ని కోల్పోయే ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యలను విటమిన్ సి తగ్గిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఎముకల నుంచి కాల్షియంను హరించే యాసిడ్ ఫుడ్స్ ఎముక సమస్యల్ని పెంచుతాయి. కుమ్‌ఖాత్ పండ్లు ఆల్కలిన్ ఫ్రూట్స్ కాబట్టి ఆస్టియోపోరోసిస్‌కు దారితీయకుండా కాపాడుతాయని చెప్పొచ్చు.

రోగనిరోధక శక్తి

కుమ్‌ఖాత్ పండ్లలోని బీటా-క్రిప్టోక్సాంతిన్, ఎల్-లైమోనెనె మన దేహంలో రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయని ఓ అధ్యయనం చెబుతోంది. సహజ సిద్ధమైన కిల్లర్ సెల్స్ కార్యకలాపాలను పెంపొందించటం ద్వారా దేహంలో మెటబాలిక్ స్ట్రెస్‌ను తగ్గించటంలో ఇవి ఉపయోపడతాయి.

రసాయనాల కొద్దీ జబ్బులు!

హరిత విప్లవానికి పట్టుగొమ్మ వంటి పంజాబ్ రాష్ట్రంలో రైతులు పునరలోచనలో పడ్డారు. రసాయనిక ఎరువులు, పురుగుమందులు అత్యధిక మోతాదులో వాడుతూ ఏడు దశాబ్దాలుగా మార్కెట్ కోసం వరి, గోధుమ వంటి పంటలు పండిస్తూ వచ్చిన రైతులు.. ఆ ఆహారం తిని తమ కుటుంబ సభ్యులు వ్యాధిగ్రస్తులుగా మారుతుండటాన్ని గురించారు. తమ కుటుంబం కోసమైనా రసాయనాలు వాడకుండా పూర్తి సేంద్రియ పద్ధతుల్లో పంటలు పండించుకోవటమే ఆరోగ్యాన్ని తిరిగి పొందే మార్గమని పంజాబ్ రైతులు ఎట్టకేలకు గ్రహిస్తున్నారు.

తేజ్‌పాల్ సింగ్ 30 ఎకరాల ఆసామి. పొలం అంతా (గత సెప్టెంబర్‌లో) పచ్చని వరి పంటతో నిండి ఉంది. పటియాలా జిల్లా కక్రాల గ్రామ పొలిమేరల్లోని తన వరి పొలానికి 4 టన్నుల యూరియా వేశానని, పురుగుల మందు ఒకసారి చల్లానని చెప్పారు. ఇది మార్కెట్‌లో అమ్మటం కోసం అతను పండిస్తున్నాడు.



ఈ ప్రధాన పొలానికి పక్కనే అతనిదే 4 ఎకరాల పొలం మరొకటి ఉంది. అందులో కొంత మేరకు వరి పంట, దాని పక్కనే కూరగాయల తోట కూడా ఉంది. 'ఈ 4 ఎకరాల పంట అమ్మటం కోసం కాదు, మా కుటుంబం కోసమే పూర్తిగా సేంద్రియంగా పండిస్తున్నా. పచ్చిరొట్ట ఎరువు, వర్మీకంపోస్టు, జీవన ఎరువులు ఈ పొలంలో వాడుతున్నా. మా కుటుంబం తినగా మిగిలినవి ఏమైనా ఉంటే అమ్ముతా' అన్నారు తేజ్‌పాల్ సింగ్.

ఈ మార్పు ఎందుకొచ్చిందని అడిగితే.. మూడేళ్ల క్రితం తన భార్య అనారోగ్యం పాలైంది. టెస్ట్ చేయిస్తే యూరిక్ యాసిడ్ పెరిగిందన్నారు. ఆ రోజుల్లో మరో దగ్గరి బంధువుకు కేన్సర్ వచ్చింది. అప్పటి నుంచి మనం తింటున్న ఆహారం నాణ్యత ఎలా ఉంది అని ఆలోచించటం మొదలు పెట్టాడు. తాను రసాయనాలతో పండించిన ఆహారోత్పత్తుల్ని పరీక్ష చేయించాడు. యూరియా, పొటాష్, పురుగు మందుల అవశేషాలు ప్రమాదకర స్థాయిలో ఆ ఆహారంలో ఉన్నట్లు తేలింది.

'అప్పుడు నేను నిర్ణయించుకున్నా. మా కుటుంబం తినేదంతా సేంద్రియ పద్ధతుల్లోనే పండించుకోవాలని గట్టి నిర్ణయానికొచ్చా. అప్పటి నుంచి ఈ 4 ఎకరాల్లో మా కోసం ఆర్గానిక్ పంటలు పండించుకొని తింటున్నాం. నా భార్య దేహంలో యూరిక్ యాసిడ్ తగ్గింది. మేం తింటున్న సేంద్రియ ఆహారం రుచిగా, నాణ్యంగా ఉంది. ఈ ఆహారం అంతకు ముందు తిన్న దానికన్నా ఎంతో మేలైనదని మాకు అర్థమైంది' అన్నారు తేజ్‌పాల్ సింగ్. ఇది ఆయన ఒక్కడి మాటే కాదు. తినే ఆహారంలో రసాయనాల అవశేషాల్లేకపోతే ఆరోగ్యం బాగుంటుందని గట్టిగా గుర్తించిన రైతులు చాలా మందే కనిపిస్తున్నారంటే ఆశ్చర్యం లేదు.

కొద్ది నెలల క్రితం పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం చెప్పిన లెక్క ప్రకారం.. పంజాబ్‌లో 2023-24లో ఎకరానికి 103 కిలోల రసాయనిక ఎరువులు వాడారు. దేశవ్యాప్తంగా రైతులు వాడుతున్న 58 కిలోలతో పోల్చితే ఇది దాదాపుగా రెట్టింపు. 1980-2018 మధ్యలో పంజాబ్ రైతులు వాడిన ఎన్‌పికె ఎరువులు ఏకంగా 180% పెరిగిందట.

దీనికి తగ్గట్టే జబ్బులూ పెరిగాయి. ఐసిఎంఆర్ సంస్థ నేషనల్ కేన్సర్ రిజిస్ట్రీ ప్రోగ్రామ్ గణాంకాల ప్రకారం.. పంజాబ్‌లో 2021లో 39,521 మంది కేన్సర్ బారిన పడితే.. అది 2024 నాటికి 42,288కి పెరిగింది. పొలాల్లో రసాయనాల వాడకం పెరగటానికి, మనుషుల్లో జబ్బులు పెరగటానికి మధ్య సంబంధం స్పష్టంగానే కనిపిస్తోంది. ఇది పంజాబ్ రైతులు, వినియోగదారులూ గుర్తిస్తున్నారు. మన సంగతేంటి?

క్లైమెట్ మర్మాలు

టిప్పింగ్ పాయింట్ (లక్ష్మణ రేఖ)



భూతాపోన్నతి, వాతావరణంలో దీర్ఘకాలిక మార్పుల వల్ల కలిగే దుష్ప్రభావాలు ఇక వెనక్కి మళ్లించలేని తీవ్ర స్థితికి చేరే లక్ష్మణ రేఖను టిప్పింగ్ పాయింట్‌గా చెప్పుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా సగటు ఉష్ణోగ్రతలను తగ్గించే ప్రయత్నాలు భవిష్యత్తులో ఒకవేళ విజయవంతమైనప్పటికీ ఈ టిప్పింగ్ పాయింట్ ఒకసారి దాటేస్తే, తిరిగి వెనక్కి రాలేని స్థితి ఉంటుంది. ఈ పెనుమార్పుల వల్ల కలిగే ఆకస్మిక, ప్రమాదకర ప్రభావాలు భవిష్యత్తు మానవాళికి, భూగోళానికి చాలా తీవ్రమైన హాని కలిగించే అవకాశం ఉంటుంది.

ప్రపంచం అంతకంతకూ వేడెక్కిపోతూ ఉంటే, పర్యావరణానికి సంబంధిన అనేక లక్ష్మణ రేఖలను దాటేసే పరిస్థితులు వస్తున్నాయి. వాటిల్లో ఒకానొకటి.. గ్రీన్‌లాండ్, పశ్చిమ అంటార్కిటికాలోని మంచు పర్వతాలు కుప్పకూలి కరిగిపోతూ ఉండటం. తత్ఫలితంగా సముద్రాల నీటి మట్టం ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోయి, లోతట్టు సముద్రతీర ప్రాంతాల్లోని జనవాసాలు, పర్యావరణ వ్యవస్థలు మునిగిపోయే ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఇంకో లక్ష్మణరేఖ.. టుండ్ర ప్రాంతాల్లోని పెర్మాఫ్రాస్ట్ (మంచు పలకలు) కరిగి మెత్తబడిపోతున్నాయి. దీనితో పెద్ద ఎత్తున హరిత గృహ వాయువులు వాతావరణంలోకి వెలువడే ముప్పుంది. భూతాపోన్నతి, వాతావరణ మార్పులు మరింత పెచ్చరిల్లే అవకాశం ఉంది. మనం దాటేస్తున్న మరో రెండు లక్ష్మణ రేఖలు.. సముద్రపు అడుగున గల కోరల్ రీఫ్స్ మూకుమ్మడిగా దెబ్బతినటం, వర్షారణ్యాల విధ్వంసం. వీటి వల్ల జీవవైవిధ్యంపై, మానవాళిపై ముమ్ముందు పెను దుష్ప్రభావాలు పడే అవకాశం ఉంటుంది.

కోళ్ల పెంపకంలో యాంటీబయాటిక్స్ వాడకాన్ని తగ్గించటం ఎలా?





1 వ్యాధి నిర్ధారణ అయిన కోళ్లకు, వాటి పక్కన ఉన్న కోళ్లకు చికిత్స చేయడానికి మాత్రమే యాంటీబయాటిక్స్ ఉపయోగించండి. వీటిని మేత ద్వారా కంటే నీటిలో కలిపి ఇస్తే బాగా పనిచేస్తాయి. యాంటీబయాటిక్ ఔషధాలను వ్యాధి నివారణకు లేదా కోళ్ల పెరుగుదలను పెంపొందించడానికి ఉపయోగించవద్దు.

2 కోళ్ల షెడ్‌లోకి వచ్చే సందర్శకుల సంఖ్యను పరిమితం చేయండి. లోపలికి వెళ్లే ముందు బట్టలు, చెప్పులు/బూట్లు మార్చుకోవాలి. చేతులు కడుక్కోవాలి. ఆవరణలోకి ప్రవేశించే ముందు వాహనాలను క్రిమిసంహారకాలతో శుభ్రపరచండి. వ్యాధులను వ్యాపింపజేసే ఎలుకలు, పురుగులు, పెంపుడు జంతువులు, అడవి జంతువులు కోళ్ల ఫారాలల్లోకి రానివ్వకండి.

3 నాణ్యతతో కూడిన మంచి వ్యాక్సిన్లను ఉపయోగించండి. తయారీదారు సూచించిన విధంగా వాటిని నిల్వ చేయండి. జాగ్రత్తగా వాడండి.

4 మీ పౌల్ట్రీ ఫామ్‌లో కోళ్ల ఆరోగ్యాన్ని, ప్రవర్తనను ప్రతిరోజూ తనిఖీ చేయండి. వాటిల్లో అకస్మాత్తుగా లేదా క్రమంగా వస్తున్న మార్పులను వెంటనే గుర్తించండి. చనిపోయిన పక్షులను తొలగించి పారవేయండి.

5 గాలి, వెల్తురు, మేత, నీటి సరఫరా, కోళ్ల సంఖ్య (స్టాకింగ్ డెన్సిటీ) ఇతర విషయాలకు సంబంధించి నిపుణుల సిఫార్సులను అనుసరించండి.

6 కోళ్లకు వేసే మేత నాణ్యంగా, పరిశుభ్రంగా ఉండాలి. మేతలో తగినంత శక్తినిచ్చే దినుసులు, ఖనిజాలను సమతుల్యంగా ఉండాలి. మేతను జాగ్రత్తగా నిల్వ చేయండి. మొక్కలు, గింజలతో కూడిన మేతను ఇవ్వటమే మేలు.

7 ప్రీబయోటిక్స్, ప్రోబయోటిక్స్, సుగంధ తైలాలు, ఆర్గానిక్ యాసిడ్స్, నీటకరగని పీచు కోళ్ల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇవి పేగులలో ఉపయోగకరమైన బ్యాక్టీరియాను పెంపొందిస్తాయి. సూక్ష్మక్రిములను నిరోధిస్తాయి. పేగులను ఆరోగ్యంగా ఉంచుతాయి.

8 మీ పౌల్ట్రీ షెడ్‌ను, పరికరాలను క్రిమిసంహారకాలతో శుభ్రం చేసిన తర్వాత.. మురికిని శుభ్రంచేయటానికి డిటర్జెంట్లు లేదా వేడి నీటిని ఉపయోగించండి. ప్రతి బ్యాచ్ తర్వాత తగినన్ని రోజులు షెడ్‌ను ఖాళీగా ఉంచండి.

9 కొత్తగా కోడి పిల్లలను తెచ్చుకునేటప్పుడు విశ్వసనీయమైన హేచరీల నుంచి తెచ్చుకోండి. టీకాలు వేసి, వ్యాధులు సోకని తల్లి కోళ్ల నుంచి పుట్టిన పిల్లలనే ఎంచుకోండి.

10 కోడిపిల్లలను తెచ్చిన వెంటనే మేతను, నీటిని అందించండి. వాటికి అవసరమైన అన్ని పోషకాలు ఇవ్వండి. శారీరక అవసరాలను తీర్చేలా ఏర్పాట్లు చేయండి.

11 శుభ్రమైన, మంచి నాణ్యత గల నీరు అందుబాటులో ఉండేలా చూసుకోండి. నీటి సరఫరా గొట్టాలను తరచుగా శుభ్రపరచండి. డ్రింకింగ్ లైన్లను వారానికోసారి శుభ్రపరచండి.

WORLD AMR AWARENESS WEEK
18-24 NOVEMBER

(సౌజన్యం: ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార-వ్యవసాయ సంస్థ)

నిర్వహణ:
పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

బిజినెస్ రీల్

డీప్‌ఫేక్ వీడియోలపై జాగ్రత్త

ప్రజలకు ఆర్‌బీఐ హెచ్చరిక

ముంబై: కొన్ని రకాల పెట్టుబడి పథకాలకు మద్దతు ఇవ్వాలంటూ గవర్నర్ శక్తికాంతదాస్‌తో కూడిన డీప్‌ఫేక్ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చలామణీ అవుతుండడంతో ఆర్‌బీఐ ప్రజలను అప్రమత్తం చేసింది. ఆర్‌బీఐ ద్వారా ప్రారంభించిన లేదా కొన్ని రకాల పెట్టుబడి పథకాలకు మద్దతు ఇవ్వాలని కోరుతూ వీడియోలు చలామణి అవుతున్నట్టు తమ దృష్టికి వచ్చినట్టు తెలిపింది. టెక్నాలజీ టూల్స్ ద్వారా సంబంధిత పథకాల్లో ప్రజలతో పెట్టుబడులు పెట్టించేందుకు చేస్తున్న మోసపూరిత ప్రయత్నంగా స్పష్టం చేసింది. టెక్నాలజీ సాయంతో ఒక వ్యక్తి స్థానంలో మరో వ్యక్తి ఫొటోను ఉంచి ప్రచారం చేసే వీడియోలను డీప్‌ఫేక్ వీడియోలుగా చెబుతారు.

వ్యవసాయ శాఖతో ఇండస్‌ఇండ్ బ్యాంక్ జట్టు

న్యూఢిల్లీ: భారత్ సంజీవని కృషి ఉత్థాన్ కార్యక్రమాన్ని ఆవిష్కరించే దిశగా కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖతో ఇండస్‌ఇండ్ బ్యాంక్ (ఐబీఎల్) , భారత్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ (బీఎఫ్‌ఐఎల్) అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. దేశవ్యాప్తంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు (ఎఫ్‌పీవో) సాధికారత కల్పించేందుకు ఇది తోడ్పడనుంది. దీని కింద ఎఫ్‌పీవో ప్రాజెక్టుల అమలుకు మార్గనిర్దేశనం చేయడం, పర్యవేక్షించడం మొదలైన వాటి కోసం జాతీయ స్థాయిలోను, 11 టార్గెట్ రాష్ట్రాల్లోను సెంట్రలైజ్డ్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను బీఎఫ్‌ఐఎల్, ఐబీఎల్ ఏర్పాటు చేస్తాయి. డేటా మేనేజ్‌మెంట్, ఐటీ మౌలిక సదుపాయాలు మొదలైన అంశాల్లో సాంకేతిక సహకారం అందిస్తాయి.

ఎన్‌టీపీసీ మధ్యంతర డివిడెండ్

రూ. 2,424 కోట్లు చెల్లింపు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇంధన దిగ్గజం ఎన్‌టీపీసీ వాటాదారులకు మధ్యంతర డివిడెండ్‌గా మొత్తం రూ. 2,424 కోట్లు చెల్లించింది. ఈ ఆర్థిక సంవత్సరం(2024-25)లో తొలి డివిడెండ్‌కింద షేరుకి రూ. 2.5 చెల్లించేందుకు గత నెలలో బోర్డు అనుమతించింది. దీనిలో భాగంగా ప్రభుత్వ వాటాకింద విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్, కార్యదర్శి పంకజ్ అగర్వాల్‌కు రూ. 1,239 కోట్లు అందించినట్లు ఎన్‌టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్ వెల్లడించారు. వెరసి వరుసగా 32వ ఏడాదిలోనూ కంపెనీ వాటాదారులకు డివిడెండ్లు పంచిన రికార్డును సొంతం చేసుకుంది. కాగా.. సముద్ర జలాల నుంచి గ్రీన్ హైడ్రోజన్ తయారీకి వీలుగా ఆంధ్రప్రదేశ్‌లో సింహాద్రి ప్లాంటును ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్‌టీపీసీ తెలియజేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-11-2024

విశాఖ	550-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	565-00
విజయవాడ	575-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	555-00
వరంగల్	557-00
రిటైల్ ధర	6.15

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
M&M	2,936.55	3.15
TECHM	1,692.05	1.88
HDFCBANK	1,736.00	1.81
DRREDDY	1,213.40	1.66
EICHERMOT	4,953.00	1.59

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SBILIFE	1,517.00	-2.92
HINDALCO	638	-2
RELIANCE	1,237.40	-1.85
HDFCLIFE	679	-1.67
SBIN	802.4	-1.46

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,951
ఎన్ఎస్ఈ	91,875
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,00,006
ఎఫ్ఐఐ	- 3,412
డీఐఐ	+ 2,784

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	69.31	$ 69.17
బ్రెంట్	73.38	$ 73.03

వచ్చేనెలలో విశాల్ మెగామార్ట్ ఐపీవో

- రూ. 8,000 కోట్ల సమీకరణకు రెడీ
- 2024లో అతిపెద్ద పబ్లిక్ ఇష్యూ!



ముంబై: సూపర్‌మార్కెట్ చైన్ విశాల్ మెగా మార్ట్ పబ్లిక్ ఇష్యూ బాటలో సాగుతున్నట్లు తెలుస్తోంది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం డిసెంబర్‌లో ఐపీవో చేపట్టనుంది. తద్వారా రూ. 8,000 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉంది. పీఈ దిగ్గజం కేదారా క్యాపిటల్ అండ్ పార్ట్‌నర్స్‌కు పెట్టుబడులున్న కంపెనీ లిస్టయితే 2024 ఏడాదికి అతిపెద్ద ఇష్యూగా నిలవనుంది. అంతేకాకుండా దేశీ ప్రైమరీ మార్కెట్లో నాలుగో పెద్ద ఐపీవోగా రికార్డులకు ఎక్కనుంది. మార్చితో ముగిసిన గతేడాది(2023-24) రూ. 8,912 కోట్ల ఆదాయం సాధించింది. రూ. 462 కోట్ల నికర లాభం ఆర్జించింది.

డిసెంబర్ మధ్యలో..

నిజానికి దేశీ స్టాక్ మార్కెట్లలో ఇటీవల నమోదవుతున్న దిద్దుబాట్ల కారణంగా నవంబర్‌లో చేపట్టదలచిన ఇష్యూని విశాల్ మెగామార్ట్ డిసెంబర్‌కు వాయిదా వేసినట్లు తెలుస్తోంది. కంపెనీ ఇప్పటికే లండన్, సింగపూర్ తదితర ప్రాంతాలలో రోడ్‌షోలపై విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లతో చర్చలు నిర్వహిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. కాగా.. వచ్చే నెల మధ్యలో చేపట్టనున్న ఐపీవోలో తాజా ఈక్విటీ జారీ లేనట్లు తెలుస్తోంది. నిధుల సమీకరణకు వీలుగా హోల్డింగ్ కంపెనీ సంయత్ సర్వీసెస్ ఎల్ఎల్‌పీ వాటాలు విక్రయించనుంది. ప్రస్తుతం విశాల్ మెగామార్ట్‌లో సంయత్ సర్వీసెస్‌కు 96.55 శాతం వాటా ఉంది. కంపెనీ సీఈవో గుణేందర్ కపూర్ వాటా 2.45 శాతంగా నమోదైంది. సుమారు 626 సూపర్‌మార్కెట్ల ద్వారా కంపెనీ దుస్తులు, ఎఫ్ఎంసీజీ, సాధారణ వర్తక వస్తువులు తదితర పలు ప్రొడక్టులను విక్రయిస్తోంది.

బీఎస్ఈ సెలక్ట్ ఐపీవో ఇండెక్స్ షురూ

తెరతీసిన ఏషియా ఇండెక్స్



న్యూఢిల్లీ: ఏషియా ఇండెక్స్ ప్రయివేట్ లిమిటెడ్ తాజాగా బీఎస్ఈ సెలక్ట్ ఐపీవో ఇండెక్స్‌ను ప్రవేశ పెట్టింది. తద్వారా కొత్తగా లిస్టయిన స్టాక్స్ పనితీరును మదింపు చేసేందుకు వీలు కల్పించింది. పబ్లిక్ ఇష్యూ లేదా లిస్టెడ్ కంపెనీల నుంచి ప్రత్యేక కంపెనీలుగా విడివడిన సంస్థలకు ఇండెక్స్‌లో చోటు లభించనుంది. వీటి పనితీరు ప్రతిబింబించేందుకు బీఎస్ఈ అనుబంధ సంస్థ ఏషియా ఇండెక్స్ తాజా ఇండెక్స్‌కు తెరతీసింది. దీనిలో చోటు కోసం ప్రధానంగా మూడు అంశాలను పరిగణిస్తుంది. పూర్తి మార్కెట్ క్యాపిటలైజేషన్, లిక్విడిటీ, మూడు నెలల కనీస లిస్టింగ్ గడువును ఇందుకు పరిగణించనున్నట్లు ఏషియా ఇండెక్స్ తెలియజేసింది. భారత్‌కు కొత్త లిస్టింగ్స్‌లో 2024 కీలక ఏడాదిగా నిలిచినట్లు పేర్కొంది. నిధుల సమీకరణ, ఐపీవోల(లిస్టింగ్) సంఖ్యరీత్యా ప్రపంచంలోని టాప్-3 మార్కెట్లలో ఒకటిగా అవతరించినట్లు తెలియజేసింది.

హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్‌కు కొరత

- సెప్టెంబర్ క్వార్టర్‌లో 25 శాతం తక్కువ సరఫరా
- స్థూల లీజింగ్‌లో 25 శాతం క్షీణత
- ప్రధాన నగరాల్లో 4 శాతం డౌన్
- రియల్టీ కన్సల్టెంట్ వెస్టియన్ నివేదిక



న్యూఢిల్లీ: హైదరాబాద్‌లో కార్యాలయ వసతులకు (ఆఫీస్ స్పేస్) సంబంధించి కొత్త సరఫరా 25 శాతం తగ్గి 4.10 మిలియన్ చదరపు అడుగులకు (ఎస్ఎఫ్‌టీ) పరిమితమైంది. స్థూల లీజింగ్ సైతం 25 శాతం తగ్గి 2.79 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా నమోదైంది. దేశవ్యాప్తంగా ఏడు ప్రధాన నగరాల్లోనూ కొత్త కార్యాలయ వసతుల సరఫరా జూలై-సెప్టెంబర్ కాలంలో 4 శాతం మేర తగ్గి 12.8 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉంది. ఇదే కాలంలో ఏడు నగరాల పరిధిలో ప్రైమ్ వర్క్‌స్పేస్ (ప్రధాన ప్రాంతాల్లో) స్థూల లీజింగ్ 17 శాతం పెరిగి 18.61 మిలియన్ ఎస్ఎఫ్‌టీలకు చేరింది. ఈ వివరాలను రియల్టీ కన్సల్టెంట్ 'వెస్టియన్' విడుదల చేసింది.

నగరాల వారీ వివరాలు..

- బెంగళూరులో ఆఫీస్ స్పేస్ కొత్త సరఫరా 33 శాతం పెరిగి 3.60 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి చేరింది. ఇక్కడ లీజింగ్ 84 శాతం పెరిగి 6.63 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉంది.
- ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో సరఫరా 360 శాతం అధికమై 2.3 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా నమోదైంది. స్థూల లీజింగ్ 17 శాతం వృద్ధితో 1.49 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి చేరింది.
- పుణెలో ఆఫీస్ వసతుల సరఫరా 26 శాతం తగ్గి 1.4 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉంది. ఇక్కడ ఆఫీస్ స్పేస్ లీజింగ్ 112 శాతం పెరిగి 2.33 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి చేరింది.
- ముంబైలో కొత్త సరఫరా 0.90 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉంది. స్థూల లీజింగ్ 2 శాతం తగ్గి 2.25 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉంది.
- చెన్నైలో తాజా ఆఫీసు వసతుల సరఫరా 58 శాతం తగ్గి 0.5 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా నమోదైంది. లీజింగ్ పరంగా పెద్ద మార్పు లేకుండా 2.01 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉంది.
- కోల్‌కతాలో గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్ విభాగంలో సెప్టెంబర్ క్వార్టర్‌లో తాజా సరఫరా లేదు. ఆఫీస్ స్పేస్ లీజింగ్ 45 శాతం తక్కువగా 0.11 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా నమోదైంది.
- బీఎఫ్ఎస్ఐ, ఫ్లెక్సిబుల్ స్పేస్ ఆపరేటర్లు ఆఫీస్ స్పేస్ డిమాండ్ కీలక చోదకాలుగా ఉన్నట్టు వెస్టియన్ తెలిపింది.

వేగంగా వృద్ధి చెందుతున్న భాగ్యనగరం

దేశవ్యాప్తంగా ఆరు ప్రముఖ నగరాల్లో వేగంగా వృద్ధి చెందుతున్న నగరంగా హైదరాబాద్‌కు మొదటి స్థానం దక్కింది. పరిపాలన, సామాజిక ఆర్థిక అంశాలు, రియల్ ఎస్టేట్, మౌలిక వసతుల ఆధారంగా నైట్‌ఫ్రాంక్ ఇండియా ఈ విషయాన్ని ప్రకటించింది. వివిధ వృద్ధి అంశాల ఆధారంగా ఆరు ప్రధాన నగరాల పనితీరును నైట్‌ఫ్రాంక్ విశ్లేషించింది. "వీటిల్లో హైదరాబాద్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతోంది. బలమైన మౌలిక వసతుల అభివృద్ధి, రియల్ ఎస్టేట్ డిమాండ్ పెరగడం, అల్ట్రా హెచ్ఎన్ఐలు(అధిక ధనవంతులు), హెచ్ఐఎన్‌ల జనాభా పెరుగుదల, చురుకైన విధానాలు సామాజిక ఆర్థిక పరపతిని పెంచుతున్నాయి" అని నైట్‌ఫ్రాంక్ నివేదిక పేర్కొంది. అద్భుతమైన నిపుణుల లభ్యత, వ్యాపార నిర్వహణకు ఉన్న అనుకూలతలతో బెంగళూరు అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న రెండో నగరంగా నిలిచింది. ముంబై ఎప్పటి మాదిరే అన్ని అంశాల్లో స్థిరమైన పురోగతి చూపించింది. దేశ ఆర్థిక రాజధాని హోదాను కాపాడుకుంది. విడిగా చూస్తే గొప్ప మౌలిక వసతులు, పరిపాలన పరంగా ఢిల్లీ ఎన్‌సీఆర్‌కు టాప్ ర్యాంక్ దక్కింది. సామాజిక ఆర్థిక అంశాల పరంగా బెంగళూరు ముందంజలో ఉంది. రియల్ ఎస్టేట్ వృద్ధి పరంగా హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది.

పీటీసీ ఇండస్ట్రీస్ లాభం రెట్టింపు

క్యూ2లో రూ. 17 కోట్లు



న్యూఢిల్లీ: ఇంజినీరింగ్ పరికరాల తయారీ కంపెనీ పీటీసీ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) రెండో త్రైమాసికంలో పటిష్ఠ ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం రెట్టింపై రూ. 17 కోట్లను అధిగమించింది. ఆదాయం బలపడటం ఇందుకు సహకరించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 8 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 34 శాతం ఎగసి రూ. 81 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 60 కోట్ల టర్నోవర్ సాధించింది. యూఎస్ఏలో ఆధునిక హాట్ రోలింగ్ మిల్‌ను కొనుగోలు చేయడంతో ఉత్పత్తి సామర్థ్యం మరింత మెరుగుపడినట్లు కంపెనీ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 5% లాభంతో రూ. 11,686 వద్ద ముగిసింది.

ఐఎస్‌బీ కొత్త లోగో..

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) తమ కొత్త లోగోను ఆవిష్కరించింది. ప్రసిద్ధ బ్రాండ్ కన్సల్టెన్సీ లాండర్ దీన్ని రూపొందించింది. సంస్థ వినూత్నమైన, పురోగామి ఆలోచనా విధానాలను ప్రతిబింబించేదిగా లోగో ఉందని డీన్ మదన్ పిల్లుట్ల తెలిపారు. అత్యుత్తమ ప్రమాణాలను నెలకొల్పే దిశగా తమ నిరంతర కృషిని ఇది ప్రతిఫలిస్తుందని పేర్కొన్నారు.

యాంపిన్ ఎనర్జీ, సీఐపీ 300 మిలియన్ డాలర్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: భారత్‌లో విస్తృతంగా పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు 300 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టే దిశగా కోపెన్‌హ్యాగెన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పార్ట్‌నర్స్‌తో (సీఐపీ) జట్టు కట్టినట్లు యాంపిన్ ఎనర్జీ ట్రాన్సిషన్ తెలిపింది. ఇరు సంస్థలు ఇప్పటికే రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులపై 200 మిలియన్ డాలర్లు సంయుక్తంగా ఇన్వెస్ట్ చేసేందుకు 2021లో ఒప్పందం కుదుర్చుకున్నాయి. దేశీయంగా పునరుత్పాదక విద్యుత్ పరివర్తనను వేగవంతం చేసేందుకు, నవకల్పనలను ప్రోత్సహించేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడగలదని యాంపిన్ ఎనర్జీ ట్రాన్సిషన్ వ్యవస్థాపకుడు పినాకి భట్టాచార్య తెలిపారు. యాంపిన్‌కి దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాల్లో 4 గిగావాట్ల పోర్ట్‌ఫోలియో ఉంది. పునరుత్పాదక విద్యుత్ రంగంలో పెట్టుబడులకు సంబంధించి అతి పెద్ద ఫండ్‌గా సీఐపీ కార్యకలాపాలు సాగిస్తోంది.

జెప్టో కేఫ్ సర్వీసుల విస్తరణ



న్యూఢిల్లీ: ప్రధాన నగరాల్లో కేఫ్ సేవలను విస్తరిస్తున్నట్టు క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ జెప్టో తెలిపింది. ముంబై, ఢిల్లీ, బెంగళూరు స్టోర్లలో 120కిపైగా కేఫ్‌లతో సర్వీసులు అందిస్తున్నట్టు వివరించింది. త్వరలో హైదరాబాద్, చెన్నై, పుణే నగరాలకు ఈ సేవలను విస్తరించనున్నట్టు వెల్లడించింది. అధిక నాణ్యత గల ఆహార తయారీ ప్రక్రియతో 10 నిమిషాల డెలివరీని సాధ్యం చేశామని, అందుకే బలమైన కస్టమర్ స్పందనను చూస్తున్నామని కంపెనీ తెలిపింది. బ్రూయింగ్ నైపుణ్యాలను ఉపయోగించే కాఫీ మెషీన్‌లతో సహా కేఫ్‌ల కోసం అత్యాధునిక పరికరాలను నిశితంగా పరిశోధించి, తమ బృందం సేకరించిందని వివరించింది. చాయ్, కాఫీ, అల్పాహారం, పేస్ట్రీస్, స్నాక్స్ వంటి 148 రకాల ఉత్పత్తులను 10 నిముషాల్లో కస్టమర్లకు డెలివరీ చేస్తామని తెలిపింది. కొత్త నగరాలకు విస్తరించడం, ప్రతి నెలా 100కుపైగా కొత్త కేఫ్‌లను ప్రారంభిస్తున్నందున వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి రూ.1,000 కోట్ల యాన్యువల్ రన్ రేట్ సాధిస్తామని జెప్టో సీఈవో ఆదిత్ పలీచా తెలిపారు.

ఒడిస్సీ ఎలక్ట్రిక్‌కు భారీ ఆర్డర్



ముంబై: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ కంపెనీ ఒడిస్సీ ఎలక్ట్రిక్ తాజాగా జీప్ ఎలక్ట్రిక్ నుంచి భారీ ఆర్డర్‌ను చేజిక్కించుకుంది. ఇందులో భాగంగా మూడేళ్ల కాలంలో 40,000 ఈవీలను సరఫరా చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఒడిస్సీలో జీప్ ఎలక్ట్రిక్ పెట్టుబడులు చేస్తోంది. తాజా డీల్‌తో బిజినెస్ టు బిజినెస్ విభాగంలో కంపెనీ మార్కెట్ విస్తరణకు, డీలర్ నెట్‌వర్క్ పెంచుకోవడానికి దోహదపడుతుందని ఒడిస్సీ ఎలక్ట్రిక్ తెలిపింది. జీప్ ఎలక్ట్రిక్ అద్దెకు ఎలక్ట్రిక్ ద్విచక్ర, త్రిచక్ర వాహనాలను ఆఫర్ చేస్తోంది.

నెట్‌వర్క్ మెరుగుపర్చిన వొడాఫోన్ ఐడియా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెలికం కంపెనీ వొడాఫోన్ ఐడియా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సర్కిల్‌లో ఇండోర్ నెట్‌వర్క్‌ను 20కిపైగా జిల్లాల్లో మెరుగుపర్చినట్టు తెలిపింది. 900 మెగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్‌తో 3,450కిపైగా టవర్లను అప్‌గ్రేడ్ చేసినట్లు వివరించింది. తద్వారా కస్టమర్లకు మెరుగైన నెట్‌వర్క్ లభిస్తుందని తెలిపింది. రూ.691 కోట్లతో 900 మెగాహెర్ట్జ్ బ్యాండ్‌లో 2.4 మెగాహెర్ట్జ్ కొనుగోలు చేసినట్టు వెల్లడించింది. 5,000లకుపైగా సైట్స్‌లో నెట్‌వర్క్ సామర్థ్యాన్ని రెట్టింపు చేయడానికి 2500 మెగాహెర్ట్జ్ బ్యాండ్‌లో స్పెక్ట్రమ్‌ను 10 మెగాహెర్ట్జ్ నుండి 20 మెగాహెర్ట్జ్‌కి అప్‌గ్రేడ్ చేసినట్టు తెలిపింది. తద్వారా వినియోగదార్లు వేగవంతమైన డేటాను అందుకోవచ్చని వివరించింది.

స్పైస్‌జెట్‌పై మరో రెండు దివాలా పిటీషన్లు



న్యూఢిల్లీ: విమానయాన సంస్థ స్పైస్‌జెట్‌పై మరో రెండు దివాలా పిటీషన్లు దాఖలయ్యాయి. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో (ఎన్‌సీఎల్‌టీ) సబర్మతి ఏవియేషన్, జెట్‌ఎయిర్17 సంస్థలు వీటిని దాఖలు చేశాయి. సబర్మతి పిటీషన్‌పై స్పైస్‌జెట్‌కు నోటీసులు జారీ చేసిన ఎన్‌సీఎల్‌టీ.. 27 మిలియన్ డాలర్ల క్లెయిమ్‌కు సంబంధించి అదనంగా మరిన్ని పత్రాలు సమర్పించాలని జెట్‌ఎయిర్17కి సూచించింది. ఐర్లాండ్‌కి చెందిన జెట్‌ఎయిర్17 .. విమాన ప్రయాణికుల రవాణాకు సంబంధించిన పరికరాలను లీజుకు అందిస్తుంది. తాము విల్మింగ్టన్ ట్రస్ట్ నుంచి విమానాలు లీజుకు తీసుకోగా, బాకీలు తీర్చాలని జెట్‌ఎయిర్17 కోరుతోందని స్పైస్‌జెట్ వాదించింది. విల్మింగ్టన్ ట్రస్ట్‌కి, జెట్‌ఎయిర్ 17కి మధ్య సంబంధంపై స్పష్టత లేదని పేర్కొంది. అయితే, స్పైస్‌జెట్ లీజును విల్మింగ్టన్ తమకు బదలాయించిందని, దానికి అనుగుణంగానే తాజాగా పిటీషన్ దాఖలు చేశామని జెట్‌ఎయిర్ 17 వివరించింది. స్పైస్‌జెట్‌పై ఇటీవల విల్లిస్ లీజ్, ఎయిర్ క్యాజిల్ ఐర్లాండ్, విల్మింగ్టన్, సెలెస్టియల్ ఏవియేషన్ తదితర సంస్థలు దివాలా పిటీషన్లు వేసిన సంగతి తెలిసిందే. వీటిలో చాలా మటుకు పిటీషన్లు పెండింగ్‌లో ఉన్నాయి.

విదేశాల్లోనూ పేటీఎం యూపీఐ చెల్లింపులు

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా వివిధ దేశాలకు ప్రయాణించే తమ యూజర్లు .. యూపీఐ మాధ్యమంలో చెల్లింపులు జరిపే వెసులుబాటును ఆర్థిక సేవల సంస్థ పేటీఎం అందుబాటులోకి తెచ్చింది. యూఏఈ, సింగపూర్, ఫ్రాన్స్, మారిషస్, భూటాన్, నేపాల్‌లోని నిర్దిష్ట ప్రాంతాల్లో దీన్ని వినియోగించుకోవచ్చని పేటీఎం మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ (ఓసీఎల్) వెల్లడించింది. షాపింగ్, డైనింగ్ సహా వివిధ అవసరాలకు చెల్లింపుల కోసం ఈ ఫీచరు ఉపయోగపడగలదని పేర్కొంది. రానున్న హాలిడే సీజన్‌లో తమ యూజర్లు మరింత సౌకర్యవంతంగా విదేశీ ప్రయాణాలు చేసేందుకు ఇది సహాయకరంగా ఉంటుందని పేర్కొంది.

హైదరాబాద్‌లో ఇండిజీన్ కొత్త సెంటర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లైఫ్ సైన్సెస్ కమర్షియలైజేషన్ కంపెనీ ఇండిజీన్ తమ అంతర్జాతీయ డెలివరీ కార్యకలాపాలను పటిష్టం చేసుకుంటోంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో కొత్త సెంటర్‌ను ప్రారంభించింది. నూతన ఉత్పత్తులను ఆవిష్కరించడం, కొత్త పరిస్థితులకు అనుగుణంగా మారడానికి సంబంధించి ఫార్మా పరిశ్రమపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో వాటికి సహాయం అందించడంలో ఈ సెంటర్ కీలక పాత్ర పోషించగలదని కంపెనీ తెలిపింది. ఉత్తర అమెరికా, యూరప్, ఆసియావ్యాప్తంగా తమకు 6 హబ్‌లు, 18 కార్యాలయాలు ఉన్నట్లు వివరించింది.

మారికో లక్ష్యం డబుల్ డిజిట్

- 2024-25 మిగిలిన కాలంపై ఆశాభావం
- ద్రవ్యోల్బణం దిగొస్తుందన్న అంచనా
- ప్రీమియం ఉత్పత్తుల వాటా పెంపుపై దృష్టి




న్యూఢిల్లీ: ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీ మారికో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయ ఆరు నెలల కాలానికి మెరుగైన వృద్ధిని అంచనా వేస్తోంది. అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది మార్చి మధ్య డబుల్ డిజిట్ వృద్ధి సాధిస్తామని, అధిక స్థాయిలో ఉన్న ద్రవ్యోల్బణం వచ్చే రెండు త్రైమాసికాల్లో మోస్తరు స్థాయికి దిగొస్తుందని అంచనా వేస్తున్నట్టు సంస్థ ఎండీ, సీఈవో సౌగత గుప్తా తెలిపారు. సఫోలా బ్రాండ్ ఉత్పత్తుల ధరలను మారికో ఇప్పటికే ఒక విడత పెంచింది. ముడి సరుకులైన పామాయిల్, కోకోవా, కాఫీ ధరలు పెరిగిపోవడంతో ఇతర ఎఫ్ఎంసీజీ కంపెనీలు సైతం ధరల పెంపు బాటలో వెళ్లొచ్చని తెలుస్తోంది. ఎఫ్ఎంసీజీ వ్యాప్తంగా ధరల పెరుగుదల ఉంటుందని సౌగత గుప్తా సంకేతం ఇచ్చారు. అయితే, బడా ఎఫ్ఎంసీజీ కంపెనీల్లో చాలా వరకు ముడి సరుకుల ధరల పెరుగుదలలో అధిక భాగాన్ని వ్యయ నియంత్రణ చర్యలతో సర్దుబాటు చేసుకోగలవన్నారు. ఈ సంస్థలు కొంత మేర ధరల పెంపును చేపట్టొచ్చన్నారు. అదే సమయంలో అమ్మకాల పరిమాణంలో వృద్ధికి తోడు, మార్కెట్ వాటా సంస్థలకు కీలకమని చెప్పారు. మరో ముడి సరుకు అయిన ముడిచమురు ధరలు సమీప కాలంలో అంతగా ఆటుపోట్లకు గురికాకపోవచ్చని గుప్తా అంచనా వేశారు.

సవాళ్లున్నా అధిగమిస్తాం..

"తయారీ వ్యయం విషయంలో సవాళ్లున్నాయి. దీంతో ఆదాయ వృద్ధితో పోల్చితే మార్జిన్లు కొంత బలహీనంగా ఉండొచ్చు. ఇప్పుడున్న అతిపెద్ద సవాలు ద్రవ్యోల్బణం. ఇది వచ్చే రెండు త్రైమాసికాల్లో శాంతిస్తుందని భావిస్తున్నాం. దీంతో పట్టణాల్లో వినియోగం కోలుకుంటుంది. అధిక ఆహార ధరలతో పట్టణ వినియోగంపై ప్రభావం పడింది" అని సౌగత గుప్తా వివరించారు. మారికో సెప్టెంబర్ త్రైమాసికంలో ఆదాయంలో 7.6 శాతం మేర, లాభంలో 20 శాతం చొప్పున వృద్ధిని చూపించడం గమనార్హం. ద్వితీయ ఆరు నెలల కాలంలో ఆదాయం రెండంకెల స్థాయిలో వృద్ధి చెందుతుందని నమ్మకంగా ఉన్నట్టు గుప్తా చెప్పారు. కనీస మద్దతు ధరలు, మంచి వర్షాలు, ప్రభుత్వ వ్యయాల అండతో గ్రామీణ వినియోగం పుంజుకుంటుందన్నారు. ప్రస్తుతం కొబ్బరి (కోప్రా) ధరలు ఎంతో అధికంగా ఉన్నాయని, అవి తగ్గుతాయన్న అంచనాతో ఉన్నట్టు తెలిపారు. కోప్రా ధరలు పెరిగినందున ప్యారాచూట్ ఆయిల్ ధరల సవరణపై ఎదురైన ప్రశ్నకు.. చారిత్రకంగా చూస్తే కొబ్బరి ధరలు గణనీయంగా పెరిగిన సమయంలో చిన్న సంస్థల కంటే తామే ద్రవ్యోల్బణాన్ని మెరుగ్గా అధిగమించినట్టు చెప్పారు. ప్రీమియం ఆహార ఉత్పత్తుల నుంచి ప్రస్తుతం 21% ఆదాయం వస్తుండగా, 30 శాతానికి చేరుతుందని ప్రకటించారు.

250 గిగావాట్లకు పునరుత్పాదక విద్యుదుత్పత్తి సామర్థ్యం

2026 నాటికి ఇక్రా అంచనా



న్యూఢిల్లీ: దేశీయంగా పునరుత్పాదక విద్యుదుత్పత్తి స్థాపిత సామర్థ్యాలు 2026 నాటికి 250 గిగావాట్ల స్థాయికి చేరవచ్చని అంచనా వేస్తున్నట్లు రేటింగ్ ఏజెన్సీ ఇక్రా వెల్లడించింది. రూఫ్‌టాప్ సోలార్ సెగ్మెంట్, కమర్షియల్.. ఇండస్ట్రియల్ (సీఅండ్ఐ) సెగ్మెంట్లు ఇందుకు గణనీయంగా దోహదపడగలవని పేర్కొంది. అయితే, స్థల సమీకరణలో జాప్యం, పంపిణీ కనెక్టివిటీపరమైన సమస్యలు మొదలైనవి ప్రాజెక్టుల అమలుకు సవాలుగా ఉంటున్నాయని ఇక్రా వివరించింది. ఇవి ఇలాగే కొనసాగితే పరిశ్రమ వృద్ధి అవకాశాలపై ప్రభావం పడుతుందని సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గిరీష్‌కుమార్ కదమ్ తెలిపారు. ప్రస్తుతం దేశీయంగా 2024 సెప్టెంబర్ నాటికి పునరుత్పాదక విద్యుదుత్పత్తి స్థాపిత సామర్థ్యం 201 గిగావాట్లుగా ఉంది. మరోవైపు, 2030 నాటికి దేశీయంగా ఎనర్జీ స్టోరేజ్ సామర్థ్య అవసరాలు 50 గిగావాట్ల స్థాయిలో ఉంటాయని ఇక్రా పేర్కొంది. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌లు, పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ప్రాజెక్టులు (పీఎస్‌పీ) వీటిని తీర్చగలవని వివరించింది.

జట్టుకు దూకుడు నేర్పిన సారథి... విదేశీ పిచ్‌లపై సైతం అలవోకగా పరుగులు చేయగల నేర్పరి... టెక్నిక్, టెంపర్‌మెంట్‌లో అతడికెవరూ రారు సాటి! కంగారూ గడ్డపై పరుగులు చేసేందుకు సహచరలంతా తీవ్రంగా తడబడుతుంటే... ఆసీస్ బౌలర్లను ఎలా ఎదుర్కోవాలో నిరూపించిన అసలు సిసలు నాయకుడు అతడు. అందుకే ప్రస్తుతం అతడు పెద్దగా ఫామ్‌లో లేకపోయినా... కీలక 'బోర్డర్–గావస్కర్' ట్రోఫీ సిరీస్‌కు ముందు ఎవరినోట విన్నా అతడి గురించే చర్చ. 'బాడీలైన్' బౌలింగ్‌తో ఇబ్బంది పట్టాలని ఒకరు... రెచ్చగొట్టకుండా వదిలేయాలని మరొకరు... ఇలా ఆస్ట్రేలియా మాజీ ఆటగాళ్లంతా తీవ్రంగా చర్చిస్తున్న ఆ ప్లేయర్ మరెవరో కాదు... టీమిండియా మాజీ సారథి విరాట్ కోహ్లి. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్‌కు గురైన టీమిండియా... ఆసీస్ పర్యటనలో ఆకట్టుకోవాలంటే అతడు రాణించాల్సిన అవసరం ఎంతో ఉంది!

–సాక్షి క్రీడా విభాగం



కోహ్లి 'కీ'లకం!

భారత స్టార్ బ్యాటర్‌పై భారీ అంచనాలు

అందరి దృష్టి విరాట్ ప్రదర్శనపైనే

ఆస్ట్రేలియా గడ్డపై ఆరోసారి టెస్టు సిరీస్ ఆడనున్న మాజీ కెప్టెన్

సుదీర్ఘ ఫార్మాట్‌ను అమితంగా ఇష్టపడే విరాట్ కోహ్లికి ఆస్ట్రేలియాపై మెరుగైన రికార్డు ఉంది. క్రీజులో కుదురుకుంటే మంచినీళ్ల ప్రాయంలా పరుగులు రాబట్టే విరాట్... ఆసీస్‌లో ఆసీస్‌పై అదరగొట్టాడు. కంగారూ గడ్డపై ఇప్పటి వరకు 13 టెస్టులు ఆడిన కోహ్లి 1352 పరుగులు చేశాడు. 54.08 సగటు నమోదు చేసిన విరాట్... 6 సెంచరీలు, 4 అర్ధశతకాలు కొట్టాడు. పేస్‌కు అనుకూలించే పిచ్‌లపై యాభైకి పైగా సగటుతో పరుగులు రాబట్టడం అంటే మామూలు విషయం కాదు. సుదీర్ఘ కాలంగా భారత జట్టులో కీలక సభ్యుడిగా సాగుతున్న విరాట్ తన కెరీర్‌లో దాదాపు చివరి ఆసీస్ పర్యటనకు సిద్ధమవుతున్నాడు. మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్న 'బోర్డర్–గావస్కర్' సిరీస్‌లో అందరి దృష్టి కోహ్లిపైనే నిలవనుంది. వ్యక్తిగత కారణాల వల్ల రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ తొలి టెస్టుకు అందుబాటులో లేకపోవడం... మరో యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ గాయంతో జట్టుకు దూరమవడం... గత పర్యటనలో అదరగొట్టిన సీనియర్ ప్లేయర్లు చతేశ్వర్ పుజారా, అజింక్యా రహానే ఇప్పుడు జట్టులోనే లేకపోవడం... ఇవన్నీ వెరసి విరాట్ కోహ్లి విలువను మరింత పెంచాయి. పెద్దగా అనుభవం లేని యశస్వి జైస్వాల్, ఇప్పటి వరకు అరంగేట్రమే చేయని అభిమన్యు ఈశ్వరన్, నిలకడ లోపించిన కేఎల్ రాహుల్, తొలిసారి ఆసీస్‌లో పర్యటిస్తున్న ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్ ఖాన్, దేవదత్ పడిక్కల్ వంటి వాళ్లతో కూడిన బ్యాటింగ్ లైనప్‌లో కోహ్లి ఒక్కడే శిఖరంలా కనిపిస్తున్నాడు. పరీక్ష పెట్టే పేస్ పిచ్‌లు, సవాలు విసిరే బౌన్సీ వికెట్‌లు స్వాగతం పలుకుతున్న సమయంలో టీమిండియా మెరుగైన ప్రదర్శన చేయాలంటే బ్యాటింగ్ దళాన్ని ముందుండి నడిపించాల్సిన బాధ్యత కోహ్లిదే.

ఫామ్ అందుకుంటాడా...

గత రెండు పర్యాయాలు ఆస్ట్రేలియా గడ్డపై అద్వితీయ ప్రదర్శన కనబర్చిన టీమిండియా... 'బోర్డర్–గావస్కర్' సిరీస్‌ను ఒడిసి పట్టింది. ముచ్చటగా మూడోసారి అదే జోరు కొనసాగాలంటే బ్యాటింగ్ బలగం రాణించాల్సిన అవసరముంది. అయితే సహనానికి పరీక్ష పెట్టే ఆసీస్ పిచ్‌లపై మెరుగైన ప్రదర్శన చేయాలంటే మొక్కవోని దీక్ష ముఖ్యం. తాజాగా స్వదేశంలో న్యూజిలాండ్‌తో సిరీస్‌లో స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోయిన కోహ్లి... మూడు మ్యాచ్‌ల్లో కలిపి 100 పరుగులు కూడా చేయలేదు. మరి ఇలాంటి స్థితిలో పెద్దగా అనుభవం లేని బ్యాటింగ్ ఆర్డర్‌తో భారత జట్టు ప్రతిష్ఠాత్మక ట్రోఫీ నిలబెట్టుకోవాలంటే కోహ్లి సత్తా చాటాల్సిన అవసరముంది. భారత జట్టు వరుసగా మూడోసారి ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు అర్హత సాధించాలంటే టీమిండియా ఈ సిరీస్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఓడకుండా... 4–0తో ట్రోఫీ చేజిక్కించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మరి ఇది సాధ్యపడాలంటే కోహ్లి తనలోని అసలు సిసలు పోరాట యోధుడిని తట్టి లేపాల్సిన అవసరముంది. గతంతో ఫార్మాట్‌తో సంబంధం లేకుండా చెలరేగిపోయిన కోహ్లి... కొంతకాలంగా నెమ్మదించాడు. మునుపటి మెరుపులు మెరిపించ లేకపోతున్నాడు. ఈ ఏడాది 6 టెస్టులు ఆడిన కోహ్లి... అందులో 22.72 సగటుతో కేవలం 250 పరుగులు మాత్రమే చేశాడు. జట్టుకు అవసరమైన సమయంలో రాణిస్తాడనే నమ్మకం సాధించిన కోహ్లి... ఆసీస్ పర్యటనలో అదరగొట్టాలని అభిమానులు ఆశిస్తున్నారు.

కోహ్లిని వదిలేయండి: వాట్సన్

కీలక సిరీస్‌కు ముందు ఆస్ట్రేలియా ఆటగాళ్లకు... ఆ దేశ మాజీ ఓపెనర్ షేన్ వాట్సన్ కీలక సూచన చేశాడు. మైదానంలో కోహ్లి జోలికి వెళ్లకుండా ఉండటమే మంచిదని తమ ప్లేయర్లకు చెప్పాడు. రెచ్చగొడితే కోహ్లిలోని అత్యుత్తమ ఆటగాడు బయటకు వస్తాడని హితవు పలికాడు. 'విరాట్‌ను దగ్గర నుంచి గమనించా. అతడిలో మెరుగైన ప్రదర్శన చేయాలనే కసి ఎక్కువ. అది లోలోపల ఎప్పుడూ రగులుతూనే ఉంటుంది. దాన్ని రెచ్చగొట్టి బయటకు తీయకపోవడమే మేలు. అందుకే ఆసీస్ ఆటగాళ్లు అతడిని వదిలేయాలి. లేకుంటే అతడు చాలా ప్రమాదకరం' అని వాట్సన్ అన్నాడు. ఇప్పటి వరకు ఐదుసార్లు ఆసీస్‌లో పర్యటించిన కోహ్లి...



2014–15 పర్యటనలో 86.50 సగటుతో 692 పరుగులు చేశాడు. 'ఆసీస్‌లో అతడు ఎలాంటి ప్రదర్శన కనబర్చాడో అందరికీ తెలుసు. అత్యుత్తమ స్థాయిలో ఉన్నప్పుడు అతడు ప్రతి బంతిని మెరుగ్గా అర్థం చేసుకుంటాడు. అది జరగకుండా ఉండాలనే కోరుకుంటున్నా' అని వాట్సన్ అన్నాడు.

కోహ్లికి బాడీలైన్ బౌలింగ్ చేయాలి: హీలీ



భారత ప్రధాన ఆటగాడు కోహ్లిని అడ్డుకోవాలంటే బాడీలైన్ బౌలింగ్‌తో ఇబ్బంది పెట్టాలని ఆసీస్ ఆటగాళ్లకు ఆ దేశ మాజీ ప్లేయర్ ఇయాన్ హీలీ సూచించాడు. పదే పదే ముందరి ప్యాడ్‌ను లక్ష్యంగా చేసుకొని బంతులేయడం ద్వారా అతడిని బ్యాక్‌ఫుట్‌కు పరిమితం చేసి త్వరగా అవుట్ చేయవచ్చని సూచించాడు. 'తొలి టెస్టులో ఆస్ట్రేలియా పేసర్లు కోహ్లికి ఎలా బౌలింగ్ చేస్తారో చూసేందుకు ఆసక్తిగా చూస్తున్నా. క్రీజులో కోహ్లి మెరుగైన కాళ్ల కదలికలు కనబర్చితే అతడు త్వరగా కుదురుకుంటాడు. అందుకే ముందరి ప్యాడ్ లక్ష్యంగా ప్రయత్నించాలి. అప్పుడే అతడిని నియంత్రించవచ్చు. ఒకవేళ అది ఫలితాన్ని ఇవ్వకపోతే. బాడీలైన్ బౌలింగ్ చేయడం మంచిది' అని హీలీ ఆసీస్ పేసర్లకు హితవు పలికాడు.

విరాట్ ఒక చాంపియన్: లయన్



భారత సీనియర్ ప్లేయర్ విరాట్ కోహ్లిపై ఆస్ట్రేలియా స్పిన్నర్ నాథన్ లయన్ ప్రశంసలు కురిపించాడు. విరాట్ అసలు సిసలు చాంపియన్ అని అన్నాడు. గత 60 టెస్టు ఇన్నింగ్స్‌ల్లో కోహ్లి కేవలం 2 సెంచరీలు, 11 అర్ధశతకాలు మాత్రమే చేసినా... అతడిని తక్కువ అంచనా వేయడం లేదని లయన్ పేర్కొన్నాడు. 'ఫామ్‌లో ఉన్నాడా లేదా అనేది పక్కన పెడితే... అతడి రికార్డులు నమ్మశక్యం కానివి. అతడి పట్ల నాకు గౌరవం ఉంది. అతడిని అవుట్ చేయాలని తప్పక ప్రయత్నిస్తా. కానీ అది ఎంత కష్టమో నాకు తెలుసు. చాన్నాళ్లుగా మా మధ్య రసవత్తర సమరం జరుగుతుంది. కోహ్లి, స్మిత్ అత్యుత్తమ స్థాయి ఆటగాళ్లు' అని లయన్ అన్నాడు.

'డబ్బు కోసం ఢిల్లీని వీడలేదు'

గావస్కర్ విశ్లేషణను కొట్టిపారేసిన పంత్



న్యూఢిల్లీ: రిషభ్ పంత్‌కు సరైన రిటెన్షన్ ఫీజు చెల్లించకపోవడం వల్లే అతను ఢిల్లీ క్యాపిటల్స్‌ను వీడి ఉంటాడనే భారత దిగ్గజం సునీల్ గావస్కర్ విశ్లేషణను పంత్ కొట్టిపారేశాడు. ఢిల్లీతో కొనసాగకపోవడానికి డబ్బు మాత్రం కారణం కానే కాదని పంత్ 'ఎక్స్'లో ట్వీట్ చేశాడు. ఘోర కారు ప్రమాదం నుంచి బయటపడ్డాక పంత్ ఈ ఏడాది జరిగిన ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా రాణించాడు. అయితే ఢిల్లీ అతన్ని వదిలేయగా మెగా వేలానికి అందుబాటులోకి రావడంతో ఫ్రాంచైజీలన్నీ అతనిపై కన్నేశాయి. దీనిపై ఓ క్రీడా చానెల్ నిర్వహించిన చర్చా కార్యక్రమంలో పాల్గొన్న సన్నీ మాట్లాడుతూ రిషభ్ పంత్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ తిరిగి తీసుకునే అవకాశముందని సూచనప్రాయంగా వెల్లడించాడు. 'ఆటగాళ్ల వేలం ప్రక్రియ పూర్తిగా భిన్నమైంది. అది ఎలా సాగుతుందో ఎవరూ చెప్పలేరు. ఊహించలేరు. కానీ నా అంచనా ప్రకారం పంత్‌ను ఢిల్లీ మళ్లీ తమ జట్టులోకి తీసుకోవచ్చు. ఆటగాళ్ల రిటెన్షన్ అనేది సదరు ప్లేయర్‌కు, ఫ్రాంచైజీ యాజమాన్యానికి సంబంధించిన వ్యవహారం. తాను ఆశించినంత ధర రాకపోతే ఆ ఆటగాడు... తాము చెల్లించే ధరకు ఆడకపోతే ఫ్రాంచైజీ నిర్ణయాలకు విభేదించే జట్లను వీడతారు. పంత్ విషయంలోనూ ఇదే జరిగి ఉంటుందని నేను భావిస్తున్నా. రిటెన్షన్ కుదరకపోయినా... పంత్‌లాంటి కెప్టెన్ అవసరం ఢిల్లీకే ఉంది. అతను లేకపోతే ఫ్రాంచైజీ కొత్త కెప్టెన్ వేటలో పడాలి. నా అంచనా ప్రకారం ఢిల్లీ కచ్చితంగా పంత్‌ను తీసుకుంటుంది' అని గావస్కర్ అభిప్రాయపడ్డారు. దీనిపై స్పందించిన పంత్ 'ఎక్స్' వేదికగా తిరస్కరించాడు. ఢిల్లీతో పాటు కోల్‌కతా, లక్నో జట్లు కూడా తమతమ కెప్టెన్లు శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్‌లను విడుదల చేశాయి. ఈ ముగ్గురు రూ.2 కోట్ల ప్రాథమిక ధరతో వేలానికి వచ్చారు.

ప్రిక్వార్టర్ ఫైనల్లో సిక్కి–సుమీత్ రెడ్డి జోడీ

ప్రపంచ 15వ ర్యాంకర్ బీవెన్ జాంగ్‌పై అనుపమ సంచలన విజయం ● తొలి రౌండ్‌లోనే ఓడిన ప్రియాన్షు, ఆకర్షి





షెన్‌జెన్: చైనా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీలో తొలి రోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో భారత నంబర్‌వన్ జోడీ, తెలంగాణకు చెందిన సిక్కి రెడ్డి–సుమీత్ రెడ్డి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. పురుషుల సింగిల్స్‌లో ప్రియాన్షు రజావత్, మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. అయితే మహిళల సింగిల్స్‌లోనే భారత రైజింగ్ స్టార్ అనుపమ ఉపాధ్యాయ్ సంచలనం సృష్టించింది. ప్రపంచ 15వ ర్యాంకర్ బీవెన్ జాంగ్ (అమెరికా)ను బోల్తా కొట్టించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది.

మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి–సుమీత్ ద్వయం 23–21, 17–21, 21–17తో ప్రెస్లీ స్మిత్–జెనీ గాయ్ (అమెరికా) జంటను ఓడించింది. 63 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సిక్కి–సుమీత్‌లకు గట్టిపోటీ ఎదురైంది. నిర్ణాయక మూడో గేమ్‌లో ఈ హైదరాబాద్ జోడీ 12–6తో ఆధిక్యంలోకి వెళ్లింది. చివరిదాకా ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని విజయాన్ని దక్కించుకుంది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 50వ ర్యాంకర్, ఉత్తరాఖండ్‌కు చెందిన అనుపమ 21–17, 8–21, 22–20తో బీవెన్ జాంగ్‌పై సంచలన విజయం సాధించింది. తద్వారా తన కెరీర్‌లో తొలిసారి సూపర్–750 టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. మరో మ్యాచ్‌లో ఆకర్షి కశ్యప్ 10–21, 18–21తో ప్రపంచ 14వ ర్యాంకర్ తొమోకా మియాజాకి (జపాన్) చేతిలో ఓడిపోయింది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రియాన్షు 24–22, 13–21, 18–21తో చికో ఔరా ద్వి వర్డోయో (ఇండోనేసియా) చేతిలో పోరాడి ఓడిపోయాడు.

నేడు జరిగే మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో బుసానన్ (థాయ్‌లాండ్)తో పీవీ సింధు; లైన్ హొమార్క్ జార్స్‌ఫెల్ట్ (డెన్మార్క్)తో మాళవిక ఆడతారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో లీ జె హుయ్–యాంగ్ పో సువాన్ (చైనీస్ తైపీ) జంటతో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీ తలపడుతుంది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో హలింగ్ ఫాంగ్–జెంగ్ యు చియె (చైనీస్ తైపీ) జోడీతో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ జంట ఆడుతుంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో లీ జి జియా (మలేసియా)తో లక్ష్య సేన్ తలపడతాడు.



నాదల్ ఓటమి

మలాగ (స్పెయిన్): కెరీర్‌లో చివరిసారి టెన్నిస్ కోర్టులో అడుగు పెడుతున్న స్పెయిన్ దిగ్గజం రాఫెల్ నాదల్‌కు ఓటమి ఎదురైంది. డేవిస్‌కప్ ఫైనల్స్ టోర్నీలో భాగంగా నెదర్లాండ్స్ జట్టుతో మంగళవారం మొదలైన క్వార్టర్ ఫైనల్ తొలి మ్యాచ్‌లో నాదల్ బరిలోకి దిగాడు. ప్రపంచ 80వ ర్యాంకర్ బొటిక్ వాన్ డె జాండ్‌షుల్ప్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 38 ఏళ్ల నాదల్ 4–6, 4–6తో ఓడిపోయాడు. ఒక గంట 52 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నాదల్ రెండు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయాడు. 'బెస్ట్ ఆఫ్ త్రీ' పద్ధతిలో జరుగుతున్న క్వార్టర్ ఫైనల్లో రెండో సింగిల్స్‌లో టాలన్ గ్రీక్‌స్పూర్ (నెదర్లాండ్స్)తో ప్రపంచ మూడో ర్యాంకర్ అల్‌కరాజ్ (స్పెయిన్) తలపడతాడు. అల్‌కరాజ్ ఈ మ్యాచ్‌లో గెలిస్తే స్కోరు 1–1తో సమమవుతుంది. నిర్ణాయక డబుల్స్ మ్యాచ్‌లో నెగ్గిన జట్టు సెమీఫైనల్ చేరుకుంటుంది.

షఫాలీ వర్మపై వేటు

వన్డే జట్టులో దక్కని చోటు ● ఆస్ట్రేలియా పర్యటనకు భారత మహిళల జట్టు ప్రకటన

న్యూఢిల్లీ: భారత మహిళల క్రికెట్ జట్టు ఓపెనర్ షఫాలీ వర్మకు చుక్కెదురైంది. వచ్చే నెలలో ఆస్ట్రేలియా పర్యటన కోసం ఎంపిక చేసిన భారత జట్టులో ఈ యువ ఓపెనర్ చోటు కోల్పోయింది. గత కొంత కాలంగా వన్డేల్లో పేలవ ప్రదర్శన చేస్తున్న షఫాలీ వర్మను సెలెక్టర్లు ఆసీస్‌తో సిరీస్‌కు ఎంపిక చేయలేదు. బ్రిస్బేన్, పెర్త్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య డిసెంబర్ 5, 8, 11వ తేదీల్లో మూడు వన్డేలు జరుగుతాయి. ఈ సిరీస్ కోసం బీసీసీఐ సెలెక్షన్ కమిటీ మంగళవారం 16 మందితో కూడిన జట్టును ప్రకటించింది. ఈ జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యం వహించనుండగా... స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. ఈ ఏడాది ఇప్పటి వరకు 6 వన్డేలు ఆడిన 20 ఏళ్ల షఫాలీ 108 పరుగులు మాత్రమే చేయడంతో ఆమెను కీలక పర్యటనకు ఎంపిక చేయలేదు. ఇటీవల న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ ఆడిన ప్లేయర్లలో ఉమ ఛెత్రీ, దయాళన్ హేమలత, శ్రేయాంక పాటిల్, సయాలీ కూడా ఆసీస్ పర్యటనకు ఎంపిక కాలేదు. ఆ సిరీస్‌లో లేని వాళ్లలో హర్లీన్ డియోల్, రిచా ఘోష్, మిన్ను మణి, టిటాస్ సాధు, ప్రియా పూనియా తిరిగి జట్టులోకి వచ్చారు. హైదరాబాద్ బౌలర్ అరుంధతి రెడ్డి జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకుంది.



భారత మహిళల జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, ప్రియా పూనియా, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, యస్తిక భాటియా, రిచా ఘోష్, తేజల్ హసబ్నిస్, దీప్తి శర్మ, మిన్ను మణి, ప్రియా మిశ్రా, రాధా యాదవ్, టిటాస్ సాధు, అరుంధతి రెడ్డి, రేణుక సింగ్, సైమా ఠాకూర్.

భారీ వర్షంతో శ్రీలంక, న్యూజిలాండ్ ఆఖరి వన్డే రద్దు

పల్లెకెలె: కనీసం ఆఖరి పోరులో గెలిచి, విజయానందంతో స్వదేశానికి వెళ్దామనుకున్న న్యూజిలాండ్ ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. దీంతో చివరిదైన మూడో వన్డే రద్దవగా... ఇదివరకే సిరీస్‌ను కైవసం చేసుకున్న ఆతిథ్య శ్రీలంక 2–0తో ముగించింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ వర్షంతో ఆట నిలిచే సమయానికి 21 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి 112 పరుగులు చేసింది. ఓపెనర్ విల్ యంగ్ (68 బంతుల్లో 56 నాటౌట్; 8 ఫోర్లు), వన్‌డౌన్ బ్యాటర్ హెన్రీ నికోల్స్ (51 బంతుల్లో 46 నాటౌట్; 4 ఫోర్లు) రాణించారు. మిడాఫ్‌లో కెప్టెన్ అసలంక కళ్లు చెదిరే క్యాచ్‌కు ఓపెనర్ టిమ్ రాబిన్సన్ (9) అవుటయ్యాడు. తర్వాత యంగ్, నికోల్స్ అబేధ్యమైన రెండో వికెట్‌కు 88 పరుగులు జోడించారు. రెండు విడతలుగా లంకలో పర్యటించిన కివీస్ మొదట రెండు టెస్టుల సిరీస్‌ను 0–2తో కోల్పోయింది. తర్వాత భారత్ పర్యటనలో ఆతిథ్య జట్టును వైట్‌వాష్ చేసింది. ఇక్కడి నుంచి మళ్లీ లంకకు వెళ్లిన న్యూజిలాండ్ రెండు టి20ల సిరీస్‌ను 1–1తో సమం చేసుకుంది. మూడు వన్డేల సిరీస్‌ను 0–2తో కోల్పోయింది.



పట్నా ఫటాఫట్

● బెంగళూరు బుల్స్‌పై ఘనవిజయం
● 16 పాయింట్లతో మెరిసిన దేవాంక్

నోయిడా: స్టార్ రెయిడర్లు దేవాంక్, అయాన్ విజృంభించడంతో ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో పట్నా పైరేట్స్ ఘనవిజయం సాధించింది. లీగ్‌లో భాగంగా మంగళవారం జరిగిన పోరులో పట్నా పైరేట్స్ 54–31 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌ను చిత్తు చేసింది. మ్యాచ్ ఆరంభం నుంచి పూర్తి ఆధిపత్యం కనబర్చిన పట్నా ప్రత్యర్థికి కోలుకునే అవకాశమే ఇవ్వలేదు. దేవాంక్ 16 పాయింట్లు, అయాన్ 12 పాయింట్లతో సత్తా చాటారు. బెంగళూరు బుల్స్ తరఫున అక్షిత్ ధుల్ (7 పాయింట్లు) కాస్త పోరాడాడు. స్టార్ రెయిడర్ ప్రదీప్ నర్వాల్ ఒక్క పాయింట్‌కే పరిమితమయ్యాడు. ఓవరాల్‌గా పట్నా 32 రెయిడ్ పాయింట్లు సాధిస్తే... బెంగళూరు జట్టు 13కే పరిమితమైంది. ప్రత్యర్థిని మూడుసార్లు ఆలౌట్ చేసిన పైరేట్స్... తాజా లీగ్‌లో ఏడో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఈ ఫలితంతో పాయింట్ల పట్టికలో పట్నా పైరేట్స్ మూడో స్థానానికి చేరింది. మరోవైపు బెంగళూరు బుల్స్ వరుసగా ఐదో పరాజయం మూటగట్టుకుంది. పుణేరి పల్టన్, యూపీ యోధాస్ మధ్య జరిగిన మరో మ్యాచ్ 29–29 పాయింట్లతో 'టై'గా ముగిసింది. యూపీ యోధాస్ తరఫున భవానీ రాజ్‌పుత్ 10 పాయింట్లు సాధించగా... పల్టన్ తరఫున పంకజ్ 9 పాయింట్లు సాధించాడు. లీగ్‌లో భాగంగా నేడు దబంగ్ ఢిల్లీతో గుజరాత్ జెయింట్స్ (రాత్రి 8 గంటలకు), యు ముంబాతో తెలుగు టైటాన్స్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.



దేవాంక్



ఉక్రెయిన్ పైకి శతఘ్నులతో దాడి చేస్తున్న రష్యా సైనికులు



శిథిలాలే మిగిలాయి.. ఉక్రెయిన్‌లో ఓ వృద్ధురాలి ఆవేదన

ఆ మహా విపత్తుకు... 1,000 రోజులు!

రావణకాష్టంలా రష్యా-ఉక్రెయిన్ యుద్ధం • ఉక్రెయిన్‌కు నాలుగో వంతు జన నష్టం

శరణార్థులుగా మారిన 60 లక్షల మంది • 2 లక్షల సైనికులను కోల్పోయిన రష్యా

ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి సోమవారంతో అక్షరాలా వెయ్యి రోజులు నిండాయి. ఎక్కడ చూసినా శిథిలమైన భవనాలు. వాటికింద నలిగి ముక్కలైన జ్ఞాపకాలు. కమ్ముకున్న బూడిద, పొగ చూరిన గ్రామాలు. లక్షల్లో ప్రాణనష్టం. లెక్కకు కూడా అందనంత ఆస్తి నష్టం. ఉక్రెయిన్ ఏకంగా నాలుగో వంతు జనాభాను కోల్పోయింది. వెరసి ఈ యుద్ధం 21వ శతాబ్దపు మహా విషాదంగా మారింది. నానాటికీ విస్తరిస్తున్న యుద్ధ మేఘాలు ప్రపంచ దేశాలన్నింటినీ భయపెడుతున్నాయి.

రావణకాష్టంలా...

2022 ఫిబ్రవరి 24. ఉక్రెయిన్‌పై రష్యా ఆకస్మికంగా దాడికి దిగిన రోజు. నాటినుంచి రావణకాష్టాన్ని తలపిస్తూ యుద్ధం కొనసాగుతూనే ఉంది. అంతులేని ప్రాణ, ఆస్తి నష్టాన్ని కలిగిస్తూనే ఉంది. ఇప్పటిదాకా కనీసం 80,000 మందికి పైగా ఉక్రెయిన్ సైనికులు మరణించినట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్ నివేదిక అంచనా వేసింది. మరో 400,000 మందికి పైగా గాయాపడ్డట్టు పేర్కొంది. రష్యా అయితే ఏకంగా 2 లక్షల మంది సైనికులను కోల్పోయిందని సమాచారం. లక్షలాది మంది గాయపడ్డారని చెబుతున్నారు. ఐరాస మానవ హక్కుల మిషన్ గణాంకాల ప్రకారం గత ఆగస్టు 31 నాటికి ఉక్రెయిన్‌లో 11,743 మంది సామాన్య పౌరులు మరణించారు. 24 వేల మందికి పైగా గాయపడ్డారు. అయితే వాస్తవ గణాంకాలు చాలా ఎక్కువగా ఉంటాయని ఐరాస అధికారులే అంటున్నారు. ఉక్రెయిన్‌లో జననాల రేటు కూడా రెండేళ్లగా మూడో వంతుకు పడిపోయింది. ఏకంగా 60 లక్షల మంది ఉక్రెయిన్‌వాసులు శరణార్థులుగా విదేశాల్లో తలదాచుకుంటున్నారు.

చిరకాలంగా రష్యా కన్ను

1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమయ్యే దాకా ఉక్రెయిన్ రష్యన్ సామ్రాజ్యంలో భాగంగానే ఉండేది. కనుక దాన్ని తిరిగి రష్యా సమాఖ్యలో విలీనం చేయడమే లక్ష్యమని ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఎన్నోసార్లు చెప్పారు. స్లావిక్, ఆర్థోడాక్స్ క్రైస్తవులైన ఉక్రెయిన్ ప్రజలు వాస్తవానికి రష్యన్లేనన్నది ఆయన వాదన. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైనందున యుద్ధానికి త్వరలో తెర పడవచ్చన్న ఆశలు కూడా అడియాసలే అయ్యేలా ఉన్నాయి. అమెరికా అనుమతితో రష్యాపై ఉక్రెయిన్ దీర్ఘశ్రేణి క్షిపణులతో దాడి చేయడంతో తాజాగా ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ట్రంప్ బాధ్యతలు స్వీకరించేందుకు ఇంకా రెండు నెలల గడువుంది. ఆలోగా పరిణామాలు మరింతగా విషమిస్తాయా? పరిణామాలు మూడో ప్రపంచ యుద్ధం దిశగా సాగుతాయా? ఇప్పుడు సర్వత్రా ఆందోళన రేకెత్తిస్తున్న ప్రశ్నలివి.



రష్యాతో యుద్ధంలో మరణించిన వారికి ఉక్రెయిన్ సైనికుడి నివాళి

ఆర్థిక వ్యవస్థ పతనం..

యుద్ధం దెబ్బకు ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థ దాదాపుగా పతనమైంది. 2023లో స్వల్పంగా పుంజుకున్నా, రాయిటర్స్, ప్రపంచ బ్యాంక్, యూరోపియన్ కమిషన్, ఐరాస, ఉక్రెయిన్ ప్రభుత్వ అంచనాల ప్రకారం యుద్ధ నష్టం 2023 చివరికే ఏకంగా 152 బిలియన్ డాలర్ల స్థాయికి చేరింది. రష్యా దాడుల్లో దేశ మౌలిక సదుపాయాలన్నీ నేలమట్టమయ్యాయి. విద్యుత్ తదితర రంగాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. పునర్నిర్మాణ, పునరుద్ధరణ పనులకు కనీసం 500 బిలియన్ డాలర్లు కావాలని ప్రపంచ బ్యాంకు, ఉక్రెయిన్ ప్రభుత్వం అంచనా వేశాయి. దీనిముందు పాశ్చాత్య దేశాల నుంచి అందిన 100 బిలియన్ డాలర్లకు పై చిలుకు ఆర్థిక సాయం ఏ మూలకూ చాలని పరిస్థితి. పైగా అందులో అత్యధిక మొత్తం యుద్ధ అవసరాలపైనే వెచ్చించాల్సి వస్తోంది. యుద్ధం వల్ల ఉక్రెయిన్‌కు సగటున రోజుకు 14 కోట్ల డాలర్ల చొప్పున నష్టం వాటిల్లుతున్నట్టు అంచనా. ఆహార ధాన్యాల ఎగుమతిదారుల్లో ఉక్రెయిన్ ముందు వరుసలో ఉంటుంది. యుద్ధం దెబ్బకు అక్కడి నుంచి ఎగుమతులు నిలిచిపోవడం అంతర్జాతీయంగా ఆహార సంక్షోభాన్ని తీవ్రతరం చేసింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

హాంకాంగ్ జాతీయ భద్రతా కేసులో సంచలన తీర్పు

- 45 మంది 'ప్రజాస్వామ్య' ఉద్యమకారులకు జైలు
- తీవ్రంగా ఖండించిన ప్రపంచ దేశాలు

హాంకాంగ్: పార్లమెంట్‌లో తమకు అనుకూలంగా వ్యవహరించే నేతల ఎంపిక కోసం అనధికారికంగా ప్రైమరీ ఎలక్షన్స్ చేపట్టి సమాంతర పార్లమెంటరీ వ్యవస్థ నిర్వహణకు తెగించారంటూ 45 మంది ప్రజాస్వామ్య ఉద్యమకారులు, మాజీ చట్టసభసభ్యులకు హాంకాంగ్ హైకోర్టు కఠిన శిక్షలు విధించింది. వీరికి నాలుగేళ్ల నుంచి పదేళ్ల శిక్షలుపడ్డాయి. పార్లమెంట్‌లో మెజారిటీ సభ్యులను తమ వైపునకు తిప్పుకుని ప్రభుత్వాన్ని నిర్వీర్యంచేయాలని కుట్రపన్నారని హైకోర్టు తన తీర్పులో పేర్కొంది. తదుపరి పార్లమెంట్ ఎన్నికల్లో గెలిస్తే విపక్షసభ్యులుగా ఉంటూ తర్వాత ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లను తిరస్కరిస్తూ వీటో చేసేందుకు వీరంతా కుట్రపన్నారని కోర్టు తీర్పులో ప్రస్తావించింది. 2020 జులై 10, 11వ తేదీల్లో జరిగిన ఈ అనధికార ప్రైమరీ ఎన్నికల్లో 6,10,000 ఓట్లు పోలయ్యాయి. అయితే ఆనాడు అధికార ఎన్నికలను ప్రభుత్వం కోవిడ్ మహమ్మారి విజృంభణ కారణంగా వాయిదా వేయడం తెల్సిందే. అయితే హాంకాంగ్ చరిత్రలోనే అతిపెద్ద జాతీయ భద్రతా కేసుగా పరిగణించబడిన ఈ కేసులో ఉద్యమకారులపై అన్యాయంగా శిక్షలు మోపారని ప్రపంచ దేశాలు ఖండించాయి. పరోక్షంగా చైనా ఏలుబడిలో ఉన్న హాంకాంగ్‌లో సమాంతర పాలనకు ప్రయత్నించారంటూ 2021 ఏడాదిలో 47 మంది ఉద్యమకారులను ప్రభుత్వం అరెస్ట్‌చేసింది. కఠిన జాతీయ భద్రతా చట్టం–2020 కింద కేసులు నమోదుచేసింది. ఈ చట్టం కింద దోషులుగా తేలితే గరిష్టంగా జీవిత ఖైదు పడే అవకాశముంది. 47 మందిలో గత ఏడాది ఇద్దరు నిందితులు నిర్దోషులుగా విడుదలయ్యారు. ఈ ఉదంతంలో సూత్రధారిగా కోర్టు పేర్కొన్న బెన్నీ థాయ్‌కు గరిష్టంగా పదేళ్ల జైలుశిక్షపడింది. మాజీ విద్యార్థి నాయకుడు జోషువా వాంగ్, మాజీ చట్టసభ సభ్యులకూ వేర్వేరు శిక్షలు పడ్డాయి. అయితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్ర జరుగుతోందన్న విషయంపై తమకు కనీస అవగాహన కూడా లేదని కొందరు నిందితులు కోర్టులో చెప్పడంతో వారికి తక్కువ శిక్షలుపడ్డాయి. 2019లో ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలు, మీడియాపై కఠిన ఆంక్షలు, ఎన్నికల్లో సాధారణ ప్రజల భాగస్వామ్యాన్ని తగ్గించడం వంటి పరిణామాల తర్వాత ప్రజాస్వామ్య ఉద్యమకారులు ఆనాడు ఇలా అనధికార ప్రైమరీ ఎన్నికలు నిర్వహించారు. దీంతో హాంకాంగ్ ప్రభుత్వం కన్నెర్రజేసింది. బ్రిటిష్ వలస ప్రాంతంగా అభివృద్ధిచెందిన హాంకాంగ్‌పై పాలనాపగ్గాలు 1997లో చైనాకు దఖలుపడ్డాక హాంకాంగ్‌లో నిరంకుశ చట్టాలను డ్రాగన్‌దేశం అమలుచేస్తోందని ప్రపంచదేశాలు తప్పుపట్టడం విదితమే. ''హాంకాంగ్ ప్రాథమిక చట్టం ప్రకారం శాంతియుతంగా తమ నిరసన తెలుపుతున్న ఉద్యమకారులపై కక్షగట్టి ప్రభుత్వం కేసులు బనాయించి ఆగమేఘాల మీద తీర్పు వెలువరించి శిక్షించింది''అని హాంకాంగ్‌లోని అమెరికా కాన్సులేట్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఆస్ట్రేలియా, బ్రిటన్, ఐరోపా సమాఖ్యతోపాటు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, హ్యూమన్ రైట్స్ వాచ్ వంటి మానవహక్కుల పరిరక్షణా సంస్థలు తీర్పును తీవ్రంగా తప్పుబట్టాయి. అయితే తీర్పును చైనా స్వాగతించింది.

శాంతిస్థాపనకు చొరవ చూపాలి

మణిపూర్ ఉద్రిక్తతలను తగ్గించండి • రాష్ట్రపతికి ఖర్గే లేఖ



న్యూఢిల్లీ/ఇంఫాల్: మణిపూర్‌లో ఉద్రిక్త పరిస్థితులను అదుపులోకి తెచ్చేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నేరుగా జోక్యంచేసుకోవాలని, శాంతిస్థాపనకు కృషిచేయాలని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్రపతికి ఆయన లేఖ రాశారు. ''రాష్ట్రంలో శాంతిస్థాపనలో అటు కేంద్రప్రభుత్వం, ఇటు బీరెన్ నేతృత్వంలోని రాష్ట్రసర్కార్ విఫలమయ్యాయి. గత 18 నెలలుగా ఇక్కడి ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై నమ్మకం పోయింది. రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు మీరే స్వయంగా జోక్యం చేసుకుని ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణిగేలా చేయండి. ఇప్పటికే చిన్నారులు, మహిళలు, పసికందులుసహా 300 ప్రాణాలు గాల్లో కలిశాయి. ప్రాణాలు అరచేతపట్టుకుని లక్షకుపైగా అమాయక జనం వలసవెళ్లి శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. వీళ్ల వ్యథను ఎవరూ పట్టించుకోవట్లేరు. ప్రధాని మోదీ కనీసం ఒక్కసారి కూడా రాష్ట్రంలో పర్యటించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో అత్యున్నత రాజ్యాంగ పీఠంపై ఆసీనులైన మీరు రాజ్యాంగపరిరక్షణే ధ్యేయంగా మణిపూర్ పౌరుల రక్షణ కోసం స్వయంగా ఈ అంశంలో జోక్యంచేసుకోండి''అని లేఖలో ఖర్గే కోరారు.

బ్రాడ్‌బ్యాండ్ సేవల పునరుద్ధరణ

ఉద్రిక్తతల వేళ సామాజికమాధ్యమాల ద్వారా పుకార్లు వ్యాపించకుండా ఉండేందుకు గతంలో ఆపేసిన బ్రాడ్‌బ్యాండ్ సేవలను మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా పునరుద్ధరించింది. ''బ్రాడ్‌బ్యాండ్ సేవల నిలిపివేతతో సాధారణ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆరోగ్య, విద్యా సంస్థల కార్యకలాపాలకు తీవ్ర విఘాతం ఏర్పడుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని బ్రాడ్‌బ్యాండ్‌ను పునరుద్ధరిస్తున్నాం. కానీ వై-ఫై, హాట్‌స్పాట్ సేవలు ఉండవు. అలాగే మొబైల్ ఇంటర్నెట్ సేవలపై నిషేధం కొనసాగుతుంది'అని మణిపూర్ రాష్ట్ర హోం శాఖ కమిషనర్ అశోక్ చెప్పారు.

టీఎం కృష్ణకు ఇచ్చే అవార్డుకు ఎంఎస్ సుబ్బులక్ష్మి పేరు వాడొద్దు

మద్రాసు హైకోర్టు ఆదేశం

చెన్నై: ప్రముఖ గాయకుడు టీఎం కృష్ణకు ఇచ్చే అవార్డుకు కర్నాటక సంగీత విద్యాంసురాలు ఎం.ఎస్.సుబ్బులక్ష్మి పేరు వాడొద్దని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. సంగీత కళానిధి ఎం.ఎస్.సుబ్బులక్ష్మి అవార్డు పేరిట ఎలాంటి అవార్డును టీఎం కృష్ణకు బహుకరించకూడదని మద్రాస్ మ్యూజిక్ అకాడమీకి స్పష్టం చేసింది. సుబ్బలక్ష్మిపై కృష్ణ పలుమార్లు అగౌరవకరమైన వ్యాఖ్యలు చేశారని, చులకనగా మాట్లాడారని ఆమె మనుమడు వి.శ్రీనివాసన్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. సుబ్బులక్ష్మిపై తానెలాంటి అమర్యాదకర వ్యాఖ్యలు చేయలేదని, తన వ్యాఖ్యలను వక్రీకరించారని టీఎం కృష్ణ తన అఫిడవిట్‌లో కోర్టుకు తెలిపారు. తాను ఆమెను అభిమానిస్తానని చెప్పారు. తన పేరిట ఎలాంటి స్మారక అవార్డులు అందజేయకూడదని సుబ్బులక్ష్మి వీలునామా రాశారని, దీన్ని గౌరవించాలని జస్టిస్ జి.జయచంద్రన్ సూచించారు. ఆమె పేరిట కృష్ణకు అవార్డును అందజేయకూడదని ఆదేశించారు.

సమస్యల సుడిగుండంలో 'పేద' దేశాల చిన్నారులు

- కాలుష్యం, పోషకాహార లేమి, వాతావరణ మార్పుల బారిన 18 కోట్ల మంది పసిపాపలు
- వెల్లడించిన లాన్సెట్ జర్నల్ అధ్యయనం

న్యూఢిల్లీ: దిగువ, మధ్యాదాయ పేద దేశాల్లోని పసిపిల్లలు కష్టాల కడలిలో కొట్టుకుపోతున్నారని ఒక అధ్యయనం విస్తుపోయే వాస్తవాలను కళ్లకు కట్టింది. న్యూఢిల్లీలోని సెంటర్ ఫర్ క్రోనిక్ డిసీజ్ కంట్రోల్(సీసీడీసీ) పరిశోధకులతో కలిసి అంతర్జాతీయ అధ్యయనకారులు చేసిన ఒక విస్తృతస్థాయి పరిశోధన తాలూకు నివేదిక లాన్సెట్ జర్నల్‌లో ప్రచురితమైంది. పేద దేశాల్లో మూడు, నాలుగేళ్ల వయసు చిన్నారుల్లో నాలుగింట మూడొంతుల మందికి సరైన పోషణ లేదు. ఈ 18.2 కోట్ల మంది చిన్నారులు కాలుష్యం, పర్యావరణ మార్పులు, రసాయనాల ప్రభావానికి లోనుకావడం వంటి బారిన పడుతున్నారని, దీంతో వారి ఆరోగ్యవంతమైన ఎదుగుదల పెను ప్రమాదంలో పడిందని నివేదిక పేర్కొంది. పుట్టాక తొలి వేయి రోజుల కాలం అనేది చిన్నారి జీవితంలో ఎంతో విలువైంది. ఆ వేయి రోజుల్లో చిన్నారి స్వచ్ఛమైన వాతావరణంలో మంచి పోషకాహారంతో పెరిగితే తర్వాతి వేయి రోజుల జీవితం మెరుగ్గా ఉండటానికి వీలవుతుందనే ఇతివృత్తాన్ని ఆధారంగా చేసుకుని ఈ నివేదికను సిద్ధంచేశారు. దిగువ, మధ్యాదాయ దేశా(ఎల్‌ఎంఐసీఎస్)ల్లో మూడు, నాలుగేళ్ల వయసు చిన్నారుల్లో ప్రతి ముగ్గురిలో ఒక్కరు మాత్రమే సరైన పోషణ, విద్యాసంబంధ కార్యక్రమాల లబ్ది పొందగల్గుతున్నారని ఈ నివేదిక పేర్కొంది.

త్వరలో భారత్- చైనా విమాన సర్వీసులు!

చైనా విదేశాంగ మంత్రితో జైశంకర్ భేటీ

న్యూఢిల్లీ/బీజింగ్: భారత్- చైనాల మధ్య సంబంధాలు మెరుగుపడుతున్నాయి. త్వరలో భారత్- చైనాల మధ్య డైరెక్ట్ ఫ్లైట్‌లను పునరుద్ధరించే విషయమై భారత విదేశాంగ మంత్రి జైశంకర్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో చర్చించారు. బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో జీ20 సమావేశాల సందర్భంగా సోమవారం వీరిద్దరూ భేటీ అయ్యారు. వివాదాస్పద డెస్పాంగ్, డెమ్‌చోక్ సరిహద్దు ప్రాంతాల్లో బలగాల ఉపసంహరణ తర్వాత జరిగిన తొలి ఉన్నతస్థాయి సమావేశమిది. సరిహద్దుల్లో శాంతి నెలకొనడానికి బలగాల ఉపసంహరణ తోడ్పడిందని ఇరుపక్షాలు పేర్కొన్నాయి. 2020లో కోవిడ్ సమయంలో భారత్- చైనాల మధ్య నేరుగా విమానసర్వీసులు నిలిచిపోయాయి. తర్వాత కోవిడ్ ఆంక్షలను ఎత్తివేసినా.. నేరుగా నడిచే విమానసర్వీసుల పునరుద్ధరణ జరగలేదు.

స్మార్ట్‌ఫోన్‌లను వాడుతూ టెక్నాలజీపై కాస్తంత అవగాహన ఉన్న యువతీయువకులను సైతం సైబర్‌కేటుగాళ్లు మభ్యపెట్టి ఆన్‌లైన్‌లో కోట్ల రూపాయలు కొట్టేస్తున్న ఉదంతాలను రోజూ దినపత్రికల్లో చదువుతున్నాం, సామాజికమాధ్యమాల్లో చూస్తున్నాం. టెక్నాలజీపై పట్టున్న యువత పరిస్థితే ఇలా ఉంటే సాంకేతికత అప్‌డేట్స్ గురించి బొత్తిగా తెలియని వృద్ధుల పరిస్థితి చెప్పనక్కర్లేదు. వృద్ధులను ఏమార్చడం సైబర్‌బందిపోట్లకు వెన్నతో పెట్టిన విద్య. అలాంటి అమాయక బామ్మ ఒకరు తమతో మాట్లాడుతోందంటే సైబర్ నేరగాళ్లకు పండగే. ఓపిగ్గా ఆమె చెప్పేదంతా విని మెల్లిగా ఆమె బ్యాంక్ ఖాతాను ఖాళీచేద్దామని గోతికాడ నక్కల్లా వేచిచూస్తారు. వాళ్ల బలహీనతనే వినియోగదారుల బలంగా మార్చుతోంది బ్రిటిష్ టెలికం సంస్థ వర్జిన్ మీడియా ఓ2. తమ వినియోగదారులకు వచ్చే ఇలాంటి సైబర్ ఫోన్‌కాల్స్‌ను రెప్పపాటులో కనిపెట్టి వాటిని భరతం పట్టే పనిని బామ్మకు అప్పజెప్తామని కంపెనీ చెబుతోంది. అయితే ఈ బామ్మ నిజం బామ్మకాదు. కృత్రిమ మేథ సృష్టించిన ఆన్‌లైన్ బామ్మ. పేరు డైసీ. అచ్చం వృద్ధురాలి గొంతుతో మాట్లాడుతూ, తడబడుతూ, మధ్యమధ్యలో పొరబడుతూ, సోది చెప్తూ పాత సంగతులన్నీ ముందేసి సైబర్‌నేరగాళ్ల సమయాన్ని అంతా వృథా చేస్తుంది. కబుర్లు ఆపి ఆమె బ్యాంక్ ఖాతా, ఓటీపీ వివరాలు చెబుతుందేమో అని వేచిచూసే స్కామర్లకు చివరకు నిరాశే మిగుల్చుతుంది.

సైబర్ కేటుగాళ్ల పనిపట్టే ఏఐ బామ్మ



విసుగొచ్చేదాకా మాట్లాడించే కృత్రిమ మేధ చాట్‌బాట్

- మాటలతో మభ్యపెట్టి యూజర్ల డేటాను కాపాడే ప్లాన్
- కొత్తగా ఆవిష్కరించిన బ్రిటిష్ టెలికం కంపెనీ వర్జిన్ మీడియా ఓ2

ఎలా పనిచేస్తుంది?

వర్జిన్ మీడియా ఓ2 సంస్థకు చెందిన యూజర్లకు స్కామర్లు చేసే నకిలీ/స్పామ్ ఫోన్‌కాల్స్‌ను కృత్రిమమేథ చాట్ అయిన 'డైసీ'బామ్మ రెప్పపాటులో కనిపెడుతుంది. వెంటనే స్కామర్లతో యూజర్లకు బదులు ఈ బామ్మ మాట్లాడటం మొదలెడుతుంది. తమతో మాట్లాడేది నిజమైన బామ్మగా వాళ్లు పొరబడేలా చేస్తుంది. అవతలి వైపు నుంచి కేటుగాళ్లు మాట్లాడే మాటలను సెకన్లవ్యవధిలో అక్షరాల రూపంలోకి మార్చి ఆ మాటలకు సరైన సమాధానాలు చెబుతూ వేరే టాపిక్‌లోకి సంభాషణను మళ్లిస్తుంది. 'కస్టమ్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్'వంటి అధునాతన సాంకేతికతలను ఒడుపుగా వాడుకుంటూ అప్పటికప్పుడు కొత్తకొత్త రకం అంశాలను చెబుతూ సంభాషణను సాగదీస్తుంది. ఓటీపీ, బ్యాంక్ ఖాతా వివరాలు అడుగుతుంటే వాటికి సమాధానం చెప్పకుండా తాను పెంచుకున్న పిల్లి పిల్ల కేశసంపద గురించి, పిల్లి చేసే అల్లరి గురించి, తన కుటుంబసభ్యుల సంగతులు.. ఇలా అనవసరమైన అసందర్భమైన అంశాలపై సుదీర్ఘ చర్చలకు తెరలేపుతుంది. సోది కబుర్లు చెబుతూ అవతలి వైపు స్కామర్లు విసిగెత్తిపోయేలా చేస్తుంది. అయినాసరే బామ్మ మాటలగారడీలో స్కామర్లు పడకపోతే తప్పుడు చిరునామాలు, బ్యాంక్ ఖాతా వివరాలు కొద్దిగా మార్చేసి చెప్పి వారిని తికమక పెడుతుంది. ఓటీపీలోని నంబర్లను, క్రెడిట్, డెబిట్ కార్డు అంకెలను తప్పుగా చెబుతుంది. ఒకవేళ వీడియోకాల్ చేసినా అచ్చం నిజమైన బామ్మలా తెరమీద కనిపిస్తుంది. వెచ్చదనం కోసం ఉన్ని కోటు, పాతకాలం కళ్లజోడు, మెడలో ముత్యాలహారం, తెల్లని రింగురింగుల జుట్టుతో కనిపించి నిజమైన బ్రిటన్ బామ్మను మైమరిపిస్తుంది. యాసను సైతం ఆయా కేటుగాళ్ల యాసకు తగ్గట్లు మార్చుకుంటుంది. లండన్‌కు చెందిన వీసీసీపీ ఫెయిత్ అనే క్రియేటివ్ ఏజెన్సీ ఈ బామ్మ 'స్థానిక'గొంతును సిద్ధంచేసింది. తమ సంస్థలో పనిచేసే ఒక ఉద్యోగి బామ్మ నుంచి తీసుకున్న స్వర నమూనాలతో ఈ కృత్రిమ గొంతుకు తుదిరూపునిచ్చింది.

కేటుగాళ్ల సమాచారం పసిగట్టే పనిలో...

మన సమాచారం స్కామర్లకు చెప్పాల్సిందిపోయి స్కామర్ల సమాచారాన్నే ఏఐ బామ్మ సేకరించేందుకు ప్రయత్నిస్తుంది. సుదీర్ఘకాలంపాటు ఫోన్‌కాల్ ఆన్‌లైన్‌లో ఉండేలా చేయడం ద్వారా ఆ ఫోన్‌కాల్ ఎక్కడి నుంచి వచ్చిందనే వివరాలు తెల్సుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగం, నిఘా సంస్థలకు అవకాశం చిక్కుతుంది. ''ఎక్కువసేపు ఈ బామ్మతో ఛాటింగ్‌లో గడిపేలా చేయడంతో ఇతర యూజర్లకు ఫోన్‌చేసే సమయం నేరగాళ్లకు తగ్గిపోతుంది. స్కామర్లు తమ విలువైన కాలాన్ని, శ్రమను బామ్మ కారణంగా కోల్పోతారు. ఇతరులకు స్కామర్లు ఫోన్‌చేయడం తగ్గుతుంది కాబట్టి వాళ్లంతా స్కామర్ల చేతిలో బాధితులుగా మిగిలిపోయే ప్రమాదం తప్పినట్లే''అని వర్జిన్ మీడియా ఓ2 ఒక ప్రకటనలో పేర్కొంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

వాయునాణ్యత దారుణం

ఢిల్లీ రాజధానిగా అవసరమా: థరూర్

- కాంగ్రెస్ ఎంపీ పోస్టుతో కలకలం
- కృత్రిమ వర్షాలే శరణ్యం: ఆప్

న్యూఢిల్లీ: దేశ రాజధానిని కాలుష్యం భూతం వదలడం లేదు. దానికి తోడు మంగళవారం దట్టమైన పొగమంచు నగరాన్ని కమ్మేసింది. దాంతో గాలి నాణ్యత దారుణంగా పడిపోయింది. మంగళవారం కూడా ఏక్యూఐ 490, అంతకు మించి నమోదైంది. దాంతో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాజధాని ప్రాంతంలోని స్కూళ్లతో పాటు విశ్వవిద్యాలయాలు కూడా ఆన్‌లైన్ తరగతులు నిర్వహించనున్నాయి. ఇవి మంగళవారం దాకా కొనసాగుతాయని ప్రభుత్వం పేర్కొంది. ఢిల్లీలో ఇప్పటికే గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్–4 (గ్రేడ్–4) ఆంక్షలు అమల్లో ఉన్నాయి. తెలిపింది. పొగ మంచు కారణంగా 6 విమానాలు రద్దవగా 180 సర్వీసులు ఆలస్యమయ్యాయి. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ వ్యాఖ్యలతో ఢిల్లీ కాలుష్యం ఒక్కసారిగా రాజకీయ రంగు పులుముకుంది. ''భరించలేని కాలుష్యంతో ఢిల్లీ నానాటికీ వాసయోగ్యం కాకుండా పోతోంది. ప్రపంచంలోకెల్లా అత్యంత కలుషిత నగరంగా మారిపోయింది. ముఖ్యంగా నవంబర్ నుంచి జనవరి దాకా ఢిల్లీలో గాలి పీల్చే పరిస్థితే లేదు! ఇలాంటి నగరానికి ఇంకా దేశ రాజధానిగా కొనసాగే అర్హత ఉందా?''అంటూ మంగళవారం ఎక్స్‌లో ఆయన చేసిన పోస్టు కలకలం రేపుతోంది. దీనిపై నెటిజన్లలో జోరుగా చర్చ జరుగుతోంది. మెరుగైన వాతావరణ పరిస్థితులుండే హైదరాబాద్, లేదా చెన్నై వంటి దక్షిణాది నగరాలను రాజధానిగా చేయాలని పలువురు సూచిస్తున్నారు.

ప్రధాని జోక్యం చేసుకోవాలి: ఆప్

ఢిల్లీ వాయు కాలుష్యానికి తెర దించేందుకు కృత్రిమ వర్షాలే శరణ్యమని ఆప్ అభిప్రాయపడింది. ప్రధాని నరేంద్ర మోదీ చర్యలు అందుకు తీసుకోవాలంటూ ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి గోపాల్ రాయ్ మంగళవారం కేంద్రానికి లేఖ రాశారు. ''ఉత్తరాదిని పొగమంచు కప్పేసింది. దీన్ని వదిలించుకోవడానికి కృత్రిమ వర్షమే మార్గం. ఇది వైద్యపరమైన అత్యవసర పరిస్థితి. వెంటనే జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాల్సిన నైతిక బాధ్యత మోదీదే''అని పేర్కొన్నారు. దీనిపై ఇప్పటికి నాలుగు లేఖలు రాసినా కేంద్ర పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్ స్పందించడం లేదని రాయ్ విమర్శించారు.

బీజేపీ నిరసన, మాస్కుల పంపిణీ

ఢిల్లీలో కాలుష్య నియంత్రణలో ఆప్ సర్కారు విఫలమైందని బీజేపీ మండిపడింది. ఆ పార్టీ నేతలు నగరంలో పలు ప్రాంతాల్లో మాస్కులు పంపిణీ చేశారు. ''పంజాబ్ విచ్చలవిడిగా తగలబెడుతున్న పంట వ్యర్థాలే ఢిల్లీ కాలుష్యానికి ప్రధాన కారణం. అయినా పంజాబ్ ఆప్ సర్కారు తీరును ఆ పార్టీ చీఫ్ కేజ్రీవాల్, ఢిల్లీ సీఎం అతిశి సమర్థిస్తున్నారు''అని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్ దుయ్యబట్టారు.

సుప్రీంకోర్టు వర్చువల్ విచారణలు

న్యాయమూర్తులకు సూచించాం: సీజేఐ

వాయు కాలుష్య తీవ్రత దృష్ట్యా వీలైనంత వరకూ వర్చువల్ విచారణలను అనుమతించాల్సిందిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులందరినీ కోరినట్టు సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా వెల్లడించారు. మంగళవారం జస్టిస్ ఖన్నా ధర్మాసనం విచారణలు మొదలవుతూనే సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కపిల్ సిబల్ తదితరులు కాలుష్య తీవ్రతను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దాంతో సీజేఐ ఈ మేరకు వెల్లడించారు. ఢిల్లీలోని ఇతర కోర్టులు, ట్రిబ్యునళ్లకు కూడా ఈ మేరకు సూచించాలని లాయర్లతో పాటు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తదితరులు కూడా విజ్ఞప్తి చేశారు.

నైతికపర నియమావళి ఆధారంగా..



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

సామాజిక జీవనంలో వ్యక్తుల మధ్య పరస్పర అవగాహన, నమ్మకం, గౌరవం లాంటి వాటిని ఉదాత్తమైన మానవీయ పరిపక్వతా లక్షణాలుగా పేర్కొంటారు. సమాజం ద్వారానే వ్యక్తి అన్ని లక్షణాలను, స్వభావాలను అలవర్చుకుంటాడు. అదేవిధంగా సమాజం నుంచి అనేక ప్రయోజనాలు పొందుతాడు. దీనికి ప్రతిగా సమాజానికి సేవ, సహాయాన్ని అందించాల్సిన కనీస బాధ్యత ప్రతి వ్యక్తిపై ఉంది.

ప్రాథమిక విధులు

విధి అంటే ఒక వ్యక్తి ఇతరుల కోసం నిర్వర్తించాల్సిన పని లేదా బాధ్యత అని అర్థం. విధులు సమాజ వికాసానికి, దేశాభివృద్ధికి, సామాజిక స్పృహ కల్పించడానికి దోహదం చేస్తాయి. ఇవి దేశ ఐక్యత, సమగ్రతను పెంపొందిస్తాయి. ప్రాథమిక హక్కులనే ఫలాలు విధులుగా పరిపక్వం చెందినప్పుడే సమాజ జీవనం సాఫల్యం అవుతుంది.

విధులు – రకాలు: సాధారణంగా విధులను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. **అవి:**

ఎ) నైతిక విధులు

బి) చట్టబద్ధమైన విధులు

నైతిక విధులు అనేవి ప్రజల నైతిక విలువలు, సామాజిక స్పృహపై ఆధారపడి ఉంటాయి. **ఉదా:** పెద్దలను, ఉపాధ్యాయులను గౌరవించడం; అభాగ్యులను, విధివంచితులను ఆదుకోవడం.

చట్టబద్ధమైన విధులు సమాజంతో ఆమోదం పొంది, ప్రభుత్వం గుర్తించిన బాధ్యతలు. వీటిని ఉల్లంఘిస్తే శిక్షార్హులవుతారు.

ఉదా: ట్రాఫిక్ నియమాలు పాటించడం, పన్నులు సక్రమంగా చెల్లించడం.

భారత రాజ్యాంగం – ప్రాథమిక విధులు

ప్రతి పౌరుడు దేశం పట్ల, తన తోటి పౌరుల పట్ల కొన్ని కనీస బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది. వీటికి రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు. అందువల్ల వీటిని ప్రాథమిక విధులు అంటారు. వీటిని రష్యా రాజ్యాంగం నుంచి గ్రహించారు. మౌలిక రాజ్యాంగంలో ప్రాథమిక విధుల ప్రస్తావన లేదు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా సర్దార్ స్వరణ్ సింగ్ కమిటీ సిఫారసుల మేరకు ప్రాథమిక విధులను భారత రాజ్యాంగంలో పొందుపర్చారు. ప్రారంభంలో పది ప్రాథమిక విధులు ఉండేవి. 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా మరొక విధిని రాజ్యాంగంలో చేర్చడంతో వీటి సంఖ్య పదకొండుకు పెరిగింది. ప్రాథమిక విధులు 1977 జనవరి 3 నుంచి అమల్లోకి వచ్చాయి. అందువల్ల ఈ రోజును ప్రాథమిక విధుల దినోత్సవంగా పరిగణిస్తారు.

ప్రాథమిక విధులు – లక్షణాలు:

ప్రాథమిక విధులకు సంబంధించి కొన్ని ప్రత్యేక లక్షణాలున్నాయి. అవి..

- ప్రాథమిక విధులకు న్యాయ సంరక్షణ లేదు. ఇవి నేరుగా అమల్లోకి రావు. వీటి అమలు కోసం పార్లమెంట్ ప్రత్యేక చట్టాలు చేయాలి.
- ప్రాథమిక విధులు కేవలం పౌరులకు మాత్రమే వర్తిస్తాయి.
- కొన్ని ప్రాథమిక విధులు నైతికపరమైన బాధ్యతలు, మరికొన్ని పౌర బాధ్యతలు.
- కొన్ని ప్రాథమిక విధులను భారత సనాతన సంప్రదాయాలు, మత విలువలు, పురాణాల ఆధారంగా తీసుకున్నారు.

ప్రాథమిక విధులను భారత రాజ్యాంగంలోని 4-ఎ భాగంలో నిబంధన 51-ఎలో పొందుపర్చారు.

51-ఎ:

ఎ) రాజ్యాంగానికి కట్టుబడి ఉండి దాని ఆదర్శాలను, సంస్థలను, జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని గౌరవించాలి.

బి) జాతీయ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో ఉన్నత ఆదర్శాలను పాటించాలి.

సి) భారతదేశ సార్వభౌమత్వాన్ని, ఐక్యతను, సమగ్రతను పరిరక్షించాలి.

డి) దేశ రక్షణకు, జాతీయ సేవకు సదా సన్నద్ధంగా ఉండాలి.

ఇ) భారత ప్రజల మధ్య మత, భాష ప్రాంతీయ, వర్గ వైవిధ్యాలకు అతీతంగా సోదర భావాన్ని, స్ఫూర్తిని పెంపొందించాలి. స్త్రీల గౌరవాన్ని భంగపరిచేవాటిని త్యజించాలి.

ఎఫ్) భారత మిశ్రమ సంస్కృతి, ఔన్నత్యం, సంప్రదాయాలను గౌరవించి, పరిరక్షించాలి.

జి) అడవులు, సరస్సులు, నదులు, వన్య ప్రాణులు సహా ప్రకృతిలోని పరిసరాలను కాపాడాలి, అభివృద్ధి చేయాలి, జీవులపట్ల కారుణ్యాన్ని కలిగి ఉండాలి.

హెచ్) శాస్త్రీయ దృక్పథాన్ని, మానవ జిజ్ఞాసను, పరిశోధన, సంస్కరణ స్ఫూర్తిని పెంపొందించుకోవాలి.

ఐ) ప్రజల ఆస్తిని సంరక్షించాలి, హింసను ప్రేరేపించే చర్యల్లో పాల్గొనకూడదు.

జె) వ్యక్తిగత, సమష్టి చర్యల ద్వారా ప్రతి కార్యరంగంలోనూ అత్యున్నత స్థానాన్ని పొందడానికి కృషి చేయాలి. తద్వారా దేశ అత్యున్నత అభ్యుదయానికి తోడ్పడాలి.

కె) 6 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలకు విద్యావకాశాలను కల్పించే బాధ్యతను తల్లి/ తండ్రి లేదా సంరక్షకుడు నిర్వర్తించాలి.

ప్రాథమిక విధులు – సుప్రీంకోర్టు తీర్పులు

శ్యాం నారాయణ్ చాక్సీ Vs యూనియన్ ఆఫ్ ఇండియా

ఈ కేసులో జాతీయ పతాకాన్ని ప్రైవేట్ వ్యక్తుల ప్రచారం కోసం వినియోగించరాదని సుప్రీం కోర్టు పేర్కొంది.

బిజో మాన్యూవల్ Vs కేరళ (1986)

ఈ కేసులో సుప్రీం కోర్టు జాతీయ గీతాన్ని తప్పనిసరిగా ఆలపించాల్సిన అవసరం లేదని పేర్కొంది. జాతీయ గీతాలాపన అనేది మత విశ్వాసాలకు విరుద్ధమైతే ఈ విషయంలో మినహాయింపు ఉంటుంది. జాతీయ గీతాన్ని ఆలపించినప్పుడు మాత్రం అందరూ గౌరవ సూచకంగా నిలబడాలని పేర్కొంది.

అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ Vs స్టూడెంట్ యూనియన్ (2002)

ప్రాథమిక విధులను విస్మరించరాదని, అవి దేశ సమగ్రతకు, సామాజిక జీవనానికి ఆదర్శంగా ఉంటాయని ఈ కేసులో సుప్రీం కోర్టు పేర్కొంది.

డాక్టర్ దాశరథి Vs ఆంధ్రప్రదేశ్

ఈ కేసులో ఆస్థాన కవుల హోదా చెల్లదని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది.

గ్రామీణ వ్యాజ్యాల హక్కుల కేంద్రం Vs ఉత్తరప్రదేశ్ (1986)

పర్యావరణ పరిరక్షణలో ప్రాథమిక విధులను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది.

నవీన్ జిందాల్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (2004)

జాతీయ జెండాను ఎగురవేయడం భావ వ్యక్తీకరణ కిందకి వస్తుందని, పౌరులకు స్వేచ్ఛగా జెండా ఎగురవేసే హక్కు ఉంటుందని పేర్కొంది.

ప్రాథమిక విధులు – జస్టిస్ జె.ఎస్. వర్మ కమిటీ సూచనలు

1999లో నియమించిన వర్మ కమిటీ ప్రాథమిక విధులకు సంబంధించి కొన్ని సిఫారసులు చేసింది. అవి..

- జాతీయ పతాకం, జాతీయ గీతం, భారత రాజ్యాంగ పరిరక్షణకు, గౌరవానికి సంబంధించి 1971లో చేసిన చట్టం సరిపోతుందని పేర్కొంది. అదేవిధంగా భారత శిక్షాస్మృతిలో ఉన్న చట్టాల ద్వారా కొన్ని విధులను అమలు చేయవచ్చని చెప్పింది. ఉదాహరణకు..
  పౌర హక్కుల పరిరక్షణ చట్టం – 1955,
  ప్రజాప్రాతినిధ్య చట్టం – 1951,
  చట్టవ్యతిరేక కార్యకలాపాల చట్టం–1967,
  వన్యప్రాణి సంరక్షక చట్టం – 1972,
  అడవుల పరిరక్షణ చట్టం – 1980,
- ఏటా జనవరి 3ను ప్రాథమిక విధుల దినోత్సవంగా పాటించాలి.
- అన్ని విద్యా ప్రణాళికల్లో ప్రాథమిక విధులను పాఠ్యాంశంగా చేర్చాలి.
- అన్ని విద్యా సంస్థల్లో ఎన్‌సీసీలను తప్పక ప్రవేశపెట్టాలి.
- ప్రసార మాధ్యమాల ద్వారా ప్రాథమిక విధుల గురించి విస్తృత ప్రచారం కల్పించాలి.

విమర్శనాత్మక పరిశీలన

ప్రాథమిక విధులను రాజ్యాంగంలో చేర్చడంపై అనేక విమర్శలున్నాయి.

- దేశంలో భారత పౌరులు సహజంగా చట్ట విధేయులు, క్రమశిక్షణ ఉన్నవారు అయినప్పుడు వారి బాధ్యతలను ప్రత్యేకంగా గుర్తు చేయడం సమంజసం కాదని కొంతమంది అభిప్రాయం.
- అత్యంత ముఖ్యమైన విధులైన సక్రమంగా పన్నులు చెల్లించడం, కుటుంబ నియంత్రణ, ఎన్నికల్లో ఓటు వేయడం లాంటి వాటిని ప్రాథమిక విధుల్లో పొందుపరచలేదు.
- ఈ విధులు కేవలం నైతికపరమైన నియమావళిపైనే ఆధారపడి ఉన్నాయి. వీటిని పాటించకపోతే శిక్షించే ఆస్కారం లేదు.
- ప్రాథమిక విధుల్లో పేర్కొన్న కొన్ని పదాలకు స్పష్టత లేదు. **ఉదా:** శాస్త్రీయ దృక్పథం, మిశ్రమ సంస్కృతి, పరిశోధనా స్ఫూర్తి అనే పదాలకు నిర్దిష్ట అర్థాలు లేవు. వీటిని నాలుగో భాగంలో కాకుండా మూడో భాగంలోనే చేర్చి ఉండాల్సింది.
- సాధారణంగా ప్రాథమిక విధులు ప్రజాస్వామ్య రాజ్యాంగంలో అంతర్భాగంగా ఉండవు. నియంతృత్వ దేశాల రాజ్యాంగంలో మాత్రమే ఇవి ఉంటాయి.
- ఇవి చట్ట నిర్దేశానికి, ఆత్మ ప్రబోధానికి మధ్య వైవిధ్యాన్ని కలిగించవచ్చు.

ప్రాథమిక విధుల ప్రయోజనాలు

- ప్రాథమిక విధులకు న్యాయసంరక్షణ లేకపోయినా, కొన్ని లోపాలున్నా.. వీటిని రాజ్యాంగంలో చేర్చడం సమంజసమే. ఎందుకంటే విధులు లేకుండా హక్కులను మాత్రమే గుర్తిస్తే అది బాధ్యతారాహిత్యానికి దారితీస్తుంది. అదేవిధంగా హక్కులు లేని బాధ్యతలు బానిసత్వానికి ప్రతీక అవుతాయి. కాబట్టి హక్కులు, విధులు, పరస్పర పోషకాలు. అవి ఒకే నాణేనికి ఉన్న రెండు పార్శ్వాల లాంటివి.
- ప్రాథమిక విధులు కూడా ఆదేశిక సూత్రాల్లా ప్రభుత్వ విధానాలు, కార్యాచరణను ప్రభావితం చేస్తాయి.
- ఆచరణాత్మకమైనవి కాకపోయినా నిరంతరం పౌరుల నైతిక బాధ్యతలను గుర్తు చేస్తాయి.
- అనేక వైవిధ్యాలున్న భారతదేశంలో పౌరులు చిత్తశుద్ధితో విశాల దృక్పథంతో బాధ్యతాయుత పౌరులుగా దేశ ఐక్యతకు, సమగ్రతకు, కృషి చేసేలా దోహదపడతాయి.
- ప్రాథమిక విధులను, ప్రాథమిక హక్కులపై ఉన్న హేతుబద్ధమైన పరిమితులుగా పరిగణించవచ్చని 1992లో సుప్రీం కోర్టు అభిప్రాయపడింది.

ప్రముఖుల వ్యాఖ్యానాలు

ఆదేశిక సూత్రాల అమలు ప్రభుత్వ చిత్తశుద్ధిపై ఆధారపడి ఉన్న విధంగానే ప్రాథమిక విధుల అమలు అనేది వ్యక్తుల చిత్తశుద్ధిపై ఆధారపడి ఉంటుంది – **దుర్గాదాస్ బసు**

ప్రాథమిక విధులు కేవలం అలంకార పూర్వకమైనవి – **జస్టిస్ కె.వి. ముఖర్జీ**

హక్కులు, విధులనేవి ఒకే నాణేనికి ఉన్న పార్శ్వాలు (Two sides of a same coin) – **హెచ్.జె. లాస్కీ**

ప్రాథమిక విధులు అసంబద్ధంగా, గందరగోళంగా ఉన్నాయి – **నానీ పాల్కీవాలా**

మాదిరి ప్రశ్నలు

1. ప్రస్తుతం ఉన్న ప్రాథమిక విధులెన్ని?
   1) 8 2) 9 3) 10 4) 11
2. ఏ కమిటీ సూచనల మేరకు ప్రాథమిక విధులను రాజ్యాంగంలో చేర్చారు?
   1) రాజమన్నార్ 2) సర్కారియా
   3) స్వరణ్ సింగ్ కమిటీ
   4) బల్వంత్ రాయ్ కమిటీ
3. ప్రాథమిక విధులకు సంబంధించి కిందివాటిలో సరైన వాక్యం ఏది?
   1) ప్రాథమిక హక్కులతోపాటే వీటిని ప్రవేశ పెట్టారు
   2) ఆదేశిక సూత్రాల స్థానంలో వీటిని ప్రవేశ పెట్టారు
   3) వీటిని ప్రత్యేకంగా ప్రవేశపెట్టారు
   4) ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలతో కలిపి ప్రవేశ పెట్టారు

సమాధానాలు: 1) 4 2) 3 3) 3

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఎఫ్‌జీటీబీ, కోయంబత్తూర్‌లో 16 పోస్టులు

కోయంబత్తూర్‌లో ఐసీఎఫ్ఆర్ఈ-ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ జెనెటిక్స్ అండ్ ట్రీ బ్రీడింగ్ (ఐఎఫ్‌జీటీబీ) రెగ్యులర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 16.
- » **పోస్టుల వివరాలు:** మల్టీ టాస్కింగ్ స్టాఫ్(ఎంటీఎస్)-08, లోయర్ డివిజన్ క్లర్క్(ఎల్‌డీసీ)-01, టెక్నీషియన్(టీఈ) (ఫీల్డ్/ల్యాబ్)-03, టెక్నికల్ అసిస్టెంట్(టీఏ) (ఫీల్డ్/ల్యాబ్)-04.
- » **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 12వ తరగతి,10+2(సైన్స్), సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 30.11.2024 నాటికి ఎంటీఎస్/ఎల్‌డీసీ పోస్టులకు 18 నుంచి 27 ఏళ్లు, టీఈ పోస్టులకు 18 నుంచి 30 ఏళ్లు, టీఏ పోస్టులకు 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష/స్కిల్ టెస్ట్, సర్టిఫికేట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.11.2024.
- » **వెబ్‌సైట్:** https://ifgtb.icfre.gov.in

గెయిల్ న్యూఢిల్లీలో 14 చీఫ్ మేనేజర్ పోస్టులు

న్యూఢిల్లీలోని గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(గెయిల్) దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న గెయిల్ వర్క్ సెంటర్లు/యూనిట్‌లలో వివిధ విభాగాల్లో చీఫ్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 14.
- » **పోస్టుల వివరాలు:** చీఫ్ మేనేజర్(రెన్యూవబుల్ ఎనర్జీ)-04, చీఫ్ మేనేజర్(ఎకనామిస్ట్)-04, చీఫ్ మేనేజర్(లా)-01, చీఫ్ మేనేజర్(మెడికల్ సర్వీసెస్)-02, చీఫ్ మేనేజర్(హ్యూమన్ రిసోర్స్)-03.
- » **అర్హత:** పోస్టును అనుసరించి బీఈ, బీటెక్, ఎల్ఎల్‌బీ,ఎంబీబీఎస్, ఎండీ/డీఎన్‌బీ/పీజీ, పీజీ డిప్లొమా, ఎంబీఏ/ఎంఎస్‌డబ్ల్యూ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **గరిష్ఠ వయో పరిమితి:** 40 ఏళ్లు మించకూడదు.
- » **పే స్కేల్:** నెలకు రూ.90,000 నుంచి రూ.2,40,000.
- » **ఎంపిక విధానం:** గ్రూప్ డిస్కషన్, ప్రొఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, ఇంటర్వ్యూ, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, దరఖాస్తులకు చివరితేది:** 11.12.2024
- » **వెబ్‌సైట్:** https://gailonline.com

ధ్వని మార్పులను మొదటిసారి తెలిపినవారు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు (ఎస్ఏ, ఎస్జీటీ)

ఉపాధ్యాయ పోటీ పరీక్షలకు తెలుగు కంటెంట్‌లో 'ధ్వని పరిణామం – అర్థ పరిణామం' తప్పనిసరి అంశం. కాబట్టి అభ్యర్థులు వీటిపై ప్రత్యేక దృష్టిని సారించాలి. ఎస్.జి.టి, లాంగ్వేజ్ పండిట్ (తెలుగు) అభ్యర్థులతోపాటు గణితం, ఫిజిక్స్, బయాలజీ, సోషల్ స్టడీస్, ఇంగ్లిష్, తెలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు సిద్ధమయ్యే అభ్యర్థులు విధిగా ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి సంపాదకత్వంలో వెలువడిన 'తెలుగు భాషా చరిత్ర' గ్రంథాన్ని సేకరించుకొని చదివితే మంచి మార్కులు సాధించొచ్చు.

ధ్వని పరిణామం

భాషా పరిణామం

భాషా సంబంధమైన రెండు అంశాల్లో మొదటిది శబ్దం. అర్థం మారకుండా శబ్దరూపం మారొచ్చు. రెండోది అర్థం. శబ్దం మారకుండా అర్థం మారొచ్చు. వీటినే భాషా శాస్త్రజ్ఞులు రెండు విధాలుగా పేర్కొన్నారు. అవి..

1.ధ్వని పరిణామం

2.అర్థ పరిణామం

- భాషా పరిణామంలో చాలా ముఖ్యమైంది ధ్వని పరిణామం.
- భాషలోని ధ్వని మార్పులను మొట్టమొదటిసారి వివరంగా తెలిపినవారు – టాలెమీ (ఇటలీ)

ధ్వని పరిణామం– నిర్వచనం:

- ధ్వనుల స్థానకరణ ప్రయత్నాన్ని, ఉచ్చారణ విధానాన్ని తెలిపేది ధ్వని విజ్ఞానం.
- ఒక భాషలో ఉన్న ఒక ధ్వనులు తర్వాత కాలంలో మార్పు చెందడాన్ని ధ్వని పరిణామం అంటారు.
- భాషలోని పదాల్లో అర్థం స్థిరంగా ఉండి శబ్దం మారడాన్ని శబ్ద పరిణామం లేదా ధ్వని పరిణామం అంటారు.
- ధ్వని పరిణామాన్ని ఆంగ్లంలో Phonetic Change అంటారు.

ధ్వని పరిణామం – భేదాలు

1. **వర్ణ సమీకరణం:** సమీకరణం అంటే కూడిక. రెండు భిన్న వర్ణాలు కలిసి ఏకవర్ణంగా మారడాన్ని వర్ణ సమీకరణం అంటారు. ఇది రెండు రకాలు. అవి..

i.పూర్వ వర్ణ సమీకరణం:

ఉదా: గది+లు = గదులు
పది+లు = పదులు
ములికి+లు = ములుకులు
పలికి+లు= పలుకులు

ii.పర వర్ణ సమీకరణం:

ఉదా: గది+కు = గదికి
మది+కు = మదికి
వాని+కు = వానికి
నది+కు = నదికి

2. **వర్ణ విభేదం:** ఒకే ధ్వనిని గాబరా, తడబాటు వల్ల రెండుసార్లు ఉచ్చరించినప్పుడు ఒక ధ్వని స్థానంలో వేరొక ధ్వని రావడాన్ని వర్ణ విభేదం అంటారు. ఇది వర్ణ సమీకరణానికి వ్యతిరేకమైంది.

ఉదా: వచించు + ఇంచు = వచింపించు
ఆవులించు+ ఇంచు = ఆవులింపించు
చూచు + ఇంచు = చూపించు

3. **వర్ణ సమ్మేళనం:** అనేక వర్ణాలు కలిసి ఏకవర్ణంగా రూపొందడమే వర్ణ సమ్మేళనం. దీనినే వర్ణ సంయోగం, వర్ణ సంయోజనం అని కూడా అంటారు.

ఉదా:
ఱ, ర > ర: చెఱకు – చెరకు, ఱాయి – రాయి, ఱోలు – రోలు
ళ, ల > ల: ముళ్ – ముల్, కల్ – కల్
ణ, న > న: కణ్ – కన్ను, యాన్ – నేను

4. **వర్ణ వ్యత్యయం:** ఒక పదంలోని వర్ణాలు తారుమారు చెందడమే వర్ణ వ్యత్యయం. దీన్నే స్థాన పరివర్తనం, అక్షర విపర్యం అని కూడా అంటారు.

ఉదా:
నవ్వులాట – నవ్వుటాల
వారణాసి – వాణారసి
తమాషా – షాతమా
జగదొంగ – గజదొంగ
పారువం – పావురం
పలుచన – చలుపన
గమనించు – మంచుగని
మోటతోలాలి – తోటమోలాలి

5. **వర్ణాగమం:** సామ్యం వల్ల, ప్రామాణికం కాదనే భావంతో కొత్త వర్ణాలు.. పదాల్లో చేరడాన్ని వర్ణాగమం అంటారు. దీన్నే వర్ణాధిక్యం అని కూడా అంటారు. ఉచ్చారణలో ఏదో కొరత ఉన్నట్లు భావించడం వల్ల ఇలాంటి ఆధిక్యత ఏర్పడుతుంది.

ఉదా: కోలాటం – కోలాటకం, దొంగాటం– దొంగాటకం, నడిరేయి – నడికిరేయి, వేగుచుక్క – వేగురుచుక్క.

6. **వర్ణ లోపం:** ఒక పదం చివర వచ్చిన హల్లు, మరొక పదం మొదట వచ్చినప్పుడు, మొదటిది లోపించడాన్ని వర్ణ లోపం అంటారు. దీన్నే సవర్ణ లోపం, అక్షర లోపం, వర్ణ నాశనం, హల్లోపం అంటారు.

ఉదా:
నిప్పు + పుల్ల = నిప్పుల్ల
రెప్ప + పాటు = రెప్పాటు
కంచు + చెంబు = కంచెంబు
రెప్ప + పోటు = రెప్పోటు

7. **అజాదిత్వం:** కొన్ని హల్లులకు ముందు ఉచ్చారణలో అచ్చు చేర్చి పలకడాన్ని అజాదిత్వం అంటారు. దీన్నే స్వర ప్రారంభం అని కూడా పిలుస్తారు.

ఉదా:
రథం – అరదం
స్కేలు – ఇస్కేలు
స్కూలు – ఇస్కూలు
స్కూటరు – ఇస్కూటరు
హోళిగ – ఓళిగ

8. **స్వరభక్తి :** భిన్న హల్లుల మధ్య మరో వర్ణం చేరడాన్ని స్వరభక్తి అంటారు. దీన్ని విప్రకర్ష, వికర్ష అని కూడా వ్యవహరిస్తారు.

ఉదా:
తర్వాత – తరువాత
మర్యాద – మరియాద
రాత్రి – రాతిరి
పర్వము – పరువము
పల్చన – పలుచన
అల్పము – అలుపము
నిద్ర – నిద్దుర
కల్పము – కలుపము
లగ్నం – లగనము
చంద్రుడు – చందురుడు

9. **తాలవ్యీకరణం:** మూలద్రావిడ భాషలోని పదాది 'క' కారానికి తాలవ్యాచ్చులు పరమైనప్పుడు 'చ' వర్ణంగా మారుతుంది. ఇలా 'క' కారం 'చ' కారంగా మారడాన్ని తాలవ్యీకరణం అంటారు.

ఉదా:
కివి – చెవి, కిళి – చిలుక, కెంపు – చెంపు
కై – చేయి, కెందొవ – చెందొవ, కెఱయ్ – చెఱయ్.

10. **లోప దీర్ఘం:** ఉచ్చారణలో ఒక వర్ణం లోపించేటప్పుడు ఏర్పడిన లోపాన్ని పూరించడానికి పూర్వ స్వరం దీర్ఘమవుతుంది. దీన్నే లోప దీర్ఘం లేదా లోప దీర్ఘత అంటారు.

ఉదా: గుర్రములు – గుర్రాలు, చివుకు – చీకు, కంచములు – కంచాలు, వజ్రములు – వజ్రాలు, ముత్యములు – ముత్యాలు, బలపములు – బలపాలు.

11. **అనుచిత విభాగం:** పదాలను తప్పుగా విరిచి వ్యవహరించడాన్ని అనుచిత విభాగం అంటారు.

ఉదా:
కిళి + కళ్ = చిలుకలు (చిలుక +లు)
ఎళి + కళ్ = ఎలికలు (ఎలుక+లు)
ఈగలు, గొడుగులు, ఏనుగులు, కొల కులు, బల్లలు.

12. **ద్విత్వ కల్పనం:** కొన్ని పదాల్లో ద్విత్వం లేకపోయినా కల్పించి చెప్పడాన్ని ద్విత్వ కల్పనం అంటారు.

ఉదా:
తలక్రిందులు – తల్లక్రిందులు
పడిన – పడ్డ, కొనిన – కొన్న, కలదు –కద్దు, తలడిలు–తల్లడిల్లు, తలమునకలు – తల్లమునకలు, తెలవారు – తెల్లవారు, వలదు – వద్దు.

అర్థ పరిణామం

విపరిమాణం అంటే మార్పు. భాషలో వర్ణాలు, ధ్వనులు, వాక్య నిర్మాణం, వ్యాకరణ నిర్మాణం ఇలా ప్రతిదీ మారినట్లుగా అర్థాలు కూడా మారుతుంటాయి. ఇలా ఆయా పదాలకు సంబంధించిన అర్థాల్లో కాలక్రమంలో కలిగిన మార్పుల్నే అర్థ పరిణామం అని అంటారు. అర్థ బోధనను వివరించేది సెమాంటిక్స్ (Semantics).

అర్థ విపరిమాణం– నిర్వచనం:

1. పదజాలానికి సంబంధించిన అర్థంలో కలిగే మార్పు అర్థ పరిణామం.
   – **ఆచార్య జి.ఎన్.రెడ్డి**
2. భాష కాలక్రమాన మారుతుంది. కాబట్టి ఒక భాషలో కాలక్రమాన వర్ణాలు, వ్యాకరణ నిర్మాణం మారినట్టుగానే పదాల అర్థాలు కూడా మారతాయి. ఒక భాషలోని పదాల అర్థాల్లో వచ్చిన మార్పుని అర్థ పరిణామం అని అంటారు.
   – **ఆచార్య పి.ఎస్. సుబ్రహ్మణ్యం**

అర్థ పరిణామంపై ప్రముఖ భాషా శాస్త్రజ్ఞులు ఆచార్య జి.ఎన్.రెడ్డి చేసిన కృషి పలువురి ప్రశంసల్ని పొందింది. ఆయన A study of Telugu Semantics అనే అంశంపై పరిశోధన చేసి మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి 1964లో పి.హెచ్.డి డిగ్రీ పొందారు. ఇది గ్రంథరూపంలో 1966లో వచ్చింది. తెలుగు భాషలో అర్థ పరిణామంపై వచ్చిన మొట్టమొదట పరిశోధన గ్రంథం ఇదే.

అర్థ పరిణామం– రకాలు

1897లో ఫ్రెంచి భాషావేత్త మైఖేల్ బ్రెయిల్ 'La Semantique' అనే గ్రంథాన్ని ప్రచురించారు. ఇది అర్థ విజ్ఞానానికి సంబంధించిన మొట్టమొదటి గ్రంథం. ఈ గ్రంథంలో బ్రెయిల్ చెప్పిన అర్థ పరిణామ రీతుల్ని ఆధారంగా చేసుకుని తెలుగుభాషలో జరిగిన అర్థ పరిణామాలను భాషావేత్తలు స్థూలంగా వర్గీకరించారు. **అవి:**

1. **అర్థ వ్యాకోచం:** అర్థం వ్యాకోచం అవడమే అర్థ వ్యాకోచం. అంటే మొదట పరిమితార్థాన్ని తెలిపే ఒక పదం కాలక్రమంలో విస్తృతార్థాన్ని తెలిపినట్లయితే అది అర్థ వ్యాకోచం.

ఉదా:
1, చెంబు 2. నూనె
3. కమ్మ 4. ధర్మరాజు
5. భీముడు 6. నారదుడు
7. మహారాజు 8. రాక్షసుడు
9. అవధాని 10. గంగ
11. అష్టకష్టాలు 12. అష్టైశ్వర్యాలు
13. తైలం 14. గ్లాసు.

2. **అర్థ సంకోచం:** అర్థం సంకోచం చెందడమే అర్థ సంకోచం. అంటే విశాల అర్థాన్ని బోధించే ఒక పదం సంకుచితార్థాన్ని లేదా తక్కువ అర్థాన్ని బోధిస్తే అది అర్థ సంకోచం.

ఉదా:
1. చీర 2. కోక
3. మధు పర్కాలు 4. వస్తాదు
5. ఉద్యోగం 6. తద్దినం
7. ఆరాధ్యుడు 8. సంభావన
9. పెద్ద 10. వ్యవసాయం
11. మృగం 12. శ్రాద్ధం
13. సాంవత్సరీకం 14. నెయ్యి
15. సాహెబు 16. పత్రం

3. **అర్థ గౌరవం:** ప్రాచీన కాలంలో నిందార్థంలో వాడిన పదాలు, సామాన్య అర్థంలో వాడిన పదాలు కొన్ని నేడు గౌరవార్థాన్ని సంతరించుకున్నాయి. ఇలా మారడాన్ని అర్థ సౌమ్యత లేదా అర్థోత్కర్ష అంటారు.

ఉదా:
1. సభికులు 2. ముహూర్తం
3. మర్యాద 4. వైతాళికుడు
5. అదృష్టం 6. అంతస్తు

4. **అర్థ గ్రామ్యత:** జన వ్యవహారంలో ఉన్న మౌలిక అర్థానికి నష్టం కలిగి పరిహాసార్థంలో, నిందార్థంలో, నిమ్నార్థంలో పదం వాడితే దాన్ని అర్థ గ్రామ్యత అంటారు. పాత కాలంలోని అర్థం కంటే తర్వాత కాలంలో అర్థం నీచమైంది, చెడ్డది అయితే దాన్ని అర్థాపకర్ష అంటారు.

ఉదా:
1. కర్మ 2. ఛాందసుడు
3. వ్యంగ్యం 4. కంపు
5. సన్యాసి 6. స్వాహా
7. దేవదాసి 8. కళావంతులు
9. కైంకర్యం 10. అసహ్యం
11. సాని 12. విధవ
13. ముండ 14. గ్రహచారం
15. పూజ్యం 16. నిండుకొన్నవి
17. శనిగ్రహం 18. ఘటం

5. **సభ్యోక్తి :** సభలో, కొందరి సమక్షంలో, సంఘంలో, ప్రత్యక్షంగా వాచ్యం చేయడానికి వీలుకాని పదాల అర్థాన్ని పరోక్షంగా లేదా నూతన పదబంధ కల్పనతో తెలియజేసే విధానాన్ని సభ్యోక్తి అంటారు.

ఉదా: i. **చనిపోవు** : కాలధర్మం, కీర్తిశేషుడు, బాల్చితన్నాడు, శివైక్యం పొందాడు. స్వర్గస్థుడయ్యాడు, దివంగతుడయ్యాడు, దీర్ఘనిద్ర, నూకలు చెల్లాయి, పరమపదించాడు.

ii. **మూత్ర విసర్జన, మల విసర్జన:** ఒంటికి, రెంటికి, లఘుశంక, గురుశంక, దొడ్డికెళ్లు, చెరువుకెళ్లు, కాల్చకు పోవు, చెంబట్టికెళ్లు, బయటకుపోవు, బహిర్భూమికి పోవు.

iii. **మలం:** అశుద్ధం.

iv. **మల విసర్జన ప్రదేశం:** పాయిఖానా, దొడ్డి, మరుగుదొడ్డి.

v. **కడుపుతో ఉంది (గర్భవతి):** ఆవిడ ఉత్తి మనిషి కాదు, నెల తప్పింది.

6. **మృదూక్తి :** కఠిన భావాల్ని, దుఃఖస్ఫోరకమైన అభిప్రాయాన్ని మృదువైన రీతిలో చెప్పడమే మృదూక్తి.

ఉదా:
దీపం కొండెక్కింది– దీపం ఆరిపోయింది
సూత్రం పెరిగిపోయింది – తెగిపోయింది.
నల్లపూసలు పెరిగిపోయాయి – తెగిపోయాయి.

'లోక్‌తక్ హైడ్రో పవర్ ప్రాజెక్టు' ఏ రాష్ట్రంలో ఉంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సైన్స్ అండ్ టెక్నాలజీ

శక్తి వనరులు

1. కింది వాటిలో పునర్వినియోగ శక్తి వనరు ఏది?
ఎ) సౌరశక్తి బి) పవనశక్తి
సి) జలవిద్యుత్ డి) పైవన్నీ
2. దేశంలో మొదటి జియోథర్మల్ ప్లాంటును ఏ రాష్ట్రంలో ఏర్పాటు చేశారు?
ఎ) ఛత్తీస్‌గఢ్ బి) జమ్ము-కశ్మీర్
సి) ఉత్తరాఖండ్ డి) హిమాచల్ ప్రదేశ్
3. భారత్ ఏ దేశ సహకారంలో తమిళనాడులోని కుడంకుళంలో రియాక్టర్లను ఏర్పాటు చేసింది?
ఎ) ఫ్రాన్స్ బి) రష్యా
సి) అమెరికా డి) జపాన్
4. బగాసే కో జనరేషన్ పద్ధతిలో శక్తిని దేని నుంచి ఉత్పత్తి చేస్తారు?
ఎ) కలప బి) చెరకు పిప్పి
సి) పశువుల పేడ డి) రంపపు పొట్టు
5. పునర్వినియోగ శక్తి వనరుల ఉత్పాదనలో మొదటి స్థానంలో ఉన్న రాష్ట్రం?
ఎ) మహారాష్ట్ర బి) ఆంధ్రప్రదేశ్
సి) తెలంగాణ డి) తమిళనాడు
6. కేంద్ర శక్తి, పునర్వినియోగ శక్తి వనరుల శాఖా మంత్రి ఎవరు?
ఎ) జె.పి.నడ్డా
బి) ప్రహ్లాద్ జోషి
సి) వెంకయ్యనాయుడు
డి) హర్షవర్ధన్
7. దేశంలో బ్యాటరీ ఆధారంగా నడిచే మొదటి కారు ఏది?
ఎ) నానో బి) రెవా
సి) బోల్ట్ డి) ఏదీకాదు
8. ఏ రాష్ట్రంలో అత్యధిక సముద్ర తరంగశక్తి అందుబాటులో ఉంది?
ఎ) గుజరాత్ బి) తమిళనాడు
సి) గోవా డి) ఆంధ్రప్రదేశ్
9. సూర్యుడి కిరణశక్తి నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేసే టెక్నాలజీని ఏమంటారు?
ఎ) సోలార్ థర్మల్
బి) సోలార్ ఫొటోవోల్టాయిక్స్
సి) సోలార్ ట్రాన్స్‌ఫర్మేషన్
డి) సోలార్ ఎలక్ట్రిసిటీ
10. 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విండ్ ఎనర్జీ' ఎక్కడ ఉంది?
ఎ) హైదరాబాద్ బి) భోపాల్
సి) చెన్నై డి) కాన్పూర్
11. 'నేషనల్ సెంటర్ ఫర్ ఓల్టాయిక్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్' (ఎన్‌సీపీఆర్ఈ)ను ఏ ఐఐటీ వద్ద ఏర్పాటు చేశారు?
ఎ) ఐఐటీ – బాంబే
బి) ఐఐటీ – కాన్పూర్
సి) ఐఐటీ – చెన్నై
డి) ఐఐటీ – ఢిల్లీ
12. షేల్ అనేది ఒక రకమైన ..?
ఎ) చెట్టు బి) శిల
సి) చమురు డి) ఉప్పు నీరు
13. భారత్‌లో ఇప్పటివరకు ఎన్ని అణు రియాక్టర్లను ఏర్పాటు చేశారు?
ఎ) 18 బి) 19 సి) 20 డి) 23
14. దేశంలో మొత్తం ఎంత విస్తీర్ణంలో బొగ్గు నిల్వలు ఉన్నాయి?
ఎ) 26,000 చ.కి.మీ.
బి) 13,000 చ.కి.మీ.
సి) లక్ష చ.కి.మీ.
డి) పది లక్షల చ.కి.మీ.
15. కేంద్ర శక్తి మంత్రిత్వ శాఖకు శక్తి సంబంధిత సాంకేతిక అంశాల్లో సలహాలు, సూచనలు ఇచ్చేది?
ఎ) సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
బి) సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ
సి) నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్
డి) పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్
16. కింది వాటిలో షేల్ గ్యాస్ వెలికితీతలో ఉపయోగించే విధానం ఏది?
ఎ) ఫ్రాంకింగ్ బి) విట్రిఫికేషన్
సి) ట్రాన్స్ ఎస్టరిఫికేషన్
డి) ఏదీకాదు
17. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మోతాదులో వినియోగించే శక్తి వనరు ఏది?
ఎ) అణుశక్తి బి) సౌరశక్తి
సి) సహజవాయువు
డి) బొగ్గు
18. ఏ మాత్రం కార్బన్ డై ఆక్సైడ్‌ను విడుదల చేయని శక్తి వనరు ఏది?
ఎ) సహజవాయువు
బి) బయో ఇథనాల్
సి) బయోడీజిల్ డి) హైడ్రోజన్
19. కింది వాటిలో సోలార్‌సెల్స్ నిర్మాణంలో దేన్ని ఉపయోగిస్తారు?
ఎ) సిల్వర్ బి) ఇనుము
సి) అల్యూమినియం డి) సిలికాన్
20. 'ఎల్లో కేక్' అని దేన్ని పేర్కొంటారు?
ఎ) రేడియం బి) యురేనియం
సి) నెప్ట్యూనియం డి) థోరియం
21. భారత్‌లో అధిక మోతాదులో ఉన్న అణు ఇంధనం ఏది?
ఎ) యురేనియం బి) థోరియం
సి) ప్లుటోనియం డి) పైవన్నీ
22. మోనజైట్ నిల్వలు అత్యధికంగా ఏ రాష్ట్రంలో ఉన్నాయి?



ఎ) కేరళ బి) ఒడిశా
సి) పంజాబ్ డి) పశ్చిమబెంగాల్
23. పైరానోమీటర్ అనే పరికరం ద్వారా దేన్ని కొలుస్తారు?
ఎ) పవనశక్తి బి) సౌరశక్తి సామర్థ్యం
సి) సౌరవికిరణం
డి) సముద్ర తరంగశక్తి
24. భారత్‌లో అత్యధిక సౌర వికిరణం చేరే రాష్ట్రం ఏది?
ఎ) తమిళనాడు బి) అసోం
సి) రాజస్థాన్ డి) హర్యానా
25. కింది వాటిలో విచ్ఛిత్తి చెందని ఐసోటోపు ఏది?
ఎ) యురేనియం-238
బి) యురేనియం-233
సి) యురేనియం- 235
డి) ప్లుటోనియం- 239
26. భారతదేశ మొదటి దశ రియాక్టర్ ఏది?
ఎ) ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్
బి) అడ్వాన్స్‌డ్ హెవీ వాటర్ రియాక్టర్
సి) ప్రెజరైజ్‌డ్ హెవీ వాటర్ రియాక్టర్
డి) ఎవల్యూషనరీ ప్రెజరైజ్‌డ్ రియాక్టర్
27. అనుసంధానం చేసిన అనేక సోలార్ కలెక్టర్లను ఏమని పిలుస్తారు?
ఎ) సోలార్ సెల్స్ బి) సోలార్ ఆర్రే
సి) సోలార్ సెంటర్
డి) సోలార్ కాంప్రేటర్
28. కింది వాటిలో సోలార్ పాండ్‌లో ఉండేది?
ఎ) ఉప్పు బి) చక్కెర
సి) రాయి డి) సున్నం
29. దేశంలో మొదటి ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్‌ను ఎక్కడ ఏర్పాటు చేశారు?
ఎ) కాక్రపార బి) కల్పక్కం
సి) కైగా డి) తారాపూర్
30. 'న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్' ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
ఎ) ముంబై బి) బెంగళూరు
సి) చెన్నై డి) హైదరాబాద్
31. దేశవ్యాప్తంగా జియోథర్మల్ శక్తికి సంబంధించి అధ్యయనం చేస్తున్న సంస్థ ఏది?
ఎ) సర్వే ఆఫ్ ఇండియా
బి) నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
సి) నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్
డి) నేషనల్ హైడ్రో ఎలక్ట్రిసిటీ పవర్ కార్పొరేషన్
32. పుగా జియోథర్మల్ క్షేత్రం ఏ రాష్ట్రంలో ఉంది?
ఎ) జమ్ము-కశ్మీర్ బి) ఛత్తీస్‌గఢ్
సి) తమిళనాడు డి) మణిపూర్
33. దేశంలో అతిపెద్ద బొగ్గు క్షేత్రం ఎక్కడ ఉంది?
ఎ) జరియా బి) బొకారో
సి) రాణిగంజ్ డి) తాల్చేర్
34. దేశంలో మొదటిసారిగా చమురు బావిని ఎక్కడ తవ్వారు?
ఎ) బాంబేహై బి) దిగ్బోయ్
సి) మెరినా బీచ్ డి) కచ్
35. నేషనల్ హైడ్రో ఎలక్ట్రిసిటీ పవర్ కార్పొరేషన్ (NHPC) ప్రధాన కార్యాలయం ఏ నగరంలో ఉంది?
ఎ) హైదరాబాద్ బి) ఫరీదాబాద్
సి) ముంబై డి) న్యూఢిల్లీ
36. కింది వాటిలో దేన్ని మండిస్తే నీరు విడుదలవుతుంది?
ఎ) హైడ్రోజన్ బి) బయోగ్యాస్
సి) మీథేన్ డి) ఆక్సిజన్
37. గుజరాత్‌లో ఎన్ని భార జల ప్లాంట్లు ఉన్నాయి?
ఎ) 2 బి) 1 సి) 3 డి) 5
38. ట్యుటికోరన్ భారజల ప్లాంటు ఏ రాష్ట్రంలో ఉంది?
ఎ) తమిళనాడు బి) మహారాష్ట్ర
సి) రాజస్థాన్ డి) కేరళ
39. కింది వాటిలో పరిశోధన రియాక్టర్ ఏది?
ఎ) అప్సర బి) ధ్రువ
సి) కామిని డి) పైవన్నీ
40. దేశంలో 'అణుశక్తి సంఘం'ను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
ఎ) 1945 బి) 1948
సి) 1952 డి) 1954
41. సీబీఎం అంటే..?
ఎ) కంబైన్డ్ బెడ్ మీథేన్
బి) కోల్ బెడ్ మీథేన్
సి) కంప్రెస్‌డ్ బెడ్ మీథేన్
డి) ఏదీకాదు
42. రక్త సరఫరాలో అవరోధాలను తొలగించడానికి ఉపయోగించే రేడియోధార్మిక ఐసోటోపు ఏది?
ఎ) అయోడిన్ -131
బి) కోబాల్ట్ - 60
సి) సోడియం - 24
డి) ఫాస్ఫరస్ - 32
43. అత్యధిక మోతాదు రేడియోధార్మిక ఐసోటోపులను ఉత్పత్తి చేసే సంస్థ ఏది?
ఎ) బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్
బి) న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్
సి) బోర్డ్ ఆఫ్ రేడియేషన్ అండ్ ఐసోటోప్ టెక్నాలజీ
డి) రాజా రామన్న సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ
44. దేశంలో మొదటి రియాక్టర్‌ను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
ఎ) 1949 బి) 1959
సి) 1969 డి) 1979
45. 'సాహా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్' ఎక్కడ ఉంది?
ఎ) కోల్‌కతా బి) ఫరీదాబాద్
సి) అలహాబాద్ డి) అహ్మదాబాద్
46. 'లోక్‌తక్ హైడ్రో పవర్ ప్రాజెక్టు' ఏ రాష్ట్రంలో ఉంది?
ఎ) మధ్యప్రదేశ్ బి) తమిళనాడు
సి) సిక్కిం డి) మణిపూర్
47. కింది వాటిలో హైడ్రోజన్ శక్తిని వినియోగించడానికి కావాల్సింది ఏది?
ఎ) ఫ్యుయల్ సెల్ బి) హైడ్రోజన్
సి) బ్యాటరీ డి) పైవన్నీ
48. భారత్‌లో స్థూలంగా ఎన్ని టన్నుల బొగ్గు నిల్వలున్నాయి?
ఎ) 250 బిలియన్ టన్నులు
బి) 301 బిలియన్ టన్నులు
సి) 1050 బిలియన్ టన్నులు
డి) 2040 బిలియన్ టన్నులు
49. కింది వాటిలో దేన్ని నవీన శక్తి వనరుగా పేర్కొంటారు?
ఎ) హైడ్రోజన్ శక్తి
బి) జియోథర్మల్ శక్తి
సి) సముద్ర తరంగశక్తి
డి) పైవన్నీ
50. దేశంలోని మొత్తం సహజవాయువు నిల్వలు ఎన్ని?
ఎ) 1.074 ట్రిలియన్ క్యూబిక్ మీటర్లు
బి) 2.57 ట్రిలియన్ క్యూబిక్ మీటర్లు
సి) 3.05 ట్రిలియన్ క్యూబిక్ మీటర్లు
డి) 5.56 ట్రిలియన్ క్యూబిక్ మీటర్లు
51. ప్రైవేట్ రంగంలో మెగాపవర్ ప్రాజెక్టులను ప్రోత్సహించడానికి, శక్తి కొనుగోలు ఒప్పందాలను కుదుర్చుకోవడానికి ఏర్పాటు చేసిన సంస్థ ఏది?
ఎ) పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్
బి) పవర్ ట్రేడింగ్ కార్పొరేషన్ (పీటీసీ)
సి) నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్
డి) సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
52. సెంట్రల్ ఎలక్ట్రో కెమికల్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఎక్కడ ఉంది?
ఎ) జాదవ్‌పూర్ బి) కరైకుడి
సి) చండీగఢ్ డి) బెల్గావ్
53. పూర్తిగా బయోడీజిల్‌పై నడిచే వ్యవసాయ ట్రాక్టర్లను రూపొందించిన సంస్థ ఏది?
ఎ) టాటా
బి) మహీంద్రా & మహీంద్రా
సి) బజాజ్ ఆటో డి) ఏదీకాదు
54. ప్రధానంగా వ్యవసాయ రంగానికి శక్తి అందించే అణు రియాక్టర్ ఎక్కడ ఉంది?
ఎ) కోట, రాజస్థాన్
బి) తారాపూర్, మహారాష్ట్ర
సి) కల్పక్కం, తమిళనాడు
డి) నరోరా, ఉత్తరప్రదేశ్
55. అగ్నిపర్వతాల్లో ఏ రకమైన శక్తి ఉంటుంది?
ఎ) అణుశక్తి బి) జియోథర్మల్ శక్తి
సి) హైడ్రోజన్ శక్తి డి) యాంత్రిక శక్తి

సమాధానాలు

1) డి; 2) ఎ; 3) బి; 4) బి;
5) డి; 6) బి; 7) బి; 8) ఎ;
9) బి; 10) సి; 11) ఎ; 12) బి;
13) డి; 14) ఎ; 15) బి; 16) ఎ;
17) డి; 18) డి; 19) డి; 20) బి;
21) బి; 22) ఎ; 23) సి; 24) సి;
25) ఎ; 26) సి; 27) బి; 28) ఎ;
29) బి; 30) ఎ; 31) బి; 32) ఎ;
33) సి; 34) బి; 35) బి; 36) ఎ;
37) ఎ; 38) ఎ; 39) డి; 40) బి;
41) బి; 42) సి; 43) సి; 44) సి;
45) ఎ; 46) డి; 47) డి; 48) బి;
49) డి; 50) ఎ; 51) బి; 52) బి;
53) బి; 54) డి; 55) బి.

There is a lot to be said about...

BANK EXAMS
GENERAL ENGLISH

Directions (Q. No. 1-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is "No error".

1. He has a scheme (1)/ which he thinks is preferable (2)/ than that proposed (3)/ by the planning commission. (4)/ No error (5)
2. The details (1)/ are the matters (2)/ for future (3)/ considerations. (4)/ No error (5)
3. The rise and fall (1)/ of the British Empire (2)/ were (3)/ Historical processes. (4)/ No error (5)
4. Information technology (1)/ as well as (2)/ management are (3)/ taught here. (4)/ No error (5)
5. This is the only one (1)/ of his ideas (2)/ that have not found (3)/ favour with biologists. (4)/ No error (5)
6. He has promised (1)/ to buy shares (2)/ in whatever company (3)/ you are interested. (4)/ No error (5)
7. One has to reckon with paying (1)/ for supporting services (2)/ although it may not be apparent (3)/ from the glib sales talk of the bank personnel. (4)/ No error (5)
8. There is a general perception in our society (1)/ that public administrations and business executives (2)/ sit in their air-conditioned chambers and quietly administer (3)/ the affairs of the states or business. (4)/ No error (5)
9. The greatest need (1)/ of the hour is (2)/ we must learn (3)/ to work together as a team. (4)/ No error (5)
10. A virtuous man, (1)/ under all misfortune of life, (2)/ still finds an inward comfort (3)/ and satisfaction. (4)/ No error (5)

Directions (Q. No. 11-15): Which of the phrases (1), (2), (3) and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error, mark (5) No correction required as your answer.

11. I should have <u>liked to have visited.</u>
1) liking to visit
2) like to visit
3) like to have visited
4) likes to visit
5) No correction required
12. <u>It was being a very hot day.</u> I remained indoor.
1) Being a very hot day
2) Been a very hot day
3) It is a hot day
4) It been a hot day
5) No correction required
13. Please excuse <u>me</u> being late.
1) mine 2) my
3) with 4) from
5) No correction required
14. He fled lest he <u>would</u> be killed.
1) will being 2) may
3) should 4) might have
5) No correction required
15. The river <u>has over flown</u> its banks.
1) have over flown
2) have been over flown
3) has overflowed
4) has over flowing
5) No correction required

Directions (Q. No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. Records going back to the fourth century A.D. refer to tea.
B. No one knows when tea was first discovered or how it came to be such a popular drink.
C. By the eighteenth century A.D. most Chinese were drinking tea both because they liked it as a beverage and for its medicinal value.
D. It was called Cha Ching, which translated means Tea Scripture.
E. The beverage is generally accepted to have originated in China hundreds of years ago.
F. Tea was so popular that one of the most distinguished poets of Tang dynasty a man called Lu Yu, even wrote a holy scripture about it.

16. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) E
17. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) E
18. What is the SECOND sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
1) B 2) A 3) C 4) D 5) E
20. What is the LAST sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. No. 21-25): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

21. There is a lot to be said about the ___ changes that technology has brought __ in the financial sector.
1) alternate; along
2) alternative; within
3) attitudinal; about
4) alternatively; forth
5) attitude; with
22. Although seat belts have been shown to ___ lives, people give a number of __ for not using them.
1) prosper; treason
2) prefer; resign
3) pamper; alternates
4) save; reasons
5) protect; cause
23. To create a scientific temper, there has to be a widely shared ___ to and belief in the value of science, particularly among the political ___.
1) commitment; elite
2) promise; choice
3) assurance; best
4) dedication; leaders
5) pledge; privilege
24. The same sciences which had led us away from nature are now ___ the miracle of creation.
1) discovering 2) unfolding
3) inventing 4) revealed
5) projected
25. Man's basic ___ is a fact and is the emotional factor for all the bloody violence that has marked human history since the beginning.
1) fierceness 2) violence
3) aggressiveness
4) assertiveness
5) ferociousness

Directions (Q. No. 26-30): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

By coach, by train, by ship and by plane, millions of tourists annually depart from home like migrating summer birds. They provide the best possible evidence to prove that the world is not really as big as it used to be. For the modern tourist is no Marco Polo. He ventures forth into the unknown and returns home in a matter of weeks, and years. Furthermore, he is armed with pamphlets, maps and weighty guide books which tell him where to go and how to get there; and where to stay, what to see and what to eat when he arrives. There are travel agencies everywhere to cater for his needs and make all the necessary preparations for him. They make out ambitious programmes and promise to **whisk** him through as many as six countries in fourteen days or, if he is in a hurry, they will cover much the same ground in eight or less.

It is a small wonder that the tourist is a busy man. He no sooner sets foot on foreign soil than he is rushed to his hotel and thence is immediately taken on a conducted tour of the city by night. In the morning he goes through another **arduous** course of sight-seeing. He has barely had the chance to recover, or indeed, to find out exactly where his hotel is located, before he is off again to yet another part of the country. It is not even a bird's eye view he gets. Rather, it is a snap-shot view.

26. Today, the world ___
1) is not as big as it was in the past.
2) is full of tourists
3) can be toured in a matter of days
4) has a lot of travel agents
5) has different modes of transport
27. According to the passage:
1) The hectic schedule of the tourist is described
2) It deals with how the tourist enjoys his tour
3) highlights the tourist's problems during the tour
4) Defines the tourist as a nomad
5) Defines the tourist as a confused person
28. Which of the following statements is false?
1) Travel agencies provide the tourist with all the necessary information
2) The tourist is a wanderlust
3) The tourist wants to derive maximum benefit from his hard earned money
4) The tourist does gets sufficient rest during his tour
5) Each country welcomes the tourist for the foreign exchange he brings with him
29. The synonym of **whisk** is:
1) Catapult 2) Leisure
3) Walk 4) Decelerate
5) Jaunt
30. The antonym of **arduous** is:
1) Fatigue 2) Formidable
3) Facile 4) Former
5) Flaunt

Answers

1) 3 2) 3 3) 3 4) 3 5) 3
6) 3 7) 5 8) 4 9) 3 10) 2
11) 2 12) 5 13) 2 14) 3 15) 3
16) 3 17) 1 18) 4 19) 1 20) 4
21) 3 22) 4 23) 1 24) 2 25) 3
26) 1 27) 5 28) 4 29) 1 30) 3

ఉద్యోగ సమాచారం

యంత్ర ఇండియా లిమిటెడ్‌లో 3,800 ట్రేడ్ అప్రెంటిస్ ఖాళీలు

నాగ్‌పూర్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ పరిధిలోని యంత్ర ఇండియా లిమిటెడ్ ట్రేడ్ అప్రెంటిస్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఐటీఐ, నాన్ ఐటీఐ సంబంధించి మొత్తం 3,883 ఖాళీలున్నాయి. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఆర్డ్‌నెన్స్, ఆర్డ్‌నెన్స్ ఎక్విప్‌మెంట్ ఫ్యాక్టరీల్లో 58వ బ్యాచ్ కింద ఈ ట్రేడ్ అప్రెంటిస్ శిక్షణ ఇవ్వనుంది. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు నవంబర్ 21వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఫ్యాక్టరీ పేరు

ఆర్డ్‌నెన్స్ కేబుల్ ఫ్యాక్టరీ-చండీగఢ్, ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ-నలంద, గన్ క్యారేజ్ ఫ్యాక్టరీ -జబల్‌పూర్, ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ-ఇటార్సీ, ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ-ఖమారియా,ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ-కట్నీ, హై ఎక్స్‌ప్లోజివ్ ఫ్యాక్టరీ-కిర్కీ, ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ-అంబఝరి, ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ ప్రాజెక్ట్-అంబర్‌నాథ్ తదితరాలు.

ఖాళీల వివరాలు

ట్రేడ్ అప్రెంటిస్: 3,883 ఖాళీలు(ఐటీఐకు సంబంధించి 2498; నాన్ ఐటీఐకు సంబంధించి 1385 ఖాళీలున్నాయి).

» **ట్రేడులు:** మెషినిస్ట్, ఫిట్టర్, టర్నర్, వెల్డర్, పెయింటర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, మేసన్, ఎలక్ట్రోప్లేటర్, మెకానిక్, ఫౌండ్రీమ్యాన్, బాయిలర్ అటెండెంట్, అటెండెంట్ ఆపరేటర్ కెమికల్ ప్లాంట్ తదితరాలు.
» **అర్హత:** ఐటీఐ కేటగిరీకి సంబంధించిన అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులతో పదోతరగతి లేదా తత్సమానం; నాన్ ఐటీఐ కేటగిరీకి సంబంధించి అభ్యర్థులు 50 శాతం మార్కులతో పదోతరగతి సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** గరిష్ఠ వయోపరిమితి 35 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు దివ్యాంగులకు పదేళ్లు సడలింపు ఉంటుంది.
» **స్టైపెండ్:** నెలకు నాన్-ఐటీఐలకు రూ.6000; ఐటీఐలకు రూ.7000 చెల్లిస్తారు.

ఎంపిక ప్రక్రియ

నాన్ ఐటీఐ కేటగిరీకి పదోతరగతి, ఐటీఐ కేటగిరీకి పదోతరగతి, ఐటీఐలో సాధించిన మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ముఖ్యమైన సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» దరఖాస్తులకు చివరి తేదీ: 21.11.2024
» వెబ్‌సైట్: https://www.recruit-gov.com/Yantra2024